సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 234

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

హడలెత్తించిన బుమ్రా **12లో** తొలి టెస్టులో దక్షిణాఫ్రికా 159కి ఆలౌట్

ఎదురులేని ఎన్డీయే

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీ(యూ) కూటమి ప్రభంజనం

243 స్థానాలకు గాను 202 స్థానాలు కైవసం

శుక్రవారం రాత్రి ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయం వద్ద ఎన్డీయే విజయోత్సవాల్లో ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా

- 35 సీట్లకే పరిమితమైన విపక్ష మహాగఠ్‌బంధన్
- బీజేపీకి 89, జేడీ(యూ)కి 85 సీట్లు
- 25 స్థానాల్లో ఆర్జేడీ, ఆరు స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు
- చిరాగ్ పాశ్వాన్ పార్టీకి 19 సీట్లు
- ఐదు సీట్లలో ఎంఐఎం జయకేతనం
- సున్నా చుట్టేసిన ప్రశాంత్ కిశోర్ పార్టీ
- ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించిన ప్రధాని మోదీ

8లో



202 ఎన్డీఏ | 35 ఎంజీబీ | 6 ఇతరులు

కూటమి	2025	2020	మార్పు
ఎన్డీఏ	202	122	+80
ఎంజీబీ	35	114	-79
ఇతరులు	6	7	-1

బెంగాల్‌లోనూ 'జంగిల్‌రాజ్'ను

అంతం చేస్తాం

తేల్చిచెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ

బిహార్‌లో ఎన్డీయే విజయం పట్ల హర్షం

బీజేపీ ప్రధాన కార్యాలయంలో విజయోత్సవంలో పాల్గొన్న మోదీ

జూబ్లీ'హిల్స్'పై కాంగ్రెస్ జెండా

ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌పై గెలుపు

24,729 ఓట్ల మెజార్టీతో విజయం

- వివరాలు 6,7,8 పేజీల్లో..

బాబు బండారం బట్టబయలు

అదానీ వైజాగ్ టెక్ పార్కులో గూగుల్ భాగస్వామి

సీఐఐ వేదికగా అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్ ఎండీ కరణ్ అదానీ స్పష్టీకరణ

- కుండబద్దలు కొట్టినట్లు వాస్తవం వెల్లడించడంతో విస్తుపోయిన చంద్రబాబు
- తద్వారా ఇన్నాళ్లూ చంద్రబాబు చేసింది దుష్ప్రచారమేనని తేటతెల్లం
- వాస్తవానికి వైఎస్ జగన్ హయాంలోనే అదానీ వైజాగ్ టెక్ పార్క్ డేటా సెంటర్
- ఈ విషయాన్ని దాచి తాను క్రెడిట్ కొట్టేసేందుకు బాబు విఫల యత్నం
- తాజాగా కరణ్ అదానీ ప్రకటనతో ఇరుకున పడ్డ బాబు సర్కారు
- రెండు సంస్థలు కలిసి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నాయని అదానీ వెల్లడి
- ఇప్పటికే పోర్టులు, సిమెంట్, ఎనర్జీ డేటా సెంటర్స్ రంగాల్లో రూ.40 వేల కోట్లకు పైగా పెట్టుబడులు
- వీటిని కొనసాగిస్తూ వచ్చే పదేళ్లలో మరో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు
- ఇన్ని వాస్తవాల మధ్య రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనలో మళ్లీ క్రెడిట్ చోరీకి యత్నం
- ఇదేం విడ్డూరమంటూ పారిశ్రామికవేత్తల్లో విస్తృత చర్చ

8లో

సంపద సృష్టితోనే పేదరిక నిర్మూలన

13లో

ప్రతి దేశంతో భారత్ మైత్రిని కోరుకుంటోంది
ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్

పెట్టుబడుల్లో 'టెక్'నిక్!

పాత కంపెనీకే కొత్త భూ కేటాయింపులు
విశాఖలోని బక్కన్నపాలెంలో ఇప్పటికే ఉన్న సెయిల్స్ సాఫ్ట్‌వేర్

8లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹84

ఫారం దగ్గర లైవ్ బర్డ్ 115

రిటైల్ లైవ్ బర్డ్ 142

స్కిన్ లెస్ 234

206

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

ప్రతిపక్షం ఊదితే.. మనం ఎగిరిపోవడం ఖాయం

మెడికల్ కాలేజీల నిరసనకు గ్రామాలే తరలివచ్చాయి



- 'సాక్షి' పేపర్ చదువుతా... 'సాక్షి' టీవీ చూస్తా
- ప్రతిపక్షాన్ని ఓ కంట కనిపెట్టాలి
- మాజీ మంత్రి యనమల

3లో

బీచ్‌లో భార్యాభర్తలు రెండు పెగ్గులేసుకునే

కల్చర్ రావాలి

స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు

3లో

ప్రభుత్వ వేధింపులతోనే

సతీష్‌కుమార్ మృతి

ఇది ముమ్మాటికీ చంద్రబాబు సర్కారు హత్యే: భూమన

- పరకామణి కేసులో విచారణ పేరుతో సతీష్‌ను బెదిరించిన ప్రభుత్వం
- సతీష్ కుమార్ మృతిపై సీబీఐ విచారణ జరిపించాలి
- వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులే ఈ ప్రభుత్వ లక్ష్యం
- అందుకు అధికారులను పావులుగా వాడుకుంటోంది
- పరకామణి కేసులో నా పేరు చెప్పాలని సతీష్‌పై ప్రభుత్వ పెద్దల ఒత్తిడి

14లో

టీటీడీ మాజీ ఏవీఎస్‌వో అనుమానాస్పద మృతి!

రైల్వేట్రాక్ పక్కన సతీష్‌కుమార్ మృతదేహం లభ్యం

14లో

- ప్రస్తుతం జీఆర్పీ సీఐగా పనిచేస్తున్న సతీష్
- టీటీడీ పరకామణి కేసులో కీలక వ్యక్తి

బాబు ప్రభుత్వ క్షుద్ర రాజకీయానికే బలి

14లో

- అబద్ధపు వాంగ్మూలం కోసం వేధించిన పోలీసులు
- ససేమిరా అన్న సతీష్ కుమార్.. ఈ నేపథ్యంలోనే పట్టాలపై శవమై కనిపించిన సతీష్ కుమార్

ఎప్పుడైతే మీరు నడిచే మార్గం
అనేక విజయాలుగా మారుతుందో
అది అరుదైనది. అది ప్లాటినమ్.

ప్రతి అడుగును విజయంగా చేయగల, ప్రతి సవాలుతో మీ క్రాఫ్ట్‌ని కళాఖండంగా చేయగల సామర్థ్యం నుంచి గొప్పదనం ఉత్పన్నమవుతుంది. నిజంగా అరుదైన, గట్టిదనం కారణంగా బహుమతిగా ఇవ్వబడే మెటల్ అయిన ప్లాటినమ్ యొక్క చిరస్థాయి నాణ్యతకు ఈ ప్రయాణం అద్దంపడుతోంది. ఎంఎస్ ధోని యొక్క ఐకానిక్ సంతకం ఉన్న, ఈ ప్లాటినమ్ కలెక్షన్ పీస్‌లు, నిజమైన విజయం తరచుగా ప్రయాణంలోనే ఉంటుందని గుర్తుచేస్తాయి.

Pt — MEN OF — PLATINUM

EXCLUSIVELY AVAILABLE AT GRT JEWELLERS Since 1964

పిటి950 కోసం చూడండి–ప్రామాణికత మరియు స్వచ్ఛతకు చిహ్నమైన 95% స్వచ్ఛత గల ప్లాటినమ్‌కు హామీ.
ఖచ్చితమైన బైబ్యాక్ కోసం, మీ ప్లాటినమ్ స్వచ్ఛతకు ప్లాటినం సర్టిఫికెట్ ను అడగండి.

DISCOVER THE NEW COLLECTION AT A STORE NEAREST TO YOU. EXPLORE WWW.GRTJEWELS.COM

Andhra Pradesh | Telangana | Karnataka | Tamil Nadu | Puducherry || Singapore

Store Locator

Shop online at: www.grtjewels.com | GRT LIVE Shop from the comfort of your home.

: 1800 203 1000 / 1800 599 1515 | Follow us:

కోకాపేట (నియోపోలిస్ మరియు గోల్డెన్ మైల్) వద్ద

బహుళ వినియోగంలో గల జోన్‌లోని ఎన్కంబ్రెన్స్‌లోలేని ప్రధాన భూములను స్వంతం చేసుకొనుటకు HMDA అవకాశం కల్పిస్తోంది.

తెలంగాణ ప్రభుత్వం తరుపున HMDA ఈ-వేలం ద్వారా దిగువ తెలిపిన భూములను "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే" ప్రాతిపదికన విక్రయించుటకు బిడ్స్ కోరుతోంది.

క్ర. సం.	ఆస్తి, ఏరియా వివరాలు	సర్వే నం.	ప్లాట్ నం.	విస్తీర్ణం (ఎకరాల్లో)	భూమి వినియోగం	భౌగోళిక ప్రదేశం	ఎకరాకు సర్కారు ధర రూ.కోట్లలో	ప్రీ-బిడ్ ఇఎండి (ప్రతి ప్లాట్‌కు రూ.కోట్లలో)	ప్రీ-బిడ్ ఇఎండి బిడ్ డాక్యుమెంట్ ఫీజు చెల్లించడానికి చివరితేదీ	ఈ-వేలం తేది	ప్రీ-బిడ్ సమావేశం తేది మరియు స్థలం
1	నియోపోలిస్ లేఅవుట్-కోకాపేట్ కోకాపేట్ (విలేజ్) గండిపేట్ (మం), రంగారెడ్డి (జిల్లా)	239 & 240	17	4.59	బహుళ వినియోగం జోన్		99.00	5.00	20-11-2025	24-11-2025 ఉ.11.00 నుండి మ. 02.00 గం.	17-11-2025 @ ఉ.11.00 గం. టీ-హబ్ రాయ్‌దుర్గ్
			18	5.31							
			15	4.03	బహుళ వినియోగం జోన్		99.00	5.00	24-11-2025	28-11-2025 ఉ.11.00 నుండి మ. 02.00 గం.	
			16	5.03							
			19	4.00	బహుళ వినియోగం జోన్		99.00	5.00	28-11-2025	03-12-2025 ఉ.11.00 నుండి మ. 02.00 గం.	
			20	4.04							
2	గోల్డెన్ మైల్ లేఅవుట్-కోకాపేట్ కోకాపేట్ (విలేజ్) గండిపేట్ (మం), రంగారెడ్డి (జిల్లా)	116 & 117	Site-2	1.98	బహుళ వినియోగం జోన్		70.00	5.00	01-12-2025	05-12-2025 ఉ.11.00 నుండి మ. 02.00 గం.	

సమాచారం కొరకు సంప్రదించండి

సైటు సందర్శనకై 1) శ్రీ అప్పారావు, యస్ఇ/ఇఇ, హెచ్‌యమ్‌డిఏ ఫోన్. 9849909840
2) శ్రీ రవీందర్, డిప్యుటీ ఇఇ, హెచ్‌యమ్‌డిఏ ఫోన్. 9133059867

విచారణకై 1) కాల్ సెంటర్ @ హెచ్‌యమ్‌డిఏ ఫోన్. 7416835522
2) శ్రీ అమరేందర్, యస్ఓ, హెచ్‌యమ్‌డిఏ ఫోన్. 7601063358

MSTC for e-Auction participation 1) శ్రీ సిద్ధార్థ్ వారథి, మేనేజర్, యంయస్‌టిసి ఫోన్. 8801074754 hydopn1@mstcindia.in
2) శ్రీ సాయి దినేష్ కుమార్, యస్ఓ, యంయస్‌టిసి ఫోన్. 7799570600 hyd@mstcindia.co.in

Transaction advisor CUSHMAN & WAKEFIELD Cushman & Wakefield (India) Pvt.Ltd 1) శ్రీ రోహన్ రవి, అసోసియేట్ డైరెక్టర్ ఫోన్. 89783 69981 rohan.ravi@cushwake.com
2) శ్రీ ప్రభు బి, మేనేజర్ ఫోన్. 99514 88881 prabhu.b@cushwake.com

రిజిస్ట్రేషన్ ఫీజు : రూ. 1,180/- జియస్‌టి (వాపసు రానిది) కలిపి
బిడ్ డాక్యుమెంట్ ఫీజు : రూ. 10లక్షలు + జియస్‌టి (వాపసు రానిది) వేలంలో పాల్గొనుటకు హెచ్‌యమ్‌డిఏకు చెల్లించాలి

ఇతర వివరాలు, ఈ-బ్రోచర్ మరియు నియమ నిబంధనలకోసం లాగ్ ఆన్ చేయండి.
www.hmda.gov.in, www.mstcecommerce.com

చెల్లింపు షెడ్యూలు
1). మొదటి వాయిదా దరావత్తు మినహాయిస్తూ అమ్మకం విలువలో 25% ఆఫర్ లెటర్ జారీ తేది నుండి 7 రోజులలోగా చెల్లించాలి.
2). మిగిలిన అమ్మకం విలువ (దరావత్తు కలుపుకొని) 90 రోజులలోగా చెల్లించాలి.

మెట్రోపాలిటన్ కమీషనర్
హెచ్‌యమ్‌డిఎ

TRIBUTE
TO A LIFE CELEBRATED
Your Legacy will shine forever
DR. SURENDRANATH
CHALAMALASHETTY
1941 — 2025
SMART-WAVES
Technology at your service
HYDERABAD

బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 'నాణ్యమైన విద్య, ప్రపంచ పరిచయం.. పిల్లలు పెద్ద కలలు కనేలా ప్రేరేపిస్తాయి. మనం వారిని ఆ మార్గంలో నడిపించాలి. శక్తివంతమైన, ప్రగతిశీల భారతదేశం కోసం ఆ కలలను సాకారం చేసుకోవడంలో పూర్తి సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు వీలుగా వారిని శక్తివంతులను చేయాలి' అని వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఆర్చర్ ధీరజ్‌కు వైఎస్ జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: ఏసియన్ ఆర్చరీ చాంపియన్‌షిప్–2025లో పురుషుల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన రాష్ట్రానికి చెందిన ధీరజ్ బొమ్మదేవరకు మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. ధీరజ్ బంగారు పతకం సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు. ఈ మేరకు వైఎస్ జగన్ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ప్రతిపక్షం ఊదితే... మనం ఎగిరిపోవడం ఖాయం

- మెడికల్ కాలేజీల నిరసనకు గ్రామాలే తరలివచ్చాయి
- 'సాక్షి' పేపర్ చదువుతా... 'సాక్షి' టీవీ చూస్తా
- ప్రతిపక్షాన్ని ఓ కంట కనిపెట్టాలి
- మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: 'ఆ... ప్రతిపక్షం ఏముందిలే ఊదితే ఎగిరిపోతుందనుకుంటే పొరపాటే.. వాళ్లు ఎగిరిపోవడం కాదు... మనమే ఎగిరిపోతాం అనే విషయం గుర్తుంచుకోవాలి' అంటూ టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తుని నియోజకవర్గంలో గురువారం రాత్రి జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ విషయంలో ప్రతిపక్షంలో కసి బాగా పెరిగిందన్నారు. అందుకే నిరసన ర్యాలీ కోసం గ్రామగ్రామాల నుంచి జనం తరలివచ్చారన్నారు. తాను రోజూ 'సాక్షి' పేపర్ చదువుతానని, 'సాక్షి' టీవీ చూస్తానన్నారు. ప్రతిపక్షం మీద ఎప్పుడూ ఓ కన్నేసి ఉంచాలన్నారు. ప్రతిపక్షం బలం అనుకుంటేనే మనం పని చేయగలుగుతామని, అలా కాకుండా ప్రతిపక్షం విషయంలో అతి విశ్వాసానికి పోతే మునిగిపోతామని చెప్పారు. 43 ఏళ్ల రాజకీయ జీవితంలో తాను కోరుకున్న పదవి తనకు దక్కలేదన్నారు. రాజ్యసభ సభ్యుడిగా చేయాలనేది తన కోరిక అని, అది వస్తుందా రాదా అనేది అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. తాను ఎప్పుడూ పదవులు కోరుకోలేదని, వాటంతట అవే వచ్చాయని చెప్పారు.

బీచ్‌లో భార్యాభర్తలు రెండు పెగ్గులేసుకునే కల్చర్ రావాలి

- విశాఖలో గోవా తరహా పర్యాటక సంస్కృతిని తీసుకురావాలి
- జూదాన్ని ప్రోత్సహిస్తేనే రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి
- క్యాసినో, పబ్‌కల్చర్ పెరిగేలా ప్రభుత్వం లిబరల్‌గా వ్యవహరించాలి
- శాసనసభ స్పీకర్ అయ్యన్న సంచలన వ్యాఖ్యలు



ఎంవీపీ కాలనీ: రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నెరెడ్కో నిర్వహించిన 'వైజాగ్ ప్రోపర్టీ ఫెస్ట్–2025'లో సంచలన వ్యాఖ్యలు చేశారు. జూదాన్ని ప్రోత్సహించకుండా పర్యాటకం ఎలా అభివృద్ధి చెందుతుందని సొంత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టీ తాగడానికి పర్యాటకులెవరైనా విశాఖ బీచ్‌కు వస్తారా? అంటూ ప్రశ్నించారు. విశాఖ బీచ్‌లో భార్యాభర్తలు రెండు పెగ్గులేసుకునే కల్చర్ ఉండాలని, భర్త బీచ్‌లో కూర్చుని రెండు పెగ్గులేసుకుంటే భార్య ఐస్‌క్రీం తింటూ ఎంజాయ్ చేసేలా ఏర్పాట్లు ఉండాలన్నారు. అవేం లేకుండా ప్రభుత్వం పర్యాటకులను విశాఖ రమ్మంటే ఎందుకొస్తారని ప్రశ్నించారు. క్యాసినో, పబ్‌కల్చర్ విశాఖలో అభివృద్ధి కావాలంటే లిబరల్‌గా ఉండాలన్నారు. ప్రభుత్వం రిస్ట్రిక్షన్స్ పెడితే పర్యాటకం ఎప్పటికీ అభివృద్ధి చెందదని స్పష్టం చేశారు. విశాఖలో ఇవేం లేకపోవడంతోనే ఏపీ, తెలంగాణ పర్యాటకులు గోవా, శ్రీలంక వంటి ప్రాంతాలకు తరలిపోతున్నారన్నారు. ఇటీవల గోవా గవర్నర్‌ను కలవడానికి వెళ్లినప్పుడు అక్కడి కల్చర్ తనను ఎంతగానో ఆకర్షించిందన్నారు. రిస్ట్రిక్షన్స్ లేని గోవా తరహా పర్యాటక సంస్కృతిని విశాఖలో తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు. ఈ దిశగా కృషి చేయాలని వేదికపై ఉన్న ఎంపీ శ్రీభరత్, మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు సూచించారు. విశాఖలో కొంత కాలంగా రియల్ ఎస్టేట్ దోపిడీ పెరిగిపోయిందన్నారు. చెరువులు, ప్రభుత్వ భూముల్లో అనధికారిక లే అవుట్‌లు పెద్ద ఎత్తున పుట్టుకొస్తున్నాయన్నారు. వాటి సమాచారం ప్రభుత్వం దగ్గర లేకపోతే తాను ఇస్తానన్నారు.

వ్యక్తిగత ప్రయోజనాలకు సీబీఐని వాడుకోలేరు

- పరస్పర విరుద్ధ పిటిషన్లు వేస్తున్న సునీత
- కేసు సత్వర విచారణకు హైకోర్టులో పిటిషన్లు
- మరోవైపు దర్యాప్తును ఇంకా కొనసాగించాలని సీబీఐ కోర్టుకు వినతి
- కేసు విచారణ ఆలస్యానికే ఇలాంటి పిటిషన్లు దాఖలు
- వైఎస్ వివేకా హత్య కేసులో సునీత పిటిషన్‌పై సీబీఐ కోర్టులో ప్రతివాదుల వాదనలు
- తదుపరి విచారణ 17కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: స్వప్రయోజనాల కోసం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ను వినియోగించుకోవాలని వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె నర్రెడ్డి సునీత ప్రయత్నిస్తున్నారని, ఇది ఎంతమాత్రం సమంజసం కాదని ప్రతివాదులు సీబీఐ కోర్టుకు విన్నవించారు. వైఎస్ వివేకా హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ సీబీఐ కోర్టులో సునీత పిటిషన్ వేశారు. దీనిపై న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురామ్ శుక్రవారం విచారణ చేపట్టారు. వాదనల అనంతరం తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేశారు. అంతకుముందు ప్రతివాదుల తరఫున న్యాయవాదులు సాయి వంశీకృష్ణ, ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపిస్తూ, 'సునీత పరస్పర విరుద్ధ పిటిషన్లు దాఖలు చేస్తున్నారు. ఒకవైపు కేసు సత్వర విచారణకు హైకోర్టులో పిటిషన్లు వేస్తూ, మరోవైపు మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ సీబీఐ కోర్టులో ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఆమెకు నచ్చినట్లు విచారణ చేయాలని కోరడం ఎంతమాత్రం చెల్లదు. ఇలాంటి పిటిషన్లను అనుమతిస్తే భవిష్యత్‌లో బాధితులమని చెప్పుకొనేవారంతా దర్యాప్తు సంస్థలను సొంత లబ్ధికి ఉపయోగించుకునే ప్రమాదం ఉంది. సునీత చర్యలన్నీ అర్థం లేకుండా ఉన్నాయి. సత్వర విచారణ కోరుతున్నారా? లేదా విచారణ ఇంకా జాప్యం కావాలని కోరుకుంటున్నారా? అనే అంశంపై స్పష్టత లేకుండా ఆమె న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇలా ఇష్టమొచ్చినట్లు వేస్తున్న పిటిషన్లతో కోర్టుల విలువైన సమయం వృథా కావడమే కాదు.. విచారణ ఏళ్లకు ఏళ్లు పట్టే అవకాశం ఉంది. ఈ కేసులో రోజూ విచారణ చేపట్టాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశిస్తే, ఈ కోర్టు మళ్లీ సీబీఐ దర్యాప్తునకు ఆదేశించినా నిష్ప్రయోజనం అవుతుంది. న్యాయస్థానంలో కేసు విచారణ ఆలస్యం చేయడానికే సునీత ఇలాంటి పిటిషన్లు వేస్తున్నారు. పిటిషన్ సమర్థనీయం కాదు. కొట్టివేయండి' అని నివేదించారు.

చార్జిషీట్ దాఖలు చేసిన తర్వాత దర్యాప్తు ఏమిటి?

'సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై ధర్మాసనం స్పందిస్తూ దిగువ కోర్టును నిర్ణయం తీసుకోమని చెప్పింది. అయితే, వాస్తవ పరిధి ఉన్న కడప కోర్టును ఆదేశించిందా? లేక హైదరాబాద్‌లోని ఈ కోర్టును ఆదేశించిందా? అనేది సందేహాస్పదంగా మారింది. 'అధికార పరిధి' తేలిస్తే ఈ పిటిషన్ మెయింటెనబుల్ అవుతుందో? లేదో? తెలుస్తుంది. సుప్రీంకోర్టులో సునీత వేసిన పిటిషన్లలో ప్రతివాదులుగా సీబీఐని తప్ప నిందితులను చేర్చలేదు. దీంతో వారి వాదనలు వినిపించే అవకాశం లేకుండా పోయింది. సుప్రీం కోర్టు మరింత దర్యాప్తునకు ఆదేశించలేదు. దిగువ కోర్టును ఆశ్రయించాలని మాత్రమే ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో వేసిన పలు పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం వద్ద ప్రస్తావించలేదు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించామని, ఇంకా దర్యాప్తు చేయడానికి ఏమీ లేదంటూ సీబీఐ అనుబంధ చార్జిషీట్ కూడా దాఖలు చేసింది. ఆ తర్వాత మళ్లీ దర్యాప్తు చేయాలని కోరడం చట్టవిరుద్ధం. ఏ కేసులోనైనా చార్జెస్ ఫ్రేమ్ చేశాక దర్యాప్తు కొనసాగించడం సాధ్యం కాదు. ఫలాన ఫలాన అంశాలపై దర్యాప్తు చేయాలని సునీత కోరలేరు. ఎలా దర్యాప్తు చేయాలో కూడా ఆమె చెబుతుండడం సరికాదు. సీబీఐ తనకు నచ్చినట్లు, తను చెప్పినట్లు దర్యాప్తు చేయాలని ఆమె పట్టుబట్టడం చెల్లదు. దర్యాప్తు పూర్తయిందని సుప్రీం కోర్టులో వెల్లడించిన సీబీఐ, మళ్లీ విచారణ ఎలా ప్రారంభిస్తుంది'' అని ప్రతివాదుల తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు.

కుప్పకూలిన శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్

సాక్షి, చెన్నై: చెన్నై శివారులోని మహాబలిపురం వద్ద పీసీ–7 ఎయిర్‌క్రాఫ్ట్ కుప్పకూలింది. శిక్షణలో ఉన్న ఎయిర్‌ఫోర్స్ ట్రైనీ అధికారి పారాచూట్ సాయంతో ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. చెన్నై శివారు తాంబరంలో భారత ఎయిర్‌ఫోర్సు స్టేషన్‌కు చెందిన ఈ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ఓ ట్రైనీ అధికారి శుక్రవారం టేకాఫ్ తీసుకున్నారు. అయితే, మహాబలిపురం వద్ద బురదలో ఈ ఎయిర్‌క్రాఫ్ట్ కుప్పకూలి పేలిపోయింది. ట్రైనీ అధికారి పారాచూట్ సాయంతో సమీపంలోనే దిగేశాడు. తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి హెలికాప్టర్లలో వచ్చిన అధికారులు ట్రైనీ అధికారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పంజాబ్ నేషనల్ బ్యాంక్
CIRCLE OFFICE: ... విజయవాడ - 520007
... 9-13-45/2/8/1, ... విశాఖపట్నం - 530003.

RBI వారి DEA ఫండ్ నుండి బ్యాలెన్స్ క్లెయిమ్ చేయుట కొరకు బహిరంగ ప్రకటన

[illegible] ... 01.10.2025 ... 31.12.2025 ... 1800-1800, 1800-2021 ...



అంగన్‌వాడీలను బలోపేతం చేయండి

రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆందోళన

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని, వీటిలో పిల్లలకు కూడా తల్లికి వందనంతోపాటు టై, బెల్ట్, షూస్ ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, పిల్లలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని వార్డు, గ్రామ సచివాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. ప్రీ స్కూల్ పిల్లలు తగ్గిపోతున్నారనే కారణం చూపి ఆ సెంటర్లను ప్రభుత్వం కుదించాలని యోచన చేయడంపై వర్కర్లు, హెల్పర్లు నిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ బలోపేతం చేయాలంటే మూడు నుంచి ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీల్లోనే చేర్చేలా చూడాలని కోరారు. ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం అమలు చేయాలని, మెనూ క్వాంటిటీ పెంచాలని, వారికి యూనిఫామ్, టై, బెల్ట్, షూస్‌తోపాటు సాయంత్రం స్నాక్స్ కూడా ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్స్ పరిష్కారానికి ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రేపు విజయవాడకు సీజేఐ బీఆర్ గవాయ్

సాక్షి, అమరావతి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఆదివారం విజయవాడ రానున్నట్టు హైకోర్టు న్యాయవాదుల సంఘం(ఏపీహెచ్‌సీఏఏ) అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం, ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబోధ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళగిరి సీకే కన్వెన్షన్‌లో ఏపీహెచ్‌సీఏఏ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పాల్గొననున్నారని పేర్కొన్నారు. 'ఇండియా అండ్ ఇండియన్ లివింగ్ కాన్‌స్టిట్యూషన్ ఎట్ 75' అన్న అంశంపై ప్రధానోపన్యాసం చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, హైకోర్టు న్యాయమూర్తులు, సీఎం చంద్రబాబు, అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొంటారని చెప్పారు.

త్వరలో క్యాన్సర్ అట్లాస్: డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

సాక్షి, అమరావతి: క్యాన్సర్ కేసులు, చికిత్స తదితర వివరాలతో త్వరలో 'క్యాన్సర్ అట్లాస్' అందుబాటులోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు తెలిపారు. మంగళగిరిలోని వైద్య శాఖ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. బోధనాస్పత్రుల్లోని ప్రివెంటివ్ ఆంకాలజీ యూనిట్ల గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. గ్రామాల నుంచి క్యాన్సర్ పరీక్షల కోసం వచ్చే వారికి వీటిలో గ్రీన్ చానల్ ఉండేలా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ సీఈవో దినేష్‌కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు 3,29,183 మంది క్యాన్సర్ కేసుల్లో చికిత్స పొందగా రూ.4,616 కోట్ల వరకు ప్రభుత్వాలు ఖర్చు చేశాయని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని జిల్లా ఆస్పత్రుల్లో 9 డే–కేర్ కీమోథెరపీ సెంటర్లు నడుస్తున్నాయని.. మరికొన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ పాల్గొన్నారు.

కోపమే అన్ని అనర్థాలకు మూలం. కోపంలో ఉన్న వ్యక్తి ఆలోచనా రహితుడు అవుతాడు. విచక్షణాజ్ఞానం కోల్పోయి తనకు తాను ముప్పును కొని తెచ్చుకుంటాడు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 15 నవంబర్ 2025

విపక్ష కూటమికి బి'హారర్'

అయిదేళ్ల క్రితం బిహార్‌లో అంతంతమాత్రంగా గెలిచి అధికారంలోకొచ్చిన ఎన్డీయే కూటమి ఈసారి అపూర్వ విజయాన్ని సొంతం చేసుకుంటున్న దాఖలా కనబడుతోంది. శుక్రవారం ఉదయం ఈవీఎంలు తెరిచినప్పటినుంచి ఆ కూటమి అప్రతిహతంగా పురోగమించటం తప్ప వెనుకంజ లేదు. దాని ధాటికి దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ విపక్షాల కంచుకోటలన్నున్నవి కుప్పకూలుతున్నాయి. అంగప్రదేశ్, భోజ్‌పూర్, మగధ్, మిథిలాంచల్, సీమాంచల్, తిరుత్ తదితర ప్రాంతాలన్నిటా ఎన్డీయే కూటమి విపక్షాలకు అందనంత దూరంలో ఉండటంతో... విపక్ష మహాగఠ్‌బంధన్ (ఎంజీబీ)కి సారథ్యం వహించిన ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్ తన స్థానాన్ని నిలుపుకోవటానికి యాతన పడ్డారంటే ఇక ఇతరుల గురించి చెప్పేదేముంది? గత ఎన్నికల్లో ఏకైక అతి పెద్ద పార్టీగా అవతరించిన ఆర్జేడీ ఇప్పుడు కుమురుగయ్యే స్థితికి చేరువైంది. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మధ్యలో కొన్నాళ్లు కూటమికి దూరమై... వెనక్కొచ్చినా ఎన్డీయేపై దాని ప్రభావం లేకపోవటం గమనించదగ్గది. 243 స్థానాలున్న అసెంబ్లీలో దాదాపు 200 స్థానాలకు ఎగబాకే దిశగా అది దూసుకెళ్తుండగా కనీసం 40 అయినా వస్తాయా అనే సందిగ్ధంలో ఎంజీబీ పడింది. తన ప్రాభవం గతించి దశాబ్దాలవుతుండగా ఎన్నిక తొచ్చినప్పుడల్లా 'తగుదునమ్మా...' అంటూ అధిక స్థానాలు కోసం పట్టుబట్టే కాంగ్రెస్ షరా మామూలుగా 61 తీసుకుని బొక్కబోర్లా పడింది. కూటమికి తాను పెద్ద గుదిబండనని రుజువు చేసుకుంది. గతంలో 70 సీట్లు తీసుకుని కేవలం 19 గెల్చుకున్న కాంగ్రెస్... ఇప్పుడు కేవలం 6తో సరిపెట్టుకునేలా కనబడుతోంది. సీమాంచల్‌లో ఎంఐఎం గతంలో గెల్చుకున్న అయిదు స్థానాలూ నిలుపుకోవటమేకాక రీ కౌంటింగ్ సాగుతున్న ఆరో స్థానంలోనూ నువ్వానేనా అన్నట్టుంది. వామపక్షాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి.

స్పెషల్ ఇంటెన్సివ్ సర్వే(సర్) పేరిట ఎన్నికల సంఘం(ఈసీ) ఆదరాబాదరాగా మొదలెట్టిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై విపక్షాలు ఎంత హడావుడి చేసినా, సుప్రీంకోర్టుకెక్కినా... కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఓట్ చోరీ ప్రచారం చేసినా ఓటర్లు దాన్ని పెద్దగా పట్టించుకోలేదని ఫలితాల సరళి చెబుతోంది. అంతేకాదు... కుటుంబానికొక సర్కారీ ఉద్యోగమిస్తామని ఆర్జేడీ చేసిన వాగ్దానం ఎన్డీయే నగదు బదిలీ ముందు వెలవెలబోయింది. 75 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చే మహిళా రోజ్‌గార్ యోజన ద్వారా యేటా రూ. 10,000 ఇస్తామని చెప్పటమే కాక సెప్టెంబర్ 26న తొలి వాయిదాను అందించటం జనానికి నచ్చింది. బాగా వెనకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ వంటి చిన్న పార్టీలను కలుపుకొన్నా 2020 నాటి తన 37.23 శాతం ఓట్లను పెంచుకోవటంలో ఎంజీబీ విఫలమైంది. అదే సమయంలో ఎన్డీయే గతం కన్నా పది శాతం మేర పెంచుకుంది. గతం కన్నా మహిళలు ఎన్డీయే వైపు మొగ్గటం, గతంలో అలిగి విడిగా పోటీచేసిన ఎల్‌జేపీ తిరిగి వెనక్కురావటం బాగా కలిసొచ్చింది. పెద్దమాటలు చెబుతూ వచ్చిన ప్రశాంత్ కిశోర్ ప్రభుత్వ వ్యతిరేక ఓట్లలో చీలిక తీసుకొచ్చి విపక్షాలను దెబ్బతీశారు.

ఆధిపత్య కులాల్లో ఓటు బ్యాంకును నిలుపుకొంటూనే బాగా వెనకబడిన ఎంబీసీ కులాలు, మహాదళిత ఆదరణ పొందటం ఎన్డీయేకు లాభించింది. ఆ వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలకు తగినన్ని సీట్లివ్వటమే దీనికి కారణం. దీని ముందు ఆర్జేడీ ముస్లిం–యాదవ్ కలయిక పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 87 స్థానాల్లో దాదాపు 20 శాతం మించి ముస్లిం ఓట్లున్నా అందుకు దీటుగా సీట్లు కేటాయించటంలో ఆర్జేడీ విఫలమైంది. కొద్దోగొప్పో సీమాంచల్‌లో ఐచ్చినా ముస్లింలు 'గెలిచే సత్తా' ఉన్న అభ్యర్థుల వైపే మొగ్గారు. ఈ ఎన్నికల్లో ఈసీ వ్యవహార శైలి కూడా అధికార పక్షానికి కొంతమేర లాభించింది. 2024లో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో అయిదేళ్లుగా ఉన్న పథకాలను సైతం ఎన్నికల ముందు నిలిపేసిన ఈసీ... పెద్ద మనసు చేసుకుని బిహార్‌లో సరికొత్త మహిళా రోజ్‌గార్ యోజన జోలికి పోలేదు. ఎన్డీయే నెగ్గితే మళ్లీ నితీశ్ సీఎం అవుతారా లేదా అన్న సంశయం మొదట్లో ఉన్నా, ఫలితాల సరళి చూస్తే ఆ విషయంలో బీజేపీ పట్టుబట్టక పోవచ్చు. ఏదేమైనా ఇది ప్రధాని నరేంద్ర మోదీ, 'సుశాసన్ బాబు' నితీశ్ కుమార్ కలిసి సాధించిన ఘన విజయం.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తిక మాసం, **తిథి:** బ.ఏకాదశి తె.4.00 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తర రా.1.54 వరకు, తదుపరి హస్త, **వర్జ్యం:** ఉ.8.20 నుండి 10.00 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.57 నుండి 7.38 వరకు, **అమృత ఘడియలు:** సా.6.30 నుండి 8.09 వరకు, **సర్వ ఏకాదశి.**

సూర్యోదయం : 6.08
సూర్యాస్తమయం : 5.21
రాహుకాలం : ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుండి 3.00 వరకు

సోషల్ టాక్

జీవన నైపుణ్యం

నాకు ఏదైనా సాధించగల సామర్థ్యం ఉందని నేను భావిస్తే అందులో నేను విజయం సాధించేవరకూ ప్రయత్నిస్తూనే ఉంటాను. నాకు వ్యతిరేకంగా ఉన్న అసమానతలను ధిక్కరించి ముందుకు వెళతాను. సవాళ్లు జీవితంలో ఒక భాగం. ఆ సవాళ్లను ఎదుర్కోవటం జీవన నైపుణ్యం. – సానియా మీర్జా, టెన్నిస్ క్రీడాకారిణి

పెద్ద పరిష్కారం

సమస్యలకు చిన్న చిన్న పరిష్కారాలను కనిపెట్టడం సమయాన్ని వృథా చేయటమే. మీరు కనిపెట్టే పరిష్కారం ఏదైనా పెద్ద ప్రభావం చూపెట్టాలి. వ్యక్తిగత కీర్తిని, ప్రతిష్ఠలను పక్కనపెట్టండి. దైనందిన సమస్యలకు మీరు ఆవిష్కరించిన పరిష్కారమే ఎప్పటికీ మీ గుర్తింపు.

– అశోక్ గాడ్గిల్, ఎన్విరాన్‌మెంటల్ ప్రొఫెసర్

వేకువతో లేవండి

మిమ్మల్ని మీరే ముందుకు నెట్టుకోవాలి. ఎందుకంటే, ఈ పని మీ కోసం ఎవరూ చేయరు కాబట్టి! వేకువతోనే మేల్కొనండి. ఉషోదయాన్ని చిరునవ్వుతో స్వాగతించండి. మీ కలల ప్రయాణాన్ని ప్రారంభించండి. విజయం అన్నది ఎప్పుడూ ప్రయత్నంతో ప్రారంభమౌతుంది.

– సందీప్ చక్రవర్తి, ఖగోళ భౌతిక శాస్త్రవేత్త

వ్యూహ రచన

నైతిక విలువలు, అంకిత భావం... ఇవి మాత్రమే మిమ్మల్ని విజయ పథం వైపు నడిపించవు. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలి. ఏక దీక్షతో పని చేయాలి. అడ్డంకుల వెనుక ఉన్న అవకాశాలను గుర్తించగలగాలి. వాటిని అందిపుచ్చుకోటానికి వ్యూహం ఏర్పచుకోవాలి. ఇంత ఉంటుంది!

– అన్సిఫ్ అష్రఫ్, 'కొచ్చిన్ హెరాల్డ్' ఎడిటర్

మీ దారి మీదే!

ప్రపంచం చాలా వేగంగా మారిపోతోంది. మీరు ఏం సాధించాలని అనుకుంటున్నారు, ఎలా సాధించాలని భావిస్తున్నారు అనేవే ముఖ్యం. గమ్యస్థానానికి తప్పని సరిగా పాత దారుల్లోనే వెళ్లాలనేం లేదు. మీ ఇష్టం వచ్చినట్లుగా మీరొక కొత్త దారి వేసుకోవచ్చు.

– గాబ్రియేలా డెమెట్రియాడెస్, దక్షిణాఫ్రికా మోడల్

అంగీకారం

జీవితంలో ఏది జరగాల్సి ఉంటే అది జరగనివ్వండి. కాలంతో అంగీకారం కలిగి ఉండండి. అలాగని మీపై మీరు నమ్మకం కోల్పోకండి. సానుకూలమైన నిర్ణయాలను తీసుకోవటం వరకే మీ పాత్రను పరిమితం చెయ్యండి. అంతా మంచే జరుగుతుంది.

– మృణాళ్ దేశ్‌రాజ్, నటి

వైట్ కాలర్ ఉగ్రవాదం... ఓ వాస్తవం

సందర్భం

లెఫ్టినెంట్ జనరల్ ఎస్.కె. సైనీ (రిటైర్డ్)

నవంబర్ 10 సాయంత్రం జరిగిన కారు బాంబు పేలుడుతో న్యూఢిల్లీ గతుక్కుమంది. భద్రతా సంస్థలు ఒక ప్రధాన నిందితుడిని గుర్తించగలిగాయి. కశ్మీర్‌లోని పుల్వామాకు చెందిన ఈ డాక్టర్ అధునాతన టెర్రర్ మాడ్యూల్‌లో భాగమని భావిస్తున్నారు. ఈ వైట్–కాలర్ టెర్రర్ మాడ్యూల్‌కు పాకిస్తాన్‌లో పేరుమోసిన జైషే మహమ్మద్ సంస్థతో సంబంధం ఉన్నట్లు వెలుగు చూస్తున్న సాక్ష్యాధారాలు వెల్లడిస్తున్నాయి. ఉగ్రవాద సంస్థలు తాము నేరుగా ప్రమేయం పెట్టుకోకుండా, విద్యావంతులైన స్థానిక రిక్రూట్లతో దుశ్చర్యలకు పాల్పడే ధోరణి పెరుగుతోంది.

విద్యావంతుల దుశ్చర్య

'ఆపరేషన్ సిందూర్' తర్వాత కూడా, ఉగ్రవాద ప్రయత్నాలలో ఎక్కడా విరామం కనిపించడం లేదు. భద్రతా దళాలు మే నెల నుంచి, కొన్ని డజన్ల ప్రయత్నాలను భగ్నం చేసినట్లు నిపుణుల అంచనా. స్థానిక మాడ్యూళ్ళ ప్రమేయమే చాలా వాటిలో ఉంది. కారు పేలుడుకు ముందు, వివిధ చట్ట సంస్థల అధికారులు రెండు గణనీయమైన డంపులను బట్టబయలు చేయగలిగారు. పోలీసులు నవంబర్ 9న వసతి భవనాల నుంచి 350 కిలోల అమోనియం నైట్రేట్‌తో సహా దాదాపు 3,000 కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. ఇవి కశ్మీర్ నుంచి పనిచేస్తున్న ఒక ఉగ్ర ముఠాకు చెందినవి. స్వాధీనపరచుకున్న వాటిలో అసాల్ట్ రైఫిళ్ళు, పిస్తోళ్ళు, బాంబుల తయారీకి ఉపయోగపడే టైమర్లు, రిమోట్ డిటొనేషన్ సాధనాలు కూడా ఉన్నాయి.

గుజరాత్ ఉగ్ర నిరోధక స్క్వాడ్ (ఏటీఎస్) అదే రోజున ముగ్గురు అనుమానితులను అరెస్టు చేసింది. వారి నుంచి బిరెట్టా పిస్తోళ్ళు, తూటాలు స్వాధీనపరచుకున్నారు. ఈ రెండు కేసుల్లోనూ డాక్టర్లు, విశ్వవిద్యాలయ ఉద్యోగులు నిందితులుగా ఉన్నారు. వైట్–కాలర్ ఉగ్రవాదం పెరుగుతున్న ధోరణికి ఇవి మరిన్ని ఆధారాలను సమకూర్చాయి.

భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్ సాగిస్తున్న సీమాంతర ఉగ్రవాదంలో మారిన వ్యూహానికి ఢిల్లీ ఘటన అద్దం పడుతోంది. అది ఇక ఎంతమాత్రం విదేశీ ముష్కరులపై ఆధారపడటం లేదు. సరిహద్దుల నుంచి నేరుగా చొరబడేటట్లు చేయడం లేదు. భారతదేశం లోపల వృత్తి నిపుణులను మతోన్మాదులుగా తయారు చేసి వారిని దాడులకు ఉపయోగించుకునే పనికి పాకిస్తాన్ నిగూఢ వ్యవస్థ పాల్పడుతోంది. ఇది తమకేం సంబంధం లేదని చెప్పుకొనేందుకు పాక్ ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రయత్నం. దీనివల్ల ఉగ్రవాద చర్యలను పాకిస్తాన్‌తో, దాని లోని సంస్థలతో నేరుగా ముడిపెట్టడం కుదరదు.

> ఉగ్రవాద సంస్థలు తాము నేరుగా ప్రమేయం పెట్టుకోకుండా, విద్యావంతులైన స్థానిక రిక్రూట్లతో దుశ్చర్యలకు పాల్పడే ధోరణి పెరుగుతోంది. యూనివర్సిటీలు, వృత్తి విద్యా సంస్థల లోపల కౌంటర్–రాడికలైజేషన్ ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాలి.

మారిన పాక్ వ్యూహం

పాక్ ఇలా వ్యూహం మార్చుకోవడం వెనుక దేశీయ, అంతర్జాతీయ అంశాలు చాలా ఉన్నాయి. ఉగ్ర సంఘటనల్లో పాత్రకుగానూ అంతర్జాతీయంగా ఎదురయ్యే విఘాతాలను తప్పించుకోవాలని పాక్ యోచిస్తోంది. 'ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్' ఈ మధ్య అంటే అక్టోబర్ నెలలో పాకిక్‌కు తాజాగా హెచ్చరిక జారీ చేసింది. నిషేధిత జాబితా నుంచి 2022లో బయటపడినందుకు సంబరపడిపోవద్దనీ, అది గుప్త ధనాన్ని మార్చడం, ఉగ్రవాదులకు నగదు చేకూర్చడానికి సంబంధించి అంతర్జాతీయ పర్యవేక్షణ నుంచి తప్పించుకున్నట్లు కాదనీ స్పష్టం చేసింది.

పాకిస్తాన్ లోపల కూడా పరిస్థితులు సవ్యంగా లేవు. 'తెహ్రీక్–ఏ–తాలిబాన్ పాకిస్తాన్' మళ్ళీ విజృంభిస్తోంది. అఫ్గానిస్తాన్‌తో ఘర్షణ కొనసాగుతోంది. ఫలితంగా, పాక్ సైన్యం ఆంతరంగిక భద్రతా విధుల పైనా, డ్యూరాండ్ రేఖ పైనా ఎక్కువ దృష్టి పెట్టవలసి వస్తోంది. ప్రాంతీయ ఘర్షణల్లో వ్యూహాత్మక లివరేజీని నిలబెట్టుకుంటూనే అంతర్జాతీయంగా తనకున్న చెడ్డ పేరును చెరిపేసుకుని, కొత్త అవతారం దాల్చినట్లుగా కనిపించవలసిన అవసరాన్ని అది గుర్తించింది.

భారతదేశపు భద్రతా సంస్థలు కనివిని ఎరుగని సవాళ్ళను ఎదుర్కొంటున్నాయి. విదేశీ చొరబాటుదారులకు, దేశీయ కుట్రదారులకు మధ్యనున్న రేఖలు చెరిగిపోతున్నాయి. టెర్రర్ మాడ్యూళ్ళు వృత్తి నిపుణుల ముసుగును కూడా వేసుకుంటున్నాయి. వివిధ ప్రాంతాల్లో దొరికిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు, అవి ఏవో చెదురుమదురు దాడులకు ఉద్దేశించినవి కావనీ, సరిహద్దుకు ఆవల నున్న సూత్రధారుల ఆదేశాల మేరకు విస్తృత దాడులకు పథకాలు రచించుకున్నాయనీ తేలుతోంది.

భద్రతా సంస్థలు ఎప్పటికప్పుడు చురుకుగా వ్యవహరిస్తూ నూతన రిక్రూట్‌మెంట్ మార్గాల రూపు రేఖలను కనిపెట్టవలసి ఉంది. వృత్తి విద్యా సంస్థల్లో రాడికలైజేషన్‌పై మానవ ఇంటెలిజెన్స్ పెంచుకోవాల్సి ఉంది. ఎవరెవరు చేతులు కలుపుతున్నారో గ్రహించేందుకు ఫోరెన్సిక్ డేటాను, డిజిటల్ నిఘాను వినియోగించుకోవాలి. సంస్థలు కూడా ఉద్యోగాలిచ్చే ముందు క్షుణ్ణంగా నేపథ్యాలు తెలుసుకోవాలి. యూనివర్సిటీలు, వృత్తి విద్యా సంస్థల లోపల కౌంటర్–రాడికలైజేషన్ ప్రయత్నాలకు శ్రీకారం చుట్టాలి. ఫ్రాన్స్ 2018లో చేపట్టిన 'కాపాడుకునేందుకు నివారణ' మార్గాన్నే మనమూ అనుసరించవచ్చు. సామాజిక, విద్యా, భద్రతా, జైలు వ్యవస్థలను కూడగట్టుకుని ప్రభుత్వం సమన్వయ కార్యాచరణ ద్వారా ఎవరూ ఉగ్రవాదం వైపు మళ్ళకుండా నివారించడంపై దృష్టి పెట్టాలి.

వ్యాసకర్త సైనిక దళ మాజీ వైస్ చీఫ్ ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

విశ్లేషణ

తారా కార్థా

ఎర్ర కోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటనను ఉగ్ర దాడిగా ముద్ర వేయడంపై ప్రభుత్వం అభినందనీయమైన రీతిలో ఆచితూచి వ్యవహరించింది. దర్యాప్తు మొదలైన రెండు రోజుల తర్వాతే, దాన్ని ధ్రువపరచింది. కొన్ని ప్రాథమిక వాస్తవాలు తేటతెల్లమయ్యాయి. ఒక మాడ్యూల్ కశ్మీర్‌లో పనిచేస్తోంది. పెద్ద యెత్తున పేలుడు పదార్థాలు సహారన్‌పుర్, ఫరీదాబాద్ మీదుగా దేశ రాజధానికి చేరుకున్నాయి. ఆ రెండూ పరస్పర సంబంధం కలిగినవనీ, పాలుపంచుకున్నది ఒకే మాడ్యూలేననీ కొత్త డేటా తెలుపుతోంది. కానీ ఎవరి ప్రేరణతో జరిగిందనేది స్పష్టం కాలేదు. దీన్ని మరింత ప్రమాదకరమైనదిగా భావించవలసి వస్తోంది. ఇది అజ్ఞాతంగా పాకుతూ పోయే వైరస్ లాంటిది.

డాక్టర్ టెర్రర్

పోలీసులకు సహకరించవద్దని ఉద్బోధిస్తూ జైషే–మహమ్మద్ పోస్టర్లు నౌగామ్, శ్రీనగర్‌లలో అక్టోబర్‌లో దర్శనమిచ్చాయి. అప్రమత్తంగా ఉన్న పోలీస్ సూపరింటెండెంట్ వాటికి కారకుడైన వ్యక్తిని గుర్తించారు. అతను అదీల్ అహ్మద్ రాథెర్ అనే డాక్టర్. అనంతనాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్‌గా పనిచేశాడు. జమ్ము–కశ్మీర్ పోలీసులు ఆ వైద్య కళాశాలలో ఆయుధాలు, మందుగుండు సామగ్రిని కనుగొన్నారు. వాళ్ళు ఉత్తర ప్రదేశ్ పోలీసులను అప్రమత్తం చేయడంతో, అది నవంబర్ మొదటి వారంలో సహారన్‌పుర్‌కు మకాం మార్చిన రాథెర్ అరెస్టుకు దారి తీసింది. అక్కడ తీగ లాగితే ఫరీదాబాద్‌లో డొంక కదిలింది. ముజమ్మీల్ గనాయీ అరెస్టయ్యాడు. పుల్వామాకు చెందిన అతడు ఫరీదాబాద్‌లోని అల్–ఫలా ఆస్పత్రిలో డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇవి నవంబర్ మొదట్లో జరిగిన సంఘటనలు. ఫలితంగా, ఫరీదాబాద్‌లో అమోనియం నైట్రేట్‌తో సహా సుమారు 2,900 కిలోల పేలుడు పదార్థాలు దొరికాయి.

మరింత మంది ఉగ్రవాదులను పసిగట్టే పనిని పోలీసులు నవంబర్ 10న ప్రారంభించినప్పటికీ, ఆ సాయంత్రం ఎర్ర కోట వద్ద కారు బాంబు పేలింది. సీసీటీవీ ఫుటేజీలో ఉమర్ ఉన్–నబీ అనే మరో డాక్టర్ పైకి తేలాడు. కారు నడిపింది అతడేనని ఫోరెన్సిక్ ఆధారాలు వెల్లడించాయి. అతనూ ఫరీదాబాద్‌లోని అదే ఆస్పత్రికి చెందినవాడు. షోపియాన్‌లో ఒక రాడికల్ ఇమామ్‌ను, అల్–ఫలాకు చెందిన మహిళా డాక్టర్‌ను లక్నోలో అదుపులోకి తీసుకున్నారు. మరింత మంది పట్టుబడవచ్చు.

అసలు కారు బాంబును ఉద్దేశపూర్వకంగానే పేల్చారా అనేది సందేహంగా మారింది. అక్కడికి కొద్ది వందల గజాల దూరంలో శ్రీ గౌరీ శంకర్ ఆలయం ఉంది. అక్కడ కారు బాంబును పేల్చి ఉంటే మరింత మంది చనిపోయి ఉండేవారు. ఉగ్ర వాదులు సాధారణంగా కోరుకునే మతపరమైన కల్లోలాలను రేకెత్తించి ఉండేది. ముఠాలోని ఇతర సభ్యులు పట్టుబడటంతో, అతను భయోత్పాతానికి లోనై పేల్చేసుకున్నాడన్నది ఒక భావన. ఏ విధంగా చూసినా, ఇది రెండేళ్ళుగా సాగుతున్న పథకంగా కనిపిస్తోంది. 'ఆపరేషన్ సిందూర్'కు ముందే ఈ సెల్ క్రియాశీలంగా ఉంది కనుక, జైష్, లష్కర్‌ల పురిటి గడ్డపై వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇది జరిగి ఉండవచ్చునుకోవడానికి లేదు.

> ఢిల్లీ ఇంతవరకు ఉపేక్షించిన ఒక అంశానికి వ్యతిరేకంగా కార్యాచరణకు దిగాలి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మత విద్వేషం సెగలు గక్కుతోంది. రెండు వర్గాలకు చెందిన మనుషులు చనిపోయిన అంశాన్ని మీడియా ప్రముఖంగా పేర్కొనవలసిన అవసరం ఉంది.

కాచుకుని ఉన్న శత్రువులు

ఇది సడీచప్పుడు లేకుండా పనిచేస్తూ వచ్చిన, విస్తృతమైన స్లీపర్ సెల్. అనుమానించడానికి ఏమాత్రం అవకాశం లేని వ్యక్తులు దీనిలో ఉన్నారు. వారందరూ కశ్మీర్‌కు చెందినవారు కాదు. ఈ ధోరణిని అర్థం చేసుకునేందుకు స్పెయిన్, ఇటాలియన్ పోలీసుల చర్యలోకి వెళ్ళాలి. వారు అక్కడ ఒక పెద్ద పాకిస్తానీ సెల్‌ను కనుగొన్నారు. అది జనాన్ని ఉగ్రవాదం వైపు నడిపిస్తోందని తేలింది. దాని ఆనుపానులు కనుగొనేందుకు పోలీసులకు రెండేళ్ళు పట్టింది. ఈ ఏడాది మార్చిలో మాత్రమే వారు కొందరిని అరెస్టు చేయగలిగారు. ఒక కీలక వాస్తవాన్ని గుర్తించి తీరాలి. ఉగ్రవాదాన్ని సరికొత్తగా సృష్టించలేం. ప్రస్తుతమున్న వేర్పాటువాద పరిస్థితిని ఆధారం చేసుకునే అది పైకి లేస్తుంది. వీటిలో రెండవ దానికి పాకిస్తానే చక్కని ఉదాహరణ.

ఢిల్లీ ఇంతవరకు ఉపేక్షించిన ఒక అంశానికి వ్యతిరేకంగా కార్యాచరణకు దిగాలి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో మత విద్వేషం సెగలు గక్కుతోంది. రెండు వర్గాలకు చెందిన మనుషులు చనిపోయిన అంశాన్ని మీడియా ప్రముఖంగా పేర్కొనవలసిన అవసరం ఉంది. ఇది దేశాల సరిహద్దులను దాటిన అంతర్జాతీయంగా కనిపిస్తున్న ధోరణి. కీలక ఉగ్రవాద నాయకులు తుర్కియేలోని 'సూత్రధారుల'తో సమావేశమైనట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో, అంకారాను హెచ్చరించడం కూడా సమయోచితం అనిపించుకుంటుంది. భారతదేశాన్ని ఎలాగైనా ముక్కచెక్కలు చేయాలని చాలా మంది శత్రువులు కాచుకుని కూర్చున్నారు. భారత్–పాక్ యుద్ధానికి దిగాలని చూస్తున్నారు. భారత్ ఆర్థికంగా స్థిరంగా వృద్ధి చెందుతూండటం అనేక రాజధానులలో గణనీయమైన ఆందోళన రేకెత్తిస్తోంది.

వ్యాసకర్త నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ మాజీ డైరెక్టర్ ('ద హిందూస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

'జల్, జంగిల్, జమీన్' ఉద్యమ పిత

ఇన్ బాక్స్

భారత స్వాతంత్ర్య సమర చరిత్రలో గాంధీజీ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి మహనీయుల కోవకు చెందిన ఆదివాసీ వీరుడు 'భగవాన్' బిర్సా ముండా. 1876 నవంబర్ 15న జార్ఖండ్‌లోని ఉళిహాటు గ్రామంలో ఆయన జన్మించారు. కేవలం 25 ఏళ్ల వయసులోనే బ్రిటిష్‌వారి వ్యతిరేక పోరాటంలో తుది శ్వాస విడిచారు. 'జల్, జంగిల్, జమీన్' (నీరు, అడవి, భూమి) నినాదంతో ఆయన గిరిజనుల్లో తిరుగుబాటు లేవదీశారు.

బ్రిటిష్ పాలకులు సైనిక దౌర్జన్యంతో, తప్పుడు ప్రచారంతో గిరిజన సమాజాన్ని బలహీనపరచడానికి ప్రయత్నించారు. యువకుడిగా బిర్సా ముండా ఈ దోపిడీని త్వరగా గ్రహించారు. 'మన దేవుడు ప్రకృతిలో ఉన్నాడు. మన భూమి మన తల్లి. దాన్ని ఎవ్వరూ దోచుకోలేరు!' అని ప్రచారం ప్రారంభించారు. ఇది గిరిజన హృదయాల్లో విప్లవాన్ని రగిల్చింది. బిర్సా ముండా కేవలం తిరుగుబాటుదారుడు కాదు, ఒక సాంస్కృతిక పునరుజ్జీవనకారుడు.



బిర్సా ముండా

బ్రిటిష్ వాళ్లు ప్రవేశపెట్టిన జమీందారీ వ్యవస్థ గిరిజనుల భూములను కబ్జా చేసి, వారిని తమ సొంత భూముల్లోనే కూలీలుగా మార్చింది. దీనికి ప్రతిస్పందనగా బిర్సా 1899 డిసెంబర్‌లో 'ఉల్గులన్' (విప్లవం) ప్రారంభించారు. 'డికు రాజ్ టుంతు జనా, అబుయా రాజ్ ఎటే జనా!' (విదేశీ పాలన ముగిసింది, ఇప్పుడు మన పాలన ప్రారంభమైంది!) అంటూ వేలాది మంది ముండా, ఓరాన్, సంథాల్ గిరిజనులను ఒకే జెండా కిందకు తెచ్చి ఉద్యమింపజేశారు. ఆయన నేతృత్వంలో జరిగిన 'లిదొంబారి బుర్' యుద్ధం (1900)లో వందలాది గిరిజనులు వీరమరణం పొందారు. చివరికి బిర్సా పట్టుబడటంతో రాంచీ జైల్లో పెట్టారు. 1900 జూన్ 9వ తేదీన తన 25వ ఏట జైల్లోనే అమరుడయ్యారు. 'మలేరియా'తో ఆయన మరణించాడని బ్రిటిష్‌వాళ్లు ప్రకటించినా ఆయనపై విష ప్రయోగం జరిగిందని కొందరంటారు. జనం ఆయన్ని 'ధర్తీ అబా' (అవనీ పిత)గా గౌరవించుకున్నారు.

'భూమిని అమ్మవద్దు, సంస్కృతిని మరచిపోవద్దు. మతాన్ని కోల్పోవద్దు' అన్న ఆయన బోధనలు గిరిజనుల్లో తెచ్చిన చలనాన్ని గమనించిన బ్రిటిష్ ప్రభుత్వం... ఆయన మరణం తర్వాత 1908లో 'ఛోటా నాగపూర్ టెనెన్సీ చట్టం' తెచ్చింది. ఈ చట్టం గిరిజన భూములను ఇతరుల చేతికి వెళ్లకుండా రక్షించింది.

బిర్సా ముండా జయంతి ప్రాముఖ్యాన్ని గుర్తించిన భారత ప్రభుత్వం 2021లో ఆయన జయంతిని 'జన జాతీ గౌరవ దినోత్సవం'గా ప్రకటించింది. 2024 నవంబర్ 15 నుండి 2025 నవంబర్ 15 వరకు 'జనజాతి గౌరవ సంవత్సరం'గా జరుపుతూ వస్తోంది. దేశవ్యాప్తంగా గిరిజన చరిత్ర సదస్సులు, సాహిత్య ప్రదర్శనలు, పర్యావరణ ఉత్సవాలు, 'ధర్తీ అబా గ్రామ ఉత్కర్ష యోజన' వంటి పథకాలు అమలులోకి వచ్చాయి. ఆదివాసీ ఆత్మగౌరవ పతాక బిర్సా ముండా స్ఫూర్తిని నేటి యువత అందిపుచ్చుకోవాలి.

– కాయం నవేంద్ర I జాతీయ కన్వీనర్, అఖిల భారతీయ వనవాసి

(నేడు బిర్సా ముండా 150వ జయంతి)

నెమ్మదిగా నిర్మిస్తున్నాం!

డేటా పాయింట్

మన దేశం ఒక్కో అణు విద్యుత్ కేంద్రం నిర్మాణానికి... చైనా, లేదా ప్రపంచ దేశాల సగటుతో పోలిస్తే చాలా ఎక్కువ సమయం తీసుకుంటోంది.



దేశాల వారీగా నిర్మాణ సమయం (సంవత్సరాల్లో)

	2006-10	2011-15	2016-20	2021-23
భారత్	6.8	10.3	14.2	10.3
చైనా	5.7	5.6	5.7	6.3
ప్రపంచ సగటు	6.4	5.7	7.6	7.6

ఆధారం: అంతర్జాతీయ అణుశక్తి సంస్థ

జీవన యోగ్యత

జ్యోతిర్మయం

''మొదలు ఎక్కడో, తుది ఎక్కడో తెలియని 'కాలం' అనే మహా ప్రవాహంలో, సంపూర్ణంగా బతక గలిగే భాగ్యం దక్కితే, ఎవరికి వాళ్ళదిగా నూరేళ్ళ బతుకు మనిషిది. ఈ నూరేండ్ల కాలమూ సుఖంగా మనగలగడం కోసంగా మనిషి ఎన్నో బాధలు పడాల్సి ఉంటుంది. ఇంత కష్టం అనుభవిస్తూనే తాపత్రయమూ, విషయలోలత్వమూ వదలక పోవడం ఎందుకు? వివేకంతో కూడుకున్న పనిగా అది కనిపించదు కదా!'' అని ఆధ్యాత్మికవేత్తలు, పరిత్యాగ బుద్ధి కలిగిన యోగులు అంటారు. ఇతడు నాకు కావలసినవాడు, స్నేహితుడు; ఇతడలా కాదు, అమిత్రుడు అనగా శత్రువు, అని ఆలోచన చేసే మనిషి దృష్టి సంకుచితమైనదని వారు చెబుతారు. ఉదారచిత్తుడైన మనిషికి ప్రపంచమంతా తన బంధువర్గంలోని మనుషుల వలెనే కనపడతారని రాగరహితులు, యోగులు అంటారు. ఆలోచనలో ఆ స్థితిని ఊహించుకోవడమే మామూలు మనిషికి చాలా కష్టమైన పని. ఇక ఆచరణలో పెట్టడం అంటేనూ, ఆ స్థితిని చేరుకోవడం అంటేనూ, చాలా స్థిర చిత్తమూ, వాంఛా విముఖత్వమూ, పరిత్యాగ బుద్ధీ వంటివాటిని ప్రయత్నపూర్వకంగా అలవరచుకోవలసి ఉంటుంది. ఆ స్థితిని చేరుకున్న వ్యక్తి మాత్రమే రాగరహితంగా జీవితాన్ని అనుభవించే అర్హత కలిగి ఉంటాడని మడికి సింగన తన వాసిష్ఠ రామాయణం, ప్రహ్లాదోపాఖ్యానంలో ఇలా చెప్పాడు:

ఉ. ఆరయ సర్వభూతసముడై పరిబోధమయాత్ముడై యహం / కార వికార భావనల గ్రాగక యుల్లము చల్లనై తమో / దూరుడు రాగరోష రహితుండునై భువన ప్రవృత్తికిన్ / వారక సాక్షివోలె మనువానికి జీవితమొప్పు నెప్పుడున్. దృష్టిలో 'సర్వభూత సమత్వం' కలిగి ఉండి, ఆధ్యాత్మిక బోధనాత్మక పరిజ్ఞానం కలిగి ఉండి, చిత్తాన్ని అహంకారము, వికారము అనే భావనలకు లొంగే బేలతనానికి దూరం చేసి, క్రోధాన్ని విడనాడి, చల్లనైన మనసుతో సర్వాన్నీ ఆలోకిస్తూ, లోకాన్ని నడిపే అభిలషణీయ, అనభిలషణీయ ప్రవృత్తులకు కందక, కుందక, నిర్వికార సాక్షివలె వీక్షిస్తూ కాలం గడిపే వ్యక్తికి ఈ జీవితం ఎప్పుడూ యోగ్యమైనదిగా, ఒప్పినదిగా ఉంటుంది అని పై పద్యం సారాంశం.

– భట్టు వెంకటరావు

మొగలి పూలు..
రైతుకు సిరులు!

తీరంలోనే కాదు.. అంతర పంటగానూ సాగుకు అనుకూలం
ఒకసారి నాటితే 35 ఏళ్ల వరకు నిర్విరామంగా పంట

- మొగలి పూల నుంచి నూనె, అత్తరు, ఆకుల నుంచి నీరు ఉత్పత్తి
- ఆకులు, తీగలు, కాండం నుంచి కూడా ఉప ఉత్పత్తుల తయారీ
- లీటర్ నూనె ధర సగటున రూ.11 లక్షల పైమాటే
- ప్రపంచంలోనే నెం.1 స్థానంలో ఒడిశాలోని బరంపురం
- ఏపీలోనూ ఉద్దానం ప్రాంతంలో సాగు చేస్తున్న రైతులు
- మొగలి సాగుపై సుగంధ ద్రవ్యాల బోర్డు అధ్యయనం

సాక్షి, అమరావతి: సుగంధ పరిమళాలు వెదజల్లే మొగలి పూలు అన్నదాతలకు సిరులు కురిపిస్తున్నాయి. పెద్దగా పెట్టుబడి అవసరం లేని ఈ పూల సాగుపై ఇప్పుడిప్పుడే రైతులు దృష్టి సారిస్తున్నారు. ప్రపంచంలోనే అత్యధిక విస్తీర్ణంలో మొగలి పాదలున్న ఒడిశాలో అధ్యయనం చేసిన ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు సువిశాలమైన సముద్ర తీర ప్రాంతమున్న ఆంధ్రప్రదేశ్ ఈ మొగలి పూలసాగుకు అత్యంత అనుకూలమైన ప్రాంతంగా గుర్తించింది. తీరంలోనే కాదు.. అంతర పంటగానూ సాగు చేసే దిశగా రైతులను చైతన్యపరచడానికి అడుగులు వేస్తోంది. మొగలి పూల నుంచి నూనె, అత్తరు, ఆకులు, రెమ్మల నుంచి నీరు, ఆకులు, రెమ్మలు, స్టెమ్‌లను వివిధ రకాల హ్యాండీక్రాఫ్ట్స్‌ను తయారు చేస్తున్నారు. గతేడాది మొగలి పూల నూనె లీటరు రూ.21 లక్షలకు పైగా పలికిందంటే దీని డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇదీ సాగు విధానం..

ప్రపంచంలో మరే ఇతర వృక్ష జాతికి లేని విశిష్టత ఈ మొగలి పాదల సొంతం. మగ చెట్లు పూలు పూస్తే ఆడ చెట్లు కాయలు కాస్తాయి. ఒకసారి నాటితే 35 ఏళ్ల వరకు బతుకుతాయి. 25–30 ఏళ్ల వరకు పంటనిస్తాయి. ఒండ్రు మట్టి, ఇసుక, ఎర్రమట్టి నేలలు వీటి సాగుకు అనుకూలం. దుక్కిదున్ని 2 అడుగుల దూరంలో ఎకరాకు మట్టి స్వభావాన్ని బట్టి 150–280 మొక్కలు నాటుకోవచ్చు. లైన్ల మధ్య 8–10 అడుగులు దూరం ఉండాలి. వీటి సాగులో ఎరువులు, పురుగు మందుల అవసరం ఉండదు. ప్రారంభంలో కొద్దిగా నీళ్లంటే చాలు. ఎకరాకు రూ.లక్ష వరకు మొదట్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఏటా రూ.10 వేల నుంచి రూ. 20 వేల వ్యయం చేస్తే చాలు. అయితే ఇప్పటి వరకు వీటికి ప్రత్యేకంగా నర్సరీలంటూ ఎక్కడా లేవు. ఇప్పటికే సాగులోని మొక్కల స్టమ్‌లను తీసుకొచ్చి చెరకుగడల మాదిరిగా నాటితే వాటంతటవే పెరుగుతాయి. వరి పొలాలు, కాలువ గట్ల వెంబడి, ఇళ్లకు, పశువుల కొట్టాలకు కంచెలా, రోడ్ల కిరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్‌గానూ నాటుకోవచ్చు. కొబ్బరి, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన పంటల్లోనూ అంతర పంటగా సాగు చేసుకోవచ్చు. క్యాజరీనా, యూకలిప్టస్, జీడి మామిడి, తాటిగచ్చక వంటి వాటికి దీటుగా తీరంలో సముద్ర కోతను సమర్థంగా ఎదుర్కోవడమే కాకుండా, పొలాలకు రక్షణగా కంచెగా, మడ అడవుల్లా, తుపానులు, ఈదురు గాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్ట తీవ్రతను తగ్గించేందుకు ఇవి దోహదపడతాయి.

శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో సాగవుతున్న మొగలి పాదలు

ఎకరాకు 11వేల పూల ఉత్పత్తి

జూన్ నుంచి ఆగస్టులోపు మొగలి నాటుకునేందుకు అనుకూలం. ఈ పంటకు తేమ శాతం అధికంగా ఉండాలి. నాటిన మూడేళ్ల తర్వాత ఏటా 3 సీజన్‌లలో పంట (పూలు) చేతికొస్తుంది. జూన్ నుంచి అక్టోబర్ వరకు, డిసెంబర్ నుంచి జనవరి వరకు, మార్చి నుంచి ఏప్రిల్ వరకు ఇలా మూడు సీజన్‌లలో పూలు పూస్తాయి. మూడో ఏట నుంచి చెట్టుకు 15–20 పూలు (ఎకరాకు 5,600)పూస్తాయి. అదే ఐదేళ్లు దాటితే 35–50 పూలు (ఎకరాకు 11,200) పూస్తాయి. ఒక్కో చెట్టు ఏడాదిలో 800–1000 వరకు పూలు పూస్తుంది. వర్షాకాలంలో పూల దిగుబడి ఎక్కువగా ఉంటుంది. తీరానికి 3 కి.మీ. వరకు సాగైన పంట నుంచి నెం.1 క్వాలిటీ పూల దిగుబడి వస్తుంది. ఉదయం 5–6 గంటల్లోపు పూచే పూలను ఫస్ట్ క్వాలిటీ పూలుగా, 6–10 గంటల మధ్య పూచే పూలను సెకండ్ క్వాలిటీగా, 10–11గంటల మధ్య థర్డ్ క్వాలిటీ పూలుగా పరిగణిస్తారు. మొగ్గ దశలోనే వీటిని కట్ చేయాల్సి ఉంటుంది. ఫస్ట్ క్వాలిటీ పూలకు ఒక్కొక్క దానికి రూ.35–45, రెండో రకానికి రూ.20–25, మూడో రకం పూలకు రూ.10–15 ధర లభిస్తుంది. పండుగ సీజన్లలో థర్డ్ క్వాలిటీ పూలు సైతం మార్కెట్‌లో రూ.40 వరకు ధర పలుకుతాయి. తీరానికి 3 కి.మీ.వరకు నాటిన మొక్కల ద్వారా వచ్చే ఫస్ట్ క్వాలిటీ పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. గరిష్టంగా ఎకరా పూల ద్వారా 2.75 కిలోల వరకు నూనె ఉత్పత్తి అవుతుంది. సగటున కిలో రూ.9.25 లక్షలు పలుకుతుండగా, మొగలి పూల ద్వారా తయారయ్యే అత్తరు లీటరు రూ.40–80వేలు, మొగలి జలం లీటర్ రూ.5–20వేల వరకు పలుకుతోంది. నూనెను ఫుడ్ బేవరేజస్‌లో విరివిగా వినియోగిస్తారు. అదే మొగలి జలాలను సెంటెడ్ వాటర్ తయారీలో ఉపయోగిస్తారు. రైతుల నుంచి ఫ్యాక్టరీలు నేరుగా పూలను కొనుగోలు చేస్తాయి.

ఒడిశాలో కుటీర పరిశ్రమగా అభివృద్ధి

మొగలి సాగుకు ప్రపంచంలోనే ఒడిశాలోని గంజాం జిల్లా బరంపురం పరిసర ప్రాంతాలు కేంద్రంగా ఉన్నాయి. ఇక్కడ దాదాపు 20 వేల ఎకరాల్లో మొగలి సాగవుతోంది. ఈ ప్రాంతంలో 400కు పైగా పరిశ్రమలున్నాయి. 12 వేల మందికిపైగా ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడి ఈ పూలు సాగు చేసే రైతులే కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా నూనె, అత్తరు, నీరు వంటి ఉప ఉత్పత్తులను తయారు చేసి మార్కెటింగ్ చేస్తూ రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. ఇదే తరహాలో ఉత్తరప్రదేశ్‌లోని కనోజ్‌లో ప్రత్యేకంగా సాగు చేస్తున్నారు. ఏపీలో ఉద్దానం, సోంపేట, ఇచ్ఛాపురం, కవిటితో పాటు ప్రకాశం, చీరాల, బాపట్ల, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ పంట సహజ సిద్ధంగా సాగవుతోంది. ఒడిశా స్ఫూర్తితో శ్రీకాకుళం జిల్లాలో 400 ఎకరాలు వరకు రైతులు మొగలి సాగు చేస్తున్నారు.

ఆదాయం వచ్చే పంటగా అభివృద్ధి చేస్తున్నాం



మొగలి పాదల సాగు రైతులకు ఆదాయం వచ్చే ప్రత్యామ్నాయ పంటగా అభివృద్ధి చేస్తున్నాం. ఇందుకోసం లోతైన అధ్యయనం సాగుతోంది. మొగలి పాదలు పెంచే రైతులకు అవసరమైన శిక్షణ, సలహాలు, సూచనలు బోర్డు ద్వారా అందజేస్తాం. స్వల్ప వ్యవధిలో ఏపుగా పెరిగే మొక్కల కోసం ఒడిశా నుంచి నాణ్యమైన మొగలి అంట్లు అందుబాటులోకి తీసుకొస్తాం. పంట భూముల రక్షణకు ఏర్పాటు చేసుకునే మొగలి చెట్లు పెట్టుబడిలేని ఆదాయ వనరుగా ఉపయోగపడతాయి. కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మొగలి హెర్బల్ గార్డెన్స్ పెంపకాన్ని బోర్డు ద్వారా ప్రోత్సహిస్తాం.

– ఆవుల చంద్రశేఖర్, సీఈవో, ఏపీ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు

గంగిశెట్టి శివకుమార్‌కు బాలసాహిత్య పురస్కారం

మాధవ్ కౌశిక్ నుంచి అవార్డు అందుకుంటున్న శివకుమార్

సాక్షి, న్యూఢిల్లీ: అభ్యుదయ రచయితల సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి శివకుమార్ రచించిన 'కబుర్ల దేవత' కథల పుస్తకానికి కేంద్ర బాల సాహిత్య పురస్కారం దక్కింది. శుక్రవారం ఢిల్లీలోని కేంద్ర సాహిత్య అకాడమీ త్రివేణి కళాసంఘంలో సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార్–2025 ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో గంగిశెట్టికి కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అవార్డును అందించారు. రూ.50వేల నగదు అందజేశారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

రామాంజనేయులు (ఫైల్)

మాచవరం: అప్పుల బాధ తాళలేక ఓ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పలనాడు జిల్లా మాచవరం గ్రామానికి చెందిన కౌలు రైతు గడ్డం రామాంజనేయులు(35) గత రెండేళ్లుగా మిర్చి, పత్తి పంటలను సాగు చేస్తున్నాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయాడు. చంద్రబాబు ప్రభుత్వం మద్దతు ధరలు కూడా కల్పించలేదు. దీంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గుంటూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.



వేడుకగా కార్తీక మహాదీపోత్సవం

తిరుపతి అన్నమయ్య సర్కిల్: తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో శుక్రవారం రాత్రి కార్తీక మహాదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారికి, చతుర్భుజ మహాలక్ష్మి అమ్మవారికి తిరుమల శ్రీవారి ఆలయ అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, శ్రీనివాసార్చన నిర్వహించారు. భక్తులందరూ ఒక్కసారిగా చేసిన దీపారాధనతో మైదానంలో వెలుగులు విరజిమ్మాయి.

దూసుకొచ్చిన మృత్యువు

పాలవ్యాన్ ఢీకొని ఇద్దరు మృతి

మృతుడు కోటేశ్వరరావు

మృతుడు రామకృష్ణ

ఆగిరిపల్లి: పాల వ్యాన్ డ్రైవర్ అతి వేగం, నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకుంది. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలోని వడ్లమానులో గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఈ ఘటన జరిగింది. ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం కృష్ణారావుపాలేనికి చెందిన బాగోతు కోటేశ్వరరావు (38) నూజివీడులో సెల్‌ఫోన్ స్పేర్ పార్టులు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నూజివీడుకు చెందిన దొడ్డపనేని రామకృష్ణ (60)తో కలిసి గురువారం విజయవాడ వెళ్లిన కోటేశ్వరరావు వస్తువులు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యారు. వడ్లమాను వద్దకు రాగానే వారికి ఎదురుగా అతివేగంగా వచ్చిన పాల వ్యాను వీరి బైక్‌ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. కోటేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో నూజివీడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతనూ మరణించాడు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామకృష్ణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు రాష్ట్రాల్లో మదనపల్లె కిడ్నీ రాకెట్ లింకులు!

- విశాఖతోపాటు కర్ణాటక, గోవా రాష్ట్రాలకు పోలీసు బృందాలు
- కిడ్నీ స్వీకరించింది గోవా వ్యక్తి
- ఆపరేషన్ చేసినది బెంగళూరు డాక్టర్
- కీలక సూత్రధారులు ప్రభుత్వ ఉద్యోగులే?
- కిడ్నీ మార్పిడి చేసిన ఆస్పత్రి ప్రారంభమైనది ఏడాదిన్నర కిందటే..
- అప్పటి నుంచి ఎన్ని ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేశారనే దానిపై విచారణ

మదనపల్లె: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన అన్నమయ్య జిల్లా మదనపల్లె కిడ్నీ రాకెట్ ముఠా కార్యకలాపాలు మూడు రాష్ట్రాల్లో విస్తరించినట్టు తెలుస్తోంది. కిడ్నీ ఇచ్చినది విశాఖ జిల్లా యువతి, దానిని అమర్చింది గోవాకు చెందిన వ్యక్తికి, ఈ ఆపరేషన్ చేసినది బెంగళూరుకు చెందిన వైద్యుడని పోలీసులు గుర్తించారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉంది? ఎప్పటి నుంచి ఉంది? ట్రాన్స్‌ప్లాంటేషన్‌కి అనుమతిలేని ఆస్పత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స ఎలా చేశారు? ఇందులో అనుభవం కలిగిన వైద్యుల అవసరం కాబట్టి వాళ్లు ఎవరు? అన్న అంశాలపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఏపీలోని విశాఖపట్నం సహా మరికొన్ని ప్రాంతాలతోపాటు కర్ణాటక, గోవా రాష్ట్రాలకు పోలీసు బృందాలు వెళ్లాయి.

విశాఖతో మదనపల్లెకు లింకు ఎలా కుదిరింది?

విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం బొడ్డపాలేనికి చెందిన సాడి యమున (29) అనే యువతి కిడ్నీ తీసి గోవాకు చెందిన వ్యక్తికి అమర్చినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేసిన వ్యక్తి బెంగళూరుకు చెందిన యూరాలజీ వైద్యుడు పార్థసారథి అని గుర్తించారు. ఆయన కోసం గాలిస్తున్నారు. కిడ్నీ స్వీకరించినది గోవా వ్యక్తి.. అతని ఆరోగ్య కారణాల దృష్ట్యా ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై ఆలోచిస్తున్నట్టు తెలిసింది. మరోవైపు కిడ్నీ సేకరించే విషయంలో ఉత్తరాంధ్రలోని విశాఖ జిల్లాకు చెందిన యువతికి, ఆపరేషన్ చేసిన ఆస్పత్రి ఉన్న రాయలసీమలోని మదనపల్లె ముఠాకు ఎలా లింకు కుదిరింది? వీటి మూలాలు ఎక్కడ ఉన్నాయనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. ఈ కేసులో కీలక నిందితుడైన వైద్య, ఆరోగ్యశాఖలో జిల్లా డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు నుంచి వివరాలను రాబడితేనే గుట్టంతా వీడుతుందని భావిస్తున్నారు. కిడ్నీ మార్పిడి చేసిన మదనపల్లె గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఏడాదిన్నర కిందట ప్రారంభించారని పోలీసులు చెబుతున్నారు. అక్కడ ఇప్పటిదాకా ఎన్ని ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్‌లు చేశారో ఆరా తీస్తున్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసేవారే కీలకం?

ఈ వ్యవహారంలో వైద్య, ఆరోగ్యశాఖలో జిల్లా డీసీహెచ్ఎస్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆంజనేయులు, కదిరి, మదనపల్లె ప్రభుత్వాస్పత్రుల్లోని డయాలసిస్ విభాగంలో పనిచేస్తున్న బాలు, మెహరాజ్ కీలకమని పోలీసులు గుర్తించారు. సాడి యమున మృతిచెందకుండా ఉంటే కిడ్నీ రాకెట్ వెలుగులోకి వచ్చేదికాదు. కిడ్నీ రాకెట్ ముఠా ఆమె మరణించిన తర్వాత కూడా గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని అంబులెన్స్‌లో తరలించి, విషయం బయటకు రాకుండా చేసేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. మరోవైపు యమునతో ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్న సూరిబాబుకు ఈ విషయాలన్నీ తెలిసే కిడ్నీ మార్పిడి కోసం మధ్యవర్తులైన పిల్లి పద్మ, సత్యతో ఆమెను పంపినట్టు పోలీసులు గుర్తించారు. క్రైమ్ నంబర్ 179/2025గా నమోదైన కేసులో ఏడుగురిని నిందితులుగా చేర్చారు. డాక్టర్ ఆంజనేయులును ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఎఫ్ఐఆర్ వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు.

కాలి నడకన తిరుమలకు క్రికెటర్ శ్రీచరణి

తిరుమల: ప్రముఖ మహిళా క్రికెటర్, ప్రపంచకప్ విజయంలో కీలకపాత్ర పోషించిన శ్రీచరణి శనివారం రాత్రి తిరుమల చేరుకున్నారు. తిరుపతిలోని అలిపిరి మార్గం నుంచి కాలి నడకన ఆమె తిరుమలకు చేరుకున్నారు. అనంతరం వరాహ స్వామిని దర్శించుకుని.. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు.

టీటీడీకి రూ.కోటి విరాళం

తిరుమల: టీటీడీ వేంకటేశ్వర అన్న ప్రసాదం ట్రస్ట్‌కు విజయవాడకు చెందిన మోనిష్ వెంకట సత్యప్రకాష్ శుక్రవారం రూ.కోటి విరాళంగా అందించారు. దాత తరపున ఆయన ప్రతినిధి భూషణ్ తిరుమలలోని చైర్మన్ క్యాంపు కార్యాలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు విరాళం డీడీని అందజేశారు.

మన్యంలో పెరిగిన చలి

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో చలితీవ్రత అధికమైంది. మూడ్రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గుముఖం పడుతున్నాయి. సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఏజెన్సీలోని ప్రజలు చలితో వణుకుతున్నారు. శుక్రవారం ఏజెన్సీలోని జి.మాడుగులలో 6 డిగ్రీలు, అరకు లోయలో 7.3, డుంబ్రిగూడ 7.9, ముంచంగిపుట్టు 8.5, హుకుంపేట 9.1, పాడేరు 9.6, పెదబయలు 10.3, చింతపల్లి 10.5, పాడేరు మండలం మినుములూరు కాఫీబోర్డులో 11, మారేడుమిల్లి 12.5, డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు శుక్రవారం నమోదైనట్లు చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. ఉష్ణోగ్రతలు తగ్గడంతో సాయంత్రం నాలుగు గంటల నుంచే చలిగాలులు విజృంభిస్తున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది.

సుగంధ ద్రవ్యాలకు విశేష ఆదరణ

వరల్డ్ స్పైస్ ఆర్గనైజేషన్ చైర్మన్ రామ్‌కుమార్ మీనన్

మాట్లాడుతున్న రామ్‌కుమార్ మీనన్

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ప్రపంచవ్యాప్తంగా సుగంధ ద్రవ్యాలకు విశేష ఆదరణ ఉందని వరల్డ్ స్పైస్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూఎస్ఓ) చైర్మన్ రామ్‌కుమార్ మీనన్ అన్నారు. అఖిల భారత సుగంధ ద్రవ్యాల ఎగుమతిదారుల ఫోరం (ఏఐఎస్ఈఎఫ్) భాగస్వామి డబ్ల్యూఎస్ఓ ఏపీ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరులో 4వ జాతీయ సుగంధ ద్రవ్యాల సదస్సు–2025 నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన ఆయన మాట్లాడుతూ ఆహార భద్రతను బలోపేతం చేయడం, సుగంధ ద్రవ్యాల రంగంలో వృద్ధిని పెంచడమే ప్రధాన ఉద్దేశమన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ సైంటిఫిక్ ప్యానెల్ ఆన్ పెస్టిసైడ్ రెసిడ్యూస్ చైర్మన్ డాక్టర్ పరేష్ షా మాట్లాడుతూ పొలం నుంచి పళ్లెం వరకు ఆహార భద్రత మార్గదర్శక సూత్రంగా ఉండాలన్నారు. సుగంధ ద్రవ్యాల సరఫరా, సమగ్రత, వృద్ధిపై వివరించారు. సుగంధ ద్రవ్యాల బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఏబీ.రెమాశ్రీ మాట్లాడుతూ సాంకేతికత ఒక తాళం వంటిదన్నారు. దాన్ని పొలాల్లోకి తీసుకెళ్లి విభిన్న ప్రాంతాల్లో వ్యాప్తి చేయాలన్నారు. అనంతరం సుగంధ ద్రవ్యాల సరఫరా, ఆహార భద్రత, అగ్రిటెక్ ఆధారితమైన అభ్యాసం, వ్యవసాయ ఆవిష్కరణల సంఘాల ద్వారా సమగ్ర వృద్ధిపై చర్చించారు. సదస్సులో రైతులు, రైతు–ఉత్పత్తి సంస్థలు (ఎఫ్‌పీవో), వ్యవసాయ సాంకేతిక సంస్థల ఆచార్యులు, ఎగుమతిదారులు, రెగ్యులేటర్లు పాల్గొన్నారు.

ఆ భూకబ్జా వెనుక పవన్‌కళ్యాణ్ పీఏ

బాధితుడు భీమరశెట్టి రమణబాబు ఆరోపణ

డాబాగార్డెన్స్ (విశాఖ జిల్లా) : డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పీఏ సురేష్ భూకబ్జాలను ప్రోత్సహిస్తున్నాడని భీమరశెట్టి రమణబాబు అనే వ్యక్తి ఆరోపించారు. విశాఖలోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అచ్యుతాపురం మండలం దుప్పుతూరులో 11.23 సెంట్ల భూమి ఉందని, 2005 నుంచి ఇప్పటివరకు ఆ భూమి తమ ఆధీనంలోనే ఉందని చెప్పారు. తమ భూమిని కూండ్రపు సత్య, పైలా వెంకటస్వామి భూకబ్జా చేయాలని చూస్తున్నారని, ఈ విషయమై అచ్యుతాపురం సీఐకి, తహసీల్దార్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు. తామిచ్చిన ఫిర్యాదుకు తహసీల్దార్ 145 నోటీసులు జారీచేశారన్నారు. ఈ కబ్జా వెనుక పవన్‌కళ్యాణ్ పీఏ సురేష్ ఉన్నట్లు తెలిపారు. భూకబ్జాను సురేష్ ప్రోత్సహిస్తున్నారనే ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని, తమకు పాస్‌బుక్ రాకుండా అతను అడ్డుకుంటున్నాడని తెలిపారు.

ఆళ్లగడ్డలో ఇద్దరు అధికారుల కిడ్నాప్

తప్పించుకుని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మరో అధికారి

పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న తప్పించుకున్న అధికారి

సాక్షి టాస్క్‌ఫోర్స్: పాల డైరీ సొసైటీ ఎన్నికల విధులకు వెళ్తున్న అధికారులను కిడ్నాప్ చేసిన ఘటన నంద్యాల జిల్లాలో కలకలం రేపింది. వీరితో పాటు ఉన్న మరో ఎన్నికల అధికారి దుండగుల నుంచి తప్పించుకుని పట్టణ పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. విజయ పాల డైరీ సొసైటీ ఎన్నికల్లో భాగంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని బాచ్చాపురం, రుద్రవరం, నగ్లపాడు గ్రామాల్లోని పాలసేకరణ కేంద్రాల అధ్యక్ష, డైరెక్టర్ల ఎన్నికలను నిర్వహించేందుకు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. మూడు గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు నగ్లపాడుకు జగన్‌మోహన్‌రెడ్డి, రుద్రవరానికి శరత్‌కుమార్, బాచ్చాపురానికి మధును నియమించారు. శుక్రవారం వీరు ముగ్గురు నంద్యాల నుంచి ఒకే వాహనంలో ఆళ్లగడ్డకు చేరుకున్నారు. నాలుగు రోడ్ల సెంటర్‌లోని ఓ హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా కొందరు దుండగులు అక్కడకు వచ్చి పాలకేంద్రం ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చిన అధికారులు మీరేనా అని ప్రశ్నించారు. మిమ్మల్ని మేడం (టీడీపీ ఎమ్మెల్యే అఖిలప్రియ) రమ్మంటున్నారంటూ జగన్‌మోహన్‌రెడ్డి, శరత్‌కుమార్‌ను బలవంతంగా వాహనంలో ఎక్కించుకునేందుకు యత్నిస్తుండగా పక్కనున్న మరో అధికారి మధు వారికి కనిపించకుండా లోపలకు వెళ్లి దాక్కున్నాడు. వారు వెళ్లిపోయిన అనంతరం మధు భయాందోళనతో పట్టణ పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయం చెప్పారు. కాగా ఉదయం 8 గంటలకు కిడ్నాప్‌నకు గురైన ఎన్నికల అధికారుల ఆచూకీ చీకటి పడేవరకు కూడా తెలియరాలేదు. వీళ్లను ఎమ్మెల్యే ఇంట్లోనే బంధించినట్లుగా చర్చ జరుగుతోంది. ఘటనపై పట్టణ సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా కిడ్నాప్‌నకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పడం గమనార్హం.

జనసేనలో భూమి గోల

35 ఎకరాల వివాదంలో పవన్ సన్నిహితుడు వర్సెస్ ఎమ్మెల్యే సుందరం

- వివాదాన్ని సెటిల్‌మెంట్ చేసిన సురేష్
- అచ్యుతాపురం భూ వివాదంలో కోల్డ్ వార్
- తన వాటా ఇవ్వాలన్న ఎమ్మెల్యే
- నేరుగా పవన్‌కు ఫిర్యాదు చేసిన సన్నిహితుడు సురేష్
- కేబినెట్ మీటింగ్‌లో ప్రస్తావించడంతో పాటు నేరుగా ఎమ్మెల్యేకు వార్నింగ్
- రూ.350 కోట్ల భూ వివాదంలో అధికారులు బలి



పవన్ కళ్యాణ్

విజయ్‌కుమార్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తనదాకా వస్తే కానీ విషయం అర్థం కాలేదన్నట్లు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు జనసేన ఎమ్మెల్యేల దౌర్జన్యాలు స్పష్టంగా తెలిసొచ్చాయి. తన సన్నిహితుడు తలదూర్చిన భూ వ్యవహారంలోనూ స్థానిక ఎమ్మెల్యే దౌర్జన్యం చేయడంతో ఏకంగా స్థానిక తహసీల్దారు, సీఐలపై వేటు వేయడంతో పాటు ఎమ్మెల్యేకు వార్నింగ్ ఇచ్చే వరకు వ్యవహారం వెళ్లింది. అంతేకాకుండా కేబినెట్ సమావేశంలోనూ సదరు ఎమ్మెల్యే వ్యవహారాన్ని నేరుగా డిప్యూటీ సీఎం పవన్ ప్రస్తావించాల్సి వచ్చింది. రూ.350 కోట్ల విలువచేసే 35 ఎకరాల భూ వివాదంలో పవన్ సన్నిహితుడు వర్సెస్ ఎమ్మెల్యేగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వివాదాల్లోకి వెళితే.. అచ్యుతాపురం మండలం దుప్పితూరు గ్రామం బోగాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్లు 40/2, 30,31,39, 461/2,5,7, 477, 488, 490/1, 490/2, 52,54,56,60/2, 103, 112, 113, 114/3లోని 35 ఎకరాలకుపైగా ఉన్న భూ వ్యవహారంలో 1993 నుంచి పీఆర్ఎస్ నాయుడు, పైలా వెంకటస్వామి మధ్య వివాదం నడుస్తోంది. అయితే, సదరు భూమిలోకి ఎవ్వరూ వెళ్లకుండా ఉండేందుకు కోర్టు నుంచి గతంలో ఆదేశాలు ఉన్నాయి. అనంతరం జరిగిన కోర్టు ప్రొసీడింగ్స్‌లో పీఆర్ఎస్ నాయుడుకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. ఈ వివాదం నడుస్తున్న సమయంలోనే పీఆర్ఎస్ నాయుడుకు అనుకూలంగా వ్యవహరించేందుకు యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ భారీగా డబ్బులు డిమాండ్ చేయడమే కాకుండా రూ.50 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారనే ఆరోపణలున్నాయి. అయితే, కోర్టు తీర్పు వచ్చిన నేపథ్యంలో పీఆర్ఎస్ నాయుడు నేరుగా భూమిలోకి ప్రవేశించారు.

ఎమ్మెల్యేకు వార్నింగ్.. అధికారుల బదిలీ

తనతో సంబంధం లేకుండా నేరుగా సమస్యను పరిష్కరించుకోవడంపై కినుక వహించిన ఎమ్మెల్యే స్థానిక తహశీల్దారుతో పాటు సీఐపై ఒత్తిడి తెచ్చి.. సివిల్ వివాదాన్ని కాస్తా క్రిమినల్ వివాదంగా మార్చే ప్రయత్నం చేశారనే ఆరోపణలున్నాయి. నాయుడుకు అనుకూలంగా పవన్ సన్నిహితుడైన సురేష్ అనే వ్యక్తి రంగంలోకి దిగి వివాదాన్ని పరిష్కరించారని తెలుస్తోంది. అయితే స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాత్రం తన వాటా దక్కాల్సిందేనంటూ స్థానిక అధికారులపై ఒత్తిడి తెచ్చారనే విమర్శలున్నాయి. సురేష్ ఈ విషయాన్ని పవన్‌కు చేరవేశారు. దీంతో పవన్.. సదరు ఎమ్మెల్యేకు సీరియస్ వార్నింగ్ ఇవ్వడంతో పాటు ఇద్దరు అధికారులను బదిలీ చేయించారు. అంటే తన సన్నిహితుడు తల దూర్చిన భూ వివాదంలోనే తన ఎమ్మెల్యే దౌర్జన్యం చేయడంతో ఏ మేరకు వీరి ఆగడాలు ఉన్నాయనేది పవన్‌కు తెలిసొచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే కేబినెట్‌లో పవన్ ఈ విషయమై సొంత పార్టీ ఎమ్మెల్యేపై ఆరోపణలు గుప్పించడం ఏమిటంటూ సదరు ఎమ్మెల్యే వర్గీయులు వాపోతున్నారు. అసలు పవన్ సన్నిహితుడికి తమ నియోజకవర్గంలోని భూ వివాదంతో పనేమిటంటూ వారు మండిపడుతున్నట్లు సమాచారం. తన సన్నిహితుడు భూ వివాదంలో తల దూర్చిన విషయాన్ని మరుగునపెట్టి, కేవలం తమ నేతపై మాత్రమే నింద వేయడం సరికాదంటున్నారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేల ఆగడాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఎమ్మెల్యేలతోపాటు వారి సోదరులు, బంధువులు, పీఏల ఆగడాలు మితిమీరాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

15 కిలోల గంజాయి స్వాధీనం

నిందితుడి అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు, గంజాయి

బుచ్చినాయుడుకండ్రిగ: తిరుపతి జిల్లా బుచ్చినాయుడుకండ్రిగ గ్రామంలోని ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ తిమ్మయ్య శుక్రవారం తెలిపారు. ఏఎంసీ చెక్‌పోస్టు వద్ద గురువారం తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి గంజాయి తీసుకుని తిరుపతికి వెళ్లేందుకు సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో దిగి ఆటోలో బుచ్చినాయుడుకండ్రిగకు వచ్చిన ఆ వ్యక్తిని తనిఖీ చేయగా 15 కిలోల గంజాయి పట్టుబడిందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

టీడీపీ కార్యాలయంలో 'ప్రజావేదిక'

ప్రజావేదికలో టీడీపీ నేతలు, ఎంపీడీవో

యర్రగొండపాలెం: అధికారం చేతిలో ఉంటే ఏమైనా చేయొచ్చు అనడానికి ఈ ఘటన అద్దం పడుతోంది. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించుకోవటానికి అందరికీ అందుబాటులో ఉండేలా పంచాయతీ, మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాలు లేదా స్థానిక సచివాలయాల్లో అన్ని శాఖలకు చెందిన అధికారుల సమక్షంలో ఈ ప్రజావేదిక నిర్వహించాల్సి ఉంది. అయితే శుక్రవారం ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం ఎంపీడీవో బి.శ్రీనివాసులు ఏకంగా టీడీపీ కార్యాలయంలోకే మకాం మార్చారు. నియోజకవర్గంలో ఎటువంటి అధికారం లేని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్సన్‌బాబు సమక్షంలో వేదికపై టీడీపీ నాయకులను కూర్చోపెట్టుకొని ఈ ప్రజా వేదిక నిర్వహించడం అందరినీ విస్మయానికి గురిచేసింది.

CSIR-INDIAN INSTITUTE OF CHEMICAL TECHNOLOGY
(Council of Scientific & Industrial Research)
UPPAL ROAD, HYDERABAD, TELANGANA -500 007

WALK-IN-INTERVIEW NOTIFICATION NO. PS/11/2025

CSIR-IICT, Hyderabad is conducting Walk-in-Interviews on 27th November 2025 for the positions of Project Staff having qualifications of M.Sc. in Chemistry/ M.Tech in Chemical Engineering/B.Tech in Chemical Engineering / M.Pharm/ B.Sc. etc.

For full details visit our website www.iictindia.org

Sd/-
Controller of Administration

బెంగాల్‌లోనూ 'జంగిల్‌రాజ్'ను అంతం చేస్తాం

తేల్చిచెప్పిన ప్రధాని నరేంద్ర మోదీ

- బిహార్‌లో ఎన్డీయే విజయం పట్ల హర్షం
- బీజేపీ ప్రధాన కార్యాలయంలో విజయోత్సవంలో పాల్గొన్న మోదీ
- అది ముస్లింలీగీ మావోవాదీ కాంగ్రెస్ అంటూ విపక్షంపై ఆగ్రహం

న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే విజయం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. కార్యకర్తల కష్టంతోనే గెలుపు దక్కిందని అన్నారు. బిహార్‌లో సుపరిపాలన కొనసాగిస్తామని, ఇకపై పశ్చిమ బెంగాల్‌లో 'జంగిల్‌రాజ్'ను అంతం చేస్తామని ప్రతినబూనారు. పరోక్షంగా ఎన్నికల శంఖారావం పూరించారు. మమతా బెనర్జీ ప్రభుత్వంపై సమర భేరీ మోగించారు. బిహార్ ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలో ప్రధాని మోదీ శుక్రవారం సాయంత్రం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో విజయోత్సవంలో పాల్గొన్నారు. నేతలకు, కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గంగా నది బిహార్ గుండా బెంగాల్‌లోకి ప్రవహిస్తోందని చెప్పారు. బిహార్ విజయం ఇక బెంగాల్‌లో విజయానికి దారిని ఏర్పర్చిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడ్డారు. అది ముస్లింలీగీ మావోవాదీ కాంగ్రెస్(ఎంఎంసీ)గా మారిందని ధ్వజమెత్తారు. ఆ పార్టీ త్వరలో ముక్కలుచెక్కలు కావడం తథ్యమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పెద్దలు వారు మునిగిపోవడంతోపాటు నమ్ముకున్నవారిని కూడా ముంచేస్తారని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ మెడలో మిథిలా పెయింటింగ్‌లతో కూడిన గమ్చా(కండువా) ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తద్వారా బిహార్ ప్రజలతో తనకున్న అనుబంధాన్ని చాటిచెప్పారు.

కొత్తగా ఎం.వై. ఫార్ములా

బిహార్ విజయం కొత్తగా ఎం.వై.(మహిళలు, యువత) అనే ఫార్ములాను ఇచ్చిందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. జంగిల్‌రాజ్ మనుషుల మతపరమైన ఎం.వై.(ముస్లిం–యాదవ్) ఫార్ములాను ఈ విజయం మట్టిలో కలిపేసిందని అన్నారు. 'ప్రజాస్వామ్యానికి తల్లి' అనే గొప్ప గౌరవాన్ని భారత్‌కు ఇచ్చిన గడ్డ బిహార్ అని కొనియాడారు. ప్రజాస్వామ్యంపై దాడి చేస్తే మట్టికరిపిస్తామన్న సందేశాన్ని ఇదే గడ్డ ఇచ్చిందన్నారు. బిహార్‌లో ఎన్డీయే విజయం ప్రజాస్వామ్యానికి దక్కిన మహోన్నత విజయమని అభివర్ణించారు. అసత్యాలు ఓడిపోతాయని, ప్రజల విశ్వాసమే గెలుస్తుందని బిహార్ నిరూపించినట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి మన దేశం పట్ల సానుకూల దృక్పథం గానీ, దార్శనికత గానీ లేవని మండిపడ్డారు. అదొక పరాన్నజీవి, మోయలేని భారం, నష్టదాయకం అంటూ కాంగ్రెస్ మిత్రపక్షాలను హెచ్చరించారు.

ఈసీ పట్ల ప్రజల విశ్వాసం బలోపేతం

ఎన్డీయే ప్రభంజనంతో బిహార్‌లో నూతన శకం ఆరంభమైందని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. రాబోయే ఐదేళ్లలో మరింత వేగంగా అభివృద్ధి కొనసాగుతుందని తేల్చిచెప్పారు. కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. బిహార్ శక్తిసామర్థ్యాలు ప్రపంచానికి తెలుస్తాయని వ్యాఖ్యానించారు. బిహార్ ఎన్నికల ఫలితాలతో ఎన్నికల సంఘం పట్ల ప్రజల విశ్వాసం మరింత బలోపేతమైందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం కృషితో ఈ ఎన్నికల్లో అత్యధిక శాతం ఓటింగ్ నమోదైనట్లు గుర్తుచేశారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వ ప్రతిభను నరేంద్ర మోదీ శ్లాఘించారు. ఎన్డీయే పక్షాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్ఐఆర్‌ను యువత స్వాగతించారు

నేడు దేశంలో అత్యధికంగా యువ జనాభా ఉన్న రాష్ట్రాల్లో బిహార్ కూడా ఉందని మోదీ వెల్లడించారు. ఇక్కడి యువతలో అన్ని కులాలు, మతాలకు చెందినవారు ఉన్నారని చెప్పారు. వారి ఆశలు, ఆకాంక్షలు, కలలు జంగిల్‌రాజ్ మనుషుల కమ్యూనల్ ఎం.వై.ఫార్ములాను సర్వనాశనం చేశాయని వెల్లడించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనను యువత స్వాగతించారని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)కు వారు మద్దతిచ్చినట్లు ఈ ఫలితాల ద్వారా స్పష్టమవుతోందని పేర్కొన్నారు. జంగిల్‌రాజ్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల్లో విచ్చలవిడిగా హింసాకాండ జరిగేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని ప్రధానమంత్రి సంతోషం వ్యక్తంచేశారు. ఎన్నికల సంఘం కృషి వల్ల అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కొనియాడారు. బిహార్ విజయం పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో బీజేపీ కార్యకర్తలకు కొత్త శక్తిని ఇచ్చిందని స్పష్టంచేశారు.

కార్యకర్తలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ. పక్కన జేపీ నడ్డా

సీఎంగా నితీశే ఉంటారు: చిరాగ్ పాశ్వాన్

పట్నా: బిహార్ ముఖ్యమంత్రి కుర్చీలో నితీశ్ కుమార్ కొనసాగుతారని భావిస్తున్నట్లు ఎన్డీయే కూటమిలోని లోక్ జనశక్తి పార్టీ(రాంవిలాస్) పార్టీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్ తెలిపారు. ఎన్డీయే కూటమి పార్టీల ఐక్యతపై నమ్మకంతోనే ప్రజలు గెలిపించారన్నారు. ప్రధాని మోదీ, సీఎం నితీశ్‌ల డబుల్ ఇంజిన్ ప్రభుత్వమే తమ విజయానికి బలమన్నారు. అహంకార వైఖరి కారణంగానే తేజస్వీ యాదవ్–రాహుల్ గాంధీల ప్రతిపక్ష కూటమి ఘోర పరాజయం పాలైందన్నారు. ఇదొక్కటే మహాగఠ్ బంధన్ పతనానికి కారణమన్నారు. పోటీ చేసిన 29 స్థానాల్లో ఎల్‌జేపీ 17 చోట్ల విజయం సాధించింది.

మహిళల ఖాతాల్లో డబ్బు..

ఎన్డీయే గెలుపునకు కారణం: వీఐపీ

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ మహిళల ఖాతాల్లోకి డబ్బును నేరుగా జమ చేయడమే అధికార ఎన్డీయే భారీ విజయానికి కారణమని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ(వీఐపీ) వ్యవస్థాపకుడు ముకేశ్ సహానీ ఆరోపించారు. ఇండియా కూటమిలోని ఈ పార్టీ పోటీ చేసిన 12 సీట్లలోనూ ఓటమి పాలైంది. దీనిపై ఆయన స్పందిస్తూ.. ఇది ప్రజలిచ్చిన తీర్పే తప్ప..తమ కూటమిలో సంస్థాగత లోపం వల్ల జరిగింది కాదని వ్యాఖ్యానించారు. తమ సందేశాన్ని ప్రజలు సరిగ్గా అర్థం చేసుకోలేదని చెప్పారు. ఎన్డీయే ఇచ్చిన మహిళలకు ఆర్థిక సాయం హామీ కూడా, ఇండియా కూటమి పరాజయానికి ఒక కారణమన్నారు. ప్రజా ధనాన్ని నితీశ్ ప్రభుత్వం ప్రచారానికి వాడుకుందని ఆరోపించారు.

ముఖ్యమంత్రి ఎవరు?

- బిహార్ కొత్త సీఎంపై ఊహాగానాలు
- నితీశ్ కొనసాగుతారని జేడీ(యూ) పోస్టు
- నిమిషాల వ్యవధిలోనే సోషల్ మీడియా నుంచి తొలగింపు
- సీఎం పదవిపై కన్నేసిన బీజేపీ
- రేసులోఉప ముఖ్యమంత్రి సామ్రాట్

పట్నా: బిహార్‌లో ఎన్డీయే సీట్ల సునామీ సృష్టించింది. ఇక ముఖ్యమంత్రి ఎవరన్నదానిపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. జేడీ(యూ) అధినేత నితీశ్ కుమార్ సీఎంగా కొనసాగుతారా? లేక మరో కొత్త నాయకుడికి పగ్గాలు అప్పగిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న సమయంలోనే.. మళ్లీ ముఖ్యమంత్రి నితీశ్ కుమారే అంటూ సోషల్ మీడియాలో జేడీ(యూ) పోస్టు చేసింది. కొద్దిసేపటికే దాన్ని తొలగించడంతో రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. నితీశ్‌ను మరోసారి సీఎంను చేయడం బీజేపీకి ఇష్టంలేదని ప్రచారం సాగుతోంది. నితీశ్‌ను జాతీయ రాజకీయాల్లోకి తీసుకెళ్లి, బీజేపీ నాయకుడినే గద్దెనెక్కిస్తారని అంచనా వేస్తున్నారు. నిజానికి తమ కూటమి గెలిస్తే నితీశ్ కుమారే సీఎం అంటూ ఎన్నికల ముందు బీజేపీ పరోక్షంగా సంకేతాలిచ్చింది. ఆయన నాయకత్వంలోనే ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని ప్రకటించింది. నితీశ్ సైతం మళ్లీ కుర్చీ ఎక్కాలని ఆరాటపడుతున్నట్లు తెలుస్తోంది. పదోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని ఆయన భావిస్తున్నారు. శుక్రవారం రాజధాని పట్నాలో భారీగా పోస్టర్లు, బోర్డులు వెలిశాయి. ''25 నుంచి 30.. మళ్లీ నితీశ్'' అంటూ అభిమానులు వాటిని ఏర్పాటు చేశారు.

మహారాష్ట్ర తరహా ప్రయోగం

బిహార్ ఎన్నికల్లో బీజేపీ తన బలం చాటుకుంది. ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. దాంతో ప్రభుత్వ ఏర్పాటుకు జేడీ(యూ)పై ఆధారపడాల్సిన అవసరం చాలావరకు తగ్గిపోయింది. జేడీ(యూ)ను పక్కనపెట్టి, చిరాగ్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్)తో పొత్తు కొనసాగిస్తే బీజేపీ సొంతంగా ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోవడం తేలికేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు కేంద్రంలో మోదీ ప్రభుత్వం జేడీ(యూ) అండతో మనుగడ సాగిస్తోంది. కాబట్టి జేడీ(యూ) స్నేహాన్ని వదులుకొనే సాహసం చేయకపోవచ్చని అంటున్నారు. ఇదిలా ఉండగా, బిహార్‌లో మహారాష్ట్ర తరహా ప్రయోగం చేసే అవకాశం లేకపోలేదు. మహారాష్ట్రలో 2024 ఎన్నికల్లో శివసేన(షిండే) నేత, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేతో కలిసి పోటీ చేసి అత్యధిక స్థానాలు గెల్చుకున్న బీజేపీ చివరకు తమ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌కే సీఎంగా కిరీటం అప్పగించింది. బిహార్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు సామ్రాట్ చౌదరి తదుపరి ముఖ్యమంత్రి రేసులో ఉన్నారు. సమీకరణాలు కలిసొస్తే ఆయన బిహార్ సీఎం అయ్యే అవకాశాలున్నాయి. బిహార్ ఎన్డీయేలో పెద్దన్న జేడీ(యూ). ఈసారి బీజేపీ వ్యూహాత్మకంగా వ్యవహరించింది. జేడీ(యూ)తో సమానంగా సీట్లు పంచుకుంది. రెండు పక్షాలు 101 సీట్ల చొప్పున తీసుకున్నాయి. ఎన్నికల్లో బీజేపీ ఎక్కువ సీట్లు నెగ్గి, జేడీ(యూ)పై స్పష్టమైన ఆధిపత్యం సాధించింది. ముఖ్యమంత్రి పదవిని డిమాండ్ చేసే స్థాయికి చేరుకుంది.

నోటా వాటా 2015 కంటే తక్కువే

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో నోటా(నన్ ఆఫ్ ది ఎబౌ)ఆప్షన్‌కు మొగ్గు చూపిన ఓటర్ల సంఖ్య గత ఎన్నికలతో పోలిస్తే మరోసారి పెరిగింది. అయితే, 2015 ఎన్నికలతో పోల్చి చూస్తే మాత్రం ఇది తక్కువేనని పరిశీలకులు అంటున్నారు. అసెంబ్లీలోని 243 సీట్లకు గాను రెండు విడతల్లో కలిపి జరిగిన పోలింగ్‌లో 6,65,870 ఓట్లు నోటాకు పడ్డాయి. అంటే, మొత్తం పోలైన ఓట్లలో ఇది 1.81 శాతం. బిహార్‌లో మొత్తం ఓటర్లు 7.45 కోట్లు కాగా, 66.91 శాతం మంది ఓటేశారు. బిహార్ అసెంబ్లీకి 1951 నుంచి ఎన్నికలు జరుగుతున్నా..ఈస్థాయిలో జనం ఓటేయడం ఇదే మొదటిసారి. 2020 ఎన్నికల్లో నోటాకు 7,06,252 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓట్లలో ఇవి 1.68 శాతం. అయితే, 2015 ఎన్నికల్లో 3.8 కోట్ల మంది ఓటర్లకు గాను 9.4 లక్షల మంది నోటా ఆప్షన్‌ను ఎంచుకున్నారు. మొత్తం ఓట్లలో ఇది 2.46 శాతం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు అత్యల్పంగా ఓట్లు పడ్డాయి.

హత్య కేసులో అరెస్టయిన అనంత్‌కుమార్ గెలుపు

పట్నా: గ్యాంగ్‌స్టర్, రాజకీయ నేత అనంత్ కుమార్ సింగ్ మొకామా స్థానం నుంచి జేడీయూ తరపున విజయం సాధించారు. సమీప ప్రత్యర్థి, ఆర్జేడీకి చెందిన వీణా సింగ్‌పై 28,206 ఓట్ల తేడాతో గెలిచారు. అనంత్‌కుమార్ సింగ్‌కు 91,416 ఓట్లు పడగా, వీణా సింగ్‌కు 63,210 ఓట్లు దక్కాయి. జన్‌సురాజ్ పార్టీ మద్దతుదారు దులార్ చంద్ యాదవ్ హత్య కేసులో ఎన్నికలకు కొద్దిరోజుల ముందే అరెస్టయిన అనంత్ కుమార్ సింగ్ ప్రస్తుతం జైలులో ఉన్నారు. 1990 నుంచి ఈ సీటు సింగ్ కుటుంబం చేతుల్లోనే ఉంది.

అభివృద్ధి, సంక్షేమానికే పట్టం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే) మరోసారి విజయ ఢంకా మోగించింది. ఎవరూ ఊహించని విధంగా అఖండ విజయం దక్కించుకుంది. ఈస్థాయి ప్రభంజనాన్ని కూటమి పెద్దలు కూడా అంచనా వేయలేకపోయారు. 243 స్థానాలకు గాను 160 వరకు సీట్లు రావొచ్చని భావించగా, ఏకంగా 200కుపైగా సీట్లను ఎన్డీయే తన ఖాతాలో వేసుకుంది. ఈ అపూర్వమైన గెలుపు వెనుక బహుళ కారణాలు కనిపిస్తున్నాయి. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక పరిస్థితులు, పదునైన ఎన్నికల మేనేజ్‌మెంట్ వంటివి ఎన్డీయేకు కలిసొచ్చాయి. అధికార కూటమి విజయానికి దోహదపడిన కొన్ని కీలక అంశాలు ఏమిటంటే..

సాక్షి, న్యూఢిల్లీ

బిహార్‌లో ఎన్డీయే ప్రభంజనానికి పలు కారణాలు

నితీశ్ కుమార్ పథకాల పట్ల ఆకర్షితులైన జనం	అధికార కూటమికి అండగా నిలిచిన మహిళా ఓటర్లు	ఎన్డీయేను ఆదరించిన ఓబీసీలు, ఈబీసీలు, దళితులు

విపక్ష కూటమిని ముంచిన అంతర్గత కుమ్ములాటలు

ఎన్నికల మేనేజ్‌మెంట్

చురుకైన ఎన్నికల మేనేజ్‌మెంట్ ఎన్డీయేకు బలంగా మారింది. 2020 నాటి ఎన్నికల్లో చోటుచేసుకున్న చిన్నచిన్న పొరపాట్లను ఆ కూటమి సరిచేసుకుంది. ఈసారి కూటమి పక్షాల మధ్య సమన్వయం బాగా పెరిగింది. వాటి మధ్య చక్కటి సహకారం కనిపించింది. బూత్–స్థాయి మేనేజ్‌మెంట్ బాగా పనిచేసింది. ఎన్నికల ప్రచారంలో కూటమి పార్టీలన్నీ కలిసికట్టుగా పాల్గొన్నాయి. అంతర్గతంగా అక్కడక్కడా అభిప్రాయభేదాలున్నా బయటకు రాకుండా జాగ్రత్తపడ్డాయి. బీజేపీ, జేడీ(యూ), లోక్ జనశక్తి పార్టీ, హిందుస్తానీ అవామీ మోర్చా(సెక్యులర్), రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేశారు. వారంతా నిత్యం ప్రజల్లో ఉండడం, ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించడం ఎన్డీయే విజయ తీరాలకు చేర్చింది.

ఈ ఎన్నికల్లో మహిళలు పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి, ఉత్సాహంగా ఓటు వేశారు. రాష్ట్రవ్యాప్తంగా మెజార్టీ జిల్లాల్లో పురుషుల కంటే మహిళలే అత్యధికంగా ఓటు వేయడం గమనార్హం. వారు ఈ ఎన్నికల్లో ఎన్డీయేకు అండగా నిలిచారు. సరిగ్గా ఎన్నికల ముందు పలు మహిళా సంక్షేమ పథకాలను నితీశ్ కుమార్ ప్రభుత్వం ప్రకటించింది. జీవికా దీదీ పథకం కింద అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లోకి రూ.10,000 చొప్పున బదిలీ చేసింది. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల(ఈబీసీ) మహిళలకు కూడా సాయం అందజేసింది. రాష్ట్రంలోని 3.51 కోట్ల మహిళా ఓటర్లలో దాదాపు 40 శాతం మందిని ఇది నేరుగా ప్రభావితం చేసింది. మహిళా సాధికారతపై నితీశ్ కుమార్ చాలా రోజులుగా ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. వారి భద్రతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారు. మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ చర్యల ఫలితంగా ఎన్డీయే పట్ల మహిళా ఓటర్లు ఆకర్శితులయ్యారు. వారి ఆదరణ ఓట్ల రూపంలో బీజేపీ కూటమికి బదిలీ అయ్యింది.

మహిళలు-ఈబీసీ సమ్మేళనం

కులాల సమీకరణాలు

వేర్వేరు కులాలను తమకు అనుకూలంగా ఒక్కతాటిపైకి తీసుకురావడంలో ఎన్డీయే సఫలమైంది. అగ్రవర్ణాల ఓటర్లు సంప్రదాయకంగా బీజేపీ వెన్నంటే నిలుస్తున్నారు. ఈ ఎన్నికల్లోనూ ఆ ఆనవాయితీ యథాతథంగా కొనసాగింది. మరోవైపు ఓబీసీలు, ఈబీసీలతోపాటు దళితుల్లో గణనీయమైన ఓ వర్గం ఎన్డీయేకు మద్దతు పలకడం విశేషం. కులాల లెక్కలపై విపక్ష మహాగఠ్‌బంధన్ ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆశించిన ఫలితం రాలేదు. భిన్న సామాజిక వర్గాలు ఎన్డీయే వెనుక సంఘటితమయ్యాయి. అధికార కూటమినే వారు మరోసారి విశ్వసించారు.

విపక్షాల్లో చీలికలు

బీజేపీ కూటమిలో స్పష్టమైన ఐక్యమత్యం కనిపించగా, కాంగ్రెస్–ఆర్జేడీ కూటమిలో చీలికలు బహిర్గతమయ్యాయి. చివరి నిమిషం వరకు సీట్ల పంపకం సక్రమంగా జరగలేదు. కొన్నిచోట్ల స్నేహపూర్వక పోటీలు తప్పలేదు. పొత్తు ధర్మాన్ని విస్మరించి, కూటమి పార్టీలే పరస్పరం పోటీకి దిగాయి. మరోవైపు ఓట్ల బదిలీ సైతం జరగలేదు. తేజస్వీ యాదవ్‌ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం కూటమిలో కొందరికి నచ్చలేదు. ప్రతి పక్షానికి ఒక ఉమ్మడి వ్యూహం లోపించింది. ఎవరికి వారే అన్నట్లుగా ప్రవర్తించారు. మహాగఠ్‌బంధన్‌ను బలహీన కూటమిగా ప్రజలు భావించారు. దాంతో ఎన్డీయేకు ఎదురే లేకుండాపోయింది. మొత్తానికి ప్రతిపక్షం స్వీయ తప్పిదాలతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది.

చీలిన ముస్లిం ఓట్లు

కాంగ్రెస్–ఆర్జేడీ కూటమికి ప్రధాన బలం ముస్లిం–యాదవ్ ఓట్లే. కానీ, ఈసారి ముస్లింలు, యాదవులు ఆ కూటమిని అంతగా ఆదరించలేదు. ఈ రెండు వర్గాలను అనుకూలంగా మార్చుకోవడంలో ప్రతిపక్ష కూటమి విఫలమైంది. ముఖ్యంగా సీమాంచల్ ప్రాంతంలో ఎంఐఎం అభ్యర్థులు బరిలో ఉండడం మహాగఠ్‌బంధన్ విజయావకాశాలను దెబ్బకొట్టింది. ముస్లింల ఓట్లు భారీగా చీలిపోయాయి. రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ) బలమైన యాదవుల్లోనూ చీలికలు కనిపించాయి. యాదవుల్లో ఓ వర్గం ఎన్డీయేకు అండగా నిలిచింది. గెలిస్తే ప్రతి ఇంటికీ ఒక ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామంటూ ఆర్జేడీ చేసిన ప్రచారాన్ని జనం నమ్మలేదు.

కొంపముంచిన 'జంగిల్‌రాజ్'

జంగిల్‌రాజ్ అనగానే గుర్తొచ్చే పేరు బిహార్. ఆర్జేడీ హయాంలో ఆటవిక పాలన కొనసాగిందని, ప్రతిపక్షానికి ఓటేస్తే ఆనాటి రాక్షస రాజ్యం మళ్లీ వస్తుందని ఎన్డీయే నేతలు పదేపదే హెచ్చరించారు. జంగిల్‌రాజ్ రోజులను జనం ఇప్పటికీ మర్చిపోలేదు. మహాగఠ్‌బంధన్‌కు ఓటేస్తే జరిగేదేమిటో ఊహించుకొని మరోసారి ఎన్డీయేకు పట్టం కట్టారు. అభివృద్ధి కావాలి తప్ప ఆటవిక రాజ్యం వద్దని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ అవినీతిపరుడు కాకపోయినప్పటికీ అవకాశవాది అనే ముద్ర ఉంది. అధికారం కోసం సులువుగా కూటములు మార్చేస్తారన్న విమర్శలున్నాయి. అయినా సరే ఓటర్లు ఆయన పరిపాలనను ఆదరించారు. నితీశ్ నాయకత్వం, పాలనా సామర్థ్యం కూడా ఎన్డీయేకు అనుకూలంగా మారింది.

ఉచిత విద్యుత్.. మధ్యతరగతికి భరోసా

రాష్ట్రంలో 1.67 కోట్ల కుటుంబాలకు 125 యూనిట్ల వరకు విద్యుత్ ఉచిత పథకాన్ని ఎన్నికల ముందే అమలు చేయడం మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గాలను ఆకట్టుకుంది. సుమారు 5 కోట్ల మంది ఓటర్లు ఈ పథకంతో లబ్ధి పొందారు. అధికారంలోకి వస్తే 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామంటూ విపక్ష కూటమి హామీ ఇచ్చినా, 'ఇప్పటికే వస్తున్న'ప్రయోజనం ముందు ఆ హామీ నిలవలేకపోయింది.

వృద్ధులు, ఆశ్రితులకు ఆదరణ

సామాజిక భద్రతా పెన్షన్‌ను రూ.400 నుంచి ఏకంగా రూ.1100కి పెంచడం 1.11 కోట్ల మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు నేరుగా ప్రయోజనం చేకూర్చింది. ఇది వారి కుటుంబాల్లో ఎన్డీయే పట్ల బలమైన సానుకూలతను నింపింది.

యువత, విద్యార్థుల మద్దతు

నిరుద్యోగ భృతి(7.6 లక్షల మందికి), స్టూడెంట్ క్రెడిట్ కార్డ్‌పై వడ్డీ మాఫీ (4 లక్షల మందికి) పథకాలు యువతను, విద్యార్థులను ఎన్డీయే వైపు మళ్లించడంలో కీలక పాత్ర పోషించాయి.

సోషల్ ఇంజనీరింగ్ సూపర్ హిట్

గత ఎన్నికల్లో దూరమైన చిరాగ్ పాశ్వాన్, ఉపేంద్ర కుశ్వాహాలను తిరిగి కూటమిలోకి తీసుకురావడం నితీశ్–బీజేపీల రాజకీయ వ్యూహానికి పరాకాష్ట. వీరితోపాటు జీతన్ రామ్ మాంఝీని నిలబెట్టుకోవడం ద్వారా దళిత, అత్యంత వెనుకబడిన, కుశ్వాహా ఓట్లను ఎన్డీయే గంపగుత్తగా సాధించింది. ఈ ముగ్గురూ తమ వర్గాల ఓట్లను ఎన్డీయేకు బదిలీ చేయడంలో సంపూర్ణంగా విజయం సాధించారు.

అభివృద్ధి, హిందుత్వ

ఒకవైపు పూర్ణియా విమానాశ్రయం, బెగుసరాయ్ వంతెన వంటి అభివృద్ధి పనులను చూపిస్తూనే, మరోవైపు సీతామఢిలో జానకీ ఆలయ(సీతాదేవి) నిర్మాణానికి అమిత్ షా, నితీశ్ కుమార్‌లు భూమి పూజ చేయడంతో హిందుత్వ ఓటు బ్యాంకు కూడా బీజేపీని బలపర్చింది. ప్రచారంలో మోదీ స్వయంగా రంగంలోకి దిగడం ఎన్డీయేకు కొండంత బలాన్నిచ్చింది. 16 రోజుల్లో 14 కీలక జిల్లాల్లో ఆయన సుడిగాలి పర్యటనలు చేశారు.

గఠ్‌బంధన్‌ను ముంచిన 'ఎం' ఫ్యాక్టర్

- తోడు నిలవని మహిళలు
- మద్దతుగా రాని ముస్లింలు
- చేయిచ్చిన మల్లాలు
- 60 సీట్లలో పోటీచేసి 6 స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్
- ఆర్జేడీ పార్టీని వదలని జంగిల్‌రాజ్ మచ్చ

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్డీఏ కూటమిపై ఓట్ల చోరీ విమర్శనాస్త్రం సంధించి, బిహార్ యువత, మహిళలు, ముస్లింలు, మల్లాలుసహా ప్రతి వర్గంపై హామీల వరద పారించిన మహాగఠ్‌బంధన్ కూటమి గెలుపుపై పెట్టుకున్న గంపెడాశలు గంగపాలయ్యాయి. ముఖ్యంగా 'ఎం ఫ్యాక్టర్'గా పిలిచే మహిళలు, ముస్లింలు, మల్లాలు తమకు ఓట్ల పోరులో తోడుగా నిలబడి విజయకేతనం ఎగరేస్తా రనుకుంటే అధికార కూటమికి విజయపతాకం కట్టబెట్టి విపక్ష కూటమి కంగుతినేలాచేశారు. కుటుంబానికో ప్రభుత్వ ఉద్యోగం, వేలాది మంది తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకణ ఇలా అన్ని వర్గాలపై హామీల వర్షం కురిపించిన మహాగఠ్‌బంధన్ కూటమి బిహారీల మనసుల్ని గెల్చుకోలేకపోయింది. ఎన్నికలకు ఆరు నెలల నుంచి ముందునుంచి సీట్ల పంపకాలపై చర్చలు మొదలైనా అవి అధికార ఎన్డీఏతో పోలిస్తే వేగంగా తేలలేదు. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు సరిగా కుదర్లేదు. కొన్ని స్థానాల్లో విపక్ష పార్టీలు ఉమ్మడి అభ్యర్థిని నిలపడంలో ఘోరంగా విఫల మయ్యాయి. కాంగ్రెస్, ఆర్జేడీ అభ్యర్థులు పోటా పోటీగా ఒకే స్థానంలో పోటీకి దిగి ఇద్దరూ ఓడిపో యారు. ఓట్లు కాంగ్రెస్, ఆర్జేడీల మధ్య చీలిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. సీఎం అభ్యర్థిని చాలా ఆలస్యంగా ప్రకటించడం, ప్రచార పర్వంలో కాంగ్రెస్, ఆర్జేడీ అగ్రనేతల సమన్వయ లోపం సైతం కూటమి విజయావకాశాలను దెబ్బతీశాయి. తమ ఎన్నికల హామీతో అండగా ఉంటారనుకున్న మహి ళలు హఠాత్తుగా చేయివ్వగా, తమతో కలిసివస్తార నుకు న్న ముస్లింలు ఇరువర్గాల వైపు చీలిపోయారు. ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వజూపినా వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ(వీఐపీ) పార్టీ చీఫ్ ముఖేశ్ సహానీ ఆసక్తి కనబర్చకపోవడంతో ఆ పార్టీకి చెందిన మల్లా వర్గపు ఓటర్లు సైతం విపక్షకూటమి వైపు కన్నెత్తి చూడలేదు. ఇలా ఎన్నో కారణాలు విపక్షాలను విజయతీరాలకు చేర్చకుండా మధ్య లోనే ముంచేశాయి.

తేజస్వీ యాదవ్ | రాహుల్ గాంధీ

అండగా నిలవని ముస్లింలు..

బిహార్‌లో 10 కోట్ల జనాభాలో 1.75 కోట్ల మంది ముస్లింలు ఉన్నారు. అంటే జనాభాలో 17.7 శాతమున్న ముస్లింలు కేవలం మహాగఠ్‌బంధన్‌కు ఓటేయకుండా అధికారకూటమి వైపూ మొగ్గచూపారు. దీంతో ఓట్లు భారీగా చీలిపోయి మహాగఠ్‌బంధన్ విజయావకాశాలు పూర్తిగా నశించాయి. 243 స్థానాలకుగాను 87 స్థానాల్లో ముస్లింల ప్రాబల్యం ఎక్కువ. అందుకే 20 చోట్ల మహాగఠ్‌బంధన్ ముస్లింలకు సీట్లిచ్చింది. అయినాసరే ఇక్కడ మొత్తంగా గెల్చింది ఐదు సీట్లే. ముస్లింలకు 14 శాతం జనాభా ఉన్న యాదవులు కలిస్తే ఓటు బ్యాంక్ 32 శాతానికి పెరిగి తమకు బాగా కలిసి వస్తుందని మహాగఠ్‌బంధన్ వేసిన లెక్కలు తారుమారయ్యాయి. దళిత, ఆదివాసీలు కలిసొస్తే కనీసం 40 శాతం ఓట్లు వస్తాయని కాంగ్రెస్ భావించింది. వాస్తవంలో కాంగ్రెస్‌కు కేవలం 8 శాతం, ఆర్జేడీకి 21 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. ముఖ్యంగా చాలా స్థానాల్లో ముస్లిం ఓట్లు చీలిపోయాయి. అనేక చోట్ల బీఎస్పీకి 4 నుంచి 6 శాతం ఓట్లు వచ్చింది. కొత్తగా ఏర్పడిన జనసురాజ్ పార్టీ మహాగఠ్‌బంధన్ విజయావకాశాలను దెబ్బతీసింది. విపక్షాలు పోటీ చేసిన స్థానాల్లో ముస్లిం ఓట్లు జనసురాజ్ పార్టీ చీల్చింది. సీమాంచల్‌లో 11 స్థానాల్లో పోటీ చేసిన ఎంఐఎం 5 స్థానాలు గెలిచింది. 60 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్ 6 చోట్ల మాత్రమే గెలిచింది. అధిక శాతం ఉన్న ముస్లింలను కాదని, మల్లా వర్గానికి ఉప ముఖ్యమంత్రి పదవి ఆఫర్ చేయడం సైతం ముస్లింలకు కోపం తెప్పించింది. దర్భంగా, మధుబని, సివాన్, గోపాల్‌గంజ్, తూర్పు చంపారన్, భగల్‌పూర్ వంటి ప్రాంతాల్లో ముస్లిం ఓట్లు భారీగా చీలిపోయాయి. వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) చీఫ్ ముఖేశ్ సహానీకి చెందిన మల్లా వర్గం ఓటర్లు మిథిలాంచల్, సీమాంచల్, ముజఫర్‌పూర్, దర్భంగా, సుపాల్, వైశాలి, సీతామఢి, షెయోహర్, కిషన్‌గంజ్, సహర్సా, ఖగారియా, తూర్పు చంపారన్, పశ్చిమ చంపారన్ జిల్లాలలో ఎక్కువ. ఆయా జిల్లాల్లో గెలుపుపై విపక్షకూటమి గంపెడాశలు పెట్టుకుంటే కేవలం 18 చోట్ల గెలిచింది. వీఐపీ పార్టీ మల్లాలు అధికంగా ఉన్న 15 చోట్ల పోటీ చేస్తే అన్ని చోట్లా ఓడింది.

పెరిగిన ఓట్ల శాతం శరాఘాతమే..

మహిళా ఓటర్లు తమ వెంటే ఉన్నారని కూటమి తొలినుంచీ భావిస్తోంది. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఏకంగా 66.91 శాతం పోలింగ్ నమోదు కాగా, ఇందులో మహిళా ఓటర్లలో 71.6 శాతం పోలింగ్ నమోదైంది. ఓటేసిన మహిళలే రాష్ట్రంలో అధికంగా గెలుపోటములను నిర్దేశించారని తేటతెల్లమైంది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు 1.5 కోట్ల మంది మహిళల ఖాతాల్లో నితీశ్ ప్రభుత్వం ఏకంగా ఒకేసారి రూ.10,000 నగదు జమచేయడంతో వాళ్లంతా అధికార పార్టీకే కొమ్ముకాశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, ఉచిత సైకిల్ పథకం వంటివి ఎన్డీఏకు కలిసొచ్చాయి. ఇవి విపక్షాలకు ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. ఆర్థికంగా వెనుకబడిన మహి ళలకు ఏటా రూ. 30వేల ఆర్థిక సాయం, జీవికా దీదీల ఉద్యో గాల క్రమబద్ధీకరణ, రూ. 30 వేల గౌరవవేతనం, 'మా' (ఇల్లు, వంట సరుకులు, ఆదాయం) పథకం ప్రతి మహిళకు భరోసా ఇస్తామని హామీ ఇచ్చినా మహిళలు విపక్షాల మాటలను నమ్మలేదు. గతంలో లాలూ ప్రసాద్ యాదవ్ సీఎంగా ఉన్నప్పుడు ఆటవికంగా పరిపాలించారంటూ ఎన్డీఏ కూటమి చేసిన ప్రచారాన్ని జనం గుర్తుంచుకుని ఆర్జేడీ మాటలను విశ్వసించడం మానేశారు. కాంగ్రెస్ వరస వైఫల్యాల నుంచి గుణపాఠాలు నేర్చుకోకుండా పాత వ్యూహాలనే అమలు చేయడం సైతం విజయపథంలో దూసుకుపోకుండా అడ్డుకుందని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించారు.

అక్రమాల పుట్ట.. అందుకే గెలవలేదు

బిహార్ ఎన్నికల ఫలితాలపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి ఘోర పరాజయంపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ ఫలితాలు తనకు నిజంగా ఆశ్చర్యం కలిగించాయన్నారు. 'ఈ ఎన్నిక ప్రక్రియ మొదట్నుంచీ అక్రమాలపుట్టగానే ఉంది. అందుకే మేం విజయం సాధించలేకపోయాం'అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ ఫలితాలపై ఇండియా కూటమి చాలా లోతైన ఆత్మ విమర్శ చేసుకోవాలని, ప్రజాస్వామ్య పరిరక్షణకు మరింత ప్రభావవంతమైన రీతిలో ప్రయత్నాలు చేపట్టాలని సూచించారు. 'మహాగట్‌బంధన్‌పై విశ్వాసం ఉంచిన బిహార్‌లోని లక్షలాది మంది ఓటర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు. బిహార్‌లో ఈ ఫలితం నిజంగా ఆశ్చర్యకరం. మొదటి నుంచీ నిష్పక్షపాతంగా లేని ఈ ఎన్నికల్లో మేం విజయం సాధించలేకపోయాం'అని గాంధీ పోస్ట్ చేశారు. 'మా పోరాటం రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసమే. కాంగ్రెస్, ఇండియా కూటమి ఈ ఫలితంపై లోతుగా సమీక్షించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి మరింత సమర్థవంతమైన ప్రయత్నాలు చేస్తాయి'అని తెలిపారు.

భారీ ఓట్ల చోరీకి నిదర్శనమిది

ఎవరూ ఊహించనంత భారీస్థాయిలో ఓట్ల చోరీకి తాజా ఎన్నికల ఫలితాలే నిదర్శనం. ఈ విధానానికి ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషన్ సృష్టికర్తలు. ఏదేమైనా దీనిని బిహార్ ఓటర్ల తీర్పుగా భావిస్తాం. గౌరవిస్తాం. రాజ్యాంగబద్ధ సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే శక్తులపై కాంగ్రెస్ పోరాటం ఇకమీదటా కొనసాగుతోంది. కాంగ్రెస్ పార్టీ పేలవ ప్రదర్శనపై అంతర్గతంగా విస్తృతస్థాయిలో మదింపు చేశాక ఈ అంశంపై మాట్లాడతాం. మహాగట్‌బంధన్ గెలుపు కోసం తమ అమూల్యమైన ఓటు వేసిన ప్రతి ఒక్క ఓటరుకు నా కృతజ్ఞతలు. ఫలితాలను చూసి కాంగ్రెస్ కార్యకర్తలు ఏమాత్రం కుంగిపోవద్దు. మీరే మా గౌరవం, ప్రతిష్ట, ఆస్తి. మీ శక్తిమేరకు కృషిచేశారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యం కోసం ఎల్లవేళలా కష్టపడదాం.

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

ప్రతి బిహారీ విజయం

అభివృద్ధి చెందిన బిహార్ కోసం కలలుగనే ప్రతి బిహారీ విజయం ఇది. జంగిల్ రాజ్, బుజ్జగింపు రాజకీయాలను ఆచరించే వారు ఏ వేషంలో వచ్చినా, దోచుకోవడానికి అవకాశం దక్కదు. ప్రజలు ఇప్పుడు కేవలం 'పాలిటిక్స్ ఆఫ్ పర్ఫార్మెన్స్'ఆధారంగా మాత్రమే తీర్పు ఇస్తున్నారు. మోదీ, నితీశ్, ఎన్డీఏ నేతలు, కార్యకర్తలందరికీ అభినందనలు. ఈ ఫలితాన్ని తమ అవిశ్రాంత కృషి ద్వారా నిజం చేసిన బూత్‌స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బిహార్ బీజేపీ కార్యకర్తలందరికీ నా వందనం. ఓటు బ్యాంకు కోసం చొరబాటుదారులను రక్షించే వారికి ప్రజలు తగిన సమాధానం ఇచ్చారు.

- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

సువర్ణాధ్యాయం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ సాధించిన అపూర్వమైన విజయం రాష్ట్ర ఎన్నికల చరిత్రలోనే కాకుండా దేశంలోనూ ఒక సువర్ణ అధ్యాయాన్ని లిఖించింది. అభివృద్ధి రాజకీయాలకు ఇది చరిత్రాత్మక విజయం. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ సాధించిన భారీ మెజారిటీ ప్రధాని మోదీ స్ఫూర్తిదాయక నాయకత్వం, సుపరిపాలన, అభివృద్ధి రాజకీయాలపై ప్రజల అచంచల విశ్వాసానికి నిదర్శనం. ఈ గొప్ప విజయానికి ప్రధానికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు. బిహార్ ప్రజలు ఎన్డీఏకు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పును అభినందిస్తున్నాను.

- రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర రక్షణశాఖ మంత్రి

అవినీతిని ప్రజలు తిరస్కరించారు

బిహార్ ప్రజలకు శుభాకాంక్షలు. జై సియా రామ్. బిహార్‌లో ఎన్డీఏకు లభించిన చారిత్రాత్మక ప్రజా మద్దతు ప్రధాని మోదీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి నితీశ్ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం యొక్క అభివృద్ధి ఆధారిత, ప్రజా సంక్షేమ విధానాలపై ప్రజల విశ్వాసానికి నిదర్శనం. మహా కూటమి ఆటవిక రాజ్యం, అవినీతిని పూర్తిగా తిరస్కరించారని ఎన్డీఏ సుపరిపాలన, స్థిరత్వం, అభివృద్ధి దార్శనికతను బిహార్ సోదర సోదరీమణులు విశ్వసించారనేందుకు ఈ విజయమే రుజువు.

- జేపీ నడ్డా, కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు

అభివృద్ధిని కోరుకుంటున్నారు

బిహార్ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని ఫలితాలు నిరూపించాయి. ఎన్డీయే ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టారు. రౌడీయిజాన్ని, గూండాయిజాన్ని వద్దనుకుని అభివృద్ధిని కోరుకున్నారు. మోదీ నాయకత్వంలో నితీశ్ నేతృత్వంలోని ప్రభుత్వం ద్వారా జరుగుతున్న పురోగతి ఇకపైనా కొనసాగించాలని నిశ్చయించుకున్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఇంత భారీ స్థాయిలో సీట్లు గెలుస్తుందని సర్వేలు కూడా ఊహించలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఇప్పుడున్న కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఆ 3 రాష్ట్రాలు కూడా ఆ పార్టీ నుంచి చేజారిపోవడం ఖాయం.

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

టైగర్ అభీ జిందా హై!

తాజా ఎన్నికల్లో పట్టు నిరూపించుకున్న నితీశ్ కుమార్

- 2020 అసెంబ్లీ ఫలితాలతో పోల్చితే రెట్టింపు సీట్లు
- రాష్ట్ర రాజకీయాల్లో ఎదురులేదని నిరూపించుకున్న సీఎం

పట్నా: 'టైగర్ అభీ జిందా హై'(పులి ఇంకా సజీవంగానే ఉంది) బాలీవుడ్ బ్లాక్‌బస్టర్ ఇది. జేడీ(యూ) అధినేత, బిహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు ఈ టైటిల్ సరిగ్గా వర్తిస్తుంది. 'నేను అలసిపోలేదు. రిటైర్ అవ్వాలనే మూడ్‌లోనూ లేను'అన్న పదాలకు నితీశ్‌కుమార్ నిలువుటద్దంలా కనిపిస్తున్నారు. ఐదేళ్ల క్రితం 2020 బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సీట్లను ప్రస్తుతం దాదాపు రెట్టింపు చేసుకున్న నితీశ్, ఆ రాష్ట్ర రాజకీయాల్లో తనకు ఎదురులేదని నిరూపించుకున్నారు.

వదంతులను పటాపంచలు చేస్తూ..

బిహార్ అసెంబ్లీ ఎన్నికల శంఖారావం మొదలు నితీశ్ కుమార్ పలు అంశాల్లో తన సత్తాను నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇందులో ఒకటి 'ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత ఉంది'అన్న అంశంకాగా, 'ఆయన ఆరోగ్యం సరిగా లేదు' అన్నది మరొకటి. ఈ రెండు అంశాలను ఎన్నికల సందర్భంగా ప్రతిపక్షం ఉధృతంగా ప్రజల్లోకి తీసుకునివెళ్లింది. అయితే ఈ ప్రచారాన్ని ఆయన సమర్థంగా ఎదుర్కొన్నట్లు తాజా ఫలితాలు స్పష్టంచేస్తున్నాయి.

పథకాల ప్రకటనలో దూకుడు

అత్యంత కీలకమైన ఈ ఎన్నికలకు ముందుగా, 75 ఏళ్ల నితీశ్ దూకుడుగా పథకాలు ప్రకటించారు. సామాజిక భద్రతా పెన్షన్లు పెంచడం, జీవికా -ఆశా- అంగన్‌వాడీ సిబ్బందికి భత్యాలు ఇవ్వడం ఇందులో కొన్ని. అంతేకాదు ఎంతో ప్రచారం పొందిన 'ముఖ్యమంత్రి మహిళా రోజ్ యోజన'కింద కోటి మందికిపైగా మహిళల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున జమ చేసి ప్రజాకర్షక పథకాల్లో దూసుకుపోయారు. అయితే ఈ ''ఫ్రీబీలు''ప్రభావాన్ని ఆయన రాజకీయ ప్రత్యర్థులు ముందుగానే గమనించారు. ఆయన మాజీ డిప్యూటీ తేజస్వి యాదవ్ (ఆర్జేడీ) ప్రభుత్వం 'కాపీక్యాట్'గా మారిందని విమర్శించారు. నితీశ్‌కు గతంలో సహాయకునిగా వ్యవహరించిన పవన్ వర్మ 'ఈ పథకాల ద్వారా ఓటర్లను లంచం ఇస్తున్నారు'అని విమర్శించారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని అభ్యర్థించారు. ప్రస్తుతం పవన్ వర్మ.. జేడీయూ సుప్రీమోకు ఒకప్పుడు సన్నిహితునిగా ఉన్న ప్రశాంత్ కిషోర్ నాయకత్వంలోని జన సురాజ్ పార్టీలో (జేఎస్‌పీ) ఉన్నారు. ఇక రాష్ట్ర ఖజానాను దెబ్బతీస్తున్నారన్న విమర్శలు సరేసరి.

తొణకని, బెణకని నైజం

అయితే రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ కాలం సీఎం గా పనిచేసిన నితీశ్ కుమార్ మాత్రం విమర్శలు, ఆరోపణలకు ఏమాత్రం కంగారు పడలేదు. బీజేపీ తనపై 'మహారాష్ట్ర శిండే విధానం'అవలంబించబోతుందన్న ప్రత్యర్థుల మాటలకూ విలువ ఇవ్వలేదు. మహారాష్ట్రలో శివసేనను అధిగమించి బీజేపీ అధికారం చేపట్టిన తరహాలోనే, నితీశ్‌కూ బీజేపీ రాజకీయంగా భంగం కలిగిస్తుందన్న అర్థంలో ప్రతిపక్షాలు చేసిన విమర్శలకూ ఆయన విలువ ఇవ్వలేదు. అయితే ఈ విమర్శలకు ఆయన ఎందుకు తొణకడంలేదన్నది ఇక్కడ చర్చనీయాంశంగా మారింది. లోక్‌సభలో స్వతంత్ర మెజారిటీ లేనందున.. బీజేపీ కేంద్రంలో అధికారంలో నిలవడానికి జేడీయూ మద్దతుపైనే ఆధారపడి ఉందన్న నిజం బహుశా ఆయన దృష్టిలో ఉండవచ్చన్నది ఇందులో ఒకటి. ఇక ఈ సందర్భంలో బీజేపీ విషయానికి వస్తే, రాష్ట్రంలో మోదీ 14 భారీ సభలు, ఒక రోడ్‌షో నిర్వహించారు. అయితే నితీశ్ కుమార్‌తో సమస్తీపూర్‌లో జరిగిన తొలి ఎన్నికల సభ మినహా వీరిరువురూ ఒకే వేదికపై ఎక్కడా కనిపించలేదు. అయినా, 'నితీశ్ బాబు చేసిన మంచి పనిని గుర్తుంచుకోండి'అని ప్రజలను ఉద్దేశించి మోదీ ప్రతి సభలో పేర్కొన్నారు.

రాజకీయ ప్రస్థానం..

- బిహార్‌లోని బఖ్తియార్పూర్‌లో 1951లో జన్మించిన కుమార్ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్.
- విద్యుత్ శాఖలో వచ్చిన ఉద్యోగాన్ని వదిలి జేపీ ఉద్యమం కాలంలో రాజకీయాల్లోకి ప్రవేశించారు.
- జనతా పార్టీలో చేరి 1977లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికలో పోటీ చేశారు కానీ ఓడిపోయారు. 1985లో తొలి విజయాన్ని సాధించారు.
- దాదాపు ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో తరచూ పక్షం–విపక్షం మారుతూ వచ్చారన్న విమర్శలతో 'పల్టూ రాం' (పల్టీ రాం) అన్న బిరుదు కూడా సంపాదించారు.

తేజస్వీ ఆశ.. అడియాస

పట్నా: తండ్రి నుంచి కుమారులకు ఆస్తిపాస్తులు వారసత్వంగా వస్తుంటాయి. కానీ బిహార్‌లో లాలూ ప్రసాద్ యాదవ్ నుంచి ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌కు తండ్రి పరిపాలనా కాలం నాటి ఆటవికపాలన తాలూకు మాయని మచ్చలు అలాగే అంటుకుపోయాయి. జంగిల్‌రాజ్‌గా పేరుమోసిన లాలూ ప్రసాద్ యాదవ్ పరిపాలనాకాలంనాటి చేదు జ్ఞాపకాలు చివరకు తేజస్వీయాదవ్ విజయావకాశాలను దారుణంగా దెబ్బతీశాయి. ఆర్జేడీ అధికారంలోకి వస్తే ఆటవికపాలనకు ఆవాహన పలికినట్లేనని ఎన్డీఏ కూటమి చేసిన ప్రచారం బాగా పనిచేసి అది చివరకు మహాగట్‌బంధన్ కూటమికి ఓట్లు రాలకుండా చేసింది. దీంతో ముఖ్యమంత్రి అవ్వాలనుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ కల కలగానే మిగిలిపోయింది. స్నేహితుడు, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీతో కలిసి చేసిన జంట భారీ ర్యాలీలు సైతం జనాల మనసులను మార్చలేకపోయాయి. బిహార్ కీలకనేత కుమారునిగా రాజకీయ అరంగేట్రం అత్యంత సులభంగా జరిగినా ఎన్నికల రణరంగంలో గెలవడం అంతతేలికకాదని తేజస్వీకి శుక్రవారం నాటి ఫలితాలు రుచిచూపించాయి. మహాగట్‌బంధన్ తరఫున ముఖ్యమంత్రి అభ్యర్థిగా తేజస్వీ యాదవ్ పేరును ప్రకటించినప్పుడే కూటమిలోని కొందరు నేతలకు ఈ నిర్ణయం రుచించలేదు. సీఎం అభ్యర్థికి వ్యక్తిగత కరిష్మా తోడవ్వాల్సిందిపోయి కుటుంబ అప్రతిష్ట ఈయన గెలుపునకు అవరోధంగా మారొచ్చనే అనుమానాలకు ఆనాడే బీజాలు పడ్డాయి. ఇవి ఇప్పుడు నిజమయ్యాయని కొందరు రాజకీయనేతలు విశ్లేషిస్తున్నారు.

క్రికెట్‌కు గుడ్‌బై.. ఎన్నికల్లో కొత్త ఇన్నింగ్స్

రాష్ట్రవాళీ క్రికెటర్ అయిన తేజస్వీ పదేళ్ల క్రితం తనకిష్టమైన ఆటకు స్వస్తిపలికారు. తన అసలైన రాజకీయ వారసుడు తేజస్వీ అని భావించిన మరుక్షణమే లాలూ ఈయనతో రాజకీయరంగ ప్రవేశం చేయించారు. మిత్రధర్మం పాటించి కాలంలో జేడీయూతో కలిసి ప్రభుత్వం ఏర్పాటుచేసినప్పుడు నితీశ్ సర్కార్‌లో తేజస్వీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. అయితే కేంద్రంలో యూపీఏ-1 పరిపాలనాకాలంలో రైల్వే మంత్రిగా లాలూ ప్రసాద్ యాదవ్ భూములు తీసుకుని రైల్వే ఉద్యోగాలు ఇచ్చాడనే కేసులో తేజస్వీ పేరు సైతం జతకూడడంతో తేజస్వీపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. విచిత్రంగా ఆ అవకతవకల నాటికి తేజస్వీ ఇంకా టీనేజీ పిల్లాడు కావడం గమనార్హం. అయితే తర్వాత తేజస్వీ రాజకీయాల్లో అడుగుపెట్టడం 2020 బిహార్ ఎన్నికల్లో ఆర్జేడీ ఏకంగా 75 సీట్లు సాధించంతో ఈయన పేరు మార్మోగిపోయింది. ఆ హవాను తాజా ఎన్నికల్లో తేజస్వీ కొనసాగించలేకపోయారు. ఆర్జేడీ సారథ్యంలోని కూటమి అధికారంలోకి వస్తే జంగిల్‌రాజ్ పునరావృతమవుతుందన్న బీజేపీ ప్రచారాన్ని తేజస్వీ బలంగా తిప్పికొట్టలేకపోయారు.

అందర్నీ గెలిపించి.. స్వరాష్ట్రంలో చతికిలపడి..

- విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్న ఒకప్పటి ఎన్నికల వ్యూహకర్త
- బిహార్ ఎన్నికల్లో ఘోరంగా విఫలమైన ప్రశాంత్ కిషోర్ 'జన సురాజ్ పార్టీ'

పట్నా: ఢిల్లీ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ ఇలా పలు రాష్ట్రాల్లో ప్రధాన పార్టీలను సునాయాసంగా గెలుపుబాటలో నడిపించి అధికార పీఠాలపై కూర్చోబెట్టిన ఒకప్పటి ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ తీరా స్వరాష్ట్రం బిహార్‌లో సొంతంగా పార్టీ పెట్టి కూడా కనీసం ఒక్క స్థానంలో గెలవలేక ఘోరంగా విఫలమయ్యారు. అయితే ఇలాంటి ఫలితాలను ముందే ఊహించిన ప్రశాంత్ ఇటీవల ఈ అంశంపై మాట్లాడటం విశేషం. ''గెలిస్తే మహా ప్రభంజనం సృష్టిస్తాం. ఎవ్వరూ ఊహించనన్ని సీట్లు గెల్చుకుంటా. లేదంటే అత్యంత ఘోరంగా ఓడిపోతాం''అని అన్నారు. రెండో మాట అచ్చంగా శుక్రవారం నిజమైంది. ఆయన స్థాపించిన జన సురాజ్ పార్టీ మొత్తం 243 స్థానాల్లో పోటీచేసి కనీసం ఒక్కచోట కూడా గెలుపుబోణీ కొట్టలేకపోయింది. చాలా చోట్ల పార్టీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతయ్యాయి.

పాదయాత్రతో మొదలెట్టి..

2022 అక్టోబర్ రెండో తేదీన చంపారన్‌లో ప్రశాంత్ పాదయాత్ర మొదలెట్టి వందల కిలోమీటర్లు నడిచారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సమస్యలు అడిగి తెల్సుకున్నారు. సమస్యలను తీర్చుతానని హామీ ఇచ్చారు. ఛాయ్ పే చర్చా అంటూ ప్రధాని మోదీకి కొత్త నినాదం ఇచ్చిన ప్రశాంత్ తదనంతర కాలంలో ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్, పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, తమిళనాడులో ఎంకే స్టాలిన్, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ పార్టీ చీఫ్ జగన్‌మోహన్ రెడ్డి, ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్, బిహార్‌లో నితీశ్ కుమార్, మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రేలకు ఎన్నికల వ్యూహకర్తగా ఉండి ఆయా రాష్ట్రాల్లో వాళ్ల పార్టీలను గెలిపించారు. అదే వ్యూహంతో బిహార్‌లోనూ ఎన్నికల బరిలో దిగిన ప్రశాంత్ అనూహ్యంగా చతికిలపడ్డారు. శుక్రవారం విడుదలైన బిహార్ శాసనసభ ఎన్నికల ఫలితాల్లో జన సురాజ్‌పార్టీ అభ్యర్థులు అందరూ ఓడిపోయారు. ఓటర్లను ఏమాత్రం ఆకట్టుకోలేకపోయారు.

నితీశ్‌తో పొసగక సొంత పార్టీ..

ఇండియా పొలిటికల్ యాక్షన్ కమిటీ(ఐ–ప్యాక్) పేరిట ఎన్నికల వ్యూహాలు, సిద్ధాంతాలు, పథకాలను రచించే సంస్థను కొన్నాళ్ల క్రితం ప్రశాంత్ స్థాపించారు. ఇతర రాష్ట్రాల్లో వ్యూహకర్తగా విజయం సాధించాక స్వరాష్ట్రంలో అడుగుపెట్టారు. 2015లో నితీశ్‌కుమార్‌ను గెలిపించి నితీశ్ సర్కార్‌లో కేబినెట్ మంత్రి హోదాకు సమానంగా ప్రభుత్వసలహాదారు పదవిలో ప్రశాంత్ కొనసాగారు. మూడేళ్ల తర్వాత జేడీయూలో చేరి ఏకంగా పార్టీ జాతీయ ఉపాధ్యక్ష పగ్గాలు చేపట్టారు. అయితే పౌరసత్వ సవరణ చట్టం విషయంలో నితీశ్, ప్రశాంత్ మధ్య తీవ్రవిభేదాలు పొడచూపాయి. దీంతో ప్రశాంత్‌ను జేడీయూ నుంచి బహిష్కరించారు. ఈ అక్కసుతోనే సొంత పార్టీ పెట్టాడని బిహారీలు ఇంకా నమ్ముతున్నారు.

పేలవ కేడర్, కొత్త అభ్యర్థులు

ఎలాంటి నేరచరిత్రలేని అభ్యర్థులను రంగంలోకి దింపానని ప్రశాంత్ ఘనంగా ప్రకటించారు. కానీ ఏ రాష్ట్రంలోనైనా కాస్తంత ఛరిష్మా ఉన్న నేతలే ఎక్కువ ఓట్లను కొల్లగొట్టగలరని రాజకీయ చరిత్ర చెబుతోంది. కొన్ని నెలల క్రితమే స్థాపించిన జన సురాజ్ పార్టీ ఇంకా క్షేత్రస్థాయిలోకి చొచ్చుకుపోలేదు. దీంతో పార్టీకి పెద్దగా కేడర్, కార్యకర్తల బలం లేదు. ఇవన్నీ పార్టీ విజయావకాశాలను బాగా దెబ్బతీశాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. బిహార్‌లో మార్పు తెస్తానని వాగ్దానంతో ఎన్నికల పద్మవ్యూహంలో దిగిన ప్రశాంత్ తొలి ప్రయత్నంలో జనం చావుదెబ్బ తీశారు.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయంతో శుక్రవారం పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో పండగ చేసుకున్న బీజేపీ కార్యకర్తలు ప్రధాని మోదీ చిత్ర పటానికి స్వీట్లు తినిపించారు

బిహార్‌లో కాంగ్రెస్ కనుమరుగు!!

40 ఏళ్ల క్రితం 100కుపైగా స్థానాలు గెలుపు

ఇప్పుడు అత్యంత అధ్వాన స్థితికి చేరుకున్న దిగ్గజ పార్టీ

న్యూఢిల్లీ: సరిగ్గా 40 ఏళ్ల క్రితం బిహార్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100కుపైగా స్థానాల్లో విజయపతాక ఎగరేసింది. శుక్రవారం వెలువడిన ఎన్నికల్లో కేవలం ఆరు చోట్ల గెలిచింది. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. 1952 ఎన్నికల్లో 41.38 శాతం ఓట్లను ఒడిసిపట్టిన కాంగ్రెస్ ప్రభ 1990వ దశకం నుంచి తగ్గుతూ వస్తోంది. ఈసారి 50కిపైగా స్థానాల్లో పోటీచేసిన కాంగ్రెస్.. అసదుద్దీన్ ఒవైసీ సారథ్యంలోని ఏఐఎంఐఎం, జితన్ రామ్ మాంఝీ సారథ్యంలోని హిందుస్తానీ అవామ్ మోర్చా(హెచ్ఏఎం)ల స్థాయికి పడిపోయింది. ఎంఐఎం, హెచ్ఏఎంలు చెరో 5 చోట్ల గెలిచాయి. 15 ఏళ్ల క్రితంతో పోలిస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ఓటు షేరు కాస్తంత పెరిగింది. 2010లో పోలైన ఓట్లలో కాంగ్రెస్‌కు 8.17 శాతం ఓట్లు పడితే ఈసారి కాస్తంత ఎక్కువగా 8.75 శాతం ఓట్లు పడ్డాయి. తిరుగుబాటు నేతలను దారి తెచ్చుకోవడం, కీలక నేతల మధ్య సమన్వయం పెంచడం, ఓడిన స్థానాల్లో తిరిగి పట్టుసాధించి విజయం సాధించే క్రమంలో కాంగ్రెస్ ఘోరంగా విఫలమవుతోంది. 1985లో వందకుపైగా సీట్లు గెలిచిన పార్టీ తర్వాత 1990లో కేవలం 71 స్థానాలకు పరిమితమైంది. అప్పటి నుంచి గెలుపు కోత మొదలైంది. 1995లో 29 చోట్ల, 2000లో 23 చోట్ల గెలిచింది. ఇక 2005లో పదంటే పది చోట్ల విజయం సాధించింది.

శుక్రవారం ఫలితాలను చూస్తే హెచ్ఏఎం(సెక్యులర్) నేత చేతిలో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌కుమార్ సైతం ఓడిపోయారు. 'కుటుంబ'నియోజకవర్గంలో హెచ్ఏఎం అభ్యర్థి లలన్ రామ్ .. రాజేశ్ కంటే 21,525 ఓట్లు ఎక్కువ సాధించారు. రాహుల్‌గాంధీ తలకెత్తుకున్న ఓటు చోరీ నినాదం బిహార్‌లో ఏమాత్రం పనిచేయలేదు. రాహుల్ చేసిన ఓటర్ అధికార్ యాత్ర, ఓటర్లజాబితా సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై విమర్శలు, ప్రజాస్వామ్యాన్ని జెన్ జెడ్ యువతరం కాపాడాలన్న పిలుపులకు ఓటర్ల నుంచి ఎలాంటి స్పందనాలేదు. గతంతో పోలిస్తే బిహార్‌లో మౌలికవసతుల అభివృద్ధి వేగంగా జరగడంతో ఓటర్లు ఎన్డీఏ వైపు మొగ్గుచూపడంతో కాంగ్రెస్ ఓటమి రూపంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. కొన్ని చోట్ల ఆర్జేడీ, కాంగ్రెస్ ఉమ్మడి అభ్యర్థిని నిలపలేకపోవడం, ఉన్న కొన్ని ఓట్లను కొత్తగా వచ్చిన జనసురాజ్ పార్టీ చీల్చడంతో మరికొన్ని స్థానాలు కాంగ్రెస్ చేతుల్లోంచి జారిపోయాయి. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం విప్లవాత్మకంగా సంస్థాగత సంస్కరణలకు తెగించకపోతే అధికారాలను కోల్పోయే పరంపర కొనసాగుతుందని రాజకీయ పండితులు విశ్లేషించారు.

షాకిచ్చిన ఉప ఫలితాలు

బుద్గాంలో ఎన్సీకి మొట్టమొదటి పరాజయం

నగ్రోటాలో డిపాజిట్ గల్లంతు • రాజస్తాన్‌లో సీటు గెలుచుకున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ: వివిధ రాష్ట్రాల్లోని 8 నియోజకవర్గాలకు ఈనెల 11వ తేదీన జరిగిన ఉప ఎన్నికల్లో నాలుగింటిని అధికార పక్షాలు దక్కించుకున్నాయి. బీజేపీ పాలిత రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఒక సీటును గెలుచుకోగా, జమ్మూకశ్మీర్‌లోని బుద్గాం స్థానం అధికార నేషనల్ కాన్ఫరెన్స్ మొట్టమొదటిసారిగా ఓటమి పాలైంది. ఇక్కడ పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ(పీడీపీ) అభ్యర్థి విజయం సాధించారు. జమ్మూకశ్మీర్‌లోని నగ్రోటా సీటును బీజేపీ నిలబెట్టుకుంది. మిజోరంలో ప్రధాన ప్రతిపక్షం మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్) డంపా సీటును, పంజాబ్‌లోని తరన్‌తరన్ స్థానాన్ని ఆప్, జార్ఖండ్‌లోని ఘట్‌శిలా స్థానాన్ని జేఎంఎం నిలబెట్టుకున్నాయి. అదేవిధంగా, తెలంగాణలోని జుబ్లీహిల్స్ స్థానాన్ని బీఆర్ఎస్ నుంచి అధికార కాంగ్రెస్ దక్కించుకుంది. ఒడిశాలోని నౌపడ స్థానాన్ని బీజేపీ భారీ మెజార్టీతో తిరిగి గెలుచుకుంది. ఉప ఎన్నిక ఫలితాలపై ప్రధాని మోదీ స్పందించారు. బీజేపీ అభ్యర్థులకు విజయం అందించిన జమ్మూకశ్మీర్‌లోని నగ్రటా, ఒడిశాలోని నౌపడ నియోజకవర్గాల ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కొత్తగా ఎమ్మెల్యేలైన దేవయాని రాణా, ధొలాకియాలను ఆయన అభినందించారు. వీరి గెలుపునకు అహర్నిశలు కృషి చేసిన కార్యకర్తలకు ఎక్స్‌లో ధన్యవాదాలు తెలిపారు.

కంచుకోటలో ఎన్సీ ఓటమి

బుద్గాం నియోజకవర్గం అబ్దుల్లాల కుటుంబానికి కంచుకోటగా ఉంది. గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్సీ) అగ్రనేత ఒమర్ అబ్దుల్లా బుద్గాంతోపాటు గండేర్‌బల్ స్థానాల నుంచి పోటీ చేసి గెలుపొందారు. అనంతరం, సీఎం అయ్యాక బుద్గాంకు రాజీనామా చేశారు. దీంతో, 11న ఉప ఎన్నిక జరిగింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో ఇక్కడ ప్రతిపక్ష పీడీపీ అభ్యర్థి ఆగా సయ్యద్ ముంతజీర్ విజయం సాధించారు. ఎన్సీ అభ్యర్థి ఆగా సయ్యద్ మెహమ్మూద్‌పై ముంతజీర్ 4,478 ఓట్ల తేడాతో గెలుపొంది రికార్డు నెలకొల్పారు. 1957లో మొదటిసారిగా ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఓటమి ఎరుగని ఎన్సీకి మొట్టమొదటి పరాజయమిది.

డిపాజిట్ కోల్పోయిన ఎన్సీ

జమ్మూకశ్మీర్‌లోని నగ్రోటా స్థానాన్ని బీజేపీ అభ్యర్థి దేవయాని రాణా గెలుచుకున్నారు. జమ్మూకశ్మీర్ నేషనల్ పాంథర్స్ పార్టీ(జేకేఎన్‌పీపీ)కి చెందిన హర్ష్ దేవ్ సింగ్‌పై 24,647 ఓట్ల తేడాతో దేవయాని గెలిచారు. ఇక్కడ నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థిని షమీమ్ బేగం డిపాజిట్ కోల్పోయారు. ఆమెకు కేవలం 10,872 ఓట్లు మాత్రమే దక్కాయి. దివంగత ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా కుమార్తె దేవయాని. దేవేందర్ మరణంతో ఉప ఎన్నిక జరిగింది.

నౌపడలో బీజేపీ భారీ మెజార్టీ

ఒడిశాలోని నౌపడ స్థానాన్ని బీజేపీ అభ్యర్థి జే ధొలాకియా గెలుచుకున్నారు. సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్‌కు చెందిన ఘాసీ రామ్ మాఝిపై 83,748 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. దివంగత బీజేడీ ఎమ్మెల్యే రాజేంద్ర ధొలాకియా కుమారుడు జె. రాజేంద్ర మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది.

అధికార పార్టీకి ఎదురుదెబ్బ

రాజస్తాన్‌లో అధికార పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. అంటా స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ చేతిలో పరాజయం పాలైంది. బీజేపీ అభ్యర్థి మోర్పాల్ సుమన్‌పై కాంగ్రెస్ నేత ప్రమోద్ జైన్ భయా 15,612 ఓట్ల తేడాతో గెలిచారు. బీజేపీకి చెందిన ఎమ్మెల్యే కన్వర్ లాల్ మీనా ఓ క్రిమినల్ కేసులో దోషిగా తేలడంతో అనర్హత వేటు పడింది. దీంతో, ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది.

సీటు నిలుపుకున్న ఆప్

పంజాబ్‌లోని తరన్ తరన్ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఆప్ అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు తన సమీప ప్రత్యర్థి, శిరోమణి అకాలీదళ్‌కు చెందిన సుఖ్‌వీందర్ కౌర్ రణ్‌ధవాపై 12,091 ఓట్ల తేడాతో విజయం సాధించారు. ఆప్ ఎమ్మెల్యే కశ్మీర్ సింగ్ సోహాల్ జూన్‌లో చనిపోవడంతో ఇక్కడ ఉప ఎన్నిక జరిపారు.

జార్ఖండ్‌లో బీజేపీ ఓటమి

జార్ఖండ్‌లోని ఘట్‌శిలా నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం)కు చెందిన సోమేశ్ చంద్ర సోరెన్, సమీప ప్రత్యర్థి బీజేపీకి చెందిన బాబూలాల్ సోరెన్‌ను 38,500 ఓట్ల తేడాతో ఓడించారు. జేఎంఎం ఎమ్మెల్యే రాందాస్ సోరెన్ కుమారుడే సోమేశ్. రాందాస్ ఆగస్ట్ 15వ తేదీన హఠాన్మరణం చెందగా ఉప ఎన్నిక చేపట్టారు.

స్వల్ప తేడాతో విజయం

అధికార జొరాం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) అభ్యర్థి వన్‌లాల్ సైలోవా స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. ఆయనపై ఎంఎన్ఎఫ్ అభ్యర్థి ఆర్.లాల్‌థంగ్లియా 562 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఎంఎన్ఎఫ్‌కు చెందిన డంపా శాసనసభ్యుడు లాల్‌రిన్‌ట్లువాంగా సైలో జూలైలో చనిపోవడంతో ఇక్కడ ఉప ఎన్నిక నిర్వహించారు.

శుక్రవారం పట్నాలో బీజేపీ శ్రేణుల సంబరాలు





ఎదురులేని ఎన్డీయే

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ-జేడీ(యూ) కూటమి ప్రభంజనం

243 స్థానాలకు గాను 202 స్థానాలు కైవసం

35 సీట్లకే పరిమితమైన విపక్ష మహాగఠ్‌బంధన్

పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికల్లో అధికార ఎన్డీయే సీట్ల సునామీ సృష్టించింది. మొత్తం 243 స్థానాలకు గాను ఏకంగా 202 స్థానాలు దక్కించుకొని డబుల్ సెంచరీ కొట్టేసింది. తమకు ఎదురే లేదని నిరూపించుకుంది. శుక్రవారం వెల్లడైన ఎన్నికల ఫలితాల్లో మొదటి నుంచీ చివరిదాకా బీజేపీ–జేడీ(యూ) కూటమి ప్రభంజనమే కనిపించింది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాకర్షణ శక్తి, సీఎం నితీశ్ కుమార్ అందించిన సుపరిపాలన కూటమి విజయానికి బాటలు వేశాయి. 89 సీట్లలో జయకేతనం ఎగురవేసిన బీజేపీ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. మిత్రపక్షమైన జేడీ(యూ)ను వెనక్కి నెట్టి, కూటమి పెద్దన్నగా మారింది. కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన మహాగఠ్‌బంధన్ పూర్తిగా కుదేలయ్యింది. 35 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఎన్నికల వ్యూహకర్తగా పేరుగాంచిన ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన సురాజ్ పార్టీ గుండుసున్నా చుట్టేసింది. ఘోర పరాజయం పాలయ్యింది. సీట్లు సాధించడంలో విఫలమైన జన సురాజ్ పార్టీ చాలా స్థానాల్లో మహాగఠ్‌బంధన్ విజయావకాశాలను దెబ్బకొట్టింది. బిహార్ విజయంతో ఊపుమీదున్న బీజేపీ ఇక బెంగాల్ కోటపై కాషాయ జెండా పాతడానికి రెట్టించిన ఉత్సాహంతో సిద్ధమవుతోంది. బిహార్ విజయాన్ని ప్రజాస్వామ్య విజయంగా ప్రధాని మోదీ అభివర్ణించారు. జంగిల్‌రాజ్ ఇక అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు.

ప్రభావం చూపని వామపక్షాలు

హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ నేతృత్వంలోని ఎంఐఎం ముస్లిం మైనార్టీల ప్రాబల్యం కలిగిన సీమాంచల్‌లో ఒంటరిగా 29 సీట్లలో పోటీ చేసి, ఐదు సీట్లు సాధించింది. కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ నాయకత్వంలోని ఎల్‌జేపీ(రామ్‌విలాస్) 19 సీట్లు సొంతం చేసుకుంది. హిందుస్తానీ అవామీ మోర్చా(సెక్యులర్) 5 సీట్లు, రాష్ట్రీయ లోక్ మోర్చా 4 సీట్లు, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ 2 సీట్లు, ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీ ఒక స్థానాన్ని తమ ఖాతాలో వేసుకున్నాయి. మరోవైపు ఈ ఎన్నికలు కాంగ్రెస్–ఆర్జేడీ కూటమికి చేదు అనుభవం మిగిల్చాయి. గత ఎన్నికల్లో 75 సీట్లు గెల్చుకున్న ఆర్జేడీ ప్రస్థానం ఇప్పుడు 25 సీట్ల వద్దే ఆగిపోయింది. కాంగ్రెస్ సంఖ్యాబలం 19 నుంచి 6కు పడిపోయింది. గత ఎన్నికలతో పోలిస్తే ఆర్జేడీ, కాంగ్రెస్ బలం భారీగా తగ్గిపోయింది. సీఎం నితీశ్ కుమార్ ప్రజా వ్యతిరేకతను అధిగమించి మళ్లీ గెలుపు బావుటా ఎగురవేశారు. ముస్లింల ప్రభావం అధికంగా ఉన్న నియోజకవర్గాల్లోనూ బీజేపీ కూటమికి మంచి ఫలితాలు లభించాయి. విపక్ష కూటమిలో భాగమైన వామపక్షాలు పెద్దగా ప్రభావం చూపలేకపోయాయి. బహుజన సమాజ్ పార్టీ ఒక స్థానం, సీపీఎం ఒక స్థానం గెల్చుకున్నాయి. బిహార్ విజయంతో బీజేపీ శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. వచ్చే ఏడాది పలు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఇప్పటినుంచే కష్టపడి పనిచేస్తామని తేల్చిచెప్పాయి. ఇదిలా ఉండగా, బిహార్ నూతన ముఖ్యమంత్రి ఎవరన్నదానిపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. నితీశ్ కుమార్‌కు మరోసారి అవకాశం దక్కకపోవచ్చని, బీజేపీ నాయకుడే తదుపరి ముఖ్యమంత్రి అవుతారని ప్రచారం సాగుతోంది. దీనిపై బీజేపీ గానీ, జేడీ(యూ) గానీ ఇంకా స్పందించలేదు.

సుపరిపాలన, వికాసానిదే విజయం

బిహార్ ఎన్నికల ఫలితాలపై ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్‌లో సుపరిపాలన, వికాసం, ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయానిదే విజయం అని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టంచేశారు. బిహార్ శాసనసభ ఎన్నికల్లో ఎన్డీయే ఘన సాధించడంపై శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'సుపరిపాలన గెలిచింది. అభివృద్ధి గెలిచింది. ప్రజా సంక్షేమ స్ఫూర్తి గెలిచింది. సామాజిక న్యాయం గెలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయేను చరిత్రాత్మకమైన, అపూర్వమైన విజయంతో ఆశీర్వదించినందుకు బిహార్‌లోని నా కుటుంబ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ అఖండ తీర్పు బిహార్ కోసం ప్రజలకు సేవ చేయడానికి నూతన సంకల్పంతో పనిచేయడానికి మాకు శక్తినిస్తుంది. అవిశ్రాంతంగా పనిచేసిన ప్రతి ఎన్డీయే కార్యకర్తకు నా కృతజ్ఞతలు. వారు మా అభివృద్ధి ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రతిపక్షాల ప్రతి అబద్ధాన్ని గట్టిగా తిప్పికొట్టారు. రాబోయే కాలంలో, బిహార్‌లో అభివృద్ధి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, రాష్ట్ర సంస్కృతికి కొత్త గుర్తింపును తీసుకువచ్చేందుకు మేము అవిశ్రాంతంగా కృషి చేస్తాం. యువశక్తి, నారీశక్తికి సుసంపన్న జీవితం అందజేస్తాం'' అని పేర్కొన్నారు.

ఫలితాల అనంతరం ప్రధాని మోదీని సన్మానిస్తున్న రాజ్‌నాథ్ సింగ్, నడ్డా, అమిత్ షా

ఏ పార్టీకి ఎన్ని సీట్లు అంటే..

బీజేపీకి 89, జేడీ(యూ)కి 85, ఆర్జేడీకి 25, ఎల్‌జేపీ(రామ్‌విలాస్)కి 19, కాంగ్రెస్‌కు 6, ఎంఐఎంకు 5, హిందుస్తానీ అవామీ మోర్చా(సెక్యులర్)కు 5, రాష్ట్రీయ లోక్ మోర్చాకు 4, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్‌కు 2, ఇండియన్ ఇంక్లూజివ్ పార్టీకి 1, సీపీఎంకు 1, బీఎస్పీకి 1 సీటు చొప్పున వచ్చాయి.

తేజస్వీ అతికష్టం మీద ఎన్నిక

మహాగఠ్‌బంధన్ ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ అతికష్టం మీద గట్టెక్కారు. రాఘోపూర్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థి సతీశ్ కుమార్‌పై 14,532 ఓట్ల తేడాతో గెలిచారు. తొలుత వెనుకంజలో ఉన్న తేజస్వీ చివరి రౌండ్లలో పుంజుకున్నారు. ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా, మంత్రులు ప్రేమ్ కుమార్, మహేశ్వర్ హజారీ, సంజయ్ సరోగీ మరోసారి విజయం సొంతం చేసుకున్నారు.

పెరిగిన ఎన్డీయే ఓట్ల శాతం

బిహార్ ఎన్నికల్లో బీజేపీ, జేడీ(యూ) తమ ఓట్ల శాతాన్ని పెంచుకున్నాయి. 2020 ఎన్నికల్లో 110 స్థానాల్లో పోటీ చేసిన బీజేపీ 19.46 శాతం ఓట్లు సాధించగా, ప్రస్తుతం 101 స్థానాల్లో పోటీకి దిగి 20.08 శాతం ఓట్లు దక్కించుకుంది. జేడీ(యూ) 2020లో 115 సీట్లలో పోటీ చేసి, 15.39 శాతం ఓట్లు కైవసం చేసుకుంది. ఈ ఎన్నికల్లో 101 సీట్లలో పోటీ చేసి, 19.25 శాతం ఓట్లు పొందింది. ఆర్జేడీ ఓట్ల శాతం 23.11 నుంచి 23 శాతానికి పడిపోయింది. కాంగ్రెస్ ఓట్లశాతం 9.48 నుంచి 8.71 శాతానికి తగ్గిపోయింది.

బిహార్‌లో గెలిచిన ప్రముఖులు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనేక సంచలనాలకు, ఆసక్తికరమైన గెలుపోటములకు వేదికగా ని లిచాయి. ఎన్డీఏ ప్రభంజనంలో కొందరు అగ్రనాయకులు, సినీతారలు అనూహ్యంగా గెలిచి తమ పట్టు నిరూపించుకోగా, మరికొందరు అగ్రశ్రేణి నేతలు, ముఖ్యంగా 'యాదవ్' కుటుంబం, భోజ్‌పురి స్టార్లు తీవ్ర పరాజయాన్ని చవిచూశారు.

శివానీ శుక్లా (ఆర్జేడీ): బాహుబలి నేత మున్నా శుక్లా కుమార్తె శివానీ, లాల్‌గంజ్ నుంచి గెలిచి రాజకీయ అరంగేట్రం చేశారు.

మైథిలీ ఠాకూర్ (బీజేపీ – గాయని): ఈ ఎన్నికల్లో అతిపెద్ద సెలబ్రిటీ విన్నర్. రాజకీయ అరంగేట్రంలోనే అలీనగర్ నియోజకవర్గంలో ఆర్జేడీ కంచుకోటను బద్దలుకొట్టి చరిత్రాత్మక విజయం సాధించారు.

శ్రేయసి సింగ్ (బీజేపీ – షూటర్): కామన్వెల్త్ గోల్డ్ మెడలిస్ట్, షూటర్ శ్రేయసి సింగ్ జమూయ్ స్థానం నుంచి 20,000 ఓట్లకు పైగా భారీ మెజారిటీతో రెండోసారి గెలుపొందారు.

వినయ్ బిహారీ (బీజేపీ – గాయకుడు/నటుడు): ప్రముఖ భోజ్‌పురి గాయకుడు, సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన వినయ్ బిహారీ లౌరియా స్థానం నుంచి మరోసారి సులభంగా గెలుపొందారు.

బిహార్‌లో మజ్లిస్ హవా ..

ఐదు స్థానాల్లో విజయం

సాక్షి, హైదరాబాద్: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ సత్తా చాటింది. ఏఐఎంఐఎం బిహార్‌లో 25 స్థానాల్లో పోటీ చేసి.. ముస్లింల ప్రాబల్యం అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో ఐదు స్థానాలను దక్కించుకుంది. జోకిహాట్, బహదుర్‌గంజ్, కొఛాధమన్ అమౌర్, బైసీ నియోజకవర్గాల్లో గణనీయమైన మెజారిటీలతో విజయం సాధించింది. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి తరపున 21 స్థానాల్లో పోటీ చేసిన ఏఐఎంఐఎం ఐదు స్థానాలు గెలిచింది. ఇప్పుడు అవే ఐదు స్థానాల్లో మరోసారి విజయం సాధించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ హైదరాబాద్‌లో మాట్లాడుతూ తమ పార్టీకి ఓటు వేసినందుకు బిహార్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సీమాంచల్ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

జూబ్లీ'హిల్స్'పై కాంగ్రెస్ జెండా

- ఉప ఎన్నికలో బీఆర్ఎస్‌పై గెలుపు
- 24,729 ఓట్ల మెజార్టీతో విజయం
- బీజేపీ అభ్యర్థి డిపాజిట్ గల్లంతు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ విజయ బావుటా ఎగురవేసింది. ఆ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొదలు.. ప్రతి రౌండ్‌లోనూ నవీన్ యాదవ్ ఆధిక్యత ప్రదర్శిస్తూ వచ్చారు. మొత్తం ఏడు డివిజన్లలోనూ ఆయనకు మెజార్టీ లభించింది. బీఆర్ఎస్ రెండో స్థానంలో నిలవగా.. బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డి డిపాజిట్ గల్లంతయ్యింది. ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు మజ్లిస్, టీజేఎస్, వామపక్షాల మద్దతు కలిసి వచ్చింది. మైనారిటీల ఓట్లు గణనీయంగా ఆ పార్టీకే పడినట్లు కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే మాగంటి గోపీనాథ్ వరసగా మూడు పర్యాయాలు గెలిచిన నియోజకవర్గంలో చివరకు సెంటిమెంట్ కూడా ఆయన భార్య మాగంటి సునీతకు కలిసి రాలేదు. బస్తీల ప్రజలు, తన సామాజికవర్గానికి చెందినవారు, మైనారిటీల ఓట్లను రాబట్టడంలో వెనకబడిపోయారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఊహించని రీతిలో భారీ మెజార్టీతో విజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రెండో ఉప ఎన్నికలో బీఆర్ఎస్ సిట్టింగ్ స్థానం కాంగ్రెస్ ఖాతాలో పడింది. వాస్తవానికి గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రాష్ట్రవ్యాప్తంగా విజయ దుందుభి మోగించినా, హైదరాబాద్ నగరంలో మాత్రం ప్రాతినిధ్యం లభించలేదు. ఉప ఎన్నికలపై ఆ పార్టీ దృష్టి సారించింది. కంటోన్మెంట్ మాదిరిగానే జూబ్లీ హిల్స్‌ను కూడా తన ఖాతాలో వేసుకుంది.

తొలి రోజు రూ.8.26 లక్షల కోట్ల పెట్టుబడులు

రాష్ట్ర ప్రభుత్వం వెల్లడి

ఇప్పటికే లులు మాల్స్‌కు విశాఖ, విజయవాడలో భూముల కేటాయింపు పూర్తయినా... మళ్లీ ఒప్పందం చేసుకుంటున్న సీఎం చంద్రబాబు, లులు గ్రూప్ అధినేత యూసఫ్ అలీ

సాక్షి, అమరావతి: తొలిరోజు భాగస్వామ్య సదస్సులో రూ.8.26 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఒప్పందాల ద్వారా 12.05 లక్షల ఉద్యోగాలు రానున్నట్లు తెలిపింది. సదస్సు ప్రారంభం ముందు రోజు కుదిరిన ఒప్పందాలను కలుపుకొంటే రెండు రోజుల్లో 400 ఒప్పందాల ద్వారా రూ.11,91,972 కోట్ల పెట్టుబడులు, 13,32,445 ఉద్యోగాలు రానున్నాయని చెప్పింది. రాష్ట్రంలో ఒక గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి రిలయన్స్ గ్రూపు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి సమక్షంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బోర్డు సభ్యుడు పీఎంఎస్ ప్రసాద్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ మెంటార్–సౌత్ పీవీఎల్ మాధవ రావు డేటా సెంటర్‌ను ఏర్పాటుపై ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతోపాటు రిలయన్స్ రాయలసీమలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను నిర్మించనుంది. అర్బన్ గవర్నెన్స్, రియల్ టైమ్, డిజిటల్ గవర్నెన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్, సుస్థిరాభివృద్ధి అంశాలపై సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా మంత్రి నారా లోకేశ్–సింగపూర్ విదేశీ వ్యవహారాలు, ట్రేడ్ ఇండస్ట్రీ మంత్రి గాన్ సో హాంగ్‌లు ఒప్పందాలు చేసుకున్నారు. విజయవాడ–సింగపూర్ మధ్య విమాన సర్వీసు నడపాలని నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో పోర్టులు, ఎయిర్‌పోర్టుల రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో 18 ఒప్పందాలు కుదిరాయి. విశాఖ, విజయవాడల్లో మాల్స్, మల్లవల్లి ఫుడ్‌పార్కుతోపాటు రాయలసీమలో లాజిస్టిక్ ప్రొక్యూర్మెంట్ ఎక్స్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటు చేసేలా లులు గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీ సీఆర్డీఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐ అండ్ ఐ, పరిశ్రమలు–వాణిజ్యం, ఐటీ, మున్సిపల్ శాఖలకు సంబంధించి కూడా ఒప్పందాలు కుదిరాయని ప్రభుత్వం వెల్లడించింది.

బాబు బండారం బట్టబయలు

అదానీ వైజాగ్ టెక్ పార్కులో గూగుల్ భాగస్వామి..

సీఐఐ వేదికగా అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్ ఎండీ కరణ్ అదానీ స్పష్టీకరణ

కుండబద్దలు కొట్టినట్లు వాస్తవం వెల్లడించడంతో విస్తుపోయిన చంద్రబాబు

సాక్షి, అమరావతి : ప్రపంచంలోనే అతిపెద్ద హైపర్ డేటా సెంటర్‌ను గూగుల్‌తో కలిసి ఏర్పాటు చేస్తున్నట్లు అదానీ పోర్ట్స్ అండ్ ఎస్ఈజెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కరణ్ అదానీ ప్రకటించారు. శుక్రవారం విశాఖ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ వైజాగ్ టెక్ పార్కులో ఇద్దరం కలిసి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతున్నట్లు స్పష్టం చేశారు. తద్వారా విశాఖ పార్టనర్‌షిప్ సమ్మిట్ వేదికగా సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీ మరోమారు బట్టబయలు అయ్యింది. అదానీ గ్రూపు పేరును దాస్తూ గూగుల్ డేటా సెంటర్‌ను తామే తెచ్చామంటూ ప్రచారం చేసుకుంటున్న చంద్రబాబు సర్కారు క్రెడిట్ చోరీ మరోమారు చర్చకు వచ్చింది. విశాఖలో అతిపెద్ద హైపర్ డేటా సెంటర్‌ను గూగుల్‌తో కలిసి అదానీ గ్రూపు ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ఎదుటే కరణ్ అదానీ ప్రకటించడం కొద్ది రోజులుగా ప్రభుత్వ పెద్దలు చేసిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టినట్లయింది. ఇది అన్నిచోట్లా ఏర్పాటు చేస్తున్న డేటా సెంటర్ కాదని, ఇది ఇండియా డిజిటల్ చరిత్రను తిరగరాస్తుందని కరణ్ అదానీ తెలిపారు. ఈ డేటా సెంటర్‌ను పూర్తిగా గ్రీన్ ఎనర్జీ ఆధారంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి క్రెడిట్ దక్కుతుందనే సంకుచిత బుద్ధితోనే సీఎం చంద్రబాబు గూగుల్‌తో ఒప్పందం సమయంలో అదానీ పేరెత్తలేదంటూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇదే విషయాన్ని కరణ్ అదానీ చంద్రబాబు ఎదురుగానే కుండబద్దలు కొట్టి మరీ చెప్పారు. కరణ్ అదానీ గూగుల్ కలిసి డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రకటించిన వెంటనే సీఎంతోపాటు వేదికపైన ఉన్న టీడీపీ మంత్రుల ముఖాలు ఒక్కసారిగా మాడిపోయాయి.

సీఐఐ వేదికగా మళ్లీ అదే బొంకుడు

ఉత్తరాంధ్ర దశ, దిశ మార్చాలనే లక్ష్యంతో విశాఖను అంతర్జాతీయ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ 2020 నవంబర్‌లో 300 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీతో ఒప్పందం చేసుకోవడంతోపాటు, డేటా సెంటర్‌కు డేటా తీసుకురావడం కోసం సింగపూర్ నుంచి 3,900 కి.మీ. పొడవున సబ్ సీ (సముద్ర గర్భం)లో కేబుళ్లు వేసే ప్రాజెక్టుకు వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం 2021 మార్చి 9న సింగపూర్ ప్రభుత్వానికి లేఖ రాసింది. దేశంలోని డేటా సెంటర్ ఏర్పాటు బాధ్యతలను గూగుల్ అనుబంధ సంస్థ రైడాన్ ఇన్ఫోటెక్ అదానీకి అప్పగించింది. గూగుల్‌తో అనుబంధం ఉన్న అదానీ సంస్థ విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు 2023 మే 3న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఇప్పుడు దాని కొనసాగింపులో భాగంగానే అదానీతో కలిసి గూగుల్ 300 నుంచి వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను విస్తరిస్తోంది. ఇదే విషయాన్ని ఇప్పుడు కరణ్ అదానీ సీఐఐ వేదికగా చెప్పినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో సైతం ఆ విషయాన్ని దాచి పెట్టడం ద్వారా చంద్రబాబు క్రెడిట్ చోరీ మరోమారు అంతర్జాతీయ సమాజానికి తెలిసింది. చంద్రబాబు సర్కారు తీరుపై సర్వత్రా విస్మయం వ్యక్తమైంది. ఇదే విషయమై సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తల మధ్య ఇదేం విడ్డూరం అంటూ విస్తృతంగా చర్చ జరిగింది.



విశాఖ సదస్సులో ప్రసంగించిన అనంతరం కరణ్ అదానీ 'ఎక్స్'లో పెట్టిన పోస్ట్

పెట్టుబడుల కొనసాగింపు..

అదానీ గ్రూపునకు ఆంధ్రప్రదేశ్‌తో దీర్ఘకాలంగా అనుబంధం ఉందని, ఇప్పటికే రాష్ట్రంలో పోర్టులు, సిమెంట్, ఎనర్జీ డేటా సెంటర్స్ వంటి రంగాల్లో రూ.40,000 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టామని, దీన్ని కొనసాగిస్తూ వచ్చే పదేళ్లలో మరో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టనున్నట్లు కరణ్ అదానీ ప్రకటించారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో ఆంధ్రప్రదేశ్ ఆధునికంగా మారుతోందని, దేశంలో వేగంగా ఎదుగుతున్న స్టార్టప్ స్టేట్‌లలో ఒకటని వ్యాఖ్యానించారు.

భోగాపురం ఎయిర్‌పోర్టులో భాగం కావడం ఆనందంగా ఉంది: జీఎంఆర్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో భాగస్వామి అయినందుకు సంతోషంగా ఉందని జీఎంఆర్ సంస్థ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు(జీఎంఆర్) పేర్కొన్నారు. ఇక్కడ భారీ ఎంఆర్‌వో యూనిట్‌తోపాటు ఇంటిగ్రేటెడ్ ఏరో స్పేస్ ఎకో సిస్టంను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. బజాజ్ ఫిన్ సర్వ్ చైర్మన్, ఎండీ సంజీవ్ బజాజ్ మాట్లాడుతూ యువతకు అండగా ఉండేలా రాహుల్ బజాజ్ స్కిల్లింగ్ సెంటర్లను విజయవాడ, విశాఖ, రాజమండ్రి, శ్రీసిటీ, తిరుపతిలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భారత్ ఫోర్జ్ జాయింట్ ఎండీ అమిత్ కల్యాణి మాట్లాడుతూ నౌకా నిర్మాణం, పర్యాటకం లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపారు. లులు గ్రూప్ చైర్మన్ యూసఫ్ అలీ మాట్లాడుతూ వచ్చే ఏడాదిలో మల్లవల్లి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నుంచి మామిడి, జామ రసాల ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. భారత్ బయోటెక్ ఎండీ, సీఐఐ ఉపాధ్యక్షురాలు సుచిత్రా కె.ఎల్లా మాట్లాడుతూ గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిలో స్వయం ప్రతిపత్తి సాధించేలా దేశం ముందడుగు వేస్తోందన్నారు.

పెట్టుబడుల్లో 'టెక్'నిక్!

- పాత కంపెనీకే కొత్తగా భూ కేటాయింపులు
- భారీ పెట్టుబడులంటూ ఊకదంపుళ్లు
- బక్కన్నపాలెంలో ఇప్పటికే ఉన్న సెయిల్స్ సాఫ్ట్‌వేర్
- ఇప్పుడు ఐటీ హిల్స్‌లో భూ కేటాయింపులు
- కొత్తగా కంపెనీ వస్తోందంటూ ప్రచారం
- 20 ఏళ్లుగా ఉందంటున్న మరో కంపెనీ
- పట్టుమని 500 మంది ఉద్యోగులూ కరవు
- ఈ కంపెనీ ఐదేళ్లలో 2 వేల ఉద్యోగాలు కల్పిస్తుందని ఒప్పందం
- ముందు రోజే వచ్చి భూమి పూజ చేసిన మంత్రి లోకేశ్
- భూ సంతర్పణ కోసం తిమ్మిని బమ్మిని చేస్తున్న చంద్రబాబు సర్కారు

విశాఖ జిల్లా బక్కన్నపాలెంలో చాలాకాలంగా కొనసాగుతున్న సెయిల్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇది..

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం : ఊరూపేరూ లేని ఉర్సా కంపెనీకి విశాఖలో అడ్డగోలుగా భూములు దోచిపెడదామనుకున్న వ్యవహారంలో ఆధారాలతో సహా అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు ప్రభుత్వం.. ఇప్పుడు కొత్త పంథాలో వెళుతోంది. ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న కంపెనీలకు కొత్తగా భూ కేటాయింపులు చేస్తూ.. కొత్త కంపెనీ వస్తోందంటూ ఊదరగొడుతోంది. విశాఖపట్నం జిల్లా బక్కన్నపాలెంలోని 80 ఫీట్ రోడ్డులోని ఈశ్వర్‌సాయి ఎన్‌క్లేవ్‌లో సెయిల్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. గతంలో ఇదే కంపెనీ విశాలాక్షినగర్‌లో ఉండేది. అక్కడి నుంచి బక్కన్నపాలేనికి మారింది. ఐటీ హిల్స్‌లో కూడా ఈ కంపెనీ కార్యాలయం ఉంది. అయితే, ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈ కంపెనీకి ఐటీ హిల్స్–3లో మంత్రిలోకేశ్ స్వయంగా భూమి పూజ చేశారు. అంతేకాకుండా ఇది కొత్త కంపెనీ అంటూ ఊదరగొడుతున్నారు. పెట్టుబడుల సదస్సుకు ముందు రోజు వైజాగ్ చేరుకున్న లోకేశ్.. ముందస్తు ఒప్పందాలంటూ హడావుడి చేశారు. గురువారం ఐటీ హిల్స్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో భారీగా సందడి కనిపించేందుకు గీతం కాలేజీకి చెందిన విద్యార్థులకు సూట్స్ వేసి మరీ కార్యక్రమానికి తరలించారనే విమర్శలున్నాయి.

విలువైన భూములు కట్టబెట్టేందుకే..

'శ్రీ తమ్మిన సొల్యూషన్స్' పేరుతో విశాఖ శంకరమఠం రోడ్డులో కార్యకలాపాలు నిర్వహిస్తున్న టెక్ తమ్మిన సొల్యూషన్స్‌ది కూడా ఇదే కథ. ఈ కంపెనీలో ప్రపంచ వ్యాప్తంగా ప్రస్తుతం పని చేస్తున్నది కేవలం 500 మంది లోపు ఉద్యోగులే. అయితే, రానున్న ఐదేళ్లలో కేవలం ఏపీలోని పెట్టుబడుల ద్వారానే 2వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటిస్తున్నారు.

2005లో ఏర్పడిన ఈ కంపెనీ రెండు దశాబ్దాలుగా కల్పించిన ఉద్యోగాల కంటే నాలుగు రెట్ల ఉద్యోగాలు కల్పిస్తామంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారు. ఈ కంపెనీకి ఇప్పుడు ఐటీ హిల్స్–2లో భూమిని కేటాయించడమే కాకుండా, భారీగా ఉపాధి లభిస్తుందంటూ లోకేశ్ ఊదరగొట్టే ప్రయత్నం చేశారు. ఇప్పటికే ఉన్న కొన్ని కంపెనీలకు విలువైన భూములను తక్కువ ధరకు అప్పగించేందుకు ఈ నాటకాలను తెరమీదకు తెచ్చారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు 99 పైసలకే ఎకరా భూమి అంటూ వైజాగ్‌లోని విలువైన భూములను ప్రైవేటు కంపెనీలకు అప్పనంగా కట్టబెడుతున్న చంద్రబాబు ప్రభుత్వం.. పెద్దగా ఉపాధి కల్పించని కంపెనీలకు కూడా భారీగా భూ సంతర్పణ చేస్తోంది. అప్పనంగా భూములు అప్పగించడానికి, విశాఖలో భారీగా ఐటీ కంపెనీలు వస్తున్నాయంటూ ప్రచారం చేసుకునేందుకే వీలుగా ఈ వ్యవహారాలు సాగిస్తున్నారనే విమర్శలున్నాయి.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

సాక్షి
గుంటూరు
శనివారం । 15 । నవంబర్ । 2025

కార్తిక వనభోజనాలు

దుగ్గిరాల: ఎంపీపీ షేక్ జబీనా ఆధ్వర్యంలో కంఠంరాజు కొండూరులోని మహంకాళీ ఆలయం వద్ద ఉన్న తోటలలో శుక్రవారం కార్తిక వన భోజనాలు జరిగాయి.

పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,500 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. దిగువకు 8,000 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నీటి నిల్వ 43.3532 టీఎంసీలు.

టీటీడీలో కార్తిక సందడి

తాడికొండ: వెంకటపాలెంలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో కార్తిక మాస సందడి నెలకొంది. ఆలయానికి శుక్రవారం భక్తులు భారీగా తరలివచ్చారు.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు

గుంటూరులీగల్: బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కోర్టులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జియావుద్దీన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బాలల హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. బడిబయట పిల్లలను పాఠశాలలకు వెళ్లేలా చూడాలన్నారు. బాలకార్మికులను గుర్తించి వారికి విద్యనందించాలన్నారు. పారిశ్రామిక కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించాలన్నారు. వారికి సంరక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఏఎల్వో బి.కోటేశ్వరరావు, లీగల్ ప్రొటెక్షన్ వాసంతి, డెప్యూటీ చీఫ్ లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మధుబాబు, క్రాఫ్ట్ సంస్థ ప్రోగ్రామ్ అధికారి కె.సమీర్, ప్యానల్ అడ్వకేట్‌లు పాల్గొన్నారు.

జేడీఏగా పద్మావతి బాధ్యతల స్వీకారం

కొరిటెపాడు(గుటూరు): గుంటూరు జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు(జేడీఏ)గా ఎం.పద్మావతి జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనరేట్ కార్యాలయంలో రైతు సంక్షేమ పథకాల విభాగంలో వ్యవసాయ శాఖ ఉప సంచాలకులు(డీడీఏ)గా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై గుంటూరు జిల్లా జేడీఏగా ఆమె నియమితులయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆత్మ ప్రాజెక్టు డిప్యూటీ డైరెక్టర్‌గా గతంలో పనిచేశారు. ఇప్పటి వరకు జిల్లా వ్యవసాయ అధికారిగా పనిచేసిన అయితా నాగేశ్వరరావు డీడీఏగా కొనసాగనున్నారు. పద్మావతి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ వారికి అవసరమైన సేవలను సకాలంలో చేరువ చేసేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పలువురు ఏడీఏలు, ఏఓలు, వ్యవసాయ శాఖ సిబ్బంది పద్మావతిని కలసి అభినందనలు తెలిపారు.

అందెశ్రీ రచనలు అజరామరం

తెనాలిటౌన్ : అందె శ్రీ రచనలు అజరామరమని వక్తలు కొనియాడారు. తెనాలి గాంధీనగర్‌లోని ఇస్కఫ్ కార్యాలయంలో శుక్రవారం అభ్యుదయ కళాసమితి, ప్రజానాట్య మండలి సంయుక్త ఆధ్వర్యంలో అందెశ్రీ సంతాప సభ నిర్వహించారు. అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందెశ్రీ ప్రతి పాట, పద్యం ఆయన జీవితానికి దర్పణంగా నిలిచాయని ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ కొనియాడారు. ఆయన పాడిన పాటలు జన బాహుళ్యంలో అజరామరంగా నిలిచాయని తెలిపారు. కార్యక్రమంలో సాయి మంగ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కె.రమేష్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, ఓ.మార్కండేయులు, బి.సుధాకర్, రామకృష్ణారెడ్డి, సునీల్, కె.మౌనిక, తదితరులు ఉన్నారు.

హరేకృష్ణ గోకుల క్షేత్రంలో లక్ష దీపోత్సవం

తాడేపల్లి రూరల్ : గుంటూరు జిల్లా కొలనుకొండ వద్ద ఉన్న హరేకృష్ణ గోకుల క్షేత్రంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్షేత్ర అధ్యక్షులు వంశీధర దాస తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతిరోజు అఖండ దీపంతో కార్యక్రమం ప్రారంభమవు తుందన్నారు. భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. లక్ష దీప పూజలో పాల్గొనదలచిన భక్తులు 73992 25533 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. అనంతరం లక్ష దీపోత్సవ గోడపత్రికను ఆవిష్కరించారు. గోకుల క్షేత్రం వైస్ ప్రెసిడెంట్ విలాస విగ్రహ దాస, పీఆర్‌వో రఘునాథ దాస పాల్గొన్నారు.

తెనాలి రూరల్ మండల గ్రామం నేలపాడు. అక్కడ మాగాణి పొలం కౌలు ఎకరాకు రూ.30 వేలు. నగదు మొత్తం ముందుగా చెల్లిస్తేనే కౌలుదారు చేలోకి వెళ్లగలుగుతాడు. అందరిలాగే కౌలురైతు కాకి రమేష్ మూడుచోట్ల తొమ్మిదెకరాలు కౌలుకు తీసుకున్నాడు. అప్పులు తెచ్చి అక్షరాలా రూ.2.70 లక్షలు నగదు కౌలు చెల్లించాడు. మోంథా తుఫాన్‌కు మొత్తం పంటంతా నేలక్కరుచుకుంది. పన పట్టుకుని పైకి తీస్తే మొలకలు కనిపిస్తున్నాయి. కంకుల్లో గింజ గట్టిపడింది తక్కువ. ఎకరాకు రూ.25–30 వేల పెట్టుబడి చొప్పున మొత్తం రూ.లక్షలపైనే వ్యయం చేశాడు. ఇప్పుడు చేనుకేసి చూసిన అధికారి లేడు. ఎన్యూమరేషన్ లేదు. నష్టపరిహారం వచ్చే ప్రసక్తే లేదని తెలిసి అతడికి నోట మాట రావటం లేదు.

నేలవాలిన చేలో దిగాలుగా కౌలు రైతు కాకి రమేష్

పడిపోయిన పైరు.. ప్రభుత్వానికి కనిపించని తీరు

- ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతల ఆవేదన
- రైతును దెబ్బతీసిన మోంథా తుఫాన్
- వేలాది ఎకరాలలో నేలవాలిన వరి చేలు
- నష్టం అంచనాకు కూడా రాని అధికారులు
- కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణం
- పెట్టుబడులు కాదుగదా కనీసం కౌలు కూడా రాని దుస్థితి

నేలపాడులో నేలవాలిన వరిపైరు

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలురైతు సంఘం రాష్ట్ర నాయకులు గురువారం తెనాలి రూరల్ మండలంలోని తేలప్రోలు, నేలపాడు గ్రామాల్లోని పంటపొలాలను సందర్శించినపుడు పంటలు దెబ్బతిన్న రైతులు/కౌలు రైతులు తమ గోడు వినిపించారు. అందులో నేలపాడుకు చెందిన కౌలు రైతు కాకి రమేష్ ఒకరు. పంటల నష్టం స్పష్టంగా కళ్లకు కనిపిస్తున్నా ఏం నష్టం లేదని ప్రభుత్వం చెప్పడంపై ఆవేదన వ్యక్తం చేశారు. మాగాణి భూముల్లోని వరి పైరు మొత్తానికి నష్టం కలిగిందని ఎవరూ చెప్పటం లేదు. అయిదు శాతమో? పది శాతమో పంటపొలాలు దెబ్బతిన్న విషయాన్ని ఎవరూ కాదనటం లేదు. మరి వారికి కలిగిన నష్టానికి పరిహారం ఇచ్చేదెవరు? అనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

పంట రాదని తెలిసీ..మళ్లీ పెట్టుబడులు..

సార్వా వరి కోతలు మరో వారం, పదిరోజుల్లో ప్రారంభం కానున్నాయి. నేలవాలిన వరి చేలల్లో అర్ధ గింజకు మించి దిగుబడి రాదని తేలిపోయింది. సాధారణ చేలో గంటలో పూర్తయే నూర్పిడి, పడిపోయిన చేలల్లో మూడు గంటల సమయం తీసుకుంటుంది. అంటే నూర్పిడి వ్యయం మూడురెట్లు అధికంగా చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. పంట పెద్దగా రాదని తెలిసీ మళ్లీ అధిక పెట్టుబడులు పెట్టాల్సి రావటంతో రైతులు దిగులు పడుతున్నారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని చెబుతున్న ప్రభుత్వం, మసరు వచ్చిన గింజను కొంటుందా? లేదా? అనేది మరో సమస్యగా చెబుతున్నారు.

వైఎస్ జగన్ హయాంలో ....

ఇదే సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అమలు చేసిన ఉచిత పంటల బీమాను రైతులు/కౌలురైతులు గుర్తుచేసుకుంటున్నారు. అప్పట్లో ప్రభుత్వమే రైతుల తరపున ఉచిత బీమా చేయించింది. ప్రకృతి వైపరీత్యాలతో పంటల నష్టం జరిగినపుడు, మరుసటి సీజనులో పంటల సాగుకు ముందే పరిహారం డబ్బులు చెల్లించినట్టు రైతులు చెప్పారు. ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం ఉచిత బీమా తీసేయటంతో అటు బీమా పరిహారం వచ్చే అవకాశం కూడా లేదని విచారపడుతున్నారు.

ఇదిలాఉంటే ఖరీఫ్ సీజనులో యూరియా కోసం పడిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతులు, రెండో పంటగా జొన్న/మొక్కజొన్న సాగుకు యూరియాను ముందే సేకరిస్తున్నారు. బయట మార్కెట్లో యూరియా రూ.390 –420లకు కొనుగోలు చేశామనీ, అదికూడా నానో లిక్విడ్ కొంటేనే అనే షరతుతో అమ్ముతున్నారని చెప్పారు.

నాలుగెకరాలు పడిపోయింది....

సీజను మొదట్లో రెండుసార్లు వెద పెట్టాల్సి వచ్చింది. నాలుగెకరాల్లో వరి సాగుచేస్తే తుఫాన్‌కు మూడెకరాల్లో పైరు నేలకొరిగింది. అంతా కౌలు పొలమే. ఎకరాకు 20–21 బస్తాల ధాన్యం కౌలుకు తీసుకున్నాను. పడకుండా నిలిచి ఉంది ఏమవుతుందో తెలీదు. యూరియా కట్ట రూ.400 చేసి కొన్నాం. సబ్సిడీ యూరియా అందలేదు. కనీసం పడిపోయిన చేల నన్నా లెక్కలోకి తీసుకోవాలి కదా!

– షేక్ హుస్సేన్, కౌలురైతు, తేలప్రోలు

గింజ పాలు పోసుకోలేదు...

నేను 17 ఎకరాల్లో వరి వేశాను. తుఫాన్ కారణంగా నాలుగెకరాలకు పైగా పైరు పడిపోయింది. ఆ పంటలోంచి గింజలు వచ్చే లా లేదు పాలు పోసుకోకుండా తాలు గింజలు కనిపిస్తున్నాయి. పడిపోయిన చేలో కోత కూడా కూడా సమస్యగానే మారనుంది.

– సోమవరపు నాగమల్లేశ్వరరావు, రైతు, నేలపాడు

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నైపుణ్య శిక్షణ

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు అర్హత ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు నైపుణ్యాల అభివృద్ధికి శిక్షణ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక మండలి(డి.ఐ.ఇ.పి.సి) సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులకు నిర్దేశిత సమయంలో అనుమతులు జారీ చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలకు వివిధ రాయితీలకు రూ.95,72,060 మంజూరు చేస్తూ కమిటీలో ఆమోదించారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం జయలక్ష్మి, డీపీఓ బి.వి.నాగసాయికుమార్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికా రి చెన్నయ్య, డీఆర్‌డీఏ పీడీ టి.విజయలక్ష్మి, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ నజీనాబేగం పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం, మనోవికాసం

గుంటూరు ఎడ్యుకేషన్: పుస్తక పఠనం విజ్ఞానంతోపాటు మనోవికాసానికి దోహదపడుతుందని, ఇది పౌర గ్రంథాలయాల ద్వారానే సాధ్యపడుతుందని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. శుక్రవారం అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంతో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ జి.కోటేశ్వరరావు, ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి సరస్వతిదేవి పూజ, జ్యోతి ప్రజ్వలన చేశారు.

కృష్ణానది ఎగువ ప్రాంతంలో అనధికారికంగా నిర్మిస్తున్న కట్టడం

ఇదిగో..అక్రమ కట్టడం !

- తెలిసినా పట్టించుకోని అధికారగణం
- కృష్ణానది పరివాహక ప్రాంతంలో అక్రమ నిర్మాణాలు
- చూసీ చూడనట్టు వదిలేస్తున్న ఇరిగేషన్, సీఆర్‌డీఏ అధికారులు

తాడేపల్లి రూరల్: అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో నదీ పరివాహక ప్రాంతంలో చట్ట విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో ఇరిగేషన్ శాఖ, ఇతర శాఖల నిర్లక్ష్యం వల్ల ప్రకాశం బ్యారేజ్‌కి, అమరావతి కరకట్ట వెంబడి కృష్ణానదికి ఆనుకుని నిబంధనలకు విరుద్ధంగా భారీ కట్టడాలు నిర్మించారు. అప్పట్లో ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రి దేవినేని ఉమా కృష్ణానది ఎగువ ప్రాంతంలో అక్రమ కట్టడాలను తొలగించాలంటూ ప్రకటించారు. ఆ తరువాత 2019లో కృష్ణానదిలో లోపల ఓ బడాబాబు నీటిలో భారీగా పిల్లర్లు ఏర్పాటు చేసి నిర్మాణం చేపడితే, సీఆర్‌డీఏ అధికారులు దానిని అడ్డుకున్నారు. మళ్లీ ఇప్పుడు అదే ప్రాంతంలో పాత కట్టడాన్ని పూర్తిచేసి మరో అక్రమ కట్టడాన్ని కృష్ణానదిలో చేపట్టారు. నదీతీర ప్రాంతాల్లో ఆనకట్టల వద్ద చెట్టు నాటాలన్నా, ఏమైనా నిర్మాణాలు చేపట్టాలన్నా ఇరిగేషన్ శాఖ అనుమతులు తప్పని సరి. వాటన్నింటిని తుంగలో తొక్కి తిరిగి మళ్లీ కొత్త నిర్మాణాలు చేపట్టారు. 20 అడుగుల వెడల్పు, 50 అడుగుల పొడవుతో భారీ పిల్లర్లు, బీమ్‌లు ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణం చేపట్టారు. ఆ నిర్మాణం కోసం అక్కడ భారీగా మెటీరియల్ ఉంచారు.

మంత్రి నిమ్మల ఇటే వెళ్తుంటారు...

ఉండవల్లి వద్ద కృష్ణానది ఎగువ ప్రాంతంలోని అమరావతి కరకట్ట వెంబడి జరుగుతున్న అక్రమ కట్టడం ప్రతిరోజూ ఉన్నతాధికారులకు కనిపిస్తూనే ఉంటుంది. ఇరిగేషన్ శాఖ అధికారులతో పాటు వారంలో రెండు సార్లు ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటిస్తుంటారు. సీఆర్‌టీఏ అధికారులు వారి కార్యాలయానికి వెళ్లడానికి ఇదే మార్గంలో ప్రయాణం కొనసాగిస్తున్నారు. సీఆర్‌డీఏ అధికారులు సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం కోసం కరకట్ట ఇవతల వైపు సర్వే నిర్వహిస్తున్నా ఈ అక్రమ కట్టడం నిర్మాణం కనిపించకపోవడం విశేషం.

గతంలో అధికారులు నిలిపివేసిన కట్టడం, తిరిగి నిర్మిస్తున్న బడాబాబులు

రికవరీ ఏజెంట్‌లకు కౌన్సెలింగ్

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశం

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం(గుంటూరువెస్ట్): రుణాలిచ్చే చిన్న సంస్థల రికవరీ ఏజెంట్‌లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, అటువంటి రికవరీ ఏజెంట్లకు కౌన్సెలింగ్ చేపట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రికవరీ ఏజెంట్లను బైండోవర్ చేసి, ఆయా సంస్థల యజమానులతో పోలీస్ అధికారులు సమావేశాలు నిర్వహించాలని అన్నారు. తద్వారా ప్రజలను ఇబ్బందులకు గురి చేయకుండా, న్యాయపరంగా వెళ్లేలా అవగాహన కల్పించాలని చెప్పారు. ఇటీవల దేశ రాజధానిలో జరిగిన పేలుళ్ల దృష్ట్యా జిల్లాలో భద్రతా ప్రమాణాలను పెంచాలన్నారు. సీఎం, మాజీ సీఎం నివాసాలు, హైకోర్టు, సచివాలయం, సున్నిత ప్రాంతాల్లో తనిఖీలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. వీవీఐపీ, వీఐపీలు వెళ్లే మార్గాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలన్నారు. ఆయా మార్గాల్లో సీసీ కెమెరాలు వాడకంలో ఉండేలా దృష్టి సారించాలన్నారు. చట్ట వ్యతిరేక పనులకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించి, బైండోవర్ చేయాలన్నారు. జిల్లా ఏఎస్పీలు రమణమూర్తి (పరిపాలన), రవికుమార్ (ఎల్ఓ), హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు అరెస్ట్

- రూ.6.22 లక్షల విలువ చేసే బంగారం స్వాధీనం
- అరెస్ట్ చేసిన జీఆర్‌పీ పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ అంజిబాబు, నిందితులు(కింద కూర్చున్నవారు)

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రైళ్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలను గుర్తించి వారి వద్ద గల బ్యాగ్‌లలో ఉండే బంగారం చోరీ చేసే ఆరుగురిని జీఆర్పీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ అంజిబాబు వివరాలు వెల్లడించారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు రైళ్లలో ఒంటరిగా ప్రయాణించే మహిళలను టార్గెట్ చేసి బంగారం, నగదును చోరీ చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడండతో రైల్వే పోలీసులు అప్రమత్తమయ్యారు. జీఆర్పీ డీఎస్పీ అక్కేశ్వరరావు ఆధ్వర్యంలో సీఐ అంజిబాబు, ఆర్‌పీఎఫ్ సీఐ వీరబాబు, సీఐబీ పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గాలింపులు ప్రారంభించారు. శుక్రవారం గుంటూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్నారు. కొందరు పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిలో ముగ్గురు మహిళలు, ముగ్గురు పురుషులు ఉన్నారు. వారందరు పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంకు చెందిన వారిగా గుర్తించారు. వారిలో తాడేపల్లి గూడెం, యగర్లపల్లి ప్రాంతానికి చెందిన ఎర్రసాని గోవిందరాజు, ఎర్రసాని దుర్గాప్రసాద్, పెదాల రాజు, దేవరపల్లి, జ్యోతినగర్ ప్రాంతానికి చెందిన గీరాక వరలక్ష్మి, మెడ నరసయ్య, కొడటి అమృతల వద్ద బ్యాగ్‌లను పరిశీలించారు. వారి వద్ద రూ.6.22 లక్షల విలువ చేసే 75 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వాటిని స్వాధీనం చేసుకుని విచారించగా రైళ్లలో ఒంటరి మహిళలను గుర్తించి చోరీ చేస్తున్నట్లు విచారణలో తేలింది. వారిని రిమాండ్‌కు తరలించారు. జీఆర్పీ మహిళ ఎస్సై ఓ.దీపిక, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి, సీఐబీ ఎస్ఐ శ్రీనివాస్, సుభానీలను డీఎస్పీ అభినందించారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సింది గురువులే

నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నటుడు ఆర్ నారాయణమూర్తి తదితరులు

తెనాలి:రేపటి పౌరులైన నేటి బాలలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని సినీనటు డు, నిర్మాత, దర్శకుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులోని జిల్లా పరిషత్ హైస్కూలులో శుక్రవా రం వల్లూరి వెంకటేశ్వర రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.నారాయణమూర్తి పండిట్ జవవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించా రు. విద్యార్థి జీవితంలో ఇష్టంగా చదువుకుంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని చెప్పారు. రచయిత, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వల్లూరి శివప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి విద్య దోహదం చేస్తుందని చెప్పారు. రచనా రంగం, లలిత కళల్లో ఏదొకదానిలో విద్యార్థులు నైపుణ్యం సాధించాలని సూచించారు. తమ తండ్రి వల్లూరి వెంకటేశ్వరరావు స్మారకార్థం ఏటా స్వస్థలమైన కొలకలూరు హైస్కూలులో బాలల దినోత్సవం జరుపుతున్నట్టు గుర్తుచేశారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, సాంస్కృతిక విభాగాల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు మాచర్ల నాగేశ్వరరావు, కావూరి చంద్రమోహన్, వల్లూరు వరప్రసాదరావు, షేక్ జిలాని, నల్లిబోయిన నాగేశ్వర రావు,వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ మధుమేహ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్‌సీడీ జిల్లా అధికారి డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ఎన్‌సీడీ కన్సల్టెంట్ డాక్టర్ కె.గిరిధర్‌లు వైద్య శిబిరంలో పాల్గొని అగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి షుగర్, బీపీ పరీక్షలు చేశారు. తరచూ మూత్ర విసర్జన, దృష్టి లోపం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యులను సంప్రదించి షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు.

ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో డిసెంబర్ నుంచి ప్రారంభం కానున్న ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎమ్‌వీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తేనెటీగల పెంపకం, సేంద్రియ వ్యవసాయంలో 8 వారాలు వ్యవధిలో ఈ కోర్సులు నిర్వహిస్తారన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు రూ.1,500 ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా కంప్యూటర్, లేదా ఆండ్రాయిడ్ సెల్ ఫోన్, ఐపాడ్ ఏదోకటి కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు నవంబర్ 30వ తేదీ లోగాపేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఫోన్ 90632 19959, 80960 85560 పోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

రేపు జిల్లా జూడో సీనియర్ ఎంపికలు

గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా జూడో ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ స్టేడియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి జూడో సీనియర్ ఎంపికలు జరుగుతాయని సంఘం కార్యదర్శి కిరణ్ కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జూడో జట్టు కాకినాడలో ఈనెల 22, 23 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

మీనాక్షి కుమార్

'నేను ఎంత సంపాదించాను' అని లెక్కలు వేసుకునేవారు కోకొల్లలుగా ఉంటారు. 'నేను ఏం తింటున్నాను' అని ఆరోగ్య ప్రమాణాలతో విశ్లేషించుకునేవారు వేళ్ల మీద లెక్కించే స్థాయిలోనే ఉంటారు. సుప్రీం కోర్టు లాయర్ మీనాక్షి కుమార్ రెండో కోవకు చెందిన వ్యక్తి. వివిధ రకాల వంటకాలు నేర్చుకోవడానికి థాయ్‌లాండ్ వెళ్లి ప్రత్యేక శిక్షణ తీసుకున్న మీనాక్షి... ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత 'తాజా కూరగాయలు - తాజా వంటకాలు' నినాదంతో 'రూట్స్ కేఫ్' పేరుతో ఫామ్-టు-టేబుల్ ఫుడ్ కేఫ్ స్టార్ట్ చేసి దానిని ఆల్-ఉమెన్ కేఫ్‌గా తీర్చిదిద్దింది. తన పొలంలో రసాయన రహిత కూరగాయలు పండిస్తోంది. మహిళా ఆర్థిక స్వాతంత్ర్యం ప్రాముఖ్యత గురించి ప్రచారం చేస్తోంది..

ఆల్-ఉమెన్ రూట్స్ కేఫ్

నల్లకోటులో సుప్రీం కోర్టు కారిడార్‌లలో బిజీ బిజీగా కనిపించేది మీనాక్షి కుమార్. ఆమె తండ్రి కూడా న్యాయవాది. క్రిమినల్ లాయర్‌గా మంచి పేరు తెచ్చుకుంది. 2011 సంవత్సరం ఆమె జీవితాన్ని కొత్తదారిలోకి తీసుకువెళ్లింది. ఆ సంవత్సరం యూకేలోని న్యూ క్యాజిల్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ చేయడానికి వెళ్లింది మీనాక్షి.

సరదాగా మొదలైంది...

యూనివర్శిటీలోని డార్మిటరీ కిచెన్‌లో సరదాగా వంట చేసేది మీనాక్షి.

ఆ సరదా కాస్తా ఫ్యాషన్‌గా మారింది.

యూకేలో తనకు సింగపూర్ వ్యక్తి పరిచయం అయ్యాడు. అతడు ఇలా అన్నాడు....

'చదువు కోసం మాత్రమే కాదు మనకు ఆనందాన్ని ఇచ్చే కొత్త విద్యలు నేర్చుకోవడానికి కూడా సెలవులు పెట్టవచ్చు'

చార్టెర్డ్ ఎకౌంటెంట్ అయిన అతడు కిక్ కోసం పేస్ట్రీ స్టూడెంట్‌గా మారాడు. అతడి మాటలు మీనాక్షిపై బాగా ప్రభావం చూపించాయి. వెంటనే బ్యాంకాక్‌కు వెళ్లి ప్రసిద్ధ పాకశాస్త్ర పాఠశాల 'లె కార్డాన్ బ్లూ'లో చేరింది. అది తొమ్మిది నెలల కోర్సు. స్టార్ చెఫ్ గగన్ ఆనంద్ దగ్గర పాఠాలు నేర్చుకునే అవకాశం వచ్చింది.

అలా వచ్చింది ఒక ఐడియా!

మీనాక్షి ఇండియాకు వచ్చిన తరువాత, కోవిడ్ కల్లోలం మొదలైంది. ఇంటికే పరిమితమైన ఆమె టెర్రస్‌పై రకరకాల కూరగాయలు పండించేది.

'సరిగ్గా వినియోగించుకుంటే చిన్న స్థలంలో కూడా పెద్ద దిగుబడి సాధించవచ్చు' అనే విషయాన్ని గ్రహించిన మీనాక్షి ఆ తరువాత నోయిడాలోని తన కుటుంబానికి చెందిన ఎకరం పొలంలో సేంద్రియ వ్యవసాయానికి శ్రీకారం చుట్టింది. ఆ వ్యవసాయ క్షేత్రం ఆమె ప్రయోగశాలగా మారింది. ఒకరోజు మార్నింగ్ వాక్‌కు వెళుతూ ఒక మూలన మూతబడి ఉన్న పిజ్జా పాయింట్‌ను చూసింది మీనాక్షి. ఆ సమయంలోనే తనలో ఒక ఆలోచన మెరిసింది.

రూట్స్ కేఫ్ మొదలైంది ఇలా...

'తాజా కూరగాయలు... తాజా వంటకాలు' నినాదంతో 'రూట్స్ కేఫ్' ప్రారంభించింది. తమ పొలంలో పండిన కూరగాయలనే 'రూట్ కేఫ్'లో వినియోగించేవారు. సీజన్‌లను బట్టి మెనూ మారుతుంది. 'ప్రతిదీ తాజాగా' అనే పేరు రావడంతో 'రూట్స్ కేఫ్' బాగా క్లిక్ అయింది.

మన దేశంలో పండే కూరగాయలే కాకుండా ప్రపంచ వ్యాప్త ప్రసిద్ధి పొందిన కూరగాయలతో చేసిన వంటకాలు 'రూట్స్ కేఫ్'లో అందుబాటులో ఉంటాయి. 'రూట్స్ కేఫ్'ను ప్రత్యేకంగా నిలబెట్టింది దేశ, విదేశ రసాయన రహిత కూరగాయలతో చేసిన నోరూరించే వంటకాలు మాత్రమే కాదు... సిబ్బంది కూడా. 'రూట్స్ కేఫ్'లో ఉద్యోగులందరూ మహిళలే. 'రూట్స్ కేఫ్‌లో పనిచేయాలనుకునే మహిళలకు ప్రధాన అర్హత...వారికి ఎలాంటి అనుభవం లేకపోవడం! ఇది ఆశ్చర్యంగా ఉండవచ్చు. అయితే అనుభవం లేని వారే ఆసక్తితో అన్నీ నేర్చుకుంటారు. వారిలో అంకితభావం అధికంగా కనిపిస్తుంది. రూట్స్ కేఫ్‌ను ఆల్-ఉమెన్ కేఫ్‌గా తీర్చిదిద్దడంలో విజయం సాధించాను' అంటుంది మీనాక్షి.

ఆర్థిక స్వాతంత్ర్యమే... అసలైన ప్రాధాన్యత

మోడల్ స్ట్రీట్‌ఫుడ్ కార్ట్‌లు, హై-ఎండ్ కాఫీ ప్రోగ్రామ్స్, ప్రాంతీయ వంటకాలతో ప్రయోగాలు... మొదలైనవాటితో 'రూట్స్ కేఫ్' విజయపథంలో దూసుకుపోవడం ఒక కోణం అయితే, మరో కోణం... స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యానికి విలువనిచ్చే వేదికగా రూట్స్ కేఫ్ పేరు తెచ్చుకోవడం.

'డబ్బు అనేది మహిళలకు మాట్లాడే గొంతును ఇస్తుంది. స్వేచ్ఛను, గౌరవాన్నీ ఇస్తుంది' అంటున్న మీనాక్షి కుమార్ ఎంతోమంది మహిళలకు శిక్షణ ఇచ్చి మరీ తన 'రూట్స్ కేఫ్'లో ఉద్యోగాలు ఇచ్చింది.

జీరో నుంచి శిక్షణ

'రూట్స్ కేఫ్'లో చేరిన మహిళలకు కూరగాయలు కోయడం, వంట చేయడం నుంచి వడ్డించడం వరకు జీరో నుంచి శిక్షణ ఇచ్చింది మీనాక్షి.

'ఉద్యోగం చేస్తున్నాను అనే సంతోషం కంటే కొత్త విద్య నేర్చుకున్నామనే సంతృప్తి వారిలో కనిపిస్తుంది' అని రూట్స్ కేఫ్‌లో పనిచేసే ఉద్యోగుల గురించి చెబుతోంది మీనాక్షి.

గృహిణిగా పదిహేడు సంవత్సరాలు ఇంటికే పరిమితమైన మీనాక్షి 'రూట్స్ కేఫ్'తో ఉద్యోగ ప్రస్థానం మొదలుపెట్టింది.

'కోవిడ్ తరువాత మాకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఏదైనా ఉద్యోగం చేయాలని గట్టిగా అనుకున్నాను. కాని నాకు ఎవరు ఉద్యోగం ఇస్తారు? మీకు ఎలాంటి అనుభవం ఉండనక్కర్లేదు. ఇంటర్వ్యూకు వచ్చేయండి...అనే రూట్స్ కేఫ్ పిలుపు నన్ను ఆకట్టుకుంది. ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. నా జీవితంలో తొలిసారిగా ఉద్యోగంలో చేరాను. నెల జీతం ఇరవై వేలు అందుకున్నప్పుడు నా సంతోషానికి హద్దులు లేవు. ఇది నేను సాధించిన జీతం అనే భావన ఎంతో సంతృప్తిని ఇచ్చింది' అంటుంది మధుమిత.

ఇలాంటి మధుమితలెందరికో కొత్త జీవితాన్ని ఇచ్చింది రూట్స్ కేఫ్.

తండ్రితో మీనాక్షి కుమార్

ప్రతిరోజూ ఆ ఉత్సాహం మీలో ఉంటే...

మొదటి అడుగు వేయడం అత్యంత కష్టతరమైనది కావచ్చు. అంతమాత్రాన అధైర్య పడవద్దు. ఒక అడుగు పడిన తరువాత భయం వెనకడుగు వేయిస్తుంది. ఆ తరువాత మాత్రం ప్రయాణం సజావుగానే సాగుతుంది. ప్రతిరోజూ ఉదయం మీలో 'ఈ రోజు ఉద్యోగానికి వెళుతున్నాను' అనే ఉత్సాహం కనిపిస్తుంటే మీరు సరియైన బాటలోనే ప్రయాణిస్తున్నారని అర్థం. పూర్తిగా మహిళల నేతృత్వంలో ఒక కేఫ్ నడుపుతున్నందుకు గర్వంగా ఉంది. అయితే వ్యాపారం అన్నాక అన్నీ సంతోషకరమైన రోజులే ఉండవు. కొన్నిసార్లు కస్టమర్లు ఉండరు. కొన్నిసార్లు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయి. అయినప్పటికీ అన్నింటినీ తట్టుకుని ఉత్సాహంగా ముదుకు సాగాలి.

– మీనాక్షి కుమార్

జోష్

సుధామూర్తి గారి స్టెప్స్!

సెలబ్రిటీ అయినంత మాత్రాన ఎప్పుడూ గంభీరంగానే ఉండాలనే రూలేమీ లేదు. సరదా సరదాగా ఉండవచ్చు... హాయిగా డ్యాన్స్ చేయవచ్చు.

బయోకాన్ ఫౌండర్ కిరణ్ మజుందార్, రచయిత్రి, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి సతీమణి సుధామూర్తి బెంగళూరులోని పెళ్లి ఊరేగింపులో చేసిన డ్యాన్స్ వీడియో వైరల్‌గా మారింది.

బెంగళూరులోని తాజ్ వెస్ట్ ఎండ్‌లో జరిగిన కిరణ్ మజుందార్ బంధువు వివాహ వేడుకకు ఎంతో మంది రాజకీయ, వ్యాపార ప్రముఖులు హాజరైనప్పటికీ సుధామూర్తి, కిరణ్ మజుందార్ డ్యాన్స్ సెప్స్ వేడుకకు హైలెట్‌గా నిలిచాయి.

'ఎంత పెద్దలైనా డ్యాన్స్ మొదలు పెడితే చిన్న పిల్లలైపోతారు. నృత్యం గొప్పదనం అదే!'

'ఇది సుధామూర్తిగారి తీన్మార్!'.... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి.

గతంలో... ఇన్ఫోసిస్ 40వ వార్షికోత్సవం సందర్భంగా బెంగళూరులో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మణిరత్నం 'గురు' సినిమాలోని 'బర్సోరే' పాటకు సుధామూర్తి సెప్పులు వేసి 'ఆహా' అనిపించారు.

● కైండ్‌నెస్

ఎంత మంచివాడవయా!

'ఎంత మంచి మనసు' అని ఘనంగా చెప్పుకోవడానికి కోటానుకోట్లు దానం చేయక పోయినా ఫరవాలేదు. మనకు తోచినంతలో ఏ మంచి పని చేసినా సరిపోతుంది అని చెప్పే సంఘటన ఇది.

చెన్నైలో ఒక కుక్కపిల్ల గొయ్యిలో పడింది. ఆ గొయ్యి దగ్గర నిస్సహాయంగా నిల్చొని ఏడుపు గొంతుతో అరుస్తోంది తల్లి కుక్క. ఆ అరుపులు విన్న ఒక పోలీసు గొయ్యి నుంచి కుక్కపిల్లను రక్షించాడు. తల్లి కళ్లలో సంతోషం నింపాడు.

'రోడ్డు మీద మనిషి పడిపోతే కూడా ఎవరి దారిన వారు వెళుతున్న ఈ రోజుల్లో ఆ వ్యక్తి గొప్ప మనసుతో కుక్కపిల్లను రక్షించడం గొప్ప విషయం'

'మానవత్వం మృగ్యమైపోతుంది అని నిరాశపడే రోజుల్లో ఇలాంటి మంచి పనుల గురించి వింటున్నప్పుడు ఆశాదీపాలు వెలుగుతాయి'... ఇలాంటి కామెంట్స్‌తో స్పందించారు నెటిజనులు.

సాక్షి సినిమా

● బాలకృష్ణ

అఖండ తాండవం

'సింహా, లెజెండ్, అఖండ' చిత్రాల తర్వాత హీరో బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కిన తాజా చిత్రం 'అఖండ 2: తాండవం'. సంయుక్తా మీనన్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో ఆది పినిశెట్టి, హర్షాలీ మల్హోత్రా కీలక పాత్రలు పోషించారు. ఎం. తేజస్విని సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 5న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి ముంబైలో జరిగిన ఈవెంట్‌లో 'తాండవం... అఖండ తాండవం...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. ఈ పాటకి కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించగా శంకర్ మహదేవన్, కైలాష్ ఖేర్ పాడారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ– ''అఖండ 2'లో హిందూ సనాతన ధర్మం శక్తి, పరాక్రమం చూస్తారు'' అని తెలిపారు. ''ఇది ఒక సినిమా కాదు... భారతదేశ ఆత్మ, ధర్మం. ఈ సినిమా చూసిన తర్వాత అందరూ అదే ఫీల్ అవుతారు'' అని బోయపాటి శ్రీను పేర్కొన్నారు. ''అఖండ' కు మించి 'అఖండ 2' ఉంటుంది'' అన్నారు తమన్. ''అఖండ 2' పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ కాబోతోంది'' అని గోపీ ఆచంట చెప్పారు. ఈ పాట విడుదల వేడకలో హర్షాలీ మల్హోత్రా, ఆది పినిశెట్టి, కైలాష్ ఖేర్ మాట్లాడారు.

● రానా, భాగ్యశ్రీ బోర్సే

కాంత తీసినందుకు గర్వంగా ఉంది

- రానా దగ్గుబాటి

''కాంత' సినిమాకి వస్తున్న ప్రేక్షకుల స్పందన చూస్తే చాలా ఆనందంగా ఉంది. ముఖ్యంగా దుల్కర్.. తన కెరీర్ అత్యద్భుతమైన నటన కనబరిచారు. ఈ సినిమా చేసినందుకు గర్వంగా ఉంది'' అని రానా దగ్గుబాటి తెలిపారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జోడీగా నటించిన చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో రానా, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. దుల్కర్ సల్మాన్ వేఫేర్ ఫిల్మ్స్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియాపై నిర్మించిన ఈ సినిమా శుక్రవారం విడుదల అయింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రానా దగ్గుబాటి మాట్లాడుతూ–''చాలా గ్యాప్ తర్వాత నేను స్క్రీన్ మీద కనిపించడంతో నా పాత్రకి కూడా చాలా మంచి ప్రశంసలు వచ్చాయి'' అని చెప్పారు. భాగ్యశ్రీ బోర్సే మాట్లాడుతూ–''కాంత'లో నా నటన ప్రేక్షకులకు నచ్చడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమా కోసం ఆరు నెలలు చెన్నైలోనే ఉన్నాను'' అన్నారు.

వచ్చే ఏడాదే రిలీజ్?

● అల్లు అర్జున్

'పుష్ప 2: ది రూల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి అట్లీ దర్శకత్వం వహిస్తున్న సంగతి తెలిసిందే. భారీ బడ్జెట్‌తో సన్ పిక్చర్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోందని తెలిసింది. కాగా సూపర్ హీరో కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతోందని, భారీగా గ్రాఫిక్స్ వర్క్ చేయాల్సి ఉంటుందని, ఈ కారణాల వల్ల ఈ సినిమా విడుదల 2027లో ఉండొచ్చనే ఊహాగానాలు తెరపైకి వచ్చాయి. కానీ ఈ సినిమా చిత్రీకరణ అనుకున్న సమయానికన్నా ముందుగానే పూర్తయ్యే అవకాశం ఉందని, ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌ను అట్లీ పక్కాగా ప్లాన్ చేయడమే ఇందుకు కారణమనే టాక్ వినిపిస్తోంది. అంతేకాదు... ప్రచారంలో ఉన్నట్లు ఈ చిత్రం 2027లో కాకుండా ఒక ఏడాది ముందే తెరపైకి వచ్చే చాన్స్ ఉందట. షూటింగ్ జెట్ స్పీడ్‌తో కొనసాగుతుండటంతో 2026లోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందట. ఇక ఈ చిత్రం షూటింగ్ షెడ్యూల్స్ విషయానికొస్తే... డిసెంబరు – జనవరి మధ్యలో ఓ కీలక షెడ్యూల్‌ను అట్లీ ప్లాన్ చేశారట. ఈ షెడ్యూల్ పూర్తయితే ఈ మూవీ రిలీజ్‌పై మేకర్స్ నుంచే ఓ స్పష్టత రావచ్చని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మే నాటికి షూటింగ్ పూర్తి చేసేసి, దసరాకు విడుదల చేయాలన్నది టీమ్ ప్లాన్ అని టాక్. ఈ చిత్రంలో దీపికా పదుకోన్ ఓ లీడ్ రోల్ చేస్తున్నారు.

ఎవరూ ఊహించలేరు!

● సత్య

హాస్య నటుడు సత్య హీరోగా 'మత్తు వదలరా' మూవీ ఫేమ్ రితేష్ రానా దర్శకత్వంలో ఓ సినిమా ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మిస్ యూనివర్స్ ఇండియా రియా సింఘా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పణలో చిరంజీవి, (చెర్రీ) హేమలత పెదమల్లు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'జెట్లీ' టైటిల్ ఖరారు చేసి, పోస్టర్‌ను విడుదల చేశారు. ''హై ఫ్లయింగ్ యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'జెట్లీ'. ఈ సినిమాలో థ్రిల్స్, ట్విస్టులు, హై ఓల్టేజ్ హ్యూమర్ అన్నీ రితేష్ రానా స్టైల్లో ప్యాక్ అయి ఉన్నాయి. సత్య తొలిసారి తన కెరీర్‌లో క్రేజీ, ఎవరూ ఊహించలేని అవతార్‌లో కనిపించబోతున్నారు'' అని చిత్రబృందం పేర్కొంది.

ఆ సినిమాల తర్వాత సంతాన ప్రాప్తిరస్తు

● సంజీవ్, చాందిని, విక్రాంత్, శ్రీధర్

- మధుర శ్రీధర్ రెడ్డి

''ఒక వినోదాత్మక మూవీ కోసం ప్రేక్షకులు ఎంతగా ఎదురుచూస్తున్నారో మా 'సంతాన ప్రాప్తిరస్తు' సినిమా సక్సెస్‌తో అర్థం అయింది. 'ఆయ్, లిటిల్ హార్ట్స్' వంటి చిత్రాల తర్వాత అలాంటి హోల్ సమ్ ఎంటర్‌టైనర్ మా 'సంతాన ప్రాప్తిరస్తు' అంటుండటం సంతోషంగా ఉంది'' అని నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి చెప్పారు. విక్రాంత్, చాందినీ చౌదరి జోడీగా నటించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు'. సంజీవ్ రెడ్డి దర్శకత్వం వహించారు. మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో విక్రాంత్ మాట్లాడుతూ–''మా సినిమా చూసిన వారు మా నటన, టెక్నీషియన్స్ వర్క్ గురించి మాట్లాడుతుండటం సంతోషంగా ఉంది'' అని తెలిపారు. ''థియేటర్స్‌కు వెళ్లి చూశాను.. ఆడియన్స్ స్పందన చూశాక సంతోషంగా అనిపించింది'' అన్నారు చాందినీ చౌదరి. ''కొత్త తరహా కంటెంట్ చూపిస్తే తాము ఆదరిస్తామని ప్రేక్షకులు మరోసారి నిరూపించారు'' అని సంజీవ్ రెడ్డి తెలిపారు. మ్యూజిక్ డైరెక్టర్ అజయ్ అరసాడ మాట్లాడారు.

ప్రేమ మారదు

● అడివి శేష్, అఖిల్

- అడివి శేష్

''రాజు వెడ్స్ రాంబాయి' సినిమా ట్రైలర్, కొన్ని సీన్స్ చూశాను. ఈ సినిమా కథ కూడా నాకు తెలుసు. ఇలాంటి మంచి కంటెంట్‌ను ప్రమోట్ చేయాలనే ఈ ఈవెంట్‌కు వచ్చాను. వైరల్ కంటెట్ ఎలా చేయాలని ఆలోచిస్తున్న ఈ సోషల్ మీడియా యుగంలో ఒక స్వచ్ఛమైన ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకు రావడం సాధారణ విషయం కాదు. సోషల్ మీడియా యాప్స్ మారుతూ ఉంటాయి. కానీ ప్రేమ మారదు'' అని చెప్పారు అడివి శేష్. అఖిల్, తేజస్విని జంటగా నటించిన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. డా. నాగేశ్వరరావు పూజారి సమర్పణలో సాయిలు కంపాటి దర్శకత్వంలో వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రాన్ని వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ నెల 21న రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన అడివి శేష్ మాట్లాడుతూ– ''కేరాఫ్ కంచెరపాలెం' సినిమాలా ఈ చిత్రానికీ చాలా చోట్ల ప్రీమియర్స్ వేయాలి. అప్పుడే ప్రేక్షకులు థియేటర్స్‌కు వస్తారు. అంత మంచి సినిమా ఇది'' అని అన్నారు. ''బిగినింగ్, ఇంటర్వెల్, క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది'' అన్నారు సాయి. ''ఇది కాలానికి అతీతమైన ప్రేమ కథ'' అన్నారు వేణు ఊడుగుల. ''ఈ సినిమా క్లైమాక్స్ చూసి రెండు రోజులు నిద్రపోలేదు'' అని చెప్పారు బన్నీ వాసు. ''ప్రేమంటే ఒకరి కోసం ఒకరు బతకడం'' అన్నారు చిత్ర సమర్పకులు డా. నాగేశ్వరరావు, రాహుల్ మోపిదేవి.

● 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్' పోస్టర్

మరియా త్యాగం

కేథలిక్ మత సోదరి, సామాజిక కార్యకర్త సీనియర్ రాణి మారియా వట్టాలిల్ జీవితం ఆధారంగా రూపొందిన చిత్రం 'ది ఫేస్ ఆఫ్ ది ఫేస్‌లెస్'. అణగారిన వర్గాల కోసం, మహిళా సాధికారత కోసం మారియా చేసిన కృషితో రూపొందిన ఈ చిత్రంలో ఆమె పాత్రను విన్సీ అలోషియస్ పోషించారు. 2024 ఆస్కార్‌కు నామినేట్ అయిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం దివ్యవాణి సోషల్ కమ్యూనికేషన్స్ మద్దతుతో నవంబర్ 21న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తెలుగు వెర్షన్ విడుదల కానుంది. 'ఆనంద్' ఫేమ్ రాజా మాట్లాడుతూ–''రాణి మారియా త్యాగం గురించి ఈ సినిమా ఉంటుంది. 123 అవార్డులు పొందిన సినిమా ఇది'' అన్నారు. ''ప్రపంచాన్ని కదిలించిన ఈ సినిమా నచ్చుతుంది'' అని దివ్యవాణి సోషల్ కమ్యూనికేషన్స్ సీఈఓ డాక్టర్ ఐ. లూర్దూ రాజ్ పేర్కొన్నారు.

మాస్టర్ సంకల్ప్ సందేశం

● శివాజీ రాజా, సుధాకర్ గౌడ్

''ఈ రోజుల్లో పిల్లల్లో మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. కుటుంబ వాతావరణం, పరీక్షలు, మొబైల్ వాడకం, పెరిగిన సామాజిక నేపథ్యం ఇవన్నీ పిల్లలు ఒత్తిడికి గురి కావడానికి కారణాలుగా మారుతున్నాయి. పిల్లల్లో మానసిక రుగ్మతలు తొలగించేందుకు యోగ, ధ్యానం చక్కటి పరిష్కార మార్గాలను మన పూర్వీకులు సూచించారు. పిల్లలు యోగ, ధ్యానం చేసేలా పేరెంట్స్ ప్రోత్సహించాలి'' అన్నారు భీమగాని సుధాకర్ గౌడ్. శ్రీ లక్ష్మి ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్, సంతోష్ ఫిలింస్‌పై 'ఆదిత్య, క్రియేటివ్ జీనియస్, విక్కీస్ డ్రీమ్, డాక్టర్ గౌతమ్' వంటి బాలల చిత్రాలను రూపొందించారు భీమగాని సుధాకర్ గౌడ్. ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన తాజా బాలల చిత్రం 'మాస్టర్ సంకల్ప్'. ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేసిన శివాజీ రాజా మాట్లాడుతూ–''ట్రైలర్ చాలా బాగుంది'' అని అన్నారు.

వాస్తవ ఘటనలతో...



● రామకృష్ణ, శౌర్య, అనుశ్రీ, శ్రీకాంత్

అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'దేవగుడి'. బెల్లం సుధా రెడ్డి సమర్పణలో బెల్లం రామకృష్ణా రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా డిసెంబరు 19న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం టీజర్ లాంచ్ ఈవెంట్‌కి శ్రీకాంత్ అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''2013లో రామకృష్ణా రెడ్డిగారు నిర్మాతగా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టారు. అప్పట్లో ఆయన సినిమా గురించి చెబుతుంటే మీరే డైరెక్షన్ చేయవచ్చు కదా? అనేవాడిని. ఆ తర్వాత ఆయన డైరెక్టర్‌గా మారారు. ఆయన దర్శకత్వంలో వాస్తవ ఘటనలతో రూపొందిన 'దేవగుడి' చిత్రం అందర్నీ అలరిస్తుందని నమ్ముతున్నాను'' అని చెప్పారు. బెల్లం రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ– ''నా దర్శకత్వంలో నిర్మించిన 'దేవగుడి'తో హిట్ కొట్టబోతున్నాం. స్క్రీన్‌ప్లే ఆశ్చర్యపరుస్తుంది. రఘు కుంచెగారు చక్కని పాత్ర చేశారు'' అని తెలిపారు. ''మా సినిమాని సక్సెస్ చేయాలి'' అని అభినవ శౌర్య, నరసింహ, అనుశ్రీ కోరారు. ఈ కార్యక్రమంలో రఘు కుంచె, కెమెరామేన్ లక్ష్మీకాంత్ కనికే మాట్లాడారు.

క్లుప్తంగా

బాధితులకు అండగా ఉంటాం

తాడేపల్లి రూరల్: ప్రభుత్వం రాజధాని నుంచి సీడ్‌యాక్సిస్ రోడ్డు అనుసంధానంగా స్టీల్ బ్రిడ్జి నిర్మాణానికి నిర్ణయించింది. అందులో భాగంగా మంగళగిరి, తాడేపల్లి కార్పొరేషన్ల పరిధిలో కె.ఎల్.రావు కాలనీలో 85 నివాసాలు తొలగించేందుకు కార్పొరేషన్ అధికారులు సభలు, సమావేశాలు నిర్వహించారు. నిర్వాసితులు, సీపీఎం పార్టీలు దీన్ని వ్యతిరేకించారు. శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ మద్దతు తెలుపుతూ సీపీఎం జిల్లా కార్యదర్శి నేతాజీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పార్టీ పొన్నూరు నియోజకవర్గ పరిశీలకులు గుర్రుముక్కల వేణుగోపాలస్వామిరెడ్డి విచ్చేసి కాలనీ నివాసాలకు మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం నేతాజీ, గుర్రుముక్కల వేణుగోపాలస్వామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ నిర్ణయం మార్చుకుని, రాజధాని ప్రాంతంలో సీఆర్‌డీయే, ఉండవల్లి ప్రాంతంలో నిర్వాసితులకు రెండు సెంట్ల స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల నగదు, ప్రస్తుతం తీసే ఇంటి లెక్కల ప్రకారం నగదు చెల్లించాలన్నారు.

సీఐటీయూ మహాసభను జయప్రదం చేయాలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లిలో ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు వై.నేతాజీ పిలుపునిచ్చారు. ప్రకాష్‌నగర్‌లో శుక్రవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన మాట్లాడారు. మహాసభలకు కార్మిక కుటుంబాలు తరలిరావాలని కోరారు. ఈ మహాసభల్లో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ప్రణాళికను రూపొందించనున్నట్లు ఆయన వివరించారు. సుమారు ఏడాదిగా సాగుతున్న ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి సీఐటీయూ మద్దతు తెలియజేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వేముల దుర్గారావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు సంతోష్, యేసయ్య, కమల తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పరిధిలోని పలుప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు మంగళగిరి విద్యుత్‌శాఖ ఎ.డి.ఇ. జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పట్టణ పరిధిలోని కేకే ఏవర్స్, ఎన్ఎల్‌బీ అపార్ట్‌మెంట్ ఏరియా, ఎన్ఆర్ఐ విల్లాస్ రోడ్, కొండపునేని టౌన్‌షిప్, పెద్ద పెట్రోల్‌బంక్ రోడ్, బైపాస్‌రోడ్, రత్నాల చెరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

మంగళగిరి టౌన్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళగిరిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. విజయవాడకు చెందిన దేవరపల్లి జయంత్(26) గురువారం రాత్రి స్నేహితులతో కలిసి మంగళగిరిలోని ఓ దాబాకు వచ్చాడు. అర్ధ రాత్రి స్నేహితుడు ప్రకాష్‌తో కలిసి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో ఆత్మకూరు పరిధిలో రోడ్డుపై ఎటువంటి హెచ్చరికలు లేకుండా నిలిపి ఉన్న లారీని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు. గమనించిన తోటి స్నేహితులు ఇద్దరినీ ఎయిమ్స్‌కి తరలించారు. ప్రకాష్‌కు గాయాలు కాగా జయంత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి పోతురాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

జగనన్న కాలనీలో సమస్యల తిష్ట!

- అధ్వానంగా రహదారులు
- విషసర్పాలకు నిలయాలుగా కాలనీ
- పట్టించుకోని అధికారులు

అధ్వానంగా దర్శనమిస్తోన్న జగనన్న కాలనీ రోడ్డు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని జగనన్న కాలనీ 1, 2, 3, 4 లేఅవుట్లలో కాలనీ వాసులు సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సమస్యలను గురించి అధికారులకు తెలియజేసినా పట్టించుకోక పోగా వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నుంచి రైల్వే అండర్‌బ్రిడ్జి మీదుగా వెళ్లే రోడ్డుకు ఇరువైపుల నాలుగు లేఅవుట్లు ఉన్నాయి. అందులో ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకుని సుమారు 65 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీలో ఇళ్ల వద్ద మురుగు పారేందుకు కాలువలు లేకపోవడంతో వర్షం పడిన సమయంలో మురుగు ఇళ్లలోకి చేరుతోంది. ఫలితంగా భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు.

అధ్వానంగా కాలనీ రోడ్లు..

కాలనీల్లోని పలు బజార్లలో సరైన రోడ్లు సదుపాయం లేదు. ఉన్నరోడ్లపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి అస్తవ్యస్తంగా ఉన్నాయి. ఏ కొద్దిపాటి వర్షం పడినా రోడ్లంతా బురదమయంగా మారి వాహనాలు తిరిగేందుకు కూడా వీలుకాని పరిస్థితి నెలకొంది. కాలనీ నుంచి ఫిరంగిపురం రావాలంటే వాహనాలు లేనిదే రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో కాలనీవాసులు నానా అవస్థలు పడుతున్నారు. నాలుగు లేఅవుట్లలోని కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగటం లేదు. దీంతో సాయంత్రం బిక్కుబిక్కుమంటూ స్థానికులు ఇళ్లకు చేరుకోవాల్సి వస్తోంది. వీధిదీపాలు వెలగడం లేదని చెప్పినా సమస్యను పరిష్కరించకుండా.. అంతదూరంలో ఉండకపోతే ఏమిటంటూ అధికారులు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు.

కాలనీలో రోడ్డు పక్కన పెరుగుతున్న తుమ్మచెట్లు

విషసర్పాల సంచారం..

కొన్ని చోట్ల విద్యుత్ తీగలు ఇళ్లమీదుగా వెళ్లడంతో మేడ ఎక్కాలంటే భయపడాల్సి వస్తుందని.. దీనిపై సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలనీలోని కొన్ని ప్రాంతాల్లో పిచ్చి తుమ్మచెట్లు మొలిచాయి. విషసర్పాలు, తేళ్లు, మండ్రగబ్బలు చీకటిపడితే రోడ్లపై సంచరిస్తున్నాయి. రాత్రి సమయాల్లో అవి ఇళ్లలోకి వస్తుండటంతో ఇంట్లో చిన్న పిల్లలను పెట్టుకొని ఉండాలంటేనే భయపడాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

కరెంటు తీగలతో సమస్య..

జగనన్న కాలనీలో నిర్మించిన ఇంటి మీదుగా విద్యుత్ లైన్లు వెళ్లాయి. దీంతో గాలి వచ్చినప్పుడు తీగలు ఊగుతూ ఇంటి మీదకు వస్తున్నాయి. భయంభయంతో జీవిస్తున్నాం. విద్యుత్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలి.

– వందనపు శ్యామలాదేవి, కాలనీవాసి

రోడ్లు అధ్వానంగా ఉన్నాయి..

కాలనీల్లో రోడ్లు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే బురదమయంగా మారి ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీలుకాని పరిస్థితి ఏర్పడింది. గుంతల రోడ్లలో ప్రయాణించాలంటే ఇబ్బందిగా ఉంది. పిచ్చి చెట్లు మొలవడంతో పాములు సంచరిస్తున్నాయి.

– రేపూడి రవి, కాలనీవాసి

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తాడికొండ: రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన సాఫ్ట్ టెన్నిస్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారని పాఠశాల కరస్పాండెంట్ రాయపాటి మోహన సాయికృష్ణ అన్నారు. ఈనెల 11వ తేదీ నుంచి 12వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలోని పాతపట్నంలో జరిగిన సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా టీం అండర్–14 క్యాటగిరిలో బాలికల విభాగంలో టీం ఈవెంట్లో విజేతగా నిలువగా.. అండర్–17 క్యాటగిరిలో బాయ్స్ అండ్ గర్ల్స్ టీం ఈవెంట్లో మొదటి స్థానం, అండర్–19 క్యాటగిరిలో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. వీరిలో అండర్–14 విభాగంలో తమ పాఠశాలకు చెందిన షేక్ ఫజల్ రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా అండర్–19 క్యాటగిరిలో షేక్ ఫయాజ్ అహ్మద్ జాతీయ స్థాయికి ఎంపిక కావడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. వీరు డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో మధ్యప్రదేశ్ దివాస్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు పీడీ అనీల్ కుమార్‌ను కరస్పాండెంట్ సాయి మోహన్ కృష్ణ, సీఈవో డాక్టర్ కురా అమల అభినందించారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రెటరీ గోపీచంద్, హెచ్ఎం ఎన్వీ రమణయ్య పాల్గొన్నారు.

వీధి దీపాల సమస్యను పరిష్కరించాలంటూ వినతి

మంగళగిరి టౌన్: మంగళగిరి మండల పరిధి చిన కాకాని గ్రామంలో వీధి దీపాల సమస్యను పరిష్కరించాలంటూ శుక్రవారం గ్రామ రెండో సచివాలయ కార్యదర్శి ప్రతిమకు సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. చినకాకాని గ్రామ పరిధిలోని యార్లగడ్డ సుబ్బారావు కాలనీ, సత్రం రోడ్డుతో పాటు హైవే పరిసర ప్రాంతాల్లో వీధి దీపాలు గత కొంతకాలంగా వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీంతో రాత్రి సమయాల్లో రాకపోకలకు కష్టంగా ఉంటోందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కటారి జేసుదాసు, గోపిరాజు, సత్యనారాయణ, శంకర రావు, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుగ్గిరాల గ్రామ ఉపసర్పంచి షేక్ నాగూర్ మృతి

దుగ్గిరాల: దుగ్గిరాల ఉప సర్పంచి షేక్ నాగూర్ మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని.. పార్టీ నిబద్ధత కలిగిన నాయకుడుని కోల్పోయిందని నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి(డీవీఆర్) అన్నారు. దుగ్గిరాలలో మృతిచెందిన షేక్ నాగూర్(59) పార్థివదేహానికి వేమారెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం తెలిపారు. నాగూర్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నివాళి అర్పిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

A.L COLLEGE OF EDUCATION, Guntur(Co-Education)
(Recognized by NCTE and Affiliated to A.N.U Guntur.AP)
Lodge Centre, Guntur- 522 002, Ph: 9440155164

B.Ed. Spot ADMISSIONS NOTIFICATION CATEGORY- A Seats

Applications are invited from the eligible candidates for academic year 2025-2026 B.Ed. Spot Admission (Category "A" and Left over Seats). Application forms are available from college office. Last date of submission of applications is 17/11/2025. Selection will be made as per the APSCHE Guidelines.

Guntur 14-11-2025 | Sd/- Dr.M Esther Suneela, Principal

■ **కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం**

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతంలో నదిలో మృతదేహం ఉన్నట్లు స్థానికులు శుక్రవారం తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఖాజావలి సంఘటనా స్థలానికి వెళ్లి నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి పరిశీలించగా మృతదేహం వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్లు ఉండవచ్చని.. శరీరంపై కాషాయరంగు చొక్కా, ఖాకీరంగు ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతుడి ఎడమకాలి బొటన వేలు లేదని, రెండు చెవులకూ బంగారు తీగలు ధరించి ఉన్నాడని వివరించారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తిస్తే 86888 31364 నంబరును సంప్రదించాలని ఎస్ఐ ఖాజావలి కోరారు.

■ **పాత జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం**

తాడేపల్లి రూరల్: పాత జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నుంచి విజయవాడ వైపునకు 15 మంది ప్రయాణికులతో మాలధారణ చేసిన ఒక ఆటో డ్రైవర్ చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని అతివేగంగా ఆటో నడుపుతూ వెళుతున్నారు. నులకపేట సాయిబాబా గుడి సమీపంలో ఐవోసీ వద్దకు వచ్చేసరికి ఎదురుగా అతి వేగంగా ఒక ప్రభుత్వ వాహనం వచ్చి వేగంగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఘటనలో ఆటో బోల్తా పడింది. గమనించి స్థానికులు ఆటోను పైకి లేపి ప్రయాణికులను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.

సంక్షిప్త వార్తలు

■ **పార్టీ బలోపేతానికి కృషి చేయాలి**

మంగళగిరి టౌన్: నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేసి విజయం సాధించడమే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి సూచించారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరు పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డిని గుంటూరు జిల్లా ఎస్సీ విభాగ అధ్యక్షులు సురేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. వేమారెడ్డిని శాలువాతో సత్కరించి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు భూషణం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు సుభాకర్, నాయకులు శేషు, మల్లవరపు చిన్ని, రాజేష్, దేవరాజ్, రాంబాబు, ప్రశాంత్, గోపి, మధు, చక్రవర్తి, మాతంగి బాబు, శివ, నాగరత్నం, కర్రి దాసు పాల్గొన్నారు.

■ **ప్రభుత్వ వైద్య సేవలు ప్రజల హక్కు**

మంగళగిరి టౌన్: ప్రభుత్వ వైద్య సేవలు ప్రజల హక్కు అని మంగళగిరి మండల వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మంగళగిరి మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆత్మకూరు గ్రామంలో గ్రామ అధ్యక్షులు కొల్లి శ్యామ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, సాంబశివరావు, కిషోర్ రెడ్డి, ప్రేమ్‌చంద్, దుర్గారావు, కోటేశ్వరరావు, నరసింహ, యేసుబాబు, రత్నకోట రాజు, కోటయ్య, వెంకటేశ్వరరావు, బుజ్జిబాబు, ప్రభుదాస్, శివనాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. చినకాకాని గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని గ్రామ అధ్యక్షులు మల్లవరపు కాంతారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నూతక్కి జోష్, రామకృష్ణారెడ్డి, రామనాగు, చిన్న, గోపి, నరేంద్ర, గోపాలకృష్ణ, ప్రేమకుమార్, వెంకటేశ్వరరావు, నాగరాజు, రమేష్, ప్రసాద్, వెంకయ్య, కాటంరాజు, రామమోహనరావు, చిన్నోడు, సాంబశివరావు, నాగేశ్వరరావు, శ్యామ్ సుబ్బారావు, షిర్డిసాయి తదితరులు పాల్గొన్నారు. కాజా గ్రామంలో గ్రామ అధ్యక్షులు శంకరరెడ్డి సూచనల మేరకు మంగళగిరి మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు గర్నేపూడి సుభాకర్ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రశాంత్, నీలా కిషోర్‌రాజు, రాంకీ, జగ్గయ్య, మోషే, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

■ **బాబు సర్కారులో పేదల ఎదుగుదలకు అడ్డంకులు**

తాడికొండ: ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు వైద్యులుగా ఎదుగడం ఇష్టం లేక చంద్రబాబు సర్కారు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ పేరుతో ఇష్టానురీతిగా ముందుకెళుతుందని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. శుక్రవారం తాడికొండలోని కంతేరు రోడ్డు పెద్ద మసీదు వద్ద ఏర్పాటు చేసిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. చంద్రబాబు సర్కారు అధికారంలోకి వచ్చిందే మొదలు పేదల సంక్షేమం, అభివృద్ధికి అడ్డంకులు ఏర్పడ్డాయని మండిపడ్డారు. జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు జనాబ్ పఠాన్ సైదా ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తాడికొండ మండల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్ ఖాన్, ఫిరంగిపురం మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, తాడికొండ మండల బీజీ, మైనార్టీ సెల్ అధ్యక్షులు దమ్మాటి మోహనరావు, షేక్ అజీస్, వివిధ విభాగాల నాయకులు దానం వినోద్, చుండు వెంకటరెడ్డి, షేక్ సాదిక్, గోల్డ్ బాబు, షేక్ సుభానీ, రహంతుల్లా, ఖలీమ్, ఖలీల్ పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

మేడికొండూరు: బాలల స్నేహ సమాజాన్ని నిర్మించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల అభివృద్ధి అధికారి కె.డేవిడ్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ (క్రాఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల హక్కుల వారోత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ వై.రాజ్యలక్ష్మి, 'క్రాఫ్' జిల్లా కో–ఆర్డినేటర్ జి.వెంకట్, డిప్యూటీ ఎంపీడీవో పి.పూర్ణ శంకర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని భవిత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు షేక్.మహబూబ్‌సుభానీ, రవికాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఒక ఆదర్శప్రాయమైన వ్యక్తిని ఎన్నుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని అడిషనల్ కమిషనర్ శకుంతల పేర్కొన్నారు. ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట భారత్ కేర్స్ లైఫ్ ఫౌండేషన్, ఎంటీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాలల దినోత్సవ వారోత్సవాలను నిర్వహించారు.

ర్యాలీలో పాల్గొన్న శకుంతల

దుగ్గిరాల: చాచాకి పిల్లలు అంటే చాలా మక్కువని హెచ్ఎం ఎం.శోభాదేవి అన్నారు. శుక్రవారం దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం నిర్వహించారు.

మహిళా భాగస్వామ్యంతోనే సమ్మిళిత వృద్ధి

తాడికొండ: మహిళా భాగస్వామ్యంతోనే సమ్మిళిత వృద్ధి జరుగుతుందని వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి అన్నారు. పని ప్రదేశాలలో 'పోష్' చట్టం (లైంగిక వేధింపుల నిరోధక చట్టం) మహిళలపై లైంగిక వేధింపులు.. నియమాలపై అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) ఉద్యోగులు, సిబ్బందికి శుక్రవారం ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో పని చేసే మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం –2013 లక్ష్యం అన్నారు. అంతర్గత ఫిర్యాదుల కమిటీని సమర్థంగా నిర్వహిస్తున్నామని ఏడీసీ జనరల్ మేనేజర్ కె.శ్రీహరి తెలిపారు. ఏడీసీ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఎల్.ఎస్.వి.భవనారాయణ, ఐసీసీ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్ వాణి ఫణిశ్రీ, ఐసీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కీర్తి

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

తాడికొండ: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని తుళ్లూరు గ్రంథాలయాధికారిణి పి.భాగ్యలత అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని తుళ్లూరు శాఖా గ్రంథాలయంలో శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. తాడికొండ శాఖా గ్రంథాలయంలో సర్పంచ్ తోకల సరోజిని హాజరై నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మేడికొండూరు: మేడికొండూరు మండలంలోని శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారి సుధారాణి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ పోలా నాగమణి పాల్గొన్నారు.

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు షేక్.మహబూబ్‌సుభానీ, రవికిరణ్‌లు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఐవీ వెంకటదుర్గారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గ్రంథాలయాధికారి భాగ్యలత

మంగళగిరి టౌన్: నేటి బాలలే దేశాన్ని ప్రగతి పథంలో నడిపే రేపటి పౌరులని సీకే జూనియర్ కళాశాల లెక్చరర్ డాక్టర్ ఎన్.ఆనందరావు అన్నారు. రాజీవ్ సెంటర్‌లో గుర్రం జాషువా భవనంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించి ఆయన మాట్లాడారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ఉపాధ్యాయులు గన్ని శ్రీనివాస విశ్వనాథ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుబ్బారావు

తాడేపల్లి రూరల్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో శుక్రవారం ప్రారంభించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ.. గ్రంథాలయాలు సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందించే విద్యాకేంద్రాలని అన్నారు. సీనియర్ డైరెక్టర్, కమాండర్ గురుమూర్తి గంగాధరన్, కేఎల్‌యూ కేంద్ర గ్రంథాలయ ఇన్‌చార్జి డాక్టర్ బి.ధనలక్ష్మి, ప్రొఫెసర్ ఇన్‌చార్జి డాక్టర్ బి.కిరణ్, వర్సిటీ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

మంగళగిరి టౌన్: నవులూరులోని ఓ వ్యభిచార గృహంపై మంగళగిరి రూరల్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించారు. ముగ్గురు మహిళలను ఇద్దరు విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. మహిళలను హోమ్‌కి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ కొలనుకొండ, జయభేరి కన్‌స్ట్రక్షన్ దగ్గర, KIA షోరూం పక్కన, 918 చ.గ. తూర్పు (హైవే) ఫేస్ త్రికోణకారంలో ఉన్న స్థలము అమ్మకము. సంప్ర।। ✆ 99662 28370

TOLET

■ షట్టర్స్‌షాపు గుంటూరు నగరంలో మంచి సెంటర్ బిజినెస్ అవకాశం కలదు. అద్దెకు కలదు, అడ్వాన్స్‌గా 2 నెలలు అద్దె నో డిపాజిట్. 97036 53423

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

TOURS & TRAVELS

■ ఇండియన్ రైల్వేస్ –శబరిమల మరియు అరుణాచలానికి ప్రత్యేక రైలు. 10.12.25 న ప్రారంభం. రూ. 8,500 – 2SL, 3AC, 2AC, 1AC కలవు. వివరాలకు 93550 21516 www.tourtimes.in

WANTED

■ పెదకాకానిలో వికలాంగుల ఆశ్రమంలో పనిచేయుటకు 10th ఇంటర్ చదివిన యువతి యువకులు & వంటవారు కావలెను. 95500 29851

■ Wanted MBA Marketing / Business Development / supply chain management to work a reputed company at Guntur. mini 2 years experience. Contact: 91333 99257

■ ఎలక్ట్రికల్ ఆటోలు & ట్రాక్టర్లకు గుంటూరు జిల్లాలో బ్రాంచిల కొరకు 1.సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ Q:ఏదైనాడిగ్రీ (ఫ్రెషర్స్ / అనుభవం ఉన్న వారు) 2. సర్వీస్ టెక్నీషియన్స్ ITI/ ఎలక్ట్రికల్ బ్యాక్‌గ్రౌండ్ (ఫ్రెషర్స్/ అనుభవం ఉన్న వారు) కావలెను. సం. 80089 31038, 91338 65966, hr.shreelakshmi infraequipments@gmail.com

■ Wanted Accounts Executive to work a reputed company at Guntur. Mini. 2 to 3 year experience in tally. Cont: 91333 99257

■ ప్రముఖ హాస్పిటల్‌లో పని చేయుటకు MBBS డాక్టర్స్ M/F కావలెను. వర్క్ టైం: 10.00AM - 12PM, 2PM-6PM. 8381443438

■ గుంటూరు పరిసర ప్రాంతాలలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలలో మా సంస్థ తరుపున పని చేయుటకు అనుభవము కలిగిన సెక్యూరిటీ సూపర్ వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు:30-45సం,ఇంటర్/ డిగ్రీ, ఎత్తు: 05'06" పైన. రిటైర్డ్ ఆర్మీ, పారా మిలిటరీ వారికి ప్రాధాన్యత. గార్డ్ అర్హతలు: వయస్సు:23-45 సం, 10th,ఎత్తు: 05-05"పైన లేబర్ యాక్ట్ ప్రకారం జీతం ఉదయం 11 గం.నుండి మీఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో సం: సత్యా ఇన్వెస్టిగేషన్స్&సెక్యూరిటీ సర్వీసెస్,బృందావన్ గార్డెన్స్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రక్కన, గుంటూరు. 7095125556, 0863-2951838

■ రుమాలి రోటీ పుల్కా చేయుటకు మాస్టర్స్ మరియు ఇండియన్ అసిస్టెంట్స్ మా రెస్టారెంటు నందు కావలెను. గుంటూరు సంప్రదించండి. 8712277968

■ తెనాలి దగ్గర దుగ్గిరాలలో ప్రముఖ కాఫీ పరిశ్రమకు సాధారణ ఎంప్లాయిస్, ప్యాకింగ్ బాయ్స్ & సెక్యూరిటీ గార్డ్స్ కావలెను రూమ్ & కాంటీన్ సౌకర్యం ✆ 7093924466, 8096161777

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు 7075167663 7075167541

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	84	84,563
నిఫ్టీ ▲	31	25,910

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	23,030	▲	162
డోజోన్స్	47,314	▽	142
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,695	▽	113
డాక్స్	23,880	▽	163
పాంగ్సె	3,990	▽	39
నికాయ్	50,377	▽	905

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.30	89.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.39	118.35
€	యూరో	ఎస్‌బీఐ	102.03	104.81
¥	జపాన్ యెన్ (100)	థామస్‌కుక్	46.00	59.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	55.41	59.25
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.88	69.57
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.78	24.28
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.27	24.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.62	13.45

నిధుల వేటలో క్విక్ కామర్స్..

క్విక్ కామర్స్ విభాగంలో పోటీ తీవ్రతరమవుతున్న నేపథ్యంలో కార్యకలాపాల విస్తరణ కోసం కంపెనీలు నిధుల వేటలో పడ్డాయి. క్విప్ (క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్) ద్వారా రూ. 10,000 కోట్లు సమీకరించుకునే ప్రతిపాదనకు స్విగ్గీ బోర్డు ఆమోదముద్ర వేసింది. ఈ నిధుల సమీకరణతో పాటు ర్యాపిడోలో వాటాల విక్రయం రూపంలో మరో రూ. 2,400 కోట్లు కూడా లభిస్తే స్విగ్గీ దగ్గర నిధుల నిల్వలు సుమారు రూ. 17,000 కోట్లకు చేరతాయనే అంచనాలు ఉన్నాయి. మరోవైపు, జెప్టో కూడా జోరుగా నిధులను సమీకరించుకుంటోంది. గత రెండేళ్లలో దాదాపు 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ. 17,000 కోట్లు) సేకరించింది. ప్రపంచంలోనే అత్యంత భారీ పెన్షన్ ఫండ్స్‌లో ఒకటైన కాలిఫోర్నియా పబ్లిక్ ఎంప్లాయీస్ రిటైర్మెంట్ సిస్టం ఏకంగా 450 మిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేసింది. దేశీ క్విక్ కామర్స్ మోడల్ సామర్థ్యాలపై సంస్థాగత ఇన్వెస్టర్లకు ఉన్న నమ్మకానికి ఇది నిదర్శనమని పరిశ్రమ వర్గాలు పేర్కొన్నాయి. అటు మరో సంస్థ జొమాటో 2024లో క్విప్ రూపంలో రూ. 8,500 కోట్లు సమీకరించింది. బ్లింకిట్ కార్యకలాపాలను విస్తరించేందుకు ఈ నిధులు ఉపయోగపడ్డాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్



రిలయన్స్, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, టాటాకి చెందిన బిగ్‌బాస్కెట్ లాంటి సమృద్ధిగా నిధులున్న దిగ్గజాలు రంగంలోకి దూకుడుగా దిగుతున్న నేపథ్యంలో ఈ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ నిధుల సమీకరణ అనేది రాబోయే రోజుల్లో పోటీ మరింత తీవ్రమైతే దీటుగా ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని భావిస్తున్న కంపెనీల వ్యూహాలకు సంకేతాలని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

స్విగ్గీ రూ. 10 వేల కోట్ల క్విప్
- రెండేళ్లలో జెప్టో 2 బిలియన్ డాలర్ల సమీకరణ
- గతేడాది జొమాటో రూ. 8,500 కోట్ల క్విప్
- దిగ్గజాలతో పోటీపడేందుకు సన్నాహాలు

బడా కంపెనీలు బరిలోకి దిగడంతో బిలియన్ల కొద్దీ డాలర్లు వెచ్చించి మరీ దక్కించుకున్న ప్రస్తుత మార్కెట్ వాటాను నిలబెట్టుకోవడం అంకుర సంస్థలకు కష్టమవుతుందని వివరించాయి. దీంతో రాబోయే రెండేళ్లలో కొత్త మార్కెట్లు, కొత్త మౌలిక సదుపాయాలు, కొత్త ఉత్పత్తులపై మరింతగా దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నాయి.

దిగ్గజాల వ్యూహాలు..

క్విక్ కామర్స్ విభాగంలోకి బడా కంపెనీలు కాస్త లేటుగా ప్రవేశించినా, లేటెస్ట్ వ్యూహాలతో దూకుడు ప్రదర్శిస్తున్నాయి. ఫ్లిప్‌కార్ట్ 2024 ఆగస్టులో మినిట్స్ పేరిట డార్క్ స్టోర్స్‌ను ప్రారంభించింది. ఏడాది కూడా తిరగకుండానే 2025 ఏప్రిల్ నాటికి వీటి సంఖ్యను మూడు రెట్లు పెంచింది. ఈ ఏడాది ఆఖరు నాటికి వీటిని 800కి పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇక అమెజాన్ నెమ్మదిగా బెంగళూరులో కార్యకలాపాలు ప్రారంభించి ఢిల్లీ, ముంబైకి విస్తరించింది. ఈ ఏడాది ఆఖరు నాటికి 300 డార్క్ స్టోర్స్ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉంది. అటు జియోమార్ట్ సొంత గ్రూప్‌నకు చెందిన 3,000 పైచిలుకు రిలయన్స్ రిటైల్ స్టోర్స్‌తోనే క్విక్ కామర్స్ ప్రయాణాన్ని ప్రారంభించింది. ఇప్పటికే 600 పైచిలుకు డార్క్‌స్టోర్స్ ఏర్పాటు చేసింది. అరగంటలో డెలివరీలు అందించేందుకు సొంత నెట్‌వర్క్‌ని ఉపయోగించుకోవడంతో పాటు స్థానిక కిరాణా దుకాణాలతో కూడా చేతులు కలిపింది.

లాభదాయకత అంతంతే..

క్విక్ కామర్స్ అంకురాలు భారీగా నిధులు సమీకరిస్తున్నప్పటికీ అవన్నీ కార్యకలాపాల విస్తరణకు, కస్టమర్లను దక్కించుకోవడానికి ఖర్చయిపోతున్నాయే తప్ప లాభదాయకతనేదేమీ పెద్దగా కనిపించడం లేదని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. రాబోయే రోజుల్లోనూ మార్కెట్ వాటాను దక్కించుకోవడానికి మరింతగా ఖర్చు చేయాల్సి రానుంది కాబట్టి ఇదే ధోరణి మరికొన్నాళ్లు కొనసాగే అవకాశం ఉందని వివరించాయి. 2026 తొలి రెండు త్రైమాసికాల్లో వ్యయాలు కాస్త తగ్గుముఖం పట్టొచ్చని పేర్కొన్నాయి. ఇన్వెస్టర్ల ఆకాంక్షల మేరకు ఆ తర్వాత లాభదాయకతపై తప్పనిసరిగా దృష్టి పెట్టాల్సి వస్తుందని వివరించాయి. స్విగ్గీలాంటి సంస్థలు లిస్టయి ఏడాది దాటినా స్టాక్‌లో పెద్దగా మార్పు లేకపోవడంపై ఇన్వెస్టర్లు అసంతృప్తిగా ఉన్నారని తెలిపాయి. లాభదాయకంగా మారే అవకాశాలు ఉన్నప్పటికీ తాజాగా మళ్లీ ఎందుకు నిధులను సమీకరించాల్సి వస్తోందనేది లిస్టెడ్ కంపెనీలుగా చెప్పాల్సిన బాధ్యత వాటిపై ఉంటుందని విశ్లేషకులు తెలిపారు. క్విక్ కామర్స్ తొలినాళ్లతో పోలిస్తే అర్థరహితంగా చేసే వ్యయాలను ఇన్వెస్టర్లు సహించే పరిస్థితుల్లో లేరని పేర్కొన్నారు.

27 నెలల కనిష్టానికి టోకు ద్రవ్యోల్బణం

- అక్టోబర్‌లో మైనస్ 1.21 శాతం
- అనుకూలించిన జీఎస్‌టీ రేట్ల తగ్గింపు

న్యూఢిల్లీ: టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం అక్టోబర్ నెలలో ప్రతికూల స్థితికి చేరింది. మైనస్ 1.21 శాతానికి పరిమితమైంది. ఇది 27 నెలల కనిష్ఠ స్థాయి. కూరగాయలు సహా ఆహార ధరలు చెప్పుకోతగ్గ స్థాయిలో తగ్గడం, ఇంధనం, తయారీ వస్తువుల ధరలు సైతం దిగిరావడం ఇందుకు అనుకూలించింది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు సైతం ఫలితమిచ్చింది. టోకు ధరల ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) సెప్టెంబర్ నెలలో 0.13 శాతం కాగా, క్రితం ఏడాది అక్టోబర్‌లో 2.75 శాతంగా ఉండడం గమనార్హం. ఆహార వస్తువుల ధరలు, ముడి చమురు, సహజ వాయివు, విద్యుత్, మినరల్ ఆయిల్, బేసిక్ మెటల్స్ ధరలు తగ్గడం వల్ల టోకు ద్రవ్యోల్బణం మైనస్ జోన్‌లోకి ప్రవేశించినట్టు ప్రభుత్వ డేటా తెలిపింది.

→ ఆహార వస్తు విభాగంలో టోకు ద్రవ్యోల్బణం మైనస్ 8.31% నమోదైంది. సెప్టెంబర్‌లోనూ ఇది మైనస్ 5.22%.

→ ఆలుగడ్డలకు సంబంధించి మైనస్ 39.88%, ఉల్లిగడ్డలకు సంబంధించి మైనస్ 65.43% చొప్పున ద్రవ్యోల్బణం నమోదైంది.

→ కూరగాయల విభాగంలో మైనస్ 34.97 శాతంగా నమోదైంది. సెప్టెంబర్‌లో ఇది మైనస్ 24.41 శాతం కావడం గమనించొచ్చు.

→ తయారీ వస్తువులకు సంబంధించి ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో ఉన్న 2.33 శాతం నుంచి అక్టోబర్‌లో 1.54 శాతానికి తగ్గుముఖం పట్టింది.

చివర్లో కొనుగోళ్లతో మార్కెట్ రికవరీ

ట్రేడింగ్‌లో తీవ్ర ఒడిదుడుకులు

ముంబై: ఆరంభ నష్టాలు భర్తీ చేసుకున్న స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. సెన్సెక్స్ 84 పాయింట్ల లాభంతో 84,563 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 31 పాయింట్లు పెరిగి 25,910 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే నష్టాలతో మొదలయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 450 పాయింట్లు కోల్పోయి 84,029 వద్ద, నిఫ్టీ 138 పాయింట్లు క్షీణించి 25,741 వద్ద కనిష్టాలు తాకాయి. ఆఖర్లో అధిక వెయిటేజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు స్వల్ప లాభాలతో ట్రేడింగ్‌ను ముగించాయి. అమెరికా మార్కెట్లో టెక్ షేర్లలో అమ్మకాలు, డిసెంబర్‌లో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చన్న ఫెడ్ రిజర్వ్ అధికారుల సంకేతాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

➤ సెప్టెంబర్ త్రైమాసికంలో నికర లాభం 27% క్షీణతతో ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ షేరు 3.31% నష్టపోయి రూ.1,619 వద్ద ముగిసింది.

➤ ఫిన్‌టెక్ సంస్థ పైన్‌ల్యాబ్స్ లిస్టింగ్ మెప్పించింది. ఇష్యూ ధర(రూ.221)తో పోలిస్తే బీఎస్‌ఈలో 9.50% ప్రీమియంతో రూ.242 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 28.37% ఎగసి రూ.284 వద్ద గరిష్టాన్ని తాకింది. చివరికి 14% లాభంతో రూ.251 వద్ద ముగిసింది. మార్కెట్ విలువ రూ.28,856 కోట్లుగా నమోదైంది.

➤ డాలర్ మారకంలో రూపాయి 4 పైసలు పెరిగి 88.66 వద్ద స్థిరపడింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
జీసీసీల్లో కొత్తగా 40 లక్షల కొలువులు | వాహన టోకు విక్రయాలు అదుర్స్

టాటా మోటార్స్ పీవీకి భారీ లాభాలు

- క్యూ2లో రూ. 76,248 కోట్లు
- వాణిజ్య వాహన విభాగం విడదీత ఎఫెక్ట్
- ఆదాయం రూ. 72,349 కోట్లకు డౌన్

న్యూఢిల్లీ: ప్రయాణికుల వాహన(పీవీ) రంగ దిగ్గజం టాటా మోటార్స్ పీవీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం భారీగా దూసుకెళ్లి రూ. 76,248 కోట్లను తాకింది. వాణిజ్య వాహన విభాగాన్ని విడదీయడంసహా.. సంబంధిత పెట్టుబడులపై పుస్తకాలలో(నోషనల్) నమోదు చేసిన రూ. 82,600 కోట్ల లాభం ఇందుకు సహకరించింది. దీంతోపాటు టాటా క్యాపిటల్‌తో టాటా మోటార్స్ ఫైనాన్స్ విలీన లాభాలు సైతం జత కలిసినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,521 కోట్ల లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 83,656 కోట్ల నుంచి రూ. 72,349 కోట్లకు క్షీణించింది. సైబర్ దాడుల నేపథ్యంలో బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్‌రోవర్(జేఎల్‌ఆర్) తయారీ సెప్టెంబర్‌లో నిలిచిపోవడం ప్రభావం చూపినట్లు కంపెనీ వెల్లడించింది. అయితే దేశీయంగా జీఎస్‌టీ రేట్ల సవరణలలోనూ నిలకడైన పనితీరు చూపినట్లు తెలియజేసింది. రేట్ల సవరణ తదుపరి అమ్మకాలు ఊపందుకున్నట్లు పేర్కొంది.

జేఎల్‌ఆర్ డీలా

ప్రస్తుత సమీక్షా కాలంలో జేఎల్‌ఆర్ ఆదాయం 24 శాతంపైగా నీరసించి 4.9 బిలియన్ పౌండ్లకు పరిమితమైంది. సైబర్ దాడులు, కొన్ని జాగ్వార్ మోడళ్ల షట్‌డౌన్ వల్ల నిర్వహణ లాభ (ఇబిట్) మార్జిన్లు మైనస్ 8.6%గా నమోదయ్యాయి. క్యూ2లో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పటికీ ఇకపై మరింత పటిష్ట పనితీరు చూపనున్నట్లు టాటా మోటార్స్ గ్రూప్ సీఎఫ్‌వో పీబీ బాలాజీ పేర్కొన్నారు. జేఎల్‌ఆర్‌పై సైబర్ దాడి నేపథ్యంలో కస్టమర్ల డేటా లీకయ్యే అవకాశమున్నట్లు నియంత్రణా సంస్థలకు వెల్లడించామని తెలియజేశారు. దేశీయంగా ఈవీలతో కలిపి టాటా ప్యాసింజర్ వాహన విక్రయాలు 11% ఎగసి 1,44,500 యూనిట్లను తాకాయి. ఆదాయం 16 శాతం జంప్‌చేసి రూ. 13,500 కోట్లకు చేరినట్లు కంపెనీ ఎండీ, సీఈవో శైలేష్ చంద్ర తెలియజేశారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్‌ఈలో 1.6 శాతం క్షీణించి రూ. 392 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్

సెమీఫైనల్లో లక్ష్య సేన్

కుమామోటో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత నంబర్ వన్ లక్ష్య సేన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ లక్ష్య సేన్ 21–13, 21–17తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్, 2021 ప్రపంచ చాంపియన్‌లో కీన్ యె (సింగపూర్)పై గెలుపొందాడు. నేడు జరిగే సెమీఫైనల్లో ప్రపంచ 13వ ర్యాంకర్ కెంటా నిషిమోటో (జపాన్)తో లక్ష్య సేన్ తలపడతాడు.

స్లొవేనియా శుభారంభం

బెంగళూరు: బిల్లీ జీన్ కింగ్ కప్ ప్లే ఆఫ్ టోర్నీలో భాగంగా... నెదర్లాండ్స్ జట్టుతో శుక్రవారం జరిగిన గ్రూప్ 'జి' తొలి మ్యాచ్‌లో స్లొవేనియా 2–0తో గెలిచింది. నేడు జరిగే మ్యాచ్‌లో భారత జట్టుతో స్లొవేనియా ఆడుతుంది. ఈ మ్యాచ్‌లో స్లొవేనియా గెలిస్తే వచ్చే ఏడాది జరిగే క్వాలిఫయర్స్ బెర్త్‌ను దక్కించుకుంటుంది.

హడలెత్తించిన బుమ్రా

5 వికెట్లతో మెరిసిన భారత పేసర్

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 159 ఆలౌట్
రాణించిన సిరాజ్, కుల్దీప్ • తొలి రోజు టీమిండియాదే ఆధిపత్యం

కోల్‌కతా: పిచ్ ఎలా ఉన్నా... చక్కటి లైన్ అండ్ లెంగ్త్‌తో బంతులు వేస్తే... వికెట్లు రావడం కష్టమేమీ కాదని భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా మరోసారి నిరూపించాడు. పిచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుందని అంచనా వేసిన భారత కెప్టెన్ శుబ్‌మన్ గిల్ ఏకంగా నలుగురు స్పిన్నర్లను తుది జట్టులోకి తీసుకున్నాడు. అయితే బుమ్రా నిప్పులు చెరిగే బంతులతో దక్షిణాఫ్రికా బ్యాటర్లను హడలెత్తించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత స్పిన్నర్లకు పెద్దగా పని లేకుండా చేశాడు. బుమ్రా పేస్‌కు తోడు మరో పేసర్ సిరాజ్ కూడా మెరిపించడం... ఎడంచేతి వాటం స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ తమ వంతుగా రాణించడం... వెరసి భారత జట్టుతో శుక్రవారం మొదలైన తొలి టెస్టులో తొలి రోజే దక్షిణాఫ్రికాకు కష్టాలు మొదలయ్యాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌటైంది. ఓపెనర్లు మార్క్‌రమ్ (48 బంతుల్లో 31; 5 ఫోర్లు, 1 సిక్స్), రికెల్టన్ (22 బంతుల్లో 23; 4 ఫోర్లు) తొలి వికెట్‌కు 57 పరుగులు జోడించడంతో దక్షిణాఫ్రికాకు శుభారంభం లభించినట్టే అనిపించింది. అయితే ఒక్కసారి బుమ్రా దెబ్బకు అంతా తారుమారైంది. ఐదు పరుగుల వ్యవధిలో మార్క్‌రమ్, రికెల్టన్‌లను బుమ్రా పెవిలియన్‌కు పంపించగా... కెప్టెన్ బవుమా (3)ను కుల్దీప్ అవుట్ చేశాడు. దాంతో 57/0తో పటిష్టంగా కనిపించిన దక్షిణాఫ్రికా 71/3తో కష్టాల్లో పడింది. ఆ తర్వాత ముల్డర్ (51 బంతుల్లో 24; 3 ఫోర్లు), టోనీ జోర్జి (55 బంతుల్లో 24; 1 ఫోర్, 1 సిక్స్) నింపాదిగా ఆడి వికెట్ల పతనాన్ని నిలువరించారు. నాలుగో వికెట్‌కు వీరిద్దరు 43 పరుగులు జోడించారు. దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ గాడిలో పడిందనుకున్న తరుణంలో కుల్దీప్, బుమ్రా మళ్లీ మెరిశారు. ముల్డర్‌ను కుల్దీప్... జోర్జిని బుమ్రా అవుట్ చేశారు. దాంతో దక్షిణాఫ్రికా 120 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ట్రిస్టన్ స్టబ్స్ (74 బంతుల్లో 15 నాటౌట్; 1 ఫోర్), వెరీన్ (36 బంతుల్లో 16; 2 ఫోర్లు) నిలదొక్కుకోవడానికి ప్రయత్నించినా... వెరీన్‌ను సిరాజ్ అవుట్ చేయడంతో దక్షిణాఫ్రికాకు దెబ్బ పడింది. చివరి ఐదు వికెట్లను దక్షిణాఫ్రికా 13 పరుగుల వ్యవధిలో కోల్పోయి చివరకు 159 పరుగులకే పరిమితమైంది. దక్షిణాఫ్రికా జట్టును తక్కువ స్కోరుకే పరిమితం చేసిన భారత్ కూడా బ్యాటింగ్‌కు ఇబ్బంది పడింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 20 ఓవర్లు ఆడి ఒక వికెట్ కోల్పోయి 37 పరుగులు సాధించింది.

స్కోరు వివరాలు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్: మార్క్‌రమ్ (సి) పంత్ (బి) బుమ్రా 31; రికెల్టన్ (బి) బుమ్రా 23; ముల్డర్ (ఎల్బీడబ్ల్యూ) (బి) కుల్దీప్ 24; బవుమా (సి) జురేల్ (బి) కుల్దీప్ 3; టోనీ జోర్జి (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 24; స్టబ్స్ (నాటౌట్) 15; వెరీన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) సిరాజ్ 16; మార్కో యాన్సెన్ (బి) సిరాజ్ 0; కార్బిన్ బాష్ (ఎల్బీడబ్ల్యూ) (బి) అక్షర్ పటేల్ 3; హార్మెర్ (బి) బుమ్రా 5; కేశవ్ మహరాజ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బుమ్రా 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (55 ఓవర్లలో ఆలౌట్)** 159; **వికెట్ల పతనం:** 1–57, 2–62, 3–71, 4–114, 5–120, 6–146, 7–147, 8–154, 9–159, 10–159. **బౌలింగ్:** బుమ్రా 14–5–27–5, సిరాజ్ 12–0–47–2, అక్షర్ పటేల్ 6–2–21–1, కుల్దీప్ యాదవ్ 14–1–36–2, రవీంద్ర జడేజా 8–2–13–0, వాషింగ్టన్ సుందర్ 1–0–3–0.

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (బి) మార్కో యాన్సెన్ 12; కేఎల్ రాహుల్ (బ్యాటింగ్) 13; వాషింగ్టన్ సుందర్ (బ్యాటింగ్) 6; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి) 37.** **వికెట్ల పతనం:** 1–18, **బౌలింగ్:** మార్కో యాన్సెన్ 6–2–11–1, ముల్డర్ 5–1–15–0, కేశవ్ మహరాజ్ 5–1–8–0, కార్బిన్ బాష్ 3–2–1–0, హార్మెర్ 1–1–0–0.

2012 భారత జట్టు చివరిసారి 2012లో ఒకే టెస్టులో నలుగురు స్పిన్నర్లను ఆడించింది. నాగ్‌పూర్ వేదికగా 2012 డిసెంబర్ 13 నుంచి 17 వరకు ఇంగ్లండ్‌తో 'డ్రా'గా ముగిసిన మ్యాచ్‌లో భారత్ తరఫున నలుగురు స్పిన్నర్లు అశ్విన్, రవీంద్ర జడేజా, పీయూష్ చావ్లా, ప్రజ్ఞాన్ ఓజా బరిలోకి దిగారు. ఇదే మ్యాచ్‌తో జడేజా టెస్టుల్లో అరంగేట్రం చేయగా... ప్రస్తుతం టీమిండియా హెడ్ కోచ్‌గా ఉన్న గౌతమ్ గంభీర్ ఆ మ్యాచ్‌లో రెండు ఓవర్లు వేయడం విశేషం.

బుమ్రా (5/27)

42 బంతుల్లో 144

- 'శత'క్కొట్టిన వైభవ్ సూర్యవంశీ
- 11 ఫోర్లు, 15 సిక్సలతో వీరవిహారం
- రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్ 'ఎ' ఘనవిజయం

వైభవ్ సూర్యవంశీ

దోహా: భారత క్రికెట్ టీనేజ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి వీరవిహారం చేశాడు. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టి20 క్రికెట్ టోర్నీలో 14 ఏళ్ల వైభవ్ తన విశ్వరూపం ప్రదర్శించాడు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) 'ఎ' జట్టుతో శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో వైభవ్ 42 బంతుల్లో 11 ఫోర్లు, 15 సిక్సలతో 144 పరుగులు సాధించాడు. వైభవ్ కేవలం 32 బంతుల్లోనే సెంచరీ మైలురాయిని దాటాడు. టి20ల్లో ఫాస్టెస్ట్ సెంచరీలు చేసిన భారత బ్యాటర్లుగా అభిషేక్ శర్మ, ఉర్విల్ పటేల్ (28 బంతుల్లో) పేరిట ఉన్న రికార్డును సూర్యవంశీ బద్దలు కొట్టలేకపోయాడు. మరోవైపు కెప్టెన్ జితేశ్ వర్మ కూడా చెలరేగిపోయాడు. జితేశ్ 32 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సలతో 83 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఫలితంగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత 'ఎ' నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 297 పరుగులు చేసింది. 298 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 'ఎ' జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 149 పరుగులు చేసి ఓడిపోయింది. సొహైబ్ ఖాన్ (41 బంతుల్లో 63; 3 ఫోర్లు, 6 సిక్సలు) ఆకట్టుకున్నాడు. భారత 'ఎ' బౌలర్లలో గుర్‌జప్‌నీత్ సింగ్ 3 వికెట్లు, హర్ష్ దూబే 2 వికెట్లు తీశారు. ఆదివారం జరిగే తదుపరి మ్యాచ్‌లో పాకిస్తాన్ 'ఎ'తో భారత్ 'ఎ' తలపడుతుంది.

ఇషా సింగ్‌కు కాంస్యం

కైరో: ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో 12వ పతకం చేరింది. శుక్రవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ షూటర్ ఇషా సింగ్ కాంస్య పతకాన్ని సాధించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఇషా సింగ్ 30 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకుంది. ఫైనల్లో పోటీపడ్డ భారత్‌కే చెందిన స్టార్ షూటర్ మనూ భాకర్ 23 పాయింట్లతో ఐదో స్థానంతో సరిపెట్టుకుంది. అంతకుముందు 85 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో ఇషా సింగ్ 587 పాయింట్లతో ఐదో స్థానంలో, మనూ భాకర్ 586 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు. ఏడో రోజు పోటీలు ముగిశాక భారత్ 3 స్వర్ణాలు, 5 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 12 పతకాలతో మూడో స్థానంలో ఉంది.

చరిత్ర సృష్టించిన ధీరజ్, అంకిత

- ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో పసిడి పతకాలు
- రికర్వ్ వ్యక్తిగత విభాగంలో తొలిసారి భారత ఆర్చర్లకు స్వర్ణాలు

ఢాకా: సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ భారత స్టార్స్ బొమ్మదేవర ధీరజ్, అంకిత ఆసియా ఆర్చరీ చాంపియన్స్‌గా అవతరించారు. శుక్రవారం ముగిసిన ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ధీరజ్ పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో... బెంగాల్‌కు చెందిన అంకిత మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకాలను సొంతం చేసుకున్నారు. 46 ఏళ్ల ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్ చరిత్రలో రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత ఆర్చర్లకు స్వర్ణ పతకాలు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. పురుషుల ఫైనల్లో ధీరజ్ 6–2 (28–28, 29–26, 28–28, 28–26) సెట్ పాయింట్ల తేడాతో భారత్‌కే చెందిన రాహుల్‌పై గెలిచాడు. ఫైనల్లో ఓడిన రాహుల్‌కు రజతం లభించింది. మహిళల ఫైనల్లో అంకిత 7–3 (29–27, 26–26, 26–28, 29–28, 29–28) సెట్ పాయింట్ల తేడాతో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత నామ్ సుహైన్ (దక్షిణ కొరియా)పై నెగ్గింది. భారత్‌కే చెందిన సంగీతకు కాంస్యం దక్కింది. కాంస్య పతక మ్యాచ్‌లో సంగీత 6–5తో భారత్‌కే చెందిన దీపిక కుమారిపై గెలిచింది. మరోవైపు పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో 2007 తర్వాత భారత జట్టు విజేతగా నిలిచింది. యశ్‌దీప్, అతాను దాస్, రాహుల్‌లతో కూడిన భారత బృందం ఫైనల్లో భారత్ 5–4 (56–56, 56–56, 51–57, 57–53, 29–29)తో సియో మింగి, కిమ్ యెచాన్, జాంగ్ జిహోలతో కూడిన దక్షిణ కొరియా జట్టును ఓడించింది. 'షూట్ ఆఫ్'లో భారత్, కొరియా సమంగా నిలిచినా... భారత ఆర్చర్లు కొట్టిన బాణాలు కేంద్ర బిందువుకు అతి సమీపంగా ఉండటంతో స్వర్ణం ఖాయమైంది. ఈ టోర్నీలో భారత్ 6 స్వర్ణాలు, 3 రజతాలు, 1 కాంస్యంతో కలిపి 10 పతకాలతో 'టాప్' ర్యాంక్‌లో నిలిచింది.

హరికృష్ణ, అర్జున్ గేమ్‌లు 'డ్రా'

పనాజీ: సొంతగడ్డపై జరుగుతున్న పురుషుల ప్రపంచకప్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్లు ఇరిగేశి అర్జున్, పెంటేల హరికృష్ణ ప్రిక్వార్టర్ ఫైనల్ తొలి గేమ్‌ను 'డ్రా'గా ముగించారు. లెవోన్ అరోనియన్ (అమెరికా)తో జరిగిన తొలి గేమ్‌ను తెలంగాణ ప్లేయర్ అర్జున్ 41 ఎత్తుల్లో... అల్కంటారా మార్టినెజ్ (రొమేనియా)తో జరిగిన తొలి గేమ్‌ను ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ హరికృష్ణ కూడా 41 ఎత్తుల్లోనే 'డ్రా' చేసుకున్నాడు. నేడు జరిగే రెండో గేమ్‌లో గెలిచిన వారు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఒకవేళ రెండో గేమ్ 'డ్రా' అయితే... విజేతలను నిర్ణయించేందుకు ఆదివారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహిస్తారు.

వాణిజ్య ప్రతినిధులకు చుక్కెదురు!

- రూ.3,500 నుంచి రూ.10,500తో దాదాపు 200 మంది బీ–బీ రిజిస్ట్రేషన్
- ఒక్కొక్కరు తమ వ్యాపారం గురించి 8–10 మందితో చర్చించే అవకాశం ఇస్తామని వెల్లడి
- తీరా సదస్సులో ఆ పరిస్థితే లేకపోవడంతో ఉసూరుమన్న వైనం

విశాఖలో వెలవెలబోతున్న బీ–బీ సెషన్ హాల్

సాక్షి, విశాఖపట్నం: లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు, లక్షల మందికి ఉద్యోగాలంటూ అంకెల గారడీతో రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. భాగస్వామ్య సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన వాణిజ్య ప్రతినిధుల విషయంలోనూ అదే వైఖరి ప్రదర్శించింది. తమ వాణిజ్య, వ్యాపారాల్ని విస్తరించేందుకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో కొంత మంది పారిశ్రామికవేత్తలకు భాగస్వామ్య సదస్సులో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించింది. బిజినెస్ టు బిజినెస్ (బీ–బీ) సెషన్ల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఇందులో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు రూ.3,500 నుంచి రూ.10,500 వరకు ఫీజు వసూలు చేశారు. దాదాపు 200 మంది వరకు బీ–బీలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఒక్కొక్కరు 8 నుంచి 10 మంది బిజినెస్ ప్రతినిధులతో బీ–బీ సెషన్‌లో మాట్లాడుకోవచ్చని ప్రభుత్వం చెప్పింది. తీరా భాగస్వామ్య సదస్సుకు వచ్చిన తర్వాత.. సీన్ మొత్తం రివర్స్ అయిపోయింది. ఇక్కడికొచ్చేసరికి ఒక్కరు కూడా కనిపించకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతినిధులు విస్తుపోయారు. సమస్యలుంటే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చని చెప్పి.. సదస్సు ప్రారంభమయ్యే సమయానికి వెబ్‌సైట్‌నే మూసేశారు. దీంతో కొందరు వాణిజ్య వేత్తలు బీ–బీపై నిర్వాహకులను నిలదీశారు. 'వెబ్‌సైట్ క్లోజ్ అయిపోయింది.. ఏమీ అనుకోవద్దు.. మీకోసం ఏర్పాటు చేసిన సెషన్ హాల్‌లో కూర్చోండి' అంటూ తాపీగా సమాధానం చెప్పి జారుకున్నారు. 200 మంది వరకు రిజిస్ట్రేషన్ చేసుకుంటే.. అక్కడ మాత్రం కేవలం 20 టేబుల్స్.. ఒక్కో టేబుల్ దగ్గర నాలుగు కుర్చీలు మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకున్నారు. అవి కూడా మరుగుదొడ్ల పక్కనే ఏర్పాటు చేయడంతో వచ్చినవారు కూడా ఇబ్బందులు పడ్డారు. జామర్ల కారణంగా ఇంటర్నెట్ కూడా పని చేయకపోవడంతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి కోసం ప్రత్యేకంగా వైఫై క్యూఆర్ కోడ్‌లు ఇచ్చారు. వాటిని స్కాన్ చేస్తే ఎర్రర్ రావడంతో వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాలపై ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించినా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పారిశ్రామికవేత్తలు అసహనం వ్యక్తం చేస్తూ తిరిగి వెళ్లిపోయారు.

సంపద సృష్టితోనే పేదరిక నిర్మూలన

సీఐఐ సదస్సులో పాల్గొన్న సీఎం చంద్రబాబు, గవర్నర్ జస్టిస్ నజీర్ తదితరులు

- భారత్ మైత్రిని కోరుకుంటోంది
- ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- ఏపీలోని పెట్టుబడుల అవకాశాలను వినియోగించుకోండి
- పారిశ్రామికవేత్తలకు గవర్నర్ జస్టిస్ నజీర్ సూచన
- సదస్సులను తాత్కాలిక షెడ్లలో కాకుండా శాశ్వత భవనాల్లో నిర్వహించాలి
- కేంద్ర మంత్రి పీయుష్ గోయెల్

సాక్షి, అమరావతి: సంపద సృష్టితోనే పేదరిక నిర్మూలన సాధ్యం అవుతుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఆ దిశగా కృషి జరుగుతోందని.. ప్రధాని మోదీ నేతృత్వంలో ఆర్థికంగా సుసంపన్నమైన దేశంగా భారత్ ఎదుగుతోందని చెప్పారు. విశాఖలో నిర్వహిస్తున్న సీఐఐ భాగస్వామ్య సదస్సుకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి దేశంతో భారత్ మైత్రినే కోరుకుంటోందని చెప్పారు. అంతా కలిసి ఎదుగుదాం అనే భావన భారతదేశానిదని పేర్కొన్నారు. ఇతరులకు నష్టం కలిగించటం కాదు.. ప్రయోజనం కల్పించటం ద్వారా అభివృద్ధి సాధించాలనేది భారత్ నినాదమని స్పష్టం చేశారు. జీఎస్టీ సంస్కరణలు, మౌలిక సదుపాయాల కల్పన వంటివి దేశాభివృద్ధికి దోహదం చేస్తున్నాయన్నారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనేక అవకాశాలు ఉన్నాయని, వాటిని పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని సూచించారు. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయెల్ మాట్లాడుతూ.. వాణిజ్య ప్రదర్శనలు, ఎగ్జిబిషన్లు, సదస్సులను ఇలా తాత్కాలిక షెడ్లలో కాకుండా శాశ్వత భవనాల్లో నిర్వహించాలని సీఎం చంద్రబాబుకు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ, సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మెమాని, జీఎంఆర్ సంస్థ చైర్మన్ జీఎం రావు, బజాజ్ ఫైనాన్స్ సీఎండీ సంజీవ్ బజాజ్, అపోలో ఆస్పత్రుల ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శోభన కామినేని, భారత్ ఫోర్జ్ లిమిటెడ్ జేఎండీ అమిత్ కళ్యాణి, టీవీఎస్ మోటార్స్ సీఎండీ సుదర్శన్ వేణు, సీఎస్ విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో రాష్ట్రంలో డ్రోన్ ట్యాక్సీలు

సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: వచ్చే రెండేళ్లలో దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో డ్రోన్ ట్యాక్సీలను అందుబాటులోకి తెస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇందుకోసం రాష్ట్రంలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం ఆయన సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. దేశంలోనే తొలిసారిగా క్వాంటమ్ కంప్యూటర్ ఆంధ్రప్రదేశ్‌లో తయారవుతోందని, భవిష్యత్తులో ప్రపంచానికి క్వాంటమ్ కంప్యూటర్లను అందించే రాష్ట్రంగా ఎదుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాల కోసం ప్రత్యేకంగా ఎస్క్రో ఖాతాలు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అవసరమైతే ఈ ప్రోత్సాహకాలకు సావరీన్ గ్యారెంటీ ఇస్తామని అన్నారు. విశాఖలో వాణిజ్యపరమైన ఎగ్జిబిషన్లు, ప్రదర్శనలకు వీలుగా ఐటీపీఓ ద్వారా భారత్ మండపం తరహాలోనే ఆంధ్రా మండపం నిర్మాణానికి స్థలం కేటాయిస్తామన్నారు.

డ్రోన్, స్పేస్ సిటీలకు కేంద్రం సాయం చేయాలి

రాష్ట్రంలో డ్రోన్ సిటీ, స్పేస్ సిటీలకు సీఎం చంద్రబాబు, కేంద్ర వాణిజ్య–పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో శుక్రవారం వర్చువల్ శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ క్వాంటం వ్యాలీని జనవరిలో ప్రారంభిస్తున్నామని, గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఏపీని తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ డిజైన్, తయారీ యూనిట్, సత్యసాయి, తిరుపతి జిల్లాల్లో ట్విన్ స్పేస్ సిటీస్ ఏర్పాటు అవుతున్నాయి. ఈ సందర్భంగా సీఎం, కేంద్ర మంత్రి సమక్షంలో స్పేస్ సిటీకి సంబంధించి బ్లూ స్పేస్, ఎథర్నల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలు ఒప్పందం చేసుకున్నాయి.

ఏఐపై తల్లిదండ్రులకు ఆన్‌లైన్ సిరీస్

సాక్షి, అమరావతి: తల్లిదండ్రుల్లో కృత్రిమ మేధస్సు(ఏఐ)పై అవగాహన కోసం శుక్ర, శనివారాల్లో ఆన్‌లైన్ సిరీస్ అందుబాటులోకి తెచ్చినట్టు జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎన్‌సీఈఆర్టీ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రెండు రోజులపాటు ఎన్‌సీఈఆర్టీ అధికారిక యూట్యూబ్ ఛానల్ ద్వారా ఏఐ ఆన్‌లైన్ సిరీస్‌ను నిర్వహిస్తున్నట్టు పేర్కొంది. కాగా, ఏఐ ద్వారా ఉపాధ్యాయులను కుదించవద్దని ఏపీటీఎఫ్ అమరావతి అధ్యక్షుడు సీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఏఐను ఒక పార్శ్వంగానే చూడాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

ఇన్ సర్వీస్ టీచర్లకు 'టెట్'ను మినహాయించాలి

ఢిల్లీ జంతర్ మంతర్‌లో ఎస్టీయూ–ఏపీ ధర్నా

సాక్షి, న్యూఢిల్లీ: ఇన్ సర్వీస్ టీచర్లకు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)ను మినహాయిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఎస్టీయూ–ఏపీ) డిమాండ్ చేసింది. శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో ఆల్ ఇండియా ఫెడరేషన్ ఫర్ ప్రైమరీ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐఎఫ్‌పీటీవో)ఆధ్వర్యంలో ఎస్టీయూ–ఏపీ అనుబంధ సంఘాలు ధర్నా చేశాయి. ఈ సందర్భంగా ఎస్టీయూ–ఏపీ అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ 2010 కంటే ముందు ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులకు 50 ఏళ్లు నిండినప్పటికీ టెట్ ఉత్తీర్ణులు కావాలనే నిబంధన సరి కాదన్నారు. గతంలో ఏ ప్రభుత్వ ఉద్యోగి ఇలాంటి పరీక్ష రాసిన సందర్భాలు లేవని గుర్తుచేశారు. ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించాలని ఉపాధ్యాయ సంఘాలు రివ్యూ పిటిషన్ వేశాయన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని సాయి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి పేరుతో గోమాంసం కేసు డైవర్షన్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీశ్ కుమార్ రెడ్డి ఫైర్

వేంపల్లె: విశాఖలో టీడీపీ నాయకుడి కోల్డ్ స్టోరేజ్‌లో అరబ్ దేశాలకు తరలించేందుకు సిద్ధం చేసిన 189 టన్నుల గోమాంసాన్ని డీఆర్ఐ అధికారులు పట్టుకోవడంతో ఏం చేయాలో పాలుపోక, కల్తీ నెయ్యి పేరుతో తిరుమల వేదికగా మరోసారి డైవర్షన్ కుట్రలకు చంద్రబాబు ప్రభుత్వం తెరలేపిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీశ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ కడప జిల్లాలోని వేంపల్లెలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు తన క్షుద్ర రాజకీయాల కోసం కోట్లాది మంది హిందువుల మనోభావాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. పెట్టుబడుల సదస్సు పేరుతో వైఎస్ జగన్ హయాంలో తీసుకొచ్చిన కంపెనీలతోనే మళ్లీ ఒప్పందాలు చేసుకుంటూ తండ్రీకొడుకులు చంద్రబాబు, లోకేశ్ క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని విమర్శించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ ప్రజా ఉద్యమం జరిగితే ఎల్లోమీడియాకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పరకామణి కేసులో సీఐడీ అధికారుల వేధింపులకు బలైన టీటీడీ మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ మృతిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

గోవధపై పవన్ కళ్యాణ్ స్పందించాలి

''బాపట్ల టీడీపీ ఎమ్మెల్యే నరేంద్ర వర్మ ప్రధాన అనుచరుడు, టీడీపీ కీలక నేత సుబ్రహ్మణ్య గుప్తాకు చెందిన విశాఖ శివారులోని కోల్డ్ స్టోరేజీలోనే గోమాంసం లభ్యమైతే విచారణకు ఆదేశించడానికీ కూటమి ప్రభుత్వం ముందుకు రావడం లేదు. తిరుమల లడ్డూకు అపచారం జరిగిందంటూ గతంలో కనకదుర్గమ్మ ఆలయ మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ గోమాంసం వ్యవహారంపై ఎందుకు నోరుమెదపడం లేదు? విశాఖను కడగడానికి ఎప్పుడెళ్తారో ఆయన చెప్పాలి'' అని సతీష్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు.

జూబ్లీహిల్స్‌లో ఎందుకు ప్రచారం చేయలేదు?

''బిహార్‌లో ఎన్డీయేను గెలిపించడానికి నారా లోకేశ్ బరిలో దిగినట్టు ఎల్లో మీడియా ఊదరగొడుతోంది. ఇదే లోకేశ్ పుట్టిపెరిగిన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరుగుతుంటే బీజేపీ అభ్యర్థి గెలుపునకు ఎందుకు ప్రచారం చేయలేదు? అదే బీజేపీకి చెందిన జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జూబ్లీహిల్స్‌లో నివాసం ఉంటూ కనీసం ప్రచారానికి ఎందుకు వెళ్లలేదు? వీళ్లు గెలిచే చోటికి వెళ్లి ఫొటోలు దిగడం తప్ప వీళ్లను చూసి ఎక్కడా ఓటేసే దిక్కు లేదు.'' అని సతీష్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

- ఆరు నెలల్లో రిజర్వేషన్లు కల్పించి తీరాలి
- హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ కీలక తీర్పు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు ఆరు నెలల్లో రిజర్వేషన్లు కల్పించి తీరాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. హైకోర్టును ఆశ్రయించిన ట్రాన్స్‌జెండర్‌ను స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ న్యాపతి విజయ్ ఇటీవల తీర్పు వెలువరించారు.

హైకోర్టును ఆశ్రయించిన రేఖ...

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి చెందిన కె.రేఖ అనే మహిళా ట్రాన్స్‌జెండర్ తగిన అర్హతలు ఉండటంతో ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ హిందీ, టీజీటీ హిందీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఏలూరు జిల్లా స్థాయిలో ఆమె 671 ర్యాంకు సాధించారు. అయితే ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి పోస్టులు నోటిఫై చేయకపోవడంతో నియామకం విషయంలో అధికారులు ఆమెను పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించారు. డీఎస్సీ–2025లో 16వేల పోస్టులను నోటిఫై చేశారని, అయితే ఇందులో ఒక్క పోస్టును కూడా ట్రాన్స్‌జెండర్ల కోసం కేటాయించలేదన్నారు. ఇది జాతీయ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు విరుద్ధమన్నారు. విద్యాశాఖ తరపున న్యాయవాది గుర్రం రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ, ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్ల కల్పన అనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని చెప్పారు. దీనినితప్పుపట్టడానికి వీల్లేదన్నారు.

పార్లమెంట్ చట్టం చేసినా కూడా రాష్ట్రాలు రిజర్వేషన్లు ఇవ్వడం లేదు..

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ విజయ్ తీర్పునిస్తూ... 'ట్రాన్స్‌జెండర్ల ఇబ్బందులను నల్సా కేసులో సుప్రీంకోర్టు పరిశీలించింది. నల్సా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకున్న పార్లమెంట్ ట్రాన్స్‌జెండర్ల హక్కుల పరిరక్షణ చట్టం–2019ని తీసుకొచ్చింది. అయినప్పటికీ రాష్ట్రాలు విద్య, ఉద్యోగ అవకాశాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించడం లేదు. ట్రాన్స్‌జెండర్లు సమాజంలో వెనుకబడిన వర్గాల్లో అత్యంత దిగువస్థాయిలో ఉన్నారన్నది కాదనలేని సత్యం. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల హైకోర్టులు సైతం ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చాయి. ఈ ఆదేశాలను గౌరవిస్తూ కొన్ని రాష్ట్రాలు రిజర్వేషన్లు కల్పించాయి. ట్రాన్స్‌జెండర్లు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గమే కాకుండా, సమాజం చేత పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన వర్గం కూడా. అలాంటి వారి అభ్యున్నతికి రాజ్యాంగపరంగా, నైతికంగా తగిన ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఆయా రాష్ట్రాలపై ఉంది.' అని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాల్లో ట్రాన్స్‌జెండర్లకు ఆరు నెలల్లో రిజర్వేషన్లు కల్పించి తీరాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు పిటిషనర్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

క్లుప్తంగా...

సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

సాక్షి, అమరావతి: దూర విద్య ద్వారా వ్యవసాయ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశించదల్చిన వారు ఈ నెల 30వ తేదీలోగా పేర్లను నమోదు చేసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఎంవీ రమణ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. తేనెటీగల పెంపకం(బీ–కీపింగ్), సేంద్రియ వ్యవసాయం (ఆర్గానిక్ ఫార్మింగ్) కోర్సులు డిసెంబర్ 2025 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఈ సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ పొందగోరే వారు రూ.1,500 చొప్పున ఫీజు చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో శిక్షణ పొందే అభ్యర్థులు కంప్యూటర్/ఆండ్రాయిడ్ సెల్ ఫోన్/ఐపాడ్ వంటివి కలిగి ఉండాలన్నారు. పూర్తి వివరాలు వ్యవసాయ విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ (www.angrau.ac.in) ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే 9063219959, 8309626619, 8096085560లలో సంప్రదించవచ్చునన్నారు.

వెబ్ ఆప్షన్‌ల నమోదుకు అవకాశం

సాక్షి, అమరావతి: ఎండీ(హోమియో), ఎండీ/ఎంఎస్(ఆయుర్వేద) కోర్సుల్లో రెండో దశ కౌన్సెలింగ్ వెబ్ ఆప్షన్‌ల నమోదుకు శుక్రవారం ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ ఇచ్చింది. అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి ఆదివారం సాయంత్రం ఐదు గంటల్లోగా నమోదు చేసుకోవాలని సూచించింది. హోమియోలో 23, ఆయుర్వేదంలో రెండు సీట్లు అందుబాటులో ఉన్నట్టు స్పష్టం చేసింది.

మద్యం అక్రమ కేసులో మరొకరు అరెస్టు

సాక్షి, అమరావతి: మద్యం అక్రమ కేసులో సిట్ అధికారులు ముంబైకి చెందిన వ్యాపారి అనిల్ ఛోఖ్రాను అరెస్టు చేశారు. షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించినట్టు అభియోగాలు నమోదు చేస్తూ ఆయన్ని ఈ కేసులో ఏ–49గా చేర్చారు. ముంబైలో గురువారం అరెస్టు చేసి, థానే న్యాయస్థానంలో హాజరుపరిచారు. అక్కడి నుంచి ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు తరలిస్తున్నారు. ఆయన్ని విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో శనివారం హాజరుపరుస్తారు.

ఎస్వీయూలో ర్యాగింగ్ కలకలం

అర్ధరాత్రి ఇంజినీరింగ్ వసతి గృహాల్లో జూనియర్లకు వేధింపులు

జూనియర్లను ర్యాగింగ్ చేస్తున్న సీనియర్లు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో మళ్లీ ర్యాగింగ్ కలకలం సృష్టించింది. 15రోజుల ముందు వర్సిటీలోని సైకాలజీ విభాగంలో ర్యాగింగ్‌కు గురై నలుగురు విద్యార్థినులు టీసీలు తీసుకుని వెళ్లిపోగా ఇప్పుడు మరో ఘటన జరిగింది. వర్సిటీలో పైశాచికానందంతో సీనియర్లు ర్యాగింగ్ చేయడం చర్చనీయాంశంగా మారింది. వర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బాలుర వసతి గృహం విశ్వతేజ బ్లాక్ హాస్టల్‌లో గురువారం అర్ధరాత్రి జూనియర్లకు ఇంటరాక్షన్ క్లాసుల పేరుతో సీనియర్లు ర్యాగింగ్ చేశారు. అర్ధరాత్రి హాస్టల్‌లో జూనియర్లను గంటల తరబడి నిల్చోబెట్టి వికృత చేష్టలకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు వర్సిటీకి చేరుకుని విషయంపై ఆరాతీయగా ఇంటరాక్షన్ క్లాసులు మాత్రమేనంటూ సీనియర్లు, హాస్టల్ సిబ్బంది మాయ మాటలు చెప్పసాగారు. దీంతో శుక్రవారం విద్యార్థి సంఘాల నేతలు వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు.

సతీష్ మరణంపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి

వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి సాకే శైలజానాథ్

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) మాజీ ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అనుమానాస్పద మృతిపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీమంత్రి సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. నాడు పరకామణిలో డాలర్ల చోరీ కేసులో నిందితుడైన రవికుమార్‌ను సతీష్‌కుమార్ పట్టుకుని స్వయంగా పోలీసులకు అప్పగించాడని గుర్తుచేశారు. ఇప్పుడు అదే కేసులో సతీష్‌కుమార్‌ను ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిందితుడిగా చేర్చి వేధిస్తోందని చెప్పారు. సిట్ విచారించిన నాలుగురోజుల తర్వాత సతీష్ తాడిపత్రి వద్ద రైల్వేట్రాక్‌పై విగతజీవిగా పడి ఉండడం అనేక అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. ఆయన శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'సిట్ విచారణకు హాజరైన సతీష్ ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఏ తప్పు చేయకపోయినా అతన్ని వేధించారు. పరకామణిలో డాలర్ల చోరీ కేసులో అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని లాగేందుకు కుట్రచేసి, ఆ విషయంలో సతీష్‌కుమార్‌పై తీవ్ర ఒత్తిడి చేసినట్లు తిరుపతిలో వినిపిస్తోంది. అందుకే సతీష్‌కుమార్ మరణం పూర్తిగా అనుమానాస్పదం. వీటన్నింటికీ ప్రభుత్వమే సమాధానం చెప్పాలి' అని శైలజానాథ్ డిమాండ్ చేశారు.

టీటీడీ మాజీ ఏవీఎస్‌వో అనుమానాస్పద మృతి!

రైల్వేట్రాక్ పక్కన సతీష్‌కుమార్ మృతదేహం లభ్యం

ప్రస్తుతం జీఆర్పీ సీఐగా పనిచేస్తున్న సతీష్

టీటీడీ పరకామణి కేసులో కీలక వ్యక్తి

సతీష్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఐజీ, ఎస్పీ

తాడిపత్రిటౌన్/గుంతకల్లు/అనంతపురం సెంట్రల్/తిరుమల తిరుపతి దేవస్థానం/పత్తికొండ: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మాజీ ఏవీఎస్ఓ, ప్రస్తుత గుంతకల్లు రైల్వే పోలీస్ (జీఆర్పీ) సీఐ వై. సతీష్‌కుమార్ (38) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం కోమలి సమీపంలోని రైల్వేట్రాక్ పక్కన శుక్రవారం ఆయన మృతదేహం లభించింది. టీటీడీ పరకామణి కేసులో కీలక సాక్షిగా ఉన్న సతీష్ కుమార్ గుంతకల్లు నుంచి తిరుపతికి రైల్లో వెళుతూ ఇలా మృతి చెందడంపై కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పరకామణి కేసులో విచారణకు వెళుతున్న ఆయను ఎవరైనా రైలు నుంచి తోసి హత్య చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సతీష్‌కుమార్ 2023లో టీటీడీలో ఏవీఎస్ఓగా ఉన్న సమయంలో పరకామణి ఉద్యోగి రవికుమార్ వ్యవహారాలను వెలుగులోకి తెచ్చి ఆ కేసులో కీలక సాక్షిగా మారారు. ఈ ఏడాది జూలైలో జీఆర్పీ సీఐగా గుంతకల్లుకు బదిలీ అయ్యారు. ఈయన స్వస్థలం కర్నూలు జిల్లా పత్తికొండ. గుంతకల్లుకు బదిలీపై వచ్చిన తర్వాత పట్టణంలోని ఉరవకొండ రోడ్డులోని విశాల్ మార్టు సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని కుటుంబంతో కలిసి నివసిస్తున్నారు. ఈయనకు భార్య మమత, కుమార్తె తారా (8), కుమారుడు రోహిత్(3) ఉన్నారు.

విచారణకు వెళుతూ..

పరకామణి కేసులో ఈ నెల ఆరో తేదీన తిరుపతిలో సీఐడీ విచారణకు హాజరైన సతీష్‌కుమార్.. మరోసారి హాజరయ్యేందుకు గురువారం అర్ధరాత్రి 12.30 గంటలకు నిజాముద్దీన్–తిరుపతి (రాయలసీమ ఎక్స్‌ప్రెస్) రైల్లో టూ టైర్ ఏసీలో తిరుపతికి బయలుదేరారు. శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో తాడిపత్రి సమీపంలోని కోమలి గ్రామం రైల్వేట్రాక్ వద్ద ముఖం, శరీర భాగాలపై తీవ్రగాయాలతో మృతిచెందిన వ్యక్తిని గుర్తించిన రైల్వేట్రాక్ మెన్ షంషీర్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాల కోసం ఆరా తీయగా.. గుంతకల్లు రైల్వే రిజర్వుడు ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్‌గా తేలింది. దీంతో పై అధికారులకు సమాచారం చేరవేశారు. అనంతపురం రేంజ్ డీఐజీ షీమోషి, జిల్లా ఎస్పీ జగదీష్, ఏఎస్పీ రోహిత్‌కుమార్ ఘటన స్థలానికి చేరుకుని.. మృతికి కారణాలు, ఆధారాల కోసం విచారణ చేపట్టారు. డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులతో పరిశీలించారు. గుంతకల్లు రైల్వేస్టేషన్‌లోని సీసీ కెమెరాల పుటేజీలను సైతం పరిశీలించారు. ఆయన ప్రయాణించిన బోగీలోని ప్రయాణికుల వివరాలనూ ఆరా తీస్తున్నారు. దీంతోపాటు సహచర ఉద్యోగులతో సతీష్‌కుమార్ వ్యవహారశైలిపై విచారిస్తున్నట్లు సమాచారం. మృతికి కారణాలు విచారణలో తేలాల్సి ఉందని రైల్వే డీఎస్పీ శ్రీనివాసులు ఆచారి విలేకరులకు తెలిపారు. సతీష్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

2012 బ్యాచ్ అధికారి

కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి చెందిన బ్రహ్మయ్య, చిదంబరమ్మ దంపతుల మొదటి కుమారుడు సతీష్‌కుమార్. ఈయనది పేద కుటుంబం, తండ్రి మరణంతో తమ్ముడు శ్రీహరితో కలిసి కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూ కష్టపడి చదవి పోలీసుశాఖలో ఉద్యోగం సంపాదించారు. సతీష్‌కుమార్ 2012 బ్యాచ్ అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీసు అకాడమీలో శిక్షణ తీసుకున్న చివరి బ్యాచ్ వీరిదే. తొలి పోస్టింగ్ చిత్తూరు జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చింది. తర్వాత చాలా ఏళ్ల పాటు తిరుమల తిరుపతి దేవస్థానంలోనే పనిచేశారు. 2012 బ్యాచ్‌లో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందిన వారిలో కూడా సతీష్‌కుమార్ ముందు వరుసలో ఉన్నారు. ఆయన బ్యాచ్‌మేట్స్ చాలా మంది ఇంకా ఆర్ఎస్ఐలుగానే ఉన్నారు. పరకామణి చోరీ కేసు నమోదైన సమయంలో ఈయన ఏవీఎస్ఓగా పనిచేస్తున్నారు. ఈనెల ఆరున సీఐడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. శుక్రవారం మరోసారి హాజరుకావాల్సి ఉందని గుంతకల్లు నుంచి తిరుపతికి బయలుదేరారు. అంతలోనే ఇలా జరగడంపై చాలా మంది బ్యాచ్‌మేట్స్, అధికారులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆరో తేదీ విచారణకు హాజరై వచ్చిన తర్వాత కొందరు సహచరులతో మాట్లాడుతూ తనకు మెమో ఇస్తారని, లేదా సస్పెండ్ చేస్తారని వాపోయినట్లు తెలిసింది.

నిష్పక్షపాతంగా విచారణ చేయాలి

సతీష్‌కుమార్ మృతిపై నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కుమ్మర శాలివాహన సంఘం నాయకులు గోపాల్, ఓబుళపతి, నాగేంద్ర, రామాంజనేయులు తదితరులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం అనంతపురం సర్వజనాస్పత్రి మార్చురీ వద్ద ఆందోళన చేశారు. సతీష్ కుమార్ మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. సీఐడీ అధికారులతో సిట్ ఏర్పాటు చేసి పారదర్శకంగా దర్యాప్తు చేయాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీనిపై సతీష్‌కుమార్ భార్య మమతను సంప్రదించాలని 'సాక్షి' ప్రయత్నించగా ఆమె సెల్‌ఫోన్‌ను పోలీసు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు బంధువుల ద్వారా తెలిసింది. ఆమెను మీడియాతో మాట్లాడనీయకుండా కట్టడి చేశారు. పోలీసులు ఆమె సెల్‌ఫోన్‌ను తీసుకోవాల్సిన అవసరం ఏమి ఉందని బంధువులు ప్రశ్నిస్తున్నారు.

పోస్టుమార్టం పూర్తి

సతీష్‌కుమార్ మృతదేహానికి అనంతపురం సర్వజనాస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మృతదేహాన్ని స్వగ్రామం కర్నూలు జిల్లా పత్తికొండకు తరలించారు. తొలుత మృతదేహానికి సీటీస్కాన్ చేశారు. అనంతరం వైద్యులు పోస్టుమార్టం చేశారు. మొత్తం ప్రక్రియను వీడియో తీశారు. జిల్లా ఎస్పీ జగదీష్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా సతీష్ వినియోగిస్తున్న సెల్‌ఫోన్‌ను విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు అధికార వర్గాల ద్వారా సమాచారం. దాదాపు 3 గంటలకు పైగా జిల్లా ఎస్పీ జగదీష్ ప్రభుత్వ సర్వజనాసుపత్రిలోనే ఉన్నప్పటికీ చివరకు మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. కాగా, సతీష్‌కుమార్ మృతి ఘటనకు సంబంధించి వివరాలు ఆరా తీసేందుకు సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ అనంతపురానికి చేరుకున్నట్లు సమాచారం.

హత్య కోణంలో దర్యాప్తు చేయాలి: బీజేపీ

సాక్షి, అమరావతి: తిరుపతి పరకామణి చోరీ కేసులో కీలక వ్యక్తి సతీష్‌కుమార్ అనుమానాస్పద మరణం ఆందోళనకరమని బీజేపీ ఒక ప్రకటనలో పేర్కొంది. 'రైల్వే ట్రాక్‌పై మృతదేహం లభించడం దర్యాప్తును మరింత తీవ్రమైన కోణంలో పరిశీలించాల్సిన అవసరాన్ని సూచిస్తోంది. ఈ ఘటనను హత్య కోణంలో దర్యాప్తు చేయమని ప్రభుత్వాన్ని, పోలీసులను కోరుతున్నాం. ఈ కేసుకు సంబంధించిన సాక్షులకు రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ఈ మరణం వెనుక ఎవరి హస్తం ఉన్నా కఠినంగా శిక్షించాలి. నిజం వెలుగులోకి రావాలి' అంటూ బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌నారాయణ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ వేధింపులతోనే సతీష్ మృతి

ఇది ముమ్మాటికీ చంద్రబాబు సర్కారు హత్యే: భూమన

పరకామణి కేసులో విచారణ పేరుతో సతీష్‌ను బెదిరించిన ప్రభుత్వం

సతీష్ కుమార్ మృతిపై సీబీఐ విచారణ జరిపించాలి

సాక్షి ప్రతినిధి, తిరుపతి: తిరుమల పరకామణికి సంబంధించిన కేసులో విచారణ ఎదుర్కొంటున్న టీటీడీ మాజీ ఏవీఎస్‌వో సతీష్ కుమార్ ప్రభుత్వ ఒత్తిడి, బెదిరింపుల కారణంగానే మృతి చెందారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనన్నారు. విచారణ పేరుతో తీవ్ర వేధింపులకు గురిచేసి ఆయన మృతికి కారణమైన అధికారులపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సతీష్ కుమార్ మరణానికి కారణమైన ప్రభుత్వం, పోలీస్ అధికారులతో పాటు ఆయన మీద ఒత్తిడి తెచ్చిన వారందరినీ దోషులుగా చేర్చాలన్నారు. విచారణ పేరుతో సాటి పోలీసులనే వేధిస్తూ, తప్పుడు కేసులు నమోదు చేయిస్తూ ఈ ప్రభుత్వం తప్పుడు సంప్రదాయానికి తెర తీసిందని మండిపడ్డారు. పోలీసు అధికారుల మరణాలకు కారణమయ్యేలా జరుగుతున్న విచారణలు పోలీసు సమాజానికే అవమానకరమన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులే లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం అందుకు అధికారులను పావులుగా వాడుకుంటోందన్నారు. తమపై ఎలాగైనా కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలన్న ప్రభుత్వ కుట్రలకు ఒక అమాయక పోలీసు అధికారి బలయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో భూమన మీడియాతో మాట్లాడారు.

సీబీఐతో విచారణ జరిపించాలి..

'ఈ ప్రభుత్వం చేస్తున్న అపచారాలను ప్రశ్నిస్తున్న నన్ను దోషిగా ఇరికించేందుకు టీటీడీ పాలకమండలి అధ్యక్షుడి నుంచి నారా లోకేష్ వరకూ ఏ రకంగా మాట్లాడారో, ట్వీట్లు చేశారో అందరికీ తెలుసు. దీని వెనుక చాలా పెద్ద కుట్ర ఉంది. సతీష్ మరణం వెనుక కారణాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణకు ఆదేశించాలి. పది రోజులుగా జరుగుతున్న సీఐడీ విచారణ తతంగం, న్యాయమూర్తి ఆదేశాలకు భిన్నంగా నన్ను ఇరికించడానికి జరుగుతున్న యత్నాలపై కూడా సీబీఐతో దర్యాప్తు చేయించాలి' అని భూమన డిమాండ్ చేశారు.

ఇది ప్రభుత్వ హత్యే..!

'పరకామణికి సంబంధించి రెండు నెలలుగా పత్రికల్లో వస్తున్న కథనాలతో సతీష్‌కుమార్ తీవ్రంగా కలత చెందారు. వారం రోజులుగా సీఐడీ విచారణ పేరుతో తనను వేధిస్తోందని సన్నిహితుల వద్ద ఆయన వాపోయినట్లు తెలుస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వం నా పేరు చెప్పాలంటూ సతీష్‌కుమార్‌పై ఒత్తిడి తెచ్చి మానసిక క్షోభకు గురి చేసింది. పోలీసు అధికారుల ద్వారా రాజకీయ నాయకులను ముద్దాయిలుగా చేర్చడానికి చంద్రబాబు ప్రభుత్వం పన్నిన కుట్రలకు ఒక అమాయకుడు, సౌమ్యుడు, నిజాయితీపరుడైన పోలీస్ అధికారి బలైపోయారు. ఎస్పీ గంగాధర్, డీఎస్పీలు వేణుగోపాల్, గణపతి అత్యంత దుర్మార్గంగా మాట్లాడుతున్నారు. పరకామణి కేసును విచారిస్తున్న అధికారులు న్యాయమూర్తి ఆదేశాలకు భిన్నంగా వ్యవహరిస్తూ మానసిక వేధింపులకు గురి చేస్తున్నారు. రౌడీలు, గూండాల తరహాలో పచ్చి బూతులు తిడుతూ విచారణ ఎదుర్కొంటున్న వారిని వేధిస్తున్నారు. ఏ అర్హత లేని లక్ష్మణ్ రావు అనే క్రిమినల్ కూడా విచారణలో పాల్గొని సతీష్ కుమార్‌ను బండ బూతులు తిట్టాడు. తన పై అధికారి సీవీఎస్వో నరసింహ కిషోర్ చెప్పడం వల్లే రాజీకి వెళ్లానని అధికారులకు సతీష్‌కుమార్ చెప్పారు' అని భూమన చెప్పారు.

బాబు ప్రభుత్వ క్షుద్ర రాజకీయానికే బలి

టీటీడీ పూర్వ ఏవీఎస్‌వో సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతి

- అబద్ధపు వాంగ్మూలం కోసం వేధించిన పోలీసులు
- అందుకు ససేమిరా అన్న సతీశ్ కుమార్
- ఈ నేపథ్యంలోనే పట్టాలపై శవమై కనిపించిన సతీశ్ కుమార్
- ఎవరితోనూ మాట్లాడకుండా ఆయన కుటుంబ సభ్యులను కట్టడి చేసిన పోలీసులు
- అనుమానాస్పద మృతిపై అధికారిక ప్రకటన చేయని పోలీసులు
- కానీ హత్యేనని ఎల్లో మీడియాకు లీకులు.. టీడీపీ వెబ్‌సైట్‌లో ప్రచారం
- రాజకీయ కక్ష సాధింపు కోసం వక్రీకరించే కుట్ర
- ప్రభుత్వ పెద్దల డైరెక్షన్‌లోనే పోలీసుల యాక్షన్

సాక్షి, అమరావతి: టీటీడీ పరకామణి కేసులో కూటమి ప్రభుత్వ క్షుద్ర రాజకీయం మరింత వికృతరూపం దాలుస్తోంది. ఈ కేసులో అత్యంత కీలకమైన అప్పటి టీటీడీ ఏవీఎస్‌వో, ప్రస్తుత జీఆర్పీ సీఐ వై.సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతి కేంద్ర బిందువుగా కూటమి ప్రభుత్వం కొత్త పన్నాగం పన్నుతోంది. ఈ ఉదంతాన్ని రెడ్‌బుక్ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు సాధనంగా చేసుకునేందుకు తెగబడుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలకు వ్యతిరేకంగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని సతీశ్ కుమార్‌ను పోలీసు ఉన్నతాధికారులు తీవ్రంగా వేధించిన విషయం కొన్ని రోజులుగా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఆయన అనుమానాస్పదంగా మృతి చెందడంతో వేళ్లన్నీ ప్రభుత్వ పెద్దలవైపే చూపిస్తున్నాయి. మరోవైపు ఆయన మృతి అనంతరం పోలీసు ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరు సందేహాలను మరింత బలపరుస్తోంది. అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయకుండా పోలీసు ఉన్నతాధికారులు సతీశ్ కుమార్‌ది హత్యేనని ఎల్లో మీడియాకు లీకులు ఇవ్వడం గమనార్హం. తద్వారా ఈ అంశాన్ని కూటమి ప్రభుత్వ రాజకీయ కక్ష సాధింపులకు అనుగుణంగా వక్రీకరించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్టుగా స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో సతీశ్ కుమార్‌కు పోలీసు ఉన్నతాధికారుల వేధింపులు.. ఆయన అనుమానాస్పద మృతిపై పోలీసుల లీకు రాజకీయాలు కూటమి ప్రభుత్వ కుట్రను బట్టబయలు చేస్తున్న తీరు ఇదిగో ఇలా ఉంది..

కుటుంబ సభ్యులను కట్టడి చేసిన పోలీసులు

- వైఎస్సార్‌సీపీ నేతలకు వ్యతిరేకంగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వలేనని సతీశ్‌కుమార్ తేల్చిచెప్పిన తరువాత పరిణామాల్లోనే.. ఆయన శుక్రవారం అనుమానస్పదంగా మృతి చెందడం గమనార్హం.
- గుంతకల్‌లో గురువారం అర్ధరాత్రి 12.45 గంటలకు రాయలసీమ ఎక్స్‌ప్రెస్ సెకండ్ ఏసీ బోగీలో రైలు ఎక్కిన సతీశ్ అర్ధరాత్రి రెండు గంటల సమయంలో తాడిపత్రి మండలం కోమలి సమీపంలోని రైలు పట్టాలపై అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించారు. కాగా ఈ విషయం బయటకు పొక్కగానే పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు సందేహాలను మరింత బలపరుస్తోంది.
- ప్రధానంగా సతీశ్ కుమార్ కుటుంబ సభ్యులు ఎవరితోనూ మాట్లాడకుండా పోలీసు అధికారులు కట్టడి చేశారు. ఆయన నివాసం వద్దకు మీడియా ప్రతినిధులు, సమీప బంధువులతోసహా ఇతరులను వెళ్లనివ్వలేదు. సతీశ్ కుమార్ భార్య ఫోన్‌నూ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రాత్రికీ ఆమె ఫోన్‌ను తిరిగి ఇవ్వనే లేదు. బాధిత కుటుంబం తమ ఆవేదనను ఎవరితోనూ పంచుకునేందుకు.. ఆయన మృతిపై తమ సందేహాలను వెల్లడించేందుకూ అవకాశం ఇవ్వకుండా పోలీసులు కట్టడి చేయడం పలు ప్రశ్నలను రేకెత్తిస్తోంది.

అధికారిక నిర్ధారణ లేకుండా కుట్రపూరిత ప్రచారం

ఇక సతీశ్ కుమార్ మృత దేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం తరలించిన తరువాత పోలీసుల తీరు మరింత సందేహాస్పదంగా మారింది. పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు తమ ప్రాథమిక నివేదికలో ఏమని తెలిపారో అధికారికంగా వెల్లడించలేదు. సతీశ్ కుమార్ మృతికి కారణమేమిటన్నది చెప్ప లేదు. కానీ శుక్రవారం రాత్రి 7 గంటల నుంచే ఎల్లో మీడియా ద్వారా తమ కుట్రను బయటపెట్టారు. సతీశ్ కుమార్‌ది హత్యేనని లీకులు ఇవ్వడం గమనార్హం. టీడీపీ వెబ్‌సైట్లు, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా ఆ విషయాన్ని ప్రచారంలోకి తెచ్చారు. సతీశ్ కుమార్‌ది హత్యేనని టీడీపీ అధికారిక వెబ్‌సైట్ శుక్రవారం రాత్రి 7.30గంటలకే పోస్టు చేసింది. ఇక ఈనాడు వెబ్‌సైట్‌లోనూ సతీశ్ కుమార్‌ను హత్య చేశారని పేర్కొన్నారు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక పేర్కొందని కూడా చెప్పడం గమనార్హం. అంటే పోలీసులు అధికారికంగా నిర్ధారించకుండా.. ఇలా టీడీపీ వెబ్‌సైట్లు, ఎల్లో మీడియా ద్వారా కుట్రపూరితంగానే ఓ ప్రచారాన్ని వైరల్ చేశారన్నది స్పష్టమవుతోంది.

టీడీపీ కార్యాలయం డైరెక్షన్‌లోనే..

సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతిపై టీడీపీ ప్రధాన కార్యాలయం డైరెక్షన్‌లోనే పోలీసులు వ్యవహరిస్తున్నారు. టీడీపీ నేత పట్టాభి శుక్రవారం మధ్యాహ్నం విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ లక్ష్యంగా నిరాధారణ ఆరోపణలు చేశారు. ఆ ఆరోపణలను బలపరిచేలానే పోలీసులు వ్యవహరిస్తుండటంతో ప్రభుత్వ కుట్ర బట్టబయలైంది. శుక్రవారం సాయంత్రానికే అందుకు అనుగుణంగా పోలీసులు ఎల్లో మీడియాకు లీకులు ఇచ్చారు. ఆయన తల వెనుక భాగంలో గాయముందని.. పక్కటెముకలు విరిగాయని.. హత్యేనని వైద్యులు ప్రాథమికంగా తెలిపారని లీకులు ఇవ్వడం గమనార్హం. టీడీపీ వెబ్‌సైట్, ఆ పార్టీ సోషల్ మీడియాలో అదే విషయాన్ని వైరల్ చేశాయి.

కక్ష సాధింపు కోసమే పన్నాగం..

సతీశ్ కుమార్‌ది హత్యేనని పోస్టు మార్టం ప్రాథమిక నివేదిక వెల్లడిస్తే.. ఆ విషయాన్ని పోలీసులు అధికారికంగానే వెల్లడించవచ్చు. అందుకు ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయరు. కానీ పోలీసులు అలా చేయలేదు. కేవలం ఎల్లో మీడియాకు లీకులు ఇచ్చారు. సతీశ్ కుమార్‌ది హత్యే అయితే... ఎవరిపై అక్రమ కేసు నమోదు చేయాలా అని ప్రభుత్వ తుది ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్టు తెలుస్తోంది. లేదా.. హత్యకు కారకులైన టీడీపీ వర్గీయులను కేసు నుంచి తప్పించేందుకే కాలయాపన చేస్తూ ఉండవచ్చనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. ఏది ఏమైనా సరే సతీశ్ కుమార్ మృతి వెనుక అసలు విషయాన్ని కప్పిపుచ్చి.. ప్రభుత్వ పెద్దల రాజకీయ కుట్రకు వాడుకోవాలన్నదే ప్రధాన లక్ష్యంగా ఉందన్నది స్పష్టమవుతోంది. అందుకు ప్రభుత్వ పెద్దల స్క్రిప్టును అమలు చేయడమే తమ కర్తవ్యంగా పోలీసు ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. కాగా పోలీసు అధికారి మృతిపై ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలకు పాల్పడుతుండటంపై పోలీసు వర్గాలు మండిపడుతున్నాయి. అబద్ధపు వాంగ్మూలం కోసం సతీశ్ కుమార్‌ను తీవ్రంగా వేధించడంపైనే పోలీసు వర్గాలను ఆవేదనకు గురి చేసింది. కాగా ప్రస్తుతం ఆయన అనుమానాస్పద మృతి వెనుక వాస్తవాలను వెల్లడించకుండా కక్ష సాధింపు కోసం వక్రీకరించేందుకు యత్నిస్తున్నారని పోలీసువర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

వేళ్లన్నీ ప్రభుత్వ పెద్దల వైపే..

అబద్ధపు వాంగ్మూలం కోసం వేధింపులు

అందుకు సతీశ్ కుమార్ ససేమిరా

ఈ నేపథ్యంలోనే అనుమానాస్పద మృతి

టీడీపీ కూటమి ప్రభుత్వ పెద్దలు పరకామణి కేసు దర్యాప్తును వక్రీకరించి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు స్కెచ్ వేశారు. వైఎస్సార్‌సీపీ కీలక నేతలను అక్రమ కేసులో ఇరికించి వేధించేందుకు పక్కా పన్నాగం పన్నారు. అందులో భాగంగానే టీడీపీ వీర విధేయ సీఐడీ అధికారులను రంగంలోకి దించారు. డీజీపీ కార్యాలయం పర్యవేక్షణలో ఈ అక్రమ కేసు దర్యాప్తు కుట్ర కార్యాచరణను వేగవంతం చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసు నమోదు చేసేందుకు ప్రాథమిక ఆధారాలు కూడా లభించలేదు. దీంతో సీఐడీ, పోలీసు అధికారులు టీటీడీ పూర్వ ఏవీఎస్‌వో సతీశ్ కుమార్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ఈ అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ నేతల పేర్లు చెప్పాలని ఆయన్ని వేధించారు. తాము చెప్పినట్టుగా సీఆర్‌పీసీ 161, 164 వాంగ్మూలాలు ఇవ్వాలని తీవ్రంగా బెదిరించారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డితోపాటు మరి కొందరి పేర్లు చెప్పాలని ఒత్తిడి చేశారు. వారు చెబితేనే తాను ఈ కేసులో లోకాయుక్త ఎదుట హాజరై రాజీ ప్రక్రియను పూర్తి చేసినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని వేధించారు. సతీశ్ కుమార్ ద్వారా అబద్ధపు వాంగ్మూలం నమోదు చేస్తే.. దాన్ని బట్టి అప్పటి తిరుపతి ఎస్పీగా ఉన్న పరమేశ్వర్‌రెడ్డి, మరికొందరు పోలీసు అధికారుల నుంచి అదే రీతిలో అబద్ధపు వాంగ్మూలాలు నమోదు చేయించాలన్నది పోలీసు ఉన్నతాధికారుల ఉద్దేశం. తాము చెప్పినట్టుగా అబద్ధపు వాంగ్మూలం ఇవ్వకపోతే ఈ కేసులో ఇరికించి... జైలు పాలు చేస్తామని కూడా సతీశ్ కుమార్‌ను బెదిరించినట్టు తెలుస్తోంది. పోలీసు ప్రధాన కార్యాలయ అధికారులతోపాటు, విజయవాడ పోలీసు ఉన్నతాధికారులతోనూ సతీష్‌కుమార్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చినట్టు సమాచారం. సామాజిక వర్గ కోణంలో విజయవాడలోని ఓ పోలీసు అధికారి ద్వారా సతీశ్‌కుమార్‌ను తమ దారికి తెచ్చుకునేందుకు యత్నించినట్టు తాజాగా వెలుగు చూసింది. సతీశ్ కుమార్ సామాజికవర్గానికి చెందిన అధికారితో మాట్లాడించి అబద్ధపు వాంగ్మూలం ఇవ్వాలని తీవ్ర ఒత్తిడి చేసినట్టు తెలుస్తోంది. మనం మనం ఒకటి కాబట్టి చెబుతున్నా.. పోలీసు బాస్‌లు చెప్పినట్టుగా వాంగ్మూలం ఇవ్వకపోతే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పించినట్టు సమాచారం. అంతే కాదు సతీష్ కుమార్‌ను విచారిస్తున్న సమయంలో లక్ష్మణరావు అనే ప్రైవేటు వ్యక్తి(రౌడీ)ని ప్రవేశపెట్టడం గమనార్హం. లక్ష్మణరావు చేత సతీశ్‌కుమార్‌ను తీవ్రస్థాయిలో బెదిరించి బెంబేలెత్తించినట్టు సమాచారం. సహచర పోలీసు అధికారుల సమక్షంలో ఓ పోలీసు అధికారిని ఓ ప్రైవేటు వ్యక్తి పరుషపదజాలంతో దూషించడం ... బెదిరించడం.. అంతు చూస్తామని వేధించడం ఏమిటనే విభ్రాంతి పోలీసుశాఖలో వ్యక్తమవుతోంది. ఈ నెల 6న ఓసారి ఆయన్ని సీఐడీ అధికారులు విచారించారు. కాగా ఆయన్ని శనివారం విచారణకు రావాలని తాజాగా నోటీసులు ఇచ్చారు. ఈ పరిణామాలతో సతీశ్ కుమార్ తీవ్ర ఆందోళనకు గురయ్యారని, రాజకీయ కుట్రలో పావుగా మారి అబద్ధపు వాంగ్మూలం ఇవ్వడానికి ఆయన మనస్సాక్షి అంగీకరించ లేదని సమాచారం. తాను అబద్ధపు వాంగ్మూలం ఇవ్వలేనని ఆయన సీఐడీ అధికారులకు తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే సతీశ్ కుమార్ అనుమానాస్పదంగా మృతి చెందడంతో వేళ్లన్నీ ప్రభుత్వ పెద్దలవైపే చూపిస్తున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ప్రసూతి వార్డులో 2022 మార్చి 19వ తేదీన మగ శిశువు అదృశ్యమైంది. మంగసముద్రం గ్రామానికి చెందిన ఓ గర్భిణికి ప్రసవించిన మూడు రోజుల పసికందును బ్యాగులో పెట్టుకుని ఎత్తికెళ్లిపోయారు. శిశువు అదృశ్యంపై పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా బిడ్డను గుంటూరులో గుర్తించారు. ఈ ముఠాను అరెస్ట్ చేసి కటకటపాలు చేశారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లిలో రెండు రోజులకు కిందట కిడ్నీ మార్పిడి రాకెట్ వ్యవహారం బట్టబయలైంది. ప్రభుత్వ వైద్యుడు, ప్రైవేటు ఆస్పత్రి కేంద్రంగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేస్తూ పట్టుబడ్డాడు. ఆ చికిత్స వికటించడంతో బండారం మొత్తం బయటపడింది. దళారుల ద్వారా జరుగుతున్న ఈ దందా గుట్టు రట్టు అయింది. విశాఖ జిల్లా ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ బొడ్డపాలెం గ్రామానికి చెందిన యమున అనే మహిళ ఈ మాఫియాకు బలైంది.



డెమో విభాగం డమ్మీనేనా..

ప్రైవేటు ఆస్పత్రుల పుట్టు పూర్వోత్రాలు మొత్తం డెమో విభాగం చేతిలో ఉంటుంది. చిత్తూరు డెమో చేతిలో అధికారిక, అనధికారిక ఆస్పత్రుల వివరాలు పక్కాగా ఉన్నాయి. కానీ అనధికారిక ఆస్పత్రులను టచ్ చేసేందుకు వెనకడుగు వేస్తున్నారు. చూసీ చూడ నట్లు వెళ్లిపోతున్నారు. ఆస్పత్రుల పనితీరుపై నిఘా పెట్టలేకపోతున్నారు. ఓ అధికారి మమల్ని తనిఖీలకు వెళ్లకుండా డమ్మీగా కూర్చోబెట్టారని డెమో సెక్షన్‌లోని పలువురు వాపోతున్నారు. బొమ్మసముద్రం పీహెచ్‌సీ పరిధిలో జరిగిన ఘటనతో పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ తోటపాళ్యంలోని ఓ స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తే...తన అనుమతి లేకుండా ఎలా వెళ్లావంటూ ఓ అధికారి సంజాయిషీ అడిగారు. దీంతో ఆ అధికారి కూడా మిన్నకుండిపోయారు. కాగా వైద్య వ్యవస్థల్లో జరుగుతున్న అక్రమాలను కట్టడి చేయడంలో వైద్యశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ప్రజలు మండిపడుతున్నారు.

అనుమతుల్లేని ఆస్పత్రులు

చిత్తూరు జిల్లాలో అనుమతిలేని ఆస్పత్రులు కోకొల్లుగా ఉన్నాయి. చిత్తూరు నగరంలో ప్రధానంగా సుందరయ్యవీధిలో అనుమతిలేని ఆస్పత్రులు అధికంగా ఉన్నాయి. అలాగే గిరింపేట, దర్గా సర్కిల్, కొంగారెడ్డిపల్లి, గాంధీరోడ్డు, సంతపేట, మురకంబట్టు తదితర ప్రాంతాల్లో అనధికారిక ఆస్పత్రులు ఏళ్ల తరబడి నాటుకుపోయాయి. **తిరుపతి** జిల్లాలో రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, ఎయిర్ బైపాస్ రోడ్డు, కరకంబడి రోడ్డు, లీలామహల్ సెంటర్ తదితర ప్రాంతాల్లో బహిరంగంగానే అనుమతి లేని ఆస్పత్రులు పాతుకుపోయాయి. ఈ విషయం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం వెనుక ఆంత్యరం ఏమిటోననే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

అమ్మేస్పత్రులు!

చిత్తూరు జిల్లాలో మెడికల్ మాఫియా

మదనపల్లి తరహాలో రెచ్చిపోతున్న వైనం

పలు ఆస్పత్రులు..దళారులు సిండికేట్

అనుమతి లేని ఆస్పత్రులు కోకొల్లలు

కొరవడుతున్న నిఘా వ్యవస్థ

మదనపల్లె కిడ్నీ రాకెట్‌లో తిరుపతిలోని ఓ ఆస్పత్రి పాత్ర

మత్తులో వైద్య ఆరోగ్యశాఖ

చిత్తూరు జిల్లాలో మెడికల్ మాఫియా బుసలు కొడుతోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. కొంత మంది వైద్యుల ముసుగులో దందాలకు పాల్పడుతున్నారు. దళారులతో చేతులు కలిపి పీక్కుతుంటున్నారు. మనుషుల అవయవాలతో వ్యాపారం చేస్తున్నారు. మదనపల్లి తరహాలో కిడ్నీ మార్పిడిలు, శిశు విక్రయం, అబార్షన్లు, లింగ నిర్ధారణను అవకాశంగా చేసుకుని నిబంధనలకు తూట్లు పొడిచి రోగులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేక దర్జాగా మెడికల్ మాఫియా దందా సాగిపోతోంది. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్య శాఖ మామూళ్ల మత్తులో జోగుతోంది. ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల ఆగడాలు శ్రుతి మించుతున్నాయి.

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 2,500 పైగా ప్రైవేటు ఆస్పత్రులున్నాయి. రిజిస్ట్రేషన్ లేని ఆస్పత్రులు 500 పైగా నడుస్తున్నాయి. ఆర్ఎంపీ క్లినిక్‌లు 4 వేలు, స్కానింగ్ సెంటర్లు 600 పైగా ఉండవచ్చునని అధికారుల అంచనా. వీటిలో చాలా వరకు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ వైద్య వ్యవస్థకే మాయని మచ్చను తెచ్చిపెడుతున్నాయి. అమాయక ప్రజలను ఆసరా చేసుకుని కాసుల కక్కుర్తికి పాల్పడుతోంది. మదనపల్లిలో జరిగిన కిడ్నీ రాకెట్‌తో ప్రైవేటు ఆస్పత్రుల, వైద్యుల అక్రమ వ్యాపారం బహిర్గతమైంది. మెడికల్‌లో దళారులను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈరకమైన ఘటనలు (అక్రమ స్కానింగ్, పసికందుల మాయం) జిల్లాలో జరిగిన వైద్య ఆరోగ్యశాఖ నిద్రాణంగా ఉండడం విస్మయానికి గురిచేస్తోంది.

అబార్షన్లకు అడ్డా

చిత్తూరు జిల్లా కేంద్రం అక్రమ స్కానింగ్‌లు, అబార్షన్లకు అడ్డగా పేరొందింది. ఇందు కోసం జిల్లా నలుమూలల నుంచి రావడంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచి పదుల సంఖ్యలో గర్భిణులు వస్తుంటారు. ఈ క్రమంలో కొన్ని పరిచయాలు దళారులను పోషిస్తున్నాయి. ప్రస్తుతం పెళ్లి కాకుండానే గర్భిణులు అవుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇలాంటి కేసులు జిల్లాతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి అధికంగా వస్తున్నారు. జిల్లాకు మధ్యవర్తుల ద్వారా అబార్షన్లకు వస్తున్నారు. వీరిలో కొంత మంది ఐదు నెలలు దాటితే అబార్షన్ కాదని చెప్పడం. తర్వాత బిడ్డ ప్రసవం..ఆపై మాయమవుతోంది. బిడ్డ ప్రసవించిన గంటల వ్యవధిలోనే సంచుల్లో వ్యాపారం నడుస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే కొందరు ఆడబిడ్డ అని వదిలేస్తే..వీటిల్లో చాలా వరకు దళారుల చేతిలోకి వె వెళ్లిపోతున్నాయని పలువురు చెబుతున్నారు. ఈ పసికందులు కర్ణాటక, కేరళ, గుంటూరు వంటి ప్రాంతాలకు దళారులు సరఫరా చేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

దళారులతో వైద్యుల సిండికేట్ ?

వైద్యులను ప్రజలు దైవ సమానులుగా చూస్తుంటా రు. అయితే కొందరు డాక్టర్లు చేసే అక్రమ వ్యాపారం వైద్య వ్యవస్థకే మచ్చను తెచ్చిపెడుతోంది. అక్రమ స్కానింగ్‌లను ప్రోత్సహించడం, అబార్షన్లు చేయడం, శిశువులను విక్రయానికి **పెట్టడం** వాటిలో దళారుల తో సిండికేట్ **అయ్యారనే** ఆరోపణలు వినిపిస్తున్నా యి. **దళా**రులతో చేతులు కలిపి అబార్షన్లను చేయించడమే కొందరు డాక్టర్లు పనిగా పెట్టుకున్నారు. నమ్మకంగా ఉన్న దళారుల ద్వారా వెళితే పుట్టబోయే బిడ్డ ఆడ, మగ చెప్పేస్తున్నారని పలువురు అంటున్నారు. బిడ్డ వద్దని చెబితే దళా**రుల** ద్వారా విక్రయాలు జరిపించడంలో **స్పెషలి**స్టుగా పేరు తెచ్చుకుంటున్నారనే వాదనలు **వినిపిస్తు**న్నాయి. అబార్షన్లు, ప్రసవాలు చేయడంలో పలువురు ఆర్ఎంపీలు పుట్టుకొచ్చారు. ఇవన్నీ కూడా గుట్టు చప్పుడు కాకుండా జరిగిపోతున్నాయి. ఇలా అనుమతి లేని ఆస్పత్రులు, పలువురు ఆర్ఎంపీలు మెడికల్ మాఫియాకు ఊపిరి పోస్తున్నారు. ఈ వ్యాపారంలో కొందరు వైద్యులు, ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులు, వైద్య సిబ్బంది, ఐసీడీఎస్‌లో పనిచేసే సిబ్బంది, ప్రైవేటు వ్యక్తుల ద్వారా నడుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. మే నెలలో కలెక్టర్ సుమిత్‌కుమార్ నిఘా వేసి చిత్తూరు నగరంలో అక్రమ స్కానింగ్ సెంటర్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైలో ఓ గర్భిణి మృతితో తిరుపతిలోని అక్రమ స్కానింగ్ సెంటర్ల బాగోతం వెలుగు చూసింది. ఈరెండు సెంటర్లను ఒకరే నిర్వహించడం గమనార్హం. మదనపల్లి కిడ్నీ రాకెట్ విషయంలో తిరుపతి జిల్లాకు చెందిన ఓ ఆస్పత్రి పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఆస్పత్రిపై పోలీసు నిఘా విభాగం కన్ను పడినట్లు సమాచారం.

'ఉపాధి' పనులపై ఏపీ అధికారులతో ఛత్తీస్‌గఢ్ బృందం భేటీ

సాక్షి, అమరావతి: ఛత్తీస్‌గఢ్ అధికారుల బృందం శుక్రవారం తాడేపల్లిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ మైలవరపు, ఇతర అధికారులతో సమావేశమైంది. రాష్ట్రంలో ఉపాధి హామీ పథకం అమలు గురించి చర్చించింది. కాగా, 19 మంది సభ్యులతో కూడిన ఛత్తీస్‌గఢ్ బృందం రెండు రోజులపాటు అన్నమయ్య జిల్లాలోని పలు గ్రామపంచాయతీల్లో పర్యటించింది.

బిట్స్ పిలానీ(అమరావతి) సలహాదారుగా వీఎస్ రావు

సాక్షి, అమరావతి: అమరావతిలో నెలకొల్పే బిట్స్ పిలానీ–అమరావతి క్యాంపస్ సలహాదారుగా ఆచార్య వజ్జా సాంబశివరావు(వీఎస్ రావు) బాధ్యతలు స్వీకరించారు. తుళ్లూరుకు చెందిన వీఎస్ రావు నాలుగున్నర దశాబ్దాల పాటు బిట్స్ పిలానీలో వివిధ హోదాల్లో పని చేశారు.

బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద సంబరాలు

సాక్షి, అమరావతి: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించడంతో విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. బాణసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుకుంటూ తమ సంతోషం వ్యక్తం చేశారు.

కృష్ణాబోర్డు సభ్య కార్యదర్శిగా ఎస్కే కాంబోజ్

సాక్షి, అమరావతి: కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సభ్య కార్యదర్శిగా సతీష్‌కుమార్ (ఎస్కే) కాంబోజ్‌ను కేంద్రం నియమించింది. బోర్డు సభ్య కార్యదర్శిగా పనిచేసిన డీఎం రాయ్‌పురే గత నెల పదవీ విరమణ చేశారు. దీంతో ఆ స్థానంలో సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) సీఈ ఎస్కే కాంబోజ్‌ను నియమిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ అండర్ సెక్రటరీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆక్టోపస్‌కు జాతీయస్థాయిలో రెండోస్థానం

సాక్షి, అమరావతి: కేంద్ర హోమ్ శాఖ నిర్వహించిన 'తొమ్మిదో నేషనల్ జాయింట్ కౌంటర్ ఐఈడీ ఎక్సర్‌సైజ్– విస్ఫాట్ కవచక్స్'లో ఏపీ ఆక్టోపస్ విభాగం రెండోస్థానం సాధించింది. ఈ పోటీలను హరియాణ మానేసార్‌లోని ఎన్ఎస్‌జీ ట్రైనింగ్ సెంటర్‌లో ఈనెల 10 నుంచి శుక్రవారం వరకు నిర్వహించారు. మొత్తం 23 బృందాలు పాల్గొన్న ఈ పోటీల్లో రాష్ట్ర ఆక్టోపస్ బృందం అత్యుత్తమ శిక్షణా నైపుణ్యాలు, ఆపరేషన్స్ అంశాల్లో రెండోస్థానం సాధించింది. ఏపీ ఆక్టోపస్ బృందానికి డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా శుక్రవారం అభినందించారు.

జ్యోతి సురేఖ, ధీరజ్‌కు శాప్ అభినందనలు

సాక్షి, అమరావతి: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో వెన్నం జ్యోతి సురేఖ, బొమ్మదేవర ధీరజ్ అద్భుత ప్రతిభ చాటారని శాప్ చైర్మన్ రవి నాయుడు అభినందించారు. జ్యోతి సురేఖ రెండు స్వర్ణ పతకాలు కైవసం చేసుకోగా.. ధీరజ్ ఒక స్వర్ణ పతకం అందుకున్నారని చెప్పారు.

మావోయిస్టు నేత ఆజాద్ లొంగుబాటు?

మూడు రోజులు క్రితం తెలంగాణకు రాక!

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)కి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన కీలక నేత, భద్రాద్రి కొత్తగూడెం – అల్లూరి సీతారామరాజు డివిజన్ కార్యదర్శి కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ అలియాస్ గోపన్న లొంగిపోయినట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి ద్వారా ఈ మేరకు ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఇటీవల సదరు నేతకు సంబంధించిన శుభకార్యం సందర్భంగా.. తనకు తెలిసిన కాంటాక్ట్ ద్వారా లొంగుబాటు ప్రయత్నాలు చేసినట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో ఈ లొంగుబాటును ప్రభుత్వం అధికారికంగా ధ్రువీకరించే అవకాశం ఉంది. కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్‌తో పాటు సింగరేణి కార్మిక సమాఖ్యకు చెందిన అశోక్, మరో 12 నుంచి 18 మంది వరకు మావోయిస్టులు లొంగిపోయే అవకాశం ఉంది.

కేంద్రం నుంచి మరో రూ.616 కోట్ల ఆర్థిక సంఘం నిధులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామీణ స్థానిక సంస్థల కోసం కేంద్రం మరో విడత 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. రెండో విడత టైడ్ గ్రాంట్‌గా రూ.616.14 కోట్లను ఈ నెల మొదటి వారంలో రాష్ట్రానికి విడుదల చేయగా, అందుకు సంబంధించిన పరిపాలన అనుమతులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం వేర్వేరు జీవోలు విడుదల చేసింది. గత నెలలో రూ.410.76 కోట్లు బేసిక్ గ్రాంట్ (అన్‌టైడ్) రూపంలో కేంద్రం ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఆ నిధులు ఇంకా గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో జమ చేయలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో ఇప్పటి వరకు విడుదల చేసిన మొత్తం రూ.1,026.90 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్‌ల ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. కాగా, 2025–26 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మొత్తం రూ.2,090 కోట్లు కేంద్రం కేటాయించింది.

చంద్రబాబు సర్కార్ ఐదేళ్లూ కొనసాగడం కష్టమే

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మీపార్వతి

సాక్షి,అమరావతి: గొప్పగా ఉన్నామని, అద్భుతంగా పాలన చేస్తున్నామని సీఎం చంద్రబాబు ఎన్ని గొప్పలు చెప్పుకుంటున్నా బాబు ప్రభుత్వ లోపాలు, పాలనా వైఫల్యాలు నిత్యం బయటపడుతూనే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లక్ష్మీపార్వతి తెలిపారు. ఆస్ట్రేలియాలోని బ్రస్‌బిల్‌లో ఆస్ట్రేలియా వైఎస్సార్‌సీపీ నాయకులు చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నందమూరి లక్ష్మీపార్వతి రాక సందర్భంగా ఆత్మీయ సమావేశం నిర్వహించి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'ప్రజల దృష్టి మరల్చేందుకు చేస్తున్న డైవర్షన్ పాలిటిక్స్‌ని ఎవరూ నమ్మడం లేదు. ఏడాదిన్నర పాలన చూసిన తర్వాత బాబు ప్రభుత్వం ఐదేళ్లూ కొనసాగడం కష్టమనే నిర్ణయానికి ప్రజలు వచ్చేశారు' అని పేర్కొన్నారు. ఎన్నారైలు శ్రీధర్ రెడ్డి వీరంరెడ్డి, గజ్జల చంద్ర ఓబుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య డిమాండ్

సాక్షి, అమరావతి : అన్నమయ్య రిజర్వాయర్‌ను పునరుద్ధరిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజంపేట సభలో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ విషయమై సీఎంకు రాసిన లేఖను ఈశ్వరయ్య శుక్రవారం మీడియాకు విడుదల చేశారు. వరద కారణంగా అన్నమయ్య ప్రాజెక్టు మట్టికట్ట కొట్టుకుపోయి అప్పట్లో 24 గ్రామాలకు నష్టం జరిగిందన్నారు. కట్ట తెగిపోయిన చోట బలోపేతం చేసి గేట్లు ఏర్పాటుచేసేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.787.77 కోట్లకు పరిపాలనా ఆమోదం తెలిపి ఉత్తర్వులు జారీచేసిందని ఆయన గుర్తుచేశారు. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులు జరగలేదని, చంద్రబాబు ప్రభుత్వం రావడంతో డిజైన్ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన మాటకు కట్టుబడి త్వరితగతిన అన్నమయ్య రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు పూర్తిచేయాలని ఈశ్వరయ్య కోరారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు రోజువారీ అలవెన్స్ పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎన్‌సీసీ క్యాడెట్ల రోజువారీ అలవెన్సును పెంచుతూ ఉన్నత విద్యా కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్స్, ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు అలవెన్సును రూ.265కు పెంచుతున్నట్టు పేర్కొన్నారు. ఇందులో కేంద్రం 75 శాతం, రాష్ట్రం 25 శాతం ఇస్తాయని తెలిపారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి చర్యలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని విభాగాల్లోనూ దివ్యాంగుల కోటా కింద బ్యాక్‌లాగ్ పోస్టుల(భర్తీకాని) భర్తీకి ప్రభుత్వం కాలపరిమితిని పొడిగించింది. ఈ మేరకు మహిళ, శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అన్ని శాఖల్లో 2024 మార్చి 31 నాటికి ఉన్న ఖాళీలను గుర్తించి భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

వర్సిటీల్లో మహిళల భద్రతకు చర్యలు చేపట్టాలి

సాక్షి, అమరావతి : మహిళలపై లైంగిక వేధింపులను నివారించడానికి విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యా సంస్థలు చర్యలు చేపట్టాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశించింది. పని ప్రదేశంలో మహిళా రక్షణకు, లైంగిక వేధింపులను నిరోధించడానికి జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) మార్గదర్శకాలను తప్పనిసరిగా అమలుచేయాలని తెలిపింది. ఇందులో భాగంగా.. ఎన్‌డబ్ల్యూసీ 'క్యాంపస్ కాలింగ్' కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని వర్సిటీ విభాగాధిపతులను కోరింది. విద్యా సంస్థలు మహిళల భద్రత విషయంలో చేపట్టిన చర్యలను యూజీసీ సక్షమ్ పోర్టల్‌లో నివేదించాలని స్పష్టంచేసింది. ఇందులో అంతర్గత ఫిర్యాదుల కమిటీ, ఫిర్యాదు పరిష్కార యంత్రాంగం, సవాళ్లను ఎదుర్కొనే వివరాలను తప్పనిసరిగా నివేదికలో పొందుపర్చాలని ఆదేశించింది.

చిట్టి బుర్రలపై పెను భారం

చదువు పేరుతో చిన్నారులపై కూటమి ప్రభుత్వం పెద్ద భారం మోపి పైశాచికానందాన్ని పొందుతోంది. చదువులు, ర్యాంకుల పేరుతో ఇప్పటి వరకు ప్రైవేట్ పాఠశాలల్లోనే ఒత్తిడి పెంచుతున్న పరిస్థితి ఉండింది. అయితే తాజాగా ఈ కోవలోకి ప్రభుత్వ స్కూళ్లు వచ్చి చేరాయి. సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల్లో ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న చిన్నారులకు 100 మార్కులను కేటాయించి రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులు ఝలక్ ఇచ్చారు. వీటిలో 80కు ప్రశ్నపత్రం, మరో 20కు ఇంటర్నల్ మార్కులుంటాయని ప్రకటించారు. ఇంటర్నల్‌లో ఏ విధంగా కేటాయిస్తారో నేటికీ చెప్పలేదు. గతంలో కేవలం 50 మార్కులకే ప్రశ్నపత్రం ఉండగా, చిన్నారులకు ప్రస్తుతం అగ్ని పరీక్ష పెట్టారు.

ఎస్ఏ పరీక్షల్లో 1, 2, 3వ తరగతులకు 100 మార్కులు

80కు ప్రశ్నపత్రం, మరో 20కు ఇంటర్నల్

క్వశ్చన్ పేపర్‌తో పాటు బుక్‌లెట్‌లోనూ జవాబులు రాయాల్సిందే

1, 2 క్లాసులకు 8.. 3, 4, 5కు 15 పేజీలు

రెండున్నర గంటల్లో రెండు షీట్లలో జవాబులు

ఇబ్బందులు పడుతున్న చిన్నారులు

నోరెళ్లబెడుతున్న ఉపాధ్యాయులు

నెల్లూరు (టౌన్): పరీక్షల పేరుతో చిట్టి బుర్రలపై భారాన్ని ప్రభుత్వం మోపుతోంది. ఉపాధ్యాయులకు సైతం అర్థం కాని ప్రశ్నలిస్తుండటం గమనార్హం. ఈ పరిణామాల క్రమంలో టీచర్లే నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నడూ లేని విధంగా ఆన్సర్ షీటుతో పాటు వర్క్‌బుక్‌లోనూ జవాబులు రాయాలని ఆదేశించారు. దీంతో ఏమీ తెలియని చిన్నారులు పరీక్షలంటేనే తీవ్ర ఒత్తిడికి గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.

ఇదీ తంతు..

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలను ఈ నెల పది నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. గవర్నమెంట్ స్కూళ్లలో 1.8 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఒకటి నుంచి ఐదు వరకు 85 వేల మందికిపైగా ఉన్నారు. ప్రభుత్వ స్కూళ్లతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారు ఈ పరీక్షలనే రాయాల్సి ఉంది. వీరందరికీ ఒకే ప్రశ్నపత్రాన్ని ముద్రించి పంపిణీ చేశారు. అయితే ప్రైవేట్ యాజమాన్యాలు మాత్రం సొంతంగా ముద్రించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఎస్సీఈఆర్టీ ముద్రించిన క్వశ్చన్ పేపర్‌తోనే ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షలు జరుపుతున్నారు.

పరీక్షలు ఇలా..

- 1, 2వ క్లాసులకు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్.. 3, 4, 5కు తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ పరీక్షలుంటాయి.
- అదే ఆరు నుంచి పది వరకు సబ్జెక్టుల వారీగా నిర్వహిస్తారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 100 మార్కులను కేటాయించారు.
- 80కు ప్రశ్నపత్రం, 20కు ఇంటర్నల్ పేరుతో మార్కులేయనున్నారు. జవాబు పత్రంతో పాటు వర్క్ బుక్‌లోనూ రాయాల్సి ఉంది.
- 1, 2కు 8.. 3, 4, 5 క్లాసులకు 15 పేజీలను కేటాయించారు.
- 20 ప్రశ్నలకు సంబంధించిన జవాబులను షీటులో, మిగిలిన 13కు సమాధానాలను బుక్‌లెట్‌లో రాయాల్సి ఉంది. రెండున్నర గంటల్లో రెండు షీట్లలో జవాబులను ఎలా రాయాలో చిన్నారులకు అర్థం కావడం లేదు. అసలీ వ్యవహారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారులకు తెలియదాననే సందేహం తలెత్తుతోంది.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

1, 2 తరగతుల ప్రశ్నపత్రంలా లేదని.. ఎంఏ చదివే వారికి ఇచ్చిన తరహాలో ఉందని ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సిలబస్‌తో సంబంధం లేకుండా శాస్త్రీయబద్ధంగా సైతం లేదంటున్నారు. సెల్ఫ్ అసెస్మెంట్, ఫార్మేటివ్ ప్రశ్నపత్రాల రూపకల్పనపై తమ నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. వీటి ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను ఎలా పరీక్షించాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టీచర్లే చెప్పి రాయిస్తున్న పరిస్థితి

జిల్లాలోని దాదాపు అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే సమాధానాలు చెప్పి పిల్లలతో రాయిస్తున్నారని సమాచారం. ఈ ప్రశ్నపత్రం ప్రకారం మెజార్టీ విద్యార్థులు ఫెయిలయ్యే పరిస్థితి ఉంది. రెండు పేపర్లు రాసేందుకు నాలుగు నుంచి ఐదు గంటల సమయం పడుతుందని చెప్తున్నారు. పరీక్ష నిర్వహణ, మూల్యాంకనానికే సమయం సరిపోతుందని, బోధన ఇంకెప్పుడు చేయాలని ప్రశ్నిస్తున్నారు.

సీసీఈ పరీక్ష విధానమే సరికాదు

సీసీఈ పరీక్ష విధానమే సరికాదు. 1, 2వ తరగతులకు రెండు సార్లు జవాబులు రాయాలనడం తగదు. సొంతంగా సిలబస్ ఇవ్వడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఉపాధ్యాయులే సమాధానం చెప్పి రాయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో చదువుపై పట్టు కోల్పోయే ప్రమాదం ఉంది.

– మోహన్‌దాస్, రాష్ట్ర నేత, ఏపీటీఎఫ్

మార్పు తీసుకురావాలి

ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్ష విధానంలో మార్పులు తీసుకురావాలి. ఒక సిలబస్‌నే రెండుసార్లు ఇవ్వడంతో ప్రయోజనం ఉండదు. దీంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇది సరైన విధానం కాదు.

– నవకోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి, యూటీఎఫ్

ఆంధ్రప్రదేశ్ బౌద్ధ ఆరామాలు చూసొద్దాం రండి!

పిల్లలూ... ప్రపంచానికి శాంతిని బోధించిన బుద్ధుడి గురించి మనందరికీ తెలుసుకదా. భారత ఉపఖండంలో జన్మించి ఇతర ఖండాలలో కూడా తన బోధనలతో గుర్తింపు తెచ్చుకున్న బుద్ధుడు అతను స్థాపించిన బౌద్ధమార్గానికి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. శాతవాహనుల కాలం నుంచి ఇక్ష్వాకుల పాలన వరకు, ఈ ప్రాంతం బౌద్ధ ధర్మానికి కేంద్రబిందువుగా నిలిచి, విశ్వశాంతి, ధ్యానం, తపస్సు వంటి విలువలను ప్రపంచానికి పరిచయం చేసింది. అమరావతి నుంచి నాగార్జున కొండ వరకు విస్తరించిన బౌద్ధ ఆరామాలు, ఆధ్యాత్మిక భావనలతో పాటు చిరస్థాయిగా నిలిచే శిల్పకళా సంపదను కూడా మోస్తున్నాయి.

1 అమరావతి బౌద్ధ ఆరామం

గుంటూరులో ఉన్న అమరావతి ఒకప్పుడు దక్షిణ భారత బౌద్ధ ధర్మానికి పెద్ద కేంద్రం. ఇక్కడున్న మహాస్తూపం చాలా ప్రసిద్ధి. స్తూపం గోడలపై బుద్ధుని జీవితంలోని మంచి కథలను శిల్పాల రూపంలో చెక్కారు. ఇవి చూస్తే బుద్ధుడు ప్రపంచశాంతికి ఎలాంటి బోధనలు చేశాడో తెలుస్తుంది.



2 నాగార్జున కొండ బౌద్ధ ఆరామాలు

నాగార్జునసాగర్ మధ్యలో ఉన్న దీవిని నాగార్జున కొండ అంటారు. ఇక్కడ మహాయాన బౌద్ధాన్ని ప్రచారం చేసిన ఆచార్య నాగార్జునుడు బోధనలు చేసారని చెబుతారు. విహారాలు, ధ్యానగృహాలు పాతకాలపు ఇటుక కట్టడాలు ఇక్కడ కనిపిస్తాయి. ఇది అప్పట్లో పెద్ద బౌద్ధ పాఠశాలగా పేరుగానించింది.



3 తోటలకొండ

విశాఖతీరాన ఉన్న బవికొండ, తోటలకొండ, సాలీవుడ్ ప్రాంతాలు ఒకప్పుడు విదేశీ యాత్రికులు తరచుగా వచ్చే అంతర్జాతీయ బౌద్ధ కేంద్రాలుగా ఉండేవి. వీటిలో కనిపించే ధ్యాన మండపాలు, విహారాలు, పూజా గహాలు బౌద్ధ జీవనశైలిని స్పష్టంగా ప్రతిబింబిస్తాయి.

4 ఘంటశాల

కృష్ణా జిల్లాలోని ఘంటశాల ఒకప్పుడు దక్షిణ భారత వాణిజ్య, ఆధ్యాత్మిక కేంద్రంగా నిలిచి, అపురూపమైన స్తూప నిర్మాణ శైలితో ప్రసిద్ధి చెందింది.

5 భట్టిప్రోలు

భట్టిప్రోలులో బౌద్ధానికి సంబంధించిన ప్రాచీనమైన స్తూపం ఉంది. ఇక్కడ కనుగొన్న బ్రాహ్మి శాసనం తెలుగునాట అతి పురాతన లిపులలో ఒకటిగా నిలిచింది. బుద్ధుని పవిత్ర అవశేషాలు ఇక్కడి స్తూపంలో నిల్వ చేసినట్లు చరిత్ర చెబుతుంది.

6 చందవరం

ప్రకాశం జిల్లాలోని చందవరం అనే గ్రామలో ఉన్న పురాతనమైన బౌద్ధక్షేత్రం దాదాపు రెండు వేల సంవత్సరాలకు పూర్వం నిర్మించిందిగా చరిత్రకారులు చెపుతున్నారు. పూర్వం కాశీ నుండి కంచికి ప్రయాణించే బౌద్ధ సన్యాసులు ఈ ప్రాంతంలో విశ్రాంతి తీసుకునేవారు.

● మహనీయులు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు



పిల్లలూ! తెలుగు నేలపై అనేకమంది సాహితీవేత్తలు తమ రచనలతో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసి, వారి ఉన్నతికి బాటలు వేశారు. సాహిత్యరచననే ప్రాణంగా భావించి జీవితాన్ని సుసంపన్నం చేసుకున్నారు. అటువంటివారిలో ఒకరు కాళోజీ నారాయణరావు. ఆయన్ని అందరూ 'కాళోజీ' అని పిలుస్తారు.

కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబరు 9న కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో జన్మించారు. తండ్రి రంగారావు మహారాష్ట్రీయుడు, తల్లి రమాబాయి కన్నడిగురాలు. కొంతకాలానికి కాళోజీ కుటుంబం బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లా మడికొండకు వచ్చింది. ఆ రకంగా కాళోజీ తెలుగునేలపై స్థిరపడ్డారు. హైదరాబాదులో ప్రాథమిక విద్య పూర్తి చేసిన నారాయణరావు 1939లో న్యాయవిద్య చదివి పట్టా పొందారు. 1930 నుంచే ఆయన గ్రంథాలయోద్యమంలో చురుగ్గా పాల్గొనేవారు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఓ గ్రంథాలయం ఉండాలనేది ఆయన ఆకాంక్ష. స్వాతంత్ర్య సమరం జరుగుతున్న సమయంలో సత్యాగ్రహంలో పాల్గొని 25 ఏళ్ల వయసులో జైలు శిక్ష అనుభవించారు.

ఆనాటి ప్రసిద్ధ నేతలతో కలిసి కాళోజీ ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్నారు. విద్యార్థిగా ఉన్న సమయంలో నిజాం ఆదేశాలు లెక్కచేయకుండా ధైర్యంతో నిలబడ్డారు. తెలంగాణ అంతటా విద్యావ్యాప్తి జరగాలని ఆంధ్ర సారస్వత పరిషత్తు స్థాపించిన వారిలో ఆయన కూడా ఒకరు. ఒక పక్క పోరాటాల్లో నిమగ్నమవుతూనే రచనలు చేశారు. ఆయన తెలుగుతోపాటు మరాఠీ, ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషల రచనలు తెలుగులోకి అనువదించారు. 1943లో 'కాళోజీ కథలు' పేరిట పుస్తకం ప్రచురించారు. 'ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ల కదలిక' అని ప్రఖ్యాతి పొందిన మాటను చెప్పింది నారాయణరావే. 'నా గొడవ' పేరుతో ఆయన రాసిన ఆత్మకథ ప్రసిద్ధి పొందింది. ఆయన అన్న రామేశ్వరరావు ప్రముఖ ఉర్దూ కవి కావడం విశేషం. నారాయణరావు 1958 నుంచి 1960 వరకూ ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యుడిగా పనిచేశారు. ఆయన సేవలకు మెచ్చి 1992లో భారత ప్రభుత్వం ఆయనకు 'పద్మవిభూషణ్' అందించింది. చివరిదాకా ప్రజాకవిగా బతికిన కాళోజీ 2002 నవంబర్ 13న కన్నుమూశారు.

● మీకు తెలుసా?

తియ్యటి పీచు మిఠాయి

తియ్యతియ్యటి పీచుమిఠాయి అంటే మీకు ఇష్టమా? నోరూరించే ఆ పదార్థం అంటే ఎవరికి ఇష్టముండదు అంటారా? మరి ఆ పీచుమిఠాయి చరిత్రేమిటో ఇప్పుడు తెలుసుకుందామా?

పీచుమిఠాయి చక్కెరతో చేసే దూది లాంటి ఆహార పదార్థం. దీన్నే కొన్నిచోట్ల 'సోన్ పాపిడీ' అని కూడా అంటారు. ఇది ఎక్కువగా తెలుపు, లేత గులాబీ, నీలం రంగుల్లో దొరుకుతుంది. ఇలా నోట్లో పెట్టుకోగానే అలా కరిగిపోతుంది. వీధుల్లో కొందరు పెద్ద సీసాల్లో పీచు మిఠాయి నింపుకొని, గంట కొడుతూ వచ్చి అమ్ముతుంటారు. 1897లో మొదటి సారి పీచుమిఠాయి ప్రపంచానికి తెలిసిందని అంచనా. అంతకుముందు కొంతమంది తమ ఇళ్లల్లో దీన్ని తయారు చేసుకున్నా విలియం మోరిసన్, జాన్.సి.వార్టల్ దీనికొక రూపు తీసుకొచ్చారు. ఎక్కువ రోజులు నిల్వ ఉండేలా యంత్రం ద్వారా తయారు చేసి, 1904లో అమెరికాలోని వరల్డ్ ఫేర్‌లో దీన్ని అమ్మకానికి పెట్టారు. దీని రుచి గ్రహించిన జనం విపరీతంగా కొనుక్కొని తిని ఆనందించారు. ఆ తర్వాత 1921లో ఆ పీచు మిఠాయి తయారీ యంత్రానికి జోసెఫ్ లాస్కోక్స్ మరికొన్ని మార్పులు చేశారు. అప్పుడే ఈ మిఠాయికి 'కాటన్ క్యాండీ' అని పేరు పెట్టారు. అలా ఆ పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. అమెరికాలో ఇప్పటికీ డిసెంబరు 7ను 'జాతీయ పీచుమిఠాయి దినోత్సవం'గా జరుపుకుంటారు. ప్రముఖ వేడుకలు, సంతలు, జాతర్ల సమయంలో పీచుమిఠాయి బండ్లు తప్పకుండా ఉండాల్సిందే. పీచుమిఠాయి తయారు చేసే యంత్రం చూసేందుకు ఆకర్షణీయంగా ఉంటుంది. గుండ్రంగా ఉండే ఓ హీటర్‌లో సాలెపురుగు దారాల్లాగా మిఠాయి తయారవుతూ ఉంటుంది. అందులో పుల్లను పెట్టి, మిఠాయిని బంతిలా చేసి బయటకు తీస్తారు. మీరు కొన్ని చోట్ల ఈ యంత్రాలు చూసే ఉంటారు. ఈ పీచుమిఠాయి చక్కెరతో తయారు చేస్తారు కాబట్టి మీరు దీన్ని మితంగా తినాలి. అప్పుడే అది మీ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అలా కాకుండా రోజూ ఈ మిఠాయి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు.

● కథ

గృహప్రవేశం



అనగనగా ఓ అడవిలో కుందేలు చాలా రోజులు కష్టపడి ఓ చక్కటి ఇల్లు కట్టుకుంది. గృహప్రవేశానికి ఏర్పాట్లు చేసింది. అడవిలోని వారందరికీ ఆహ్వానాలు అందాయి. ముహూర్తం రోజున అన్ని జంతువులూ వచ్చాయి. వేడుక చాలా ఘనంగా జరిగింది. ఆయా జంతువుల అలవాట్ల ప్రకారం విందు ఏర్పాటు చేసి కుందేలు వాటిని సంతృప్తి పరిచింది.

ఇంతలో కోలాహలం మొదలైంది. దూరం నుంచి గజరాజు రావడాన్ని వారంతా గమనించారు. భారీకాయం అక్కడికి నడిచి వస్తూ ఉండటంతో మిగిలిన జంతువుల్లో భయం మొదలైంది. ఏనుగుకు కూడా తాము ఆహ్వానం పంపినట్లు కుందేలు కుటుంబానికి గుర్తొచ్చింది. అయితే తమ ఇల్లు చాలా చిన్నది. ఆ ఇంటిలోకి ఏనుగు ప్రవేశిస్తే ఇక ఏమీ మిగలదు. అలాగని అతిథిని లోపలికి రావద్దని చెప్పడం భావ్యం కాదు. ఏం చేయాలో తెలియక కుందేలు కుటుంబం ఆందోళనలో పడింది.

ఇంతలో ఓ తెలివైన నక్క కుందేలు దగ్గరికి వచ్చి 'మీరేమీ చింతించకండి. గజరాజును ఎలా దారికి తేవాలో నాకు తెలుసు' అని చెప్పి అభయమిచ్చింది. కుందేలు కుటుంబం ఏనుగుకు ఎదురువెళ్లి స్వాగతం పలికింది. కాళ్లు కడిగి, చందనం రాసి, బొట్టు పెట్టి మర్యాద చేసింది. కుశలం అడిగి కనుక్కుంది. ఆ మర్యాదలకు ఏనుగు సంతృప్తి చెంది 'పదండి.. ఇంట్లోకి వెళ్దాం' అంది. ఆ మాటతో కుందేలు కుటుంబసభ్యులు బెదిరిపోయారు. ఏం చేయాలో తెలియక నక్క వైపు చూశారు.

నక్క ముందుకొచ్చి 'గజరాజా! మీరు ఈ అడవిలో ఎన్నికగన్న జీవి. మీరు రావడమే కుందేలు కుటుంబానికి జన్మధన్యమయ్యే విషయం. ఇప్పటికే వారు ఆనందంతో తబ్బిబ్బవుతున్నారు. ఇక మీరు శ్రమ తీసుకోవడం ఎందుకు? ఇంటి నిండా చుట్టాలున్నారు. మీ వంటి వారు లోపలికి వెళ్లి, వారిని తప్పించుకుంటూ ఇల్లు చూడటం తగదు. మీ స్థాయి అది కాదు. పైగా మీకోసం ఇక్కడే భారీ విందు ఏర్పాటు చేశారు' అని పలికింది. ఆ మాటలకు ఏనుగు కొంత సందేహించినా, తన స్థాయి తగ్గకుండా ఉండాలని 'అలాగా! అయితే సరే, నువ్వన్నట్లు నా స్థాయి అది కాదు. నేను ఇక్కడే ఉంటాను. విందు ఏర్పాటు చేయండి' అని హుందాగా పలికింది. దీంతో కుందేలు కుటుంబం హమ్మయ్యా అనుకుంది. హుటాహుటిన విందు ఏర్పాటు చేసి, కడుపు నిండా విందు ఆరగించిన ఏనుగు తృప్తిగా తేన్చి, కుందేలు కుటుంబాన్ని ఆశీర్వదించి వెళ్లింది. గండం తప్పినందుకు అందరూ సంతోషపడ్డారు.

● మన పుస్తకాలు

చిన్నారి హెఫ్లే చేసిన పనులేంటి?



చిన్నారులు చేసే అల్లరికి అంతూఅదుపు ఉండదు. అయినా వారేం చేసినా ముద్దే. అటువంటి ఓ పిల్లవాడే గ్రెగ్ హెఫ్లే. అతనికి రకరకాల ఊహలు, ఆశలు. తన స్కూల్లో తాను అందరికంటే పాపులర్ అవ్వాలని అతని కల. అందుకోసం రకరకాల పనులు చేస్తూ ఉంటాడు. ఆ పనులేంటి? చివరకు అతను పాపులర్ అయ్యాడా అనేది ఈ పుస్తకంలోని కథ. రచయిత, చిత్రకారుడు జెఫ్ కెన్నే రాసిన ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతి పొందింది. ఆ తర్వాత ఇదే పేరుతో పలు పుస్తకాలు సిరీస్‌గా వచ్చాయి.

పిల్లల్ని అలరించే హాస్య కథలు



చిన్నారులు నవ్వుతూ ఉంటే చూడముచ్చటగా ఉంటుంది. వారి నవ్వుల్ని మరింత పదిలం చేసే కథలివి. పిసినారులు, దుర్మార్గులు, దొంగలు, పొగరుబోతులు ఈ పుస్తకంలో తగిన శాస్తి అనుభవిస్తుంటారు. అలాగే నిత్యజీవితంలో జరిగే సరదా సంఘటనలని కూడా హాస్యంతో కథలుగా మలిచి, పిల్లలకు అర్థమయ్యే రీతిలో కథలుగా మలిచారు రచయిత హరికిషన్. ఇవి చదువుతూ ఉంటే నవ్వుల పువ్వులు విరుస్తాయి. పిల్లల మోములు వికసిస్తాయి.

● ఫొటో చెప్పిన కథ

మైక్రోచిప్ మంచిదే...

ఇక్కడ చూశారా? ఒక బుజ్జిగాడు తన పెట్ డాగ్ బరువు చూస్తున్నాడు. ఇప్పుడు తమిళనాడులో ప్రతి పెంపుడు శునకానికి మైక్రోచిప్పింగ్ తప్పనిసరి చేశారు. అలా మైక్రోచిప్ పెట్టించడానికి చెన్నైలోని యానిమల్ సెంటర్‌కు ఈ పిల్లవాడు తన శునకాన్ని తెచ్చుకున్నాడు. శునకానికి మైక్రోచిప్ పెడితే అది ఒకవేళ తప్పిపోయినా, దొంగలెత్తుకెళ్లినా వెతకడం సులువు అవుతుంది. అలాగే ఆ రాష్ట్రంలో వీధి కుక్కలకు లైసెన్సు తప్పనిసరి చేశారు. అంటే అది రిజిస్టర్ అయినట్టుగా మెడలో పట్టి వేస్తారు. ఇవన్నీ లెక్క తెలియడానికి... వాటి నుంచి ప్రమాదం రాకుండా వాక్సినేట్ చేయడానికి. మరి మీ శునకానికి ఉందా మైక్రోచిప్? లేకుంటే ఆ పని చూడండి. సరేనా?

గ్రేట్ మార్చ్

పిల్లలూ... ఈ ఫొటో చూడండి.... వందల దీపాలు ఊరేగింపు తీస్తున్నట్టు ఉన్నాయి కదూ. ఇది ఊరేగింపు కాదు. నిరసన ప్రదర్శన. బ్రెజిల్‌లోని గిరిజనులు 'గ్రేట్ మార్చ్ ఆఫ్ ఫారెస్ట్ పీపుల్స్' పేరుతో ఈ ఊరేగింపు తీశారు. దేనికో తెలుసా? తమ అడవులు కాపాడాలని... పర్యావరణాన్ని రక్షించమని. పెట్రోలు, ఇతర ఇంధనాల కోసం భూమిని తవ్విపోయొద్దని చెప్పడానికి. పిల్లలూ... పర్యావరణం ఒకసారి విధ్వంసం అయితే మళ్లీ సరికావడం కష్టం. మనం మన చెట్లను, నేలను, నీటిని, గాలిని కాపాడుకోవాలి. మీరు ఎన్ని చదువులు చదివినా పర్యావరణం గురించి తెలుసుకుంటూ దానిని కాపాడటానికి ప్రయత్నించాలి. సరేనా.

జీసీసీల్లో 40 లక్షల కొత్త కొలువులు

- 2030 నాటికి అంచనా
- ఏఐ, క్లౌడ్ ఫ్రెషర్లకు భారీగా అవకాశాలు
- టీమ్‌లీజ్ నివేదిక

ముంబై: దేశీయంగా భారీగా ఏర్పాటవుతున్న గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో (జీసీసీ) హైరింగ్ కూడా గణనీయంగా పెరుగుతోంది. 2029–30 నాటికి కొత్తగా 28 లక్షల నుంచి 40 లక్షల వరకు ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని టీమ్‌లీజ్ ఒక నివేదికలో తెలిపింది. దీని ప్రకారం భారత్‌లో 1,800 జీసీసీలు ఉన్నాయి. ప్రపంచం మొత్తం మీద ఉన్న జీసీసీల్లో ఇది 55 శాతం. 2024–25 ఆర్థిక సంవత్సరంలో వీటిలో 19 లక్షల మంది ప్రొఫెషనల్స్ ఉండగా, ఎగుమతులపరంగా 64.6 బిలియన్ డాలర్ల ఆదాయం ఆర్జించాయి. సంఘటిత ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధికి భారత జీసీసీ వ్యవస్థ మూలస్తంభంగా ఎదుగుతోందని టీమ్‌లీజ్ డిజిటల్ సీఈవో నీతి శర్మ తెలిపారు. కొత్త రిక్రూట్స్‌లో 14–22 శాతం మంది ఏఐ, క్లౌడ్, డేటా ఇంజినీరింగ్‌లాంటి డిజిటల్ నైపుణ్యాలు గల ఫ్రెషర్స్ ఉండబోతున్నారని పేర్కొన్నారు. మిగతా 76–86 శాతం మంది మధ్య స్థాయి ప్రొఫెషనల్స్ ఉంటారని వివరించారు.

కఠినతరమైన చట్టాలు..

వేగంగా విస్తరిస్తున్న జీసీసీలు కేంద్ర, రాష్ట్ర, స్థానిక స్థాయిలో ఏటా 2,000కు పైగా లీగల్ నిబంధనలను పాటించాల్సి ఉంటోంది. కార్మిక, ట్యాక్స్, పర్యావరణ చట్టాలు మొదలైనవి వీటిలో ఉంటున్నాయి. వీటికి అనుగుణంగా జీసీసీ ఆపరేటర్లు తమ కార్యకలాపాలను నిర్వహించుకోవాల్సి ఉంటుందని టీమ్‌లీజ్ రెగ్‌టెక్ సహ వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్ తెలిపారు. తదుపరి విధానకర్తలు, పరిశ్రమ, విద్యారంగం ఏ విధంగా డిజిటల్ నైపుణ్యాలు గల, నిబంధనలకు అనుగుణంగా పని చేయగలిగే సిబ్బందిని తయారు చేసుకుంటాయనే దానిపైనే జీసీసీల విస్తరణ అనేది ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.

టీజిన్‌తో బయోవరం జట్టు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జపాన్‌కి చెందిన టీజిన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు హైదరాబాద్‌కి చెందిన బయోటెక్నాలజీ సంస్థ బయోవరం వెల్లడించింది. టీజిన్ గ్రూప్‌కి చెందిన పునరుత్పాదక వైద్య ఉత్పత్తులు, మెడికల్ డివైజ్‌ల వినియోగాన్ని భారత్‌లో పెంచడం, బయోవరంనకు చెందిన ఉత్పత్తులను జపాన్ మార్కెట్లో ప్రవేశపెట్టడం వంటి అంశాలకు ఇది ఉపయోగపడనుంది. పరిశోధనలు, కొత్త ఆవిష్కరణల విషయంలో తమ సామర్థ్యాలను పటిష్టం చేసుకునేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని యూఆర్ అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ వ్యవస్థాపకుడు జగన్మోహన్ రెడ్డి తెలిపారు. ఇరు సంస్థలకు అసాధారణ సాంకేతిక సామర్థ్యాలు, అనుభవాల నేపథ్యంలో వినూత్నమైన థెరపీలను ప్రవేశపెట్టేందుకు వీలు ఉంటుందని టీజిన్ జీఎం తకాయికి నకానో తెలిపారు.

భారత మార్కెట్లో మాండెలీజ్ బిస్కాఫ్

న్యూఢిల్లీ: స్నాక్స్ బ్రాండ్ మాండెలీజ్ ఇంటర్నేషనల్ తాజాగా లోటస్ బేకరీస్‌కి చెందిన బిస్కాఫ్ కుకీలను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. బిస్కాఫ్ రాకతో మాండెలీజ్ ఇండియా దేశీయంగా తమ ప్రీమియం కుకీ పోర్ట్‌ఫోలియోను మరింతగా విస్తరించినట్లవుతుంది. లోటస్‌తో ఒప్పందం ప్రకారం భారత్‌లో బిస్కాఫ్‌ల తయారీ, మార్కెటింగ్, పంపిణీని మాండెలీజ్ ఇండియా చేపడుతుంది. అయిదు పరిమాణాల్లో లభించే బిస్కాఫ్ ప్యాక్‌ల రేటు రూ. 10 నుంచి ప్రారంభమవుతుంది. రిటైల్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో లభిస్తుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-11-2025

విశాఖ	600–00
చిత్తూరు	653–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	615–00
విజయవాడ	625–00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	605–00
వరంగల్	607–00
రిటైల్ ధర	6.65

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,874.30	3.77
HINDALCO	814	2.47
INDIGO	5,911.00	1.99
ICICIBANK	1,385.40	1.95
LT	4,005.00	1.27

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	297.4	-3.69
TMCV	320.1	-2.84
M&M	3,699.40	-1.46
EICHERMOT	6,796.50	-1.2
TATASTEEL	176.55	-1.15

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	8,843
ఎన్‌ఎస్‌ఈ	1,12,397
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	1,19,106
ఎఫ్‌ఐఐ	- 4,968
డీఐఐ	+ 8,461

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.21 (రాత్రి 11.30కు)	$ 58.69 (క్రితం ముగింపు)
బ్రెంట్	64.53 (రాత్రి 11.30కు)	$ 63.01 (క్రితం ముగింపు)

ప్రయోగాత్మక పని విధానాలు

- పరిస్థితులకు తగ్గట్లు మార్పులు
- కొత్త నైపుణ్యాలకు స్వాగతం
- భవిష్యత్‌పై ఉద్యోగుల మనోగతం
- వర్క్‌ప్లేస్ ట్రెండ్స్ నివేదిక 2025 వెల్లడి

ముంబై: భారత్‌లో పని సంస్కృతి మార్పు క్రమంలో ఉందని, భవిష్యత్తు అంతా ప్రయోగాత్మక పని విధానాలు, పరిస్థితులకు అనుణంగా మార్పులను స్వీకరించే వారిదేనని మెజారిటీ ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. ఇండీడ్ కోసం వాలువోక్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. ఈ సర్వేకు సంబంధించి వివరాలతో 'వర్క్‌ప్లేస్ ట్రెండ్స్ రిపోర్ట్ 2025' విడుదలైంది. ప్రయోగాత్మక పని నమూనాలు, పరిస్థితులకు అనుగుణంగా మారే వారికే భవిష్యత్తు ఉంటుందని 58 శాతం మంది భారత ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు. రివర్స్ మెంటారింగ్ (సీనియర్లకు జూనియర్ల మార్గదర్శనం), మైక్రో రిటైర్మెంట్ (కెరీర్‌లో స్వల్ప విరామాలు), ఏఐ మూన్‌షైనింగ్ (జాబ్ టాస్క్‌ల కోసం ఏఐని గోప్యంగా వినియోగించడం), ఏఐ వాషింగ్, స్కిల్ నోమడిజమ్ (పనికి సంబంధించి కొత్త నైపుణ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం) వంటి కొత్త పని ధోరణులను ప్రయోగాత్మక పని నమూనాలుగా ఈ నివేదిక అభివర్ణించింది. 2,584 మంది ఉద్యోగులు, 1,288 సంస్థల అభిప్రాయాలను ఈ సర్వే కోసం పరిగణనలోకి తీసుకున్నారు.

వృద్ధికే ప్రాధాన్యం..

వృద్ధికే మొదటి ప్రాధాన్యమని ప్రతి ఐదుగురు భారత ఉద్యోగుల్లో ఇద్దరు భావిస్తున్నారు. ముఖ్యంగా ఎప్పటికప్పుడు అదనపు నైపుణ్యాలు నేర్చుకోవడం, రోజువారీ విధులతో ఏఐని అనుసంధానించడం వంటివి అనుసరిస్తున్నారు. తమ కష్టాన్ని గుర్తించడం వరకే కాకుండా.. కొత్తగా నేర్చుకునేందుకు, తమని తాము తిరిగి ఆవిష్కరించుకునేందుకు గాను కొంత సమయం కేటాయింపు, ప్రస్తుత ఉద్యోగంలో విరామం అవసరమని ఉద్యోగులు భావిస్తున్నారు. ఎప్పుడూ పనిచేసుకుపోవడం అన్న విధానానికే పరిమితం కాకుండా.. విరామం, తిరిగి నైపుణ్యాలు ఆర్జించడం వంటి కొత్త ధోరణి ఉద్యోగుల్లో కనిపిస్తోంది. 41 శాతం మంది ఉద్యోగులు తమకంటూ బలమైన సరిహద్దులు విధించుకుని, కొత్త నైపుణ్యాలు నేర్చుకుంటున్నట్టు చెప్పారు. నైపుణ్యాల పెంపునకు ఎక్కువ మంది ఉద్యోగులు ఆసక్తి చూపిస్తున్నట్టు ఇండీడ్ ఇండియా ఎండీ శశి కుమార్ తెలిపారు. వ్యక్తిగత వృద్ధి, సంప్రదాయేతర పని ఏర్పాట్లు భవిష్యత్తు కార్పొరేట్ ఇండియా ప్రధాన లక్షణాలుగా ఉంటాయన్నారు.

ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ సంస్థల్లో ఎఫ్‌పీఐల వాటా డౌన్

15 ఏళ్ల కనిష్టానికి తగ్గుదల

ముంబై: ఎన్‌ఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐ) వాటా 15 ఏళ్ల కనిష్టానికి తగ్గింది. సెప్టెంబర్ ఆఖరు నాటికి 16.9 శాతానికి దిగి వచ్చింది. ఎన్‌ఎస్‌ఈ డేటా ప్రకారం వరుసగా తొమ్మిదో త్రైమాసికంలో దేశీ మ్యుచువల్ ఫండ్స్ వాటా పెరిగి 10.9 శాతానికి చేరింది. అటు వ్యక్తిగత ఇన్వెస్టర్ల వాటా స్థిరంగా కొనసాగుతున్నప్పటికీ, మ్యుచువల్ ఫండ్స్‌లో వారి హోల్డింగ్స్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే 18.75 శాతానికి చేరింది. ఇది 22 ఏళ్ల గరిష్ట స్థాయి. ఇక అన్ని కంపెనీల్లోనూ ప్రమోటర్ల హోల్డింగ్స్ స్థిరంగా 50.1 శాతంగా, నిఫ్టీ500 కంపెనీల్లో 49.3 శాతంగా నమోదయ్యాయి. అయితే, కీలకమైన నిఫ్టీ50లో మాత్రం ప్రమోటర్ల వాటాల 23 ఏళ్ల కనిష్టమైన 40 శాతానికి పడిపోయింది. ఎఫ్‌పీఐలు ఆర్థిక రంగంపై ఓవర్‌వెయిట్‌గా, కమ్యూనికేషన్ సర్వీసుల విషయంలో సానుకూలంగా ఉన్నారు. ఇంధనం, మెటీరియల్స్ లాంటి కమోడిటీ ఆధారిత రంగాలు, వినియోగ ఆధారిత సెక్టార్లపై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. అయితే, దేశీ ఫండ్స్ మాత్రం లార్జ్–క్యాప్ ఫైనాన్షియల్స్‌పై ఓవర్‌వెయిట్‌గా, నిత్యావసరాల స్టాక్స్‌పై బేరిష్‌గా ఉన్నాయి.

టాటా ఏఐజీ నుంచి 'సైబర్ ఎడ్జ్' ప్లాన్

హైదరాబాద్: టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతాల్లో వ్యాపార సంస్థలు, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌ల కోసం సమగ్రమైన సైబర్ ఇన్సూరెన్స్ ప్లాన్ 'సైబర్‌ఎడ్జ్'ను విడుదల చేసింది. సైబర్ దాడులు, డేటా చోరీల నేపథ్యంలో సమగ్రమైన రక్షణ కోసం దీన్ని తీసుకొచ్చినట్టు సంస్థ ప్రకటించింది.

రెండు తెలుగు రాష్ట్రాల్లో 2024లో 6.2 మిలియన్ మాల్వేర్ దాడులు, 17,500 ర్యాన్సమ్‌వేర్ దాడులు జరిగాయని, ప్రతీ డేటా చోరీ కారణంగా సగటు నష్టం రూ.19.5 కోట్లుగా ఉన్నట్టు పేర్కొంది. తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడేళ్లో 25% ప్రీమియంను సైబర్ ఇన్సూరెన్స్ రూపంలో సాధించాలని, లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపింది.

జీఎస్‌టీ సవరణ తర్వాత బీమాకు ఆదరణ

- అక్టోబర్‌లో గణనీయమైన స్పందన
- ఐఆర్‌డీఏఐ సభ్యుడు దీపక్ సూద్

ముంబై: జీఎస్‌టీ రేట్ల సవరణ అనంతరం బీమా రంగంలో గణనీయమైన వృద్ధి కనిపిస్తున్నట్టు బీమా రంగ నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) సభ్యుడు దీపక్ సూద్ అన్నారు. అసోచామ్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడారు. జీఎస్‌టీని సున్నా చేయడం ద్వారా బీమా రక్షణను సైతం నిత్యావసర వస్తువు కిందకు తీసుకొచ్చినట్టు చెప్పారు. మరింత మందికి బీమాని చేరువ చేయాల్సిన బాధ్యత ఇప్పుడు పరిశ్రమపై ఉన్నట్టు వ్యాఖ్యానించారు. జీఎస్‌టీ ప్రయోజనాన్ని పూర్తి స్థాయిలో బదిలీ చేయడం ద్వారా బీమాను మరింత అందుబాటు ధరలకే తీసుకురావాలని కోరారు. ''అక్టోబర్‌లో గణాంకాలను చూస్తే లైఫ్ ఇన్సూరెన్స్, రిటైల్ హెల్త్ ఇన్సూరెన్స్ గణనీయమైన వృద్ధిని చూశాయి. ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది''అని దీపక్ సూద్ పేర్కొన్నారు. టెక్నాలజీని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా పంపిణీ వ్యయాలు తగ్గించుకోవచ్చని, తప్పుడు మార్గంలో విక్రయాలను అరికట్టొచ్చని చెప్పారు. ''బీమా ప్రీమియంను జీడీపీ నిష్పత్తితో పోల్చి విస్తరణను చూస్తుంటాం. అలా చూస్తే ప్రపంచంలో భారత్ సగటున సగంలోనే ఉంటుంది. కానీ, ఎంత మంది బీమా కవరేజీ పరిధిలో ఉన్నారన్నది చూడడం ద్వారానే మన దేశ జనాభాలో బీమా ఎంత మందికి చేరువ అయ్యిందన్నది అర్థం చేసుకోగలం''అని చెప్పారు. ప్రకృతి విపత్తులకు సంబంధించి ప్రత్యేకమైన బీమా ఉత్పత్తులను తీసుకురావాలని పరిశ్రమను కోరారు. రాష్ట్రాల వారీ ప్రత్యేకమైన ప్లాన్లపైనా దృష్టి సారించాలని సూచించారు.

డైసన్ నుంచి కొత్త ఎయిర్ ప్యూరిఫయర్లు

హైదరాబాద్: వేడి, చల్లని గాలినిచ్చే రెండు కొత్త ఎయిర్ ప్యూరిఫయర్ (గాలి శుద్ధి యంత్రాలు)లు.. హాట్‌ప్లస్‌కూల్ హెచ్‌పీ2 డీ–నాక్స్, హాట్‌ప్లస్‌కూల్ హెచ్‌పీ1ను డైసన్ విడుదల చేసింది. ఏడాదిపాటు అన్ని కాలాల్లోనూ గాలిని శుద్ధి చేయడంతో పాటు సౌకర్యవంతంగా ఉండేందుకు వీటిని రూపొందించినట్టు సంస్థ ప్రకటించింది.

దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో వాయు నాణ్యత శీతా కాలంలో గణనీయంగా పడిపోతుంటుంది. ఈ తరుణంలో డైసన్ కొత్త ఉత్పత్తులను ఆవిష్కరించడం గమనార్హం. 0.1 మైక్రాన్ల స్థాయి ధూళి కణాలను సైతం ఈ పరికరాలు శుద్ధి చేస్తాయని డైసన్ ప్రకటించింది.

వాహన టోకు విక్రయాలు అదుర్స్

అక్టోబర్‌లో 17 శాతం వృద్ధి

- సియామ్ గణాంకాల వెల్లడి

న్యూఢిల్లీ: పండుగ సీజన్ డిమాండ్, జీఎస్‌టీ 2.0 అమలు కారణంగా ధరలు దిగిరావడంతో ఆటో కంపెనీలు అక్టోబర్‌లో డీలర్లకు రికార్డు స్థాయిలో వాహనాలను సరఫరా చేశాయని భారత ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) తెలిపింది. ప్యాసింజర్ వాహనాలు, ద్విచక్ర వాహనాలకు సంబంధించి ఇప్పటివరకు ఒక నెలలో ఇవే అత్యధిక టోకు విక్రయాలు అని పేర్కొంది. సియామ్ గణాంకాల ప్రకారం...

- గత నెలలో కంపెనీల నుంచి డీలర్లకు మొత్తం 4,60,739 ప్రయాణికుల వాహనాలు సరఫరా అయ్యాయి. గతేడాది ఇదే అక్టోబర్ సరఫరాలు 3,93,238 యూనిట్లతో పోలిస్తే ఇవి 17% అధికంగా ఉన్నాయి.
- వార్షిక ప్రాతిపదికన ద్విచక్రవాహనాల సరఫరా 2% పెరిగి 22,10,727 యూనిట్లకు చేరింది. స్కూటర్ల సరఫరాలు 7,21,200 యూనిట్ల నుంచి 8,24,003కు చేరాయి. అయితే మోటార్ సైకిళ్ల విక్రయాలు 4% తగ్గి 13,35,468 యూనిట్లకు పరిమితమయ్యాయి.
- త్రిచక్ర వాహనాల టోకు విక్రయాలు 6% పెరిగి 81,288 వాహనాలకు చేరాయి.

''వ్యవస్థలో కొంత రవాణా సరఫరా సమస్యలున్నప్పటికీ.., అక్టోబర్‌లో ప్యాసింజర్, టూవీలర్స్, త్రీవీలర్స్‌లు రికార్డు స్థాయిలో డీలర్లకు సరఫరా అయ్యాయి. సెప్టెంబర్ 22 నుంచి జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అమల్లోకి రావడంతో వాహనాల కొనేవారి సంఖ్య పెరిగింది. అందుకే రిజిస్ట్రేషన్లు హోల్‌సేల్ కంటే అధికంగా నమోదయ్యాయి'' అని సియామ్ డైరెక్టర్ జనరల్ రాజేశ్ మీనన్ తెలిపారు.

క్యూ2 ఆర్థిక ఫలితాలు

ఎంఆర్‌ఎఫ్ డివిడెండ్ రూ. 31

క్యూ2 నికర లాభం రూ. 526 కోట్లు

న్యూఢిల్లీ: టైర్ల తయారీ దేశీ దిగ్గజం ఎంఆర్‌ఎఫ్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 12 శాతం ఎగసి రూ. 526 కోట్లకు చేరింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 471 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 31 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 7 శాతం బలపడి రూ. 7,379 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 6,881 కోట్ల అమ్మకాలు అందుకుంది. అయితే మొత్తం వ్యయాలు సైతం రూ. 6,363 కోట్ల నుంచి రూ. 6,788 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో ఎంఆర్‌ఎఫ్ షేరు బీఎస్‌ఈలో 0.6% క్షీణించి రూ. 1,57,432 వద్ద ముగిసింది.

సన్ టీవీ లాభాలకు గండి

- క్యూ2లో 13 శాతం డౌన్
- షేరుకు రూ.3.75 డివిడెండ్

న్యూఢిల్లీ: వ్యయాలు పెరిగిపోవడం, ఆదాయం తగ్గుముఖం పట్టడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికంలో (క్యూ2) సన్ టీవీ నెట్‌వర్క్ బలహీన పనితీరు నమోదు చేసింది. రూ.355 కోట్ల లాభాన్ని ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.409 కోట్లతో పోల్చి చూస్తే 13 శాతానికి పైనే తగ్గింది. ఇదే కాలంలో ఆదాయం సైతం 39 శాతం తగ్గిపోయింది. క్రితం ఏడాది ఇదే క్వార్టర్‌లో ఉన్న రూ.1,300 కోట్ల నుంచి రూ.935 కోట్లకు పరిమితమైంది. మొత్తం వ్యయాలు 55 శాతం ఎగసి రూ.923 కోట్లకు చేరాయి. కానీ, ఇతర ఆదాయాన్ని కూడా కలిపి చూస్తే మొత్తం ఆదాయం రూ.1,439 కోట్లకు చేరింది. సన్ టీవీ నెట్‌వర్క్ కింద వివిధ భాషా వినోద, వార్తా ఛానళ్లతోపాటు, సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ జట్టు, దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టు ఉన్న విషయం తెలిసిందే. సెప్టెంబర్ త్రైమాసికంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.94 కోట్లు, సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ రూ.567 కోట్ల ఆదాయాన్ని సమకూర్చాయి. మరోవైపు వాటాదారుల వద్ద నున్న ప్రతీ షేరుకు రూ.3.75 చొప్పున మధ్యంతర డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ బోర్డు నిర్ణయించింది.

బీఎస్‌ఈలో సన్ టీవీ షేరు ధర ఎలాంటి మార్పు లేకుండా రూ.563 వద్ద స్థిరపడింది.

నాట్కో ఫార్మా లాభం 23 శాతం డౌన్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నాట్కో ఫార్మా నికర లాభం (కన్సాలిడేటెడ్) రూ. 518 కోట్లుగా నమోదైంది. గత క్యూ2లో నమోదైన రూ. 676.5 కోట్లతో పోలిస్తే 23 శాతం క్షీణించింది. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల సంబంధిత వ్యయాలు, పెరగడం, ఉద్యోగులకు వన్ టైమ్ బోనస్ ఇవ్వడం లాంటి అంశాలు ఇందుకు కారణం. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 2 ముఖ విలువ చేసే ఒక్కో షేరుపై రూ. 1.50 చొప్పున కంపెనీ రెండో మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. ఆదాయం రూ. 1,371 కోట్ల నుంచి రూ. 1,363 కోట్లకు నెమ్మదించింది. వ్యయాలు రూ. 617 కోట్ల నుంచి రూ. 849 కోట్లకు చేరాయి. సమీక్షాకాలంలో ఫార్ములేషన్స్ ఎగుమతుల ఆదాయం రూ. 1,211 కోట్ల నుంచి రూ. 1,147 కోట్లకు తగ్గింది.

శరత్ ఇండస్ట్రీస్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 5.7 కోట్లు

హైదరాబాద్: రొయ్యల పెంపకం, ఎగుమతుల కంపెనీ శరత్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. క్యూ2లో స్టాండెలోన్ నికర లాభం 54 శాతం జంప్‌చేసి రూ. 5.7 కోట్లను అధిగమించింది. రష్యా, చైనాలకు ఎగుమతులు పెరగడం, కొత్త ప్రొడక్టుల విడుదల ఇందుకు సహకరించినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3.7 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 49 శాతం ఎగసి రూ. 150 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 100 కోట్ల టర్నోవర్ సాధించింది.

ముత్తూట్ ఫిన్‌కార్ప్ లాభం రూ. 430 కోట్లు

న్యూఢిల్లీ: ముత్తూట్ పప్పచ్చన్ గ్రూప్‌లో భాగమైన ముత్తూట్ ఫిన్‌కార్ప్ (ఎంఎఫ్ఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సుమారు రూ. 430 కోట్ల నికర లాభం, రూ. 2,712.13 కోట్ల ఆదాయం ప్రకటించింది. వార్షిక ప్రాతిపదికన ఆదాయం 28 శాతం, లాభం సుమారు 60 శాతం వృద్ధి చెందాయి. స్థూల నిరర్థక ఆస్తుల పరిమాణం 1.41 శాతంగా, నికర నిరర్థక ఆస్తుల పరిమాణం 0.76 శాతంగా ఉన్నాయి. అర్థ సంవత్సరానికి గాను ఆదాయం (కన్సాలిడేటెడ్) దాదాపు రూ. 4,973 కోట్లుగా, లాభం రూ. 630 కోట్లుగా నమోదైంది.

రాంకీ ఇన్‌ఫ్రా లాభం రూ. 75.6 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రాంకీ ఇన్‌ఫ్రా నికర లాభం (కన్సాలిడేటెడ్) రూ. 75.6 కోట్లుగా, ఆదాయం రూ. 471.6 కోట్లుగా నమోదైంది. అంతక్రితం క్యూ2లో లాభం రూ. 83 కోట్లు కాగా, ఆదాయం రూ. 527.4 కోట్లుగా ఉంది. సమీక్షాకాలంలో హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ నుంచి ప్రాజెక్టు దక్కించుకున్నట్లు తెలిపింది. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లలో గోదావరి నీటిని నింపాల్సిన ఈ కాంట్రాక్టు విలువ రూ. 2,085 కోట్లు. రెండేళ్ల వ్యవధిలో దీన్ని నిర్మించాల్సి ఉంటుంది. పదేళ్ల పాటు నిర్వహించాల్సి ఉంటుంది. క్యూ2లో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించినట్లు రామ్‌కీ ఇన్‌ఫ్రా సీఈవో సునీల్ నాయర్ తెలిపారు.

ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ లాభం రూ. 19 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఎన్‌సీఎల్ ఇండస్ట్రీస్ రూ. 19 కోట్ల లాభం (కన్సాలిడేటెడ్) ప్రకటించింది. ఆదాయం రూ. 345 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం క్యూ2లో ఆదాయం రూ. 330 కోట్లు కాగా, లాభం రూ. 2.51 కోట్లు.

పేజ్ ఇండస్ట్రీస్ లాభం ఫ్లాట్

క్యూ2లో రూ. 195 కోట్లు

న్యూఢిల్లీ: జాకీ బ్రాండ్ దుస్తుల తయారీ దిగ్గజం పేజ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. క్యూ2లో నికర లాభం యథాతథంగా రూ. 195 కోట్లకు చేరింది. గతేడాది. ఇదే కాలంలో రూ. 195 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం వృద్ధితో రూ. 1,291 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 1,246 కోట్ల టర్నోవర్ సాధించింది. ఇబిటా 0.7 % నీరసించి రూ. 280 కోట్లకు పరిమితమైంది. అమ్మకాల పరిమాణం 2.5 % వృద్ధితో 5.66 కోట్ల పీస్‌లను తాకినట్లు కంపెనీ వెల్లడించింది.

వరదనీటి రెస్టారెంట్

చుట్టూ చేపలు... వాటి మధ్యలో లంచ్

సాధారణంగా రెస్టారెంట్లలోకి నీరు చేరితే యజమానులు కన్నీళ్లు పెట్టుకుంటారు. కానీ, థాయ్‌లాండ్‌లోని ఈ రెస్టారెంట్ యజమానికి మాత్రం వరద నీరే అదృష్ట దేవతలా మారింది! డైనింగ్ టేబుళ్ల మధ్య చేపలు ఈదుతుంటాయి. కస్టమర్లకు అద్భుతమైన అనుభూతిని అందిస్తున్నాయి. ఈ వింత రెస్టారెంట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. ఆహారం ఆస్వాదిస్తూ.. కాళ్ల దగ్గర ఈదే చేపలను చూసేందుకు ఇక్కడ జనం బారులు తీరుతున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

పా జిత్ రెస్టారెంట్లో కూర్చుని చేపలకు ఆహారం వేస్తూ కస్టమర్ల సరదా

వినియోగదారుల కోసం వంట పనిలో నిమగ్నమైన పోర్న్‌కామోల్

చుట్టూ నీళ్లలో చేపలు విహరిస్తుండగా విందారగిస్తున్న వినియోగదారులు

చేపలతో కలిసి విందు!

మధ్య థాయ్‌లాండ్‌లోని ఒక రెస్టారెంట్‌లో భోజనం చేయడం అద్భుతమైన అనుభూతినిస్తుంది. ఆ భోజనానుభవం కోసమే కస్టమర్లు పోటెత్తుతున్నారు. వరద నీటిలో కూర్చున్నాక.. కాళ్ల కింద చేపలు చేసే సందడి చూస్తూ.. సరదా సరదాగా భోజనం చేస్తూ ఆస్వాదిస్తున్నారు. పక్కనే ఉన్న నది ఉప్పొంగి 11 రోజులైనప్పటి నుంచి, వరద ముంపునకు గురైన నదీతీర రెస్టారెంట్ ఇంటర్నెట్‌లో ఒక సంచలనంగా మారింది. నీటిలో కూర్చుని ఫొటోలు దిగడానికి లేదా చేపలకు మేత వేస్తూ.. ఆ హడావిడిని ఫొటోలు తీయడానికి కస్టమర్లు ఉత్సాహంగా వస్తున్నారు. బ్యాంకాక్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న నఖోన్ పాథోమ్ ప్రావిన్స్‌లోని పా జిత్ రెస్టారెంట్‌లో కుటుంబాలు లంచ్ ఆస్వాదిస్తున్నాయి. చుట్టూ చేపలు ఈదుతుంటే చిన్నపిల్లలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. వెయిటర్లు చేపల సూప్ లేదా చికెన్ నూడుల్స్ గిన్నెలను నేర్పుతో టేబుల్స్ వద్దకు తీసుకొస్తున్నారు.

ఎవరూ రారనుకున్నా..

పా జిత్ రెస్టారెంట్ 30 ఏళ్లకు పైగా నదీతీరంలో స్థిరంగా ఉందని యజమాని పోర్న్‌కామోల్ ప్రాంగ్‌ప్రెంప్రీ తెలిపారు. దాదాపు నాలుగేళ్ల క్రితం తొలిసారి రెస్టారెంట్ మునిగినప్పుడు ఆమె తీవ్ర ఆందోళనకు గురయ్యారు. 'కస్టమర్లు ఎవరూ రారని అనుకున్నాను.. కానీ అప్పుడు ఒక కస్టమర్ వచ్చి, ఇక్కడ చేపలు ఉన్నాయని ఆన్‌లైన్‌లో పోస్ట్ చేశారు. అప్పటి నుండి చాలా మంది ఇక్కడ తినడానికి గుమిగూడారు'.. అని ఆమె గుర్తు చేసుకున్నారు.

లాభాలే లాభాలు

వరదల కారణంగా తన వ్యాపారం పెరిగిందని, రోజుకు దాదాపు 10,000 బాట్‌ల (భారత కరెన్సీలో సుమారు రూ.23,000) నుండి 20,000 బాట్‌ల (సుమారు రూ.46,000) వరకు తన లాభం రెట్టింపయ్యిందని ఆమె వివరించారు.

పిల్లలు ఇష్టపడే రెస్టారెంట్

అదే ప్రావిన్స్‌లో నివసించే 29 ఏళ్ల చోంపునట్ ఖంతనితి.. తన భర్త, కొడుకుతో కలిసి ఇక్కడికి వచ్చారు. 'ఇక్కడ చాలా బాగుంది. పిల్లలను ఇక్కడికి తీసుకురావచ్చు. చేపలను చూసినప్పుడు వారు అల్లరి చేయడం తగ్గిస్తారు. థాయ్‌లాండ్‌లో ఇలా చేపలు పైకి వచ్చేది ఈ ఒక్కచోట మాత్రమేనని అనుకుంటున్నాను'.. అని ఆమె చెప్పారు. 63 ఏళ్ల బెల్లా విండీ.. తన కాళ్లను చేపలు కొరుకుతున్న అనుభూతిని ఆస్వాదించాలని ఈ రెస్టారెంట్‌కు వచ్చారు. 'సాధారణంగా, నీరు చాలా ఎక్కువగా ఉంటే చేపలు ఇక్కడికి వస్తాయి. ఇక్కడి ప్రకృతి అనుభవం ఈ రెస్టారెంట్ ముఖ్య ఆకర్షణ, ఇది ప్రజలను ఆకర్షిస్తుంది'.. అన్నారు.

ఇతర ప్రాంతాలకు నష్టమే

ఈ వరదలు పా జిత్ రెస్టారెంట్‌కు అసాధారణ అదృష్టాన్ని తెచ్చినప్పటికీ, థాయ్‌లాండ్‌లోని అనేక ఇతర ప్రాంతాలను మాత్రం తీవ్రంగా దెబ్బతీశాయి. జూలై చివరి నుండి, వరదల కారణంగా 12 మంది మరణించారని, ఇద్దరు తప్పిపోయారని ప్రకృతి విపత్తుల విపత్తుల నివారణ మంత్రిత్వ శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. శుక్రవారం నాటికి, 13 ప్రావిన్స్‌లలో, ముఖ్యంగా ఉత్తర, మధ్య ప్రాంతాలలో 4,80,000 మందికి పైగా ప్రజలు వరదలతో ప్రభావితమయ్యారని వివరించింది.

కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని..

కష్టాన్ని కూడా ఇష్టంగా మార్చుకోవచ్చని 'పా జిత్' రెస్టారెంట్ నిరూపించింది. నదీ తీరం మునిగిపోయినా, దాన్ని వినూత్న 'డైనింగ్ డెస్టినేషన్'గా మార్చుకుంది. కస్టమర్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ అరుదైన అనుభవాన్ని ఆస్వాదించేందుకు థాయ్‌లాండ్ పౌరులే కాదు, ప్రపంచ పర్యాటకులు కూడా ఇక్కడికి క్యూ కట్టడం ఖాయం! మీకు కూడా ఈ వింత రెస్టారెంట్ గురించి తెలుసుకోవాలనుందా?.. చూడాలనిపిస్తోందా?..

పుల్వామాలోని ఉమర్ నబీ నివాసం పేల్చివేత

శ్రీనగర్: ఢిల్లీలో పేలుడు పదార్థాలున్న కారును నడిపి 13 మంది మృతికి కారణమైన డాక్టర్ ఉమర్ నబీ ఇంటిని భద్రతా బలగాలు పేల్చివేశాయి. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఉన్న అతడి నివాసాన్ని గురువారం అర్ధరాత్రి దాటాక బాంబులతో నేలమట్టం చేసినట్లు అధికారులు తెలిపారు. ఆ సమయంలో ఆ ఇంట్లో ఎవరూ లేరన్నారు. ఉన్నత విద్యావంతుడైన ఉమర్ నబీ తీవ్రవాద ప్రభావానికి లోనయ్యాడు. సోమవారం ఢిల్లీలోని ఎర్రకోట వద్ద పేలుడు పదార్థాలున్న హ్యుందాయ్ కారును నడిపింది ఇతడేనని అధికారులు అక్కడ లభ్యమైన శరీర భాగాల నుంచి సేకరించిన డీఎన్‌ఏ నమూనాలు ఫరీదాబాద్‌లోని అల్–ఫలా మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న అల్‌ఇతడి తల్లి డీఎన్‌ఏతో సరిపోలాయి. దీంతో, డాక్టర్ ఉమర్ నబీయే ప్రధాన నిందితుడని ధ్రువీకరించుకున్నారు.

హెచ్–1బీ పూర్తిగా బంద్

త్వరలోనే బిల్లు ● అమెరికన్లకు తీవ్ర అన్యాయం ● కాంగ్రెస్ సభ్యురాలు మర్జోరీ టేలర్

వాషింగ్టన్: వృత్తి నిపుణులకు, ముఖ్యంగా భారతీయులకు వరంగా ఉన్న హెచ్–1బీ వీసా పథకాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు అమెరికా ప్రజా ప్రతినిధి ఒకరు ప్రయత్నాలు ప్రారంభించారు. హెచ్1బీ కలిగిన వారు అనంతరం అమెరికా పౌరసత్వానికి అర్హులయ్యే అవకాశముంది. అయితే, తాజా ప్రయత్నాల కారణంగా ఈ వెసులుబాటుకు తెరపడనుంది. ఇకపై వీసా గడువు ముగిసిన వెంటనే ఎవరైనా స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. 'దశాబ్దాలుగా హెచ్–1బీ ప్రోగ్రాంలో అవకతవకలు, అక్రమాలు జరుగుతున్నాయి. అమెరికన్ల అవకాశాలను విదేశీయులు ఎగరేసుకుపోతున్నారు. అందుకే, హెచ్–1బీని ఆసాంతం రద్దు చేసేందుకు బిల్లు ప్రవేశపెట్టాలనుకుంటున్నాను'అంటూ కాంగ్రెస్ మర్జోరీ టేలర్ గ్రీన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కీలకమైన వైద్య రంగానికి అవసరమైన వైద్యులు, నర్సుల కోసం మాత్రం ఏడాదికి 10 వేల వరకు వీసాలను మంజూరు చేసేందుకు వీలుండేలా ప్రతిపాదనలను రూపొందిస్తున్నామన్నారు. పదేళ్ల తర్వాత ఈ వెసులుబాటు కూడా రద్దవుతుందన్నారు. విదేశీయుల స్థానంలో అమెరికా పౌరులే వైద్యులు, నర్సుల స్థానాలకు ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని వివరించారు. వివిధ వీసాలపై ఇక్కడికి వచ్చే ప్రత్యేక వృత్తి నిపుణులు నిర్ణీత కాల పరిమితి ముగిశాక తిరిగి స్వదేశాలకు వెళ్లిపోవాలే తప్ప, శాశ్వతంగా నివాసం ఉండేందుకు అనుమతించరాదని మర్జోరీ టేలర్ అభిప్రాయపడ్డారు. అమెరికా పౌరులు కాని వైద్య విద్యార్థుల కోసం ప్రస్తుతమున్న మెడికేర్ పథకాన్ని కూడా ఎత్తివేయాలన్నారు. ఒక్క 2023లోనే విదేశాల్లో జన్మించిన 5 వేల మందికిపైగా డాక్టర్లకు దేశంలో అవకాశాలు దొరికాయని తెలిపారు. 2024లో అమెరికాలో వైద్యవిద్యనభ్యసించిన 9 వేల మంది మాత్రం అవకాశాల్లేక విదేశాలకు వెళ్లిపోయారని టేలర్ తెలిపారు. ఇలా అమెరికన్లకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఏడాదికి 65 వేల మంది వృత్తి నిపుణులతో పాటు మరో 20 వేల మంది అడ్వాన్స్‌డ్ డిగ్రీ హోల్డర్లకు రెగ్యులర్ హెచ్–1బీ వీసాలిచ్చేందుకు కాంగ్రెస్ వీలు కల్పిస్తోంది. ఈ అవకాశాన్ని ప్రైవేట్ సంస్థలు వినియోగించుకుని, విదేశీ నిపుణులను రప్పిస్తున్నాయి. హెచ్–1బీతో లాభం పొందే వారిలో భారతీయ నిపుణులు, ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, వైద్యులు అత్యధికంగా ఉన్నారు. అయితే, అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ట్రంప్ హెచ్–1బీపై తీవ్ర ఆంక్షలు విధిస్తుండటం తెల్సిందే. అర్హులైన హెచ్–1బీ దరఖాస్తుదారులు లక్ష డాలర్లు చెల్లించాలంటూ ఆయన నిబంధన తీసుకువచ్చారు.

హారర్ సఫారీ!

సాధారణంగా సఫారీ అంటే అద్భుతమైన అనుభూతి.. కానీ, బెంగళూరులోని బన్నేరుఘట్ట జాతీయ పార్కుకు వెళ్లిన ఒక చెన్నై మహిళకు మాత్రం అది భయంకరమైన పీడకలగా మిగిలిపోయింది. అడవి జంతువుల్ని చూసేందుకు ఆమె ఉత్సాహంగా సఫారీ బస్సులో ప్రయాణిస్తోంది. ఉన్నట్టుండి ఓ చిరుత ఒక్కసారిగా బస్సుపైకి దూకి, రక్షణ కోసం ఏర్పాటు చేసిన జాలీలోంచి ఆమె చేతిపై పంజా విసిరింది..

బస్సుపైకి దూకిన చిరుత..

చెన్నైకి చెందిన 56 ఏళ్ల వహితా భాను అనే మహిళ గురువారం మధ్యాహ్నం 1 గంట సమయంలో బన్నేరుఘట్ట జాతీయ పార్కులో చిరుత సఫారీ ట్రిప్‌లో పాల్గొన్నారు. ఆమె కదలికలను గమనిస్తున్న చిరుత ఒక్కసారిగా బస్సు పైకప్పు పైకి లంఘించింది. అద్దం పక్కనే ఉన్న జాలీ ద్వారా లోపలికి పంజా విసిరి మహిళను గాయపరిచింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలో.. బస్సుపైకి చిరుత ఎక్కి, కిటికీ గుండా దాడి చేయడానికి ప్రయత్నిస్తున్న దృశ్యాలు భయానకంగా కనిపిస్తున్నాయి. చిరుత పంజా దాడిలో వహితా భాను చేతికి గాయాలయ్యాయి. వెంటనే అక్కడికక్కడే ప్రథమ చికిత్స చేశారు. అనంతరం ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం జిగానిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఆరోగ్య పరిస్థితి ప్ర స్తుతం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు.

భద్రత ప్రశ్నార్థకం

సాధారణంగా, జంతువులు, సందర్శకుల మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నివారించడానికి సఫారీ బస్సులకు కిటికీలు, ఇతర రంధ్రాలపై లోహపు వైర్ మెష్ (జాలీ) అమర్చుతారు. అయితే, ఈ చిరుత ఆ జాలీలోని చిన్న ఖాళీ గుండా లోపలికి పంజా విసిరి మహిళను రక్కగలిగింది. 'మహిళ చేతికి గాయాలయ్యాయి. ఆమెను చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించాం. ప్రస్తుతం క్షేమంగా ఉన్నారు'.. అని ఒక అధికారి వెల్లడించారు.

తాత్కాలికంగా సఫారీ నిలిపివేత

గతంలో కూడా చిరుత దాడి జరిగిన నేపథ్యంలో.. బస్సుల భద్రతను పూర్తిగా అంచనా వేసే వరకు, నాన్–ఏసీ బస్సు సఫారీని నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. 'సమస్య పరిష్కారమయ్యే వరకు వాహనాల పూర్తి భద్రతను అంచనా వేస్తాం. సందర్శకులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం'.. అని పేర్కొన్నారు. బన్నేరుఘట్ట జాతీయ పార్కులో జరిగిన ఈ ఘటన సఫారీ వాహనాల భద్రతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. కనీస రక్షణ ఏర్పాట్ల విషయంలో ఏ మాత్రం చిన్న లోపం ఉన్నా.. ఎంత పెద్ద ప్రమాదం జరుగుతుందో ఈ సంఘటన రుజువు చేసింది.

– సాక్షి, నేషనల్ డెస్క్

పద్మశ్రీ తిమ్మక్క కన్నుమూత

బెంగళూరు: ప్రముఖ పర్యావరణ వేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత, వృక్షమాతగా పేరు తెచ్చుకున్న సాలుమరద తిమ్మక్క శుక్రవారం కన్నుమూశారు. 114 ఏళ్ల తిమ్మక్క కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన ఆమె అక్కడే తుది శ్వాస విడిచారు. 1911 జూన్ 30న జన్మించిన తిమ్మక్క బెంగళూరు దక్షిణ జిల్లాలోని హులికల్–కుదూర్ మధ్య 4.5 కి.మీ. విస్తీర్ణంలో 385 మర్రి చెట్లను నాటడంతో ఆమెకు 'సాలుమరద' అనే పేరు వచ్చింది. నిరక్షరాస్యురాలైన తిమ్మక్కకు పిల్లలు లేకపోవడంతో.. మొక్కలనే పిల్లల్లా పెంచారు. ఆమె చేసిన కృషికి 2019లో పద్మశ్రీ అందుకున్నారు. అంతకు ముందు హంపి విశ్వవిద్యాలయం నుంచి 2010లో నాడోజ అవార్డు, 1995లో జాతీయ పౌర పురస్కారం, 1997లో ఇందిరా ప్రియదర్శిని వృక్ష మిత్ర అవార్డుతో సహా పలు అవార్డులు అందుకున్నారు.

ప్రముఖుల సంతాపం..

తిమ్మక్క మృతి పట్ల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సంతాపం తెలిపారు. 'వేలాది చెట్లను నాటి, వాటిని తన సొంత పిల్లలలాగా పోషించిన తిమ్మక్క, తన జీవితాన్ని పర్యావరణ పరిరక్షణకు అంకితం చేసింది. పర్యావరణం పట్ల అమితమైన ప్రేమ కలిగిన ఆమెకు మరణం లేదు. ఆమె మరణం ఈ ప్రాంతానికి తీరని లోటు'అని పేర్కన్నారు. తిమ్మక్క మృతి పట్ల మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, ఆయన కుమారుడు, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప, కర్ణాటక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పలువురు రాజకీయ నాయకులు సంతాపం తెలిపారు.

ఓ కంపెనీకి అనుకూలంగా తీర్పు ఇవ్వాలన్నారు

హైకోర్టు సీజేపై ఎన్‌సీఎల్‌ఏటీ సభ్యుడి ఆరోపణ

న్యూఢిల్లీ: ఓ కంపెనీకి అనుకూలంగా తీర్పు ఇవ్వాలంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఒకరు తనను కోరారంటూ నేషనల్ కంపెనీ లా అప్పిల్లేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)సభ్యుడు చేసిన ఆరోపణ సంచలనం కలిగించింది. ఈ అంశాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ చూ సుకుంటారని సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఆ ప్రధాన న్యాయమూర్తి పంపిన వాట్సాప్ మెసేజీని ఎన్‌సీఎల్‌ఏటీ సభ్యుడు స్క్రీన్ షాట్ తీసి పంపించారని న్యాయవాది ప్రశాంత్ భూషణ్ శుక్రవారం కాబోయే సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనానికి వివరించారు. దీంతో వారు ఈ వ్యవహారాన్ని చెన్నైలోని ఎన్‌సీఎల్‌ఏటీ నుంచి ఢిల్లీలోని ప్రిన్సిపాల్ బెంచ్‌కు బదిలీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంతో సంబంధమున్న ఏఎస్ మెట్‌కార్ప్ ప్రైవేట్ లిమిటెడ్ వివాదాన్ని హైదరాబాద్‌లోని నేషనల్ కంపెనీ ట్రిబ్యునల్ ఐఆర్‌పీ పరిష్కరిస్తారని కూడా ధర్మాసనం తెలిపింది.

పాలస్తీనియన్ల నిర్బంధం

- ప్రయాణికుల్లో 9 నెలల గర్భవతి
- 12 గంటలపాటు ప్రయాణికుల ఇబ్బందులు

జోహన్నెస్‌బర్గ్: ప్రయాణ పత్రాల సమస్యల కారణంగా తొమ్మిది నెలల గర్భవతి సహా 150 మందికి పైగా పాలస్తీనియన్లను దక్షిణాఫ్రికా అధికారులు విమానంలోనే నిర్బంధించారు. వారు ప్రయాణించిన విమానాన్ని దాదాపు 12 గంటలకు పైగా నిలిపివేయడంతో పిల్లలు, స్త్రీలు సహా ప్రయాణికులంతా ఇబ్బందులు పడ్డారు. పాలస్తీనీయన్లు ప్రయాణిస్తున్న విమానం గురువారం ఉదయం టాంబో అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంది. అయితే ప్రయాణికుల దగ్గర ఉన్న పత్రాలపై ఇజ్రాయెల్ అధికారుల నుంచి నిష్క్రమణ స్టాంపులు, దక్షిణాఫ్రికాలో ఎంతకాలం ఉంటారనే వివరాలు, స్థానిక చిరునామాలు పేర్కొనలేదు. దీంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు ప్రయాణికులను నిలిపేశారు. దక్షిణాఫ్రికా హోం శాఖ జోక్యంతో 'గిఫ్ట్ ఆఫ్ ది గివర్స్'అనే స్థానిక స్వచ్ఛంద సంస్థ వారికి వసతి కల్పించడానికి ముందుకు రావడంతో పిల్లలు సహా 153 మంది ప్రయాణికులను గురువారం రాత్రి విమానం దిగేందుకు అనుమతించారు. వారిలో 23 మంది ప్రయాణికులు ఇతర దేశాలకు వెళ్లారని, 130 మంది మాత్రం దక్షిణాఫ్రికాలోనే ఉన్నారని సరిహద్దు అధికారులు తెలిపారు. ప్రయాణికుల పట్ల వ్యవహరించిన తీరు ఆగ్రహాన్ని రేకెత్తించింది. 'ఇది చాలా దారుణం. నేను విమానంలోకి వచ్చినప్పుడు అది చాలా వేడిగా ఉంది. అక్కడ చాలా మంది పిల్లలు చెమటలు పట్టి అరుస్తూ, ఏడుస్తూ ఉన్నారు. దక్షిణాఫ్రికా ఇలా చేస్తుందంటే నేను నమ్మలేకున్నా. ఈ ప్రజలను కనీసం విమానాశ్రయంలోకి అనుమతించి, ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకోనివ్వాలి. ఇది రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక ప్రాథమిక హక్కు.' అని నిలిపి ఉండగా విమానంలోకి వెళ్లివచ్చిన పాసర్ నిగెల్ బ్రాంకెన్ అన్నారు. ఇటీవలి కాలంలో పాలస్తీనియన్లను దక్షిణాఫ్రికాకు తీసుకొచ్చిన రెండో విమానం ఇది. తాము ఎక్కడికి వెళ్తున్నామనేది కూడా వారికి తెలియదు. విమానాన్ని నిర్వహించిన సంస్థ వివరాలు కూడా తెలియరాలేదు. ఇజ్రాయెల్ దాడుల తరువాత చాలామంది పాలస్తీనియన్లు దక్షిణాఫ్రికాలో ఆశ్రయం పొందాలని భావిస్తున్నారు. అందుకు కారణం దక్షిణాఫ్రికా చాలాకాలంగా పాలస్తీనాకు మద్దతుదారుగా ఉండటమే.

తిరిగొచ్చిన చైనా వ్యోమగాములు

బీజింగ్: చైనా అంతరిక్ష కేంద్రంలోని ముగ్గురు వ్యోమగాములు ఎట్టకేలకు సురక్షితంగా భూమికి చేరుకున్నారు. ఈ నెల 5వ తేదీన వీరు తిరిగి రావాల్సి ఉంది. అయితే, గుర్తు తెలియని శకలం ఢీకొనడంతో వ్యోమనౌక షెన్‌ఝౌ–20కు నష్టం జరిగింది. రిటర్న్ క్యాప్సూల్ పోర్ట్‌హోల్‌కు చిన్న పగుళ్లు కనిపించాయి. దీంతో, వీరి ప్రయాణాన్ని ముందు జాగ్రత్తగా చివరి క్షణంలో వాయిదా వేశారు. 2011లో చైనా సొంత అంతరిక్ష కేంద్రం ఏర్పాటైన తర్వాత ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇదే మొదటిసారి. అంతరిక్ష కేంద్రంలోని వ్యోమగాములను ఆరు నెలలకోసారి చైనా మారుస్తూంటుంది. మరో ముగ్గురు వ్యోమగాములతో అక్టోబర్ 31న అక్కడికి చేరుకున్న షెన్‌ఝౌ–21 స్పేస్ క్యాప్సూల్‌లో చెన్ డాంగ్, చెన్ ఝోంగ్రుయి, వాగ్ జీ అనే వ్యోమగాములు శుక్రవారం ఇన్నర్‌మంగోలియా ప్రాంతంలోని డాంగ్‌ఫెంగ్‌లో సురక్షితంగా దిగారని చైనా అంతరిక్ష సంస్థ తెలిపింది. కక్ష్యలో 204 రోజులపాటు గడిపిన వీరు పూర్తి ఆరోగ్యంతో ఉన్నారంది. షెంఝూ–21లో వెళ్లిన వ్యోమగాముల కోసం ప్రత్యేకంగా షెంఝూ–22 అంతరిక్ష నౌకను పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామంది.

కుప్పకూలిన ఎయిర్‌ఫోర్స్ శిక్షణ విమానం

చెన్నై: భారత వైమానిక దళానికి చెందిన శిక్షణ విమానం శుక్రవారం మధ్యాహ్నం చెన్నై శివారులో కుప్పకూలింది. పైలట్ సురక్షితంగా బయటపడటంతో పెద్ద ప్రమాదం తప్పింది. చెన్నైలోని తాంబరం ఎయిర్‌బేస్ సమీపంలో ఈ ఘటన జరిగింది. భారత వైమానిక దళానికి చెందిన పిలాటస్ పీసీ–7 సింగిల్ సీటర్ శిక్షణ విమానం సాధారణ శిక్షణలో ఉండగా ప్రమాదానికి గురైంది. ప్రమాదాన్ని గమనించిన పైలట్ చాకచక్యంగా వ్యవహరించి పారాచూట్ సహాయంతో బయటపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కొద్దిసేపటి కే వైమానిక దళానికి చెందిన మరో హెలికాప్టర్ అక్కడికి చేరుకుని పైలట్‌ను ఎయిర్‌బేస్‌కు తరలించింది. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ కోర్టును ఏర్పాటు చేశారు.

రష్యా దాడుల్లో నలుగురు మృతి

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్ క్షిపణులు, డ్రోన్లతో రష్యా మరోసారి భారీ దాడికి పాల్పడింది. మంటలు చెలరేగి, శిథిలాలు చెల్లాచెదురుగా పడిన ఘటనల్లో కనీసం నలుగురు చనిపోగా, 27 మంది గాయాలపాలయ్యారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో శుక్రవారం వేకువజాము నుంచి రష్యా 430 డ్రోన్లతోపాటు 18 క్షిపణులను ప్రయోగించిందని ఉక్రెయిన్ ఆర్మీ తెలిపింది. కీవ్‌ను ప్రధాన లక్ష్యంగా చేసుకున్న రష్యా, మిగతా ప్రాంతాల్లోనూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడమే పనిగా ఈ దాడులకు తెగించిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ తెలిపారు. పలు ప్రాంతాల్లో నివాస భవనాలు, బహుళ అంతస్తుల గృహ సముదాయాలు దెబ్బతిన్నాయన్నారు. ఇస్కాండర్ క్షిపణి శకలాలతో కీవ్‌లోని అజర్‌బైజాన్ ఎంబసీకి నష్టం జరిగిందన్నారు. రాజధానిలోని వివిధ ప్రాంతాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని తెలిపారు. శిథిలాల పడి 17 మంది గాయపడ్డారని, ఒకరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. విద్యుత్ వ్యవస్థలు దెబ్బతిని, నగరంలో గాండాంధకారం అలుముకుందని వెల్లడించారు.

ఆటో డ్రైవర్‌ను చంపిన బాలనేరస్తులు

న్యూఢిల్లీ: డ్రగ్స్‌కు అలవాటు పడ్డ ఐదుగురు బాలనేరస్తులు దోపిడీ యత్నంలో ఓ ఆటో డ్రైవర్‌ను హత్య చేశారు. ఈ ఘటన రోహిణీలోని బుధ్ విహార్‌ప్రాంతంలో జరిగింది. వెంటనే ఆటో డ్రైవర్ 52 ఏళ్ల కుమార్‌ను సంజయ్ గాంధీ మెమోరియల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో ప్రాణాలొదిలాడు. వివరాల్లోకి వెళ్తే.. ఇద్దరు బాలురు మంగోల్‌పురి నుంచి రాకేశ్ కుమార్ ఆటోను అద్దెకు తీసుకున్నారు. మరో ముగ్గురు దొంగిలించిన రెండు స్కూట్లపై ఆటోను వెంబడించారు. ఏకాంత ప్రాంతానికి చేరుకోగానే ఆటో డరైవర్ కుమార్ దగ్గరున్న డబ్బు దోచుకోవడానికి ప్రయత్నించారు. ఆయన ప్రతిఘటించడంతో కత్తితో పొడిచి చంపారు. తరువాత ఐదుగురు స్కూటర్లపై పారిపోయారు. సీసీటీవీ ఫుటేజీల ద్వారా ఐదుగురు బాలురను పోలీసులు అరెస్టు చేశారు. వారి దగ్గరనుంచి రక్తపు మరకలున్న కత్తి, దొంగిలించిన రెండు స్కూటర్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులంతా 15 నుంచి 16 సంవత్సరాల వయస్సున్న వారని తెలిపారు. నిందితులు స్నాచింగ్, దొంగతనం, దోపిడీ వంటి నేరాలకు పాల్పడ్డారు. మత్తు పదార్థాలను కొనుగోలు చేయడానికి తరచూ దోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణ సమయంలో తెలిపారు. వారి అరెస్టుతో, మరో ఆరు కేసులు పరిష్కారమయ్యాయని పోలీసులు తెలిపారు.

అండర్‌వాటర్ వెహికల్స్ సృష్టి: రక్షణశాఖ

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వ రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) నీటి అడుగున స్వతంత్రంగా ప్రయాణించి, పనులు చక్కదిద్దుకు వచ్చే సత్తాకలిగిన సరికొత్త డ్రోన్‌ను ఆవిష్కరించింది. మనిషి మోసుకెళ్లగలిగేంతటి తేలికైన అటానమస్ అండర్‌వాటర్ వెహికల్స్(ఎంపీ–ఏయూవీస్)ను డీఆర్‌డీవో ఇటీవల విజయవంతంగా పరీక్షించిందని శుక్రవారం రక్షణ శాఖ వెల్లడించింది. సైడ్ స్కాన్ సోనార్, అండర్‌వాటర్ కెమెరాలు అమర్చిన ఈ ఏయూవీలు మందుపాతరల వంటి వాటిని గుర్తుపట్టి, తక్షణమే సమాచారం అందిస్తాయంది. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఈ ఎంపీ ఏయూవీలు అతి తక్కువ సమయంలోనే నిర్దేశిత పనులను విజయవంతంగా ముగిస్తాయని రక్షణ శాఖ పేర్కొంది. విశాఖపట్టణంలోని డీఆర్‌డీవోకు చెందిన నేవల్ సైన్స్ అండ్ టెక్నలాజికల్ ల్యాబొరేటరీ ఎంపీ–ఏయూవీలను అభివృద్ధి పర్చిందని వెల్లడించింది.

టెర్రర్ మాడ్యూల్ కేసు..ఇద్దరు డాక్టర్ల నిర్బంధం

ఫరీదాబాద్: టెర్రర్ మాడ్యూల్ కేసులో హరియాణా పోలీసులు మరో ఇద్దరు డాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరినీ ప్రశ్నిస్తున్నట్లు శక్రవారం అధికార వర్గాలు తెలిపాయి. వీరిలో ఒకరు నవంబర్ 2వ తేదీన అల్‌ఫలాహ్ వర్సిటీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసుకున్నారు. మరో వ్యక్తి అదే వర్సిటీ మాజీ విద్యార్థి కాగా, ప్రస్తుతం నూహ్ జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్‌లలో చేపట్టిన ఆపరేషన్‌లో పోలీసులు ఉగ్ర మాడ్యూల్ గుట్టు రట్టు చేయడంతోపాటు 2,900కిలోల పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకోవడం తెల్సిందే.ఫరీదాబాద్‌లోని అల్ ఫలాహ్ వర్సిటీకి చెందిన ముగ్గురు వైద్యులు సహా 8 మందిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్‌చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా మరికొందరిని అదుపులోకి తీసుకుని, విచారణ కొనసాగిస్తున్నారు. దేశంలో ఉగ్ర కార్యకలాపాల సమన్వయం కోసం డాక్టర్ ఉమర్ నబీ, డాక్టర్ ముజమ్మిల్ గనీ, డాక్టర్ షహీన్ షాహిద్‌లు స్విట్జరాండ్‌కు చెందిన మెసేజింగ్ యాప్‌ను వాడుతున్నట్టు వెల్లడైంది.

ఉగ్ర వైద్యుల రిజిస్ట్రేషన్లు రద్దు

సాక్షి, అమరావతి: ఢిల్లీ పేలుడు ఘటనలో నిందితులుగా ఉన్న నలుగురు వైద్యుల మెడికల్ రిజిస్ట్రేషన్‌ను నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్‌ఎంసీ) రద్దుచేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల(నివారణ) చట్టం కింద వీరిపై కేసులు నమోదైన నేపథ్యంలో ఇండియన్ మెడికల్ రిజిస్ట్రర్ (ఐఎంఆర్)/నేషనల్ మెడికల్ రిజిస్ట్రర్ (ఎన్‌ఎంఆర్)ల నుంచి వీరి పేర్లు తొలగించినట్లు ఎన్‌ఎంసీ సెక్రటరీ(ఇన్‌చార్జి) రాజీవ్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ముజఫర్ అహ్మద్, డాక్టర్ ఆదిల్ అహ్మద్ రాథర్, డాక్టర్ ముజమిల్ షకీల్, డాక్టర్ షాహీన్ సయీద్‌లు ఢిల్లీ పేలుళ్ల ఘటనలో అనుమానితులుగా ఉన్న విషయం తెలిసిందే. ముజమిల్ షకీల్, అహ్మద్ రాథర్, ముజఫర్ అహ్మద్‌లు జమ్మూకశ్మీర్.. షాహీన్ సాయీద్ ఉత్తరప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌లో వైద్యులుగా రిజిస్ట్రర్ చేసుకున్నారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ (ప్రొఫెషనల్ కండక్ట్, ఎతిక్స్) రెగ్యులేషన్స్–2002 నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లను రద్దు చేశారు.

ఎఫ్‌సీసీ ప్రథమ సీజేగా అమినుద్దీన్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ ఫెడరల్ కాన్‌స్టిట్యూషనల్ కోర్ట్(ఎఫ్‌సీసీ) ప్రథమ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అమినుద్దీన్ ఖాన్ ప్రమాణం చేశారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన వివాదాస్పద 27వ రాజ్యాంగ సవరణ బిల్లుపై గురువారం అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ సంతకం చేశారు. ఈ సవరణ ఫలితంగానే ఎఫ్‌సీసీ అవతరించింది. ప్రధాని షెహబాజ్ షరీఫ్ సిఫారసు మేరకు ఎఫ్‌సీసీ చీఫ్‌గా జస్టిస్ ఖాన్ నియామకానికి ఆమోద ముద్ర వేశారు. శుక్రవారం అధ్యక్ష భవనంలో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ ఖాన్‌తో జర్దారీ ప్రమాణం చేయించారు. ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, చీఫ్ జస్టిస్ యాహ్యా ఆఫ్రిది కార్యక్రమానికి హాజరయ్యారు.

రాజ్యసభలో గరిష్ట ప్రాతినిధ్యం ఉన్న రాష్ట్రం?

భారత రాజ్యాంగ పరిషత్ మొదట ఉప రాష్ట్రపతి పదవిని కల్పించలేదు. రాజ్యాంగ పరిషత్ ముఖ్య న్యాయ సలహాదారుడైన బెనగళ నర్సింగరావు చొరవతో ఈ పదవిని ఏర్పాటు చేశారు. రాష్ట్రపతి మరణించినా, సెలవులో ఉన్నా లేదా విధులు నిర్వర్తించలేని పరిస్థితిలో ఉన్నా కొత్త రాష్ట్రపతి ఎన్నికయ్యేంత వరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పార్లమెంట్‌లోని సభాధ్యక్షులు ఒక కమిటీగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వ పరిపాలన నిర్వహించాలని ఆయన సూచించారు. ఆ తర్వాత జరిగిన చర్చల ఫలితంగా హెచ్.పి.వి. కామత్ తదితరులు ఉప రాష్ట్రపతి పదవి ఏర్పాటుకు కృషి చేశారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

భారత పార్లమెంట్

కేంద్ర స్థాయిలో శాసన నిర్మాణ శాఖ అంటే పార్లమెంట్ (సంసద్). రాజ్యాంగంలోని 79వ అధికరణం ప్రకారం పార్లమెంట్ అంటే లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రపతి. రాజ్యాంగంలో అయిదో భాగంలోని రెండో అధ్యాయంలో 79 నుంచి 122 వరకు ఉన్న అధికరణలు భారత పార్లమెంట్ నిర్మాణం, అధికారాలు, విధుల గురించి పేర్కొంటున్నాయి.

- భారతదేశంలో 1952 నుంచి 1962 వరకు ద్విసభ్య నియోజకవర్గాలను ఏర్పాటు చేసేవారు.
- బ్రిటిష్ పార్లమెంట్‌లా భారతదేశ పార్లమెంట్‌కు సార్వభౌమాధికారం లేదు.
- 1954లో మొదటి లోక్‌సభ స్పీకర్ జి.వి. మౌలాంకర్ (గణేష్ వాసుదేవ్ మౌలాంకర్) ప్రజా ప్రతినిధుల సభకు లోక్‌సభ అని, రాష్ట్రాల మండలికి రాజ్యసభ అని నామకరణం చేశాడు.
- రాజ్యాంగంలో రాజ్యసభకు 'కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్', లోక్‌సభకు 'హౌస్ ఆఫ్ ది పీపుల్' అనే పదాలను ఉపయోగించారు. కానీ హిందీ భాషా పదాలైన రాజ్యసభ, లోక్‌సభ అనే పదాలే జన బాహుళ్యంలో వాడుకలోకి వచ్చాయి.

రాజ్యసభ

భారత రాజ్యాంగంలోని 80వ అధికరణను అనుసరించి రాజ్యసభను ఏర్పాటు చేశారు. రాజ్యాంగ పండితులు దీన్ని 'ఎగువసభ', 'రాష్ట్రాల పరిషత్', 'పెద్దల సభ'గా వర్ణించారు.

- రాజ్యసభ 1952 ఏప్రిల్ 3న ఏర్పాటైంది.
- రాజ్యసభ తొలి సమావేశాన్ని 1952 మే 13న నిర్వహించారు.
- హిందీలో 'రాజ్య' అంటే రాష్ట్రం అని అర్థం. అందువల్ల రాజ్యసభ అంటే రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే సభగా పేర్కొనవచ్చు.
- రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ గరిష్ట సభ్యుల సంఖ్య 250 మంది. ప్రస్తుతం రాజ్యసభలో 245 మంది సభ్యులున్నారు.
- ప్రస్తుతం 4వ షెడ్యూల్ ప్రకారం మొత్తం రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 233. సాహిత్యం, కళలు, శాస్త్ర విజ్ఞానం, సామాజిక సేవ మొదలైన రంగాల్లో విశేషానుభవం ఉన్న 12 మంది సభ్యులను 80(3)వ అధికరణం ప్రకారం రాష్ట్రపతి రాజ్యసభకు నామినేట్ చేస్తారు.
- రాజ్యాంగంలోని 80(2)వ అధికరణం ప్రకారం రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ సభ్యులను రాష్ట్రాల అసెంబ్లీల సభ్యులు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతి ప్రకారం ఎన్నుకుంటారు.
- 80(4)వ అధికరణం ప్రకారం పార్లమెంట్ రూపొందించిన చట్టం ఆధారంగా రాజ్యసభలో కేంద్రపాలిత ప్రాంతాల ప్రాతినిధ్యం ఉంటుంది.
- 80(5)వ అధికరణం ప్రకారం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సీట్ల కేటాయింపు రాజ్యాంగంలోని 4వ షెడ్యూల్ ప్రకారం జరగాలి.
- భారత రాజ్యాంగం సమాఖ్య విధానాన్ని అనుసరిస్తోంది. కాబట్టి పార్లమెంట్‌లో రాష్ట్రాల ప్రాతినిధ్యం అవసరమైంది. ఈ కారణంగా రాజ్యసభను ఏర్పాటు చేశారు.
- 'ప్రతి రాష్ట్రం నుంచి ఎగువ సభలో సమాన ప్రాతినిధ్య పద్ధతి' అనే అమెరికా సమాఖ్యకు చెందిన విధానం మన రాజ్యాంగంలో లేదు.
- 4వ షెడ్యూల్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జనాభా ఆధారంగా రాజ్యసభలో ప్రతినిధుల సంఖ్యను నిర్ణయించారు.
- ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు కేటాయించిన సభ్యుల సంఖ్య 31 మంది.
- నాగాలాండ్, మణిపూర్ నుంచి ఒక్కో సభ్యుడిని మాత్రమే కేటాయించారు.
- రాజ్యసభకు నిర్వహించే ఎన్నికల పద్ధతిని దక్షిణాఫ్రికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.

రాజ్యసభకు పోటీ చేయడానికి కావాల్సిన అర్హతలు:

1. భారతదేశ పౌరుడై ఉండాలి.
2. వయసు కనీసం 30 ఏళ్లు ఉండాలి.
3. ఆదాయాన్ని పొందే ప్రభుత్వ ఉద్యోగం చేయడదు.
4. పార్లమెంట్ చట్టాలరీత్యా నిర్దేశించిన ఇతర అర్హతలు కలిగి ఉండాలి.

శాశ్వత సభ: లోక్‌సభలా రాజ్యసభకు నిర్ణీత కాల పరిమితి ఉండదు. ఇది శాశ్వత సభ. ఇది రద్దు కాదు. మొత్తం సభ్యుల్లో మూడో వంతు సభ్యులు ప్రతి రెండేళ్లకు ఒకసారి పదవీ విరమణ చేస్తారు. వీరి స్థానంలో కొత్త సభ్యులను ఎన్నుకుంటారు. పదవీ విరమణ చేసిన సభ్యులు తిరిగి పోటీ చేయవచ్చు. ఒక్కో సభ్యుడు ఆరేళ్లు కొనసాగుతాడు.

- అధికరణ 83(1) ప్రకారం రాజ్యసభ కాలపరిమితి గురించి వివరించారు.
- 89వ అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎక్స్-అఫీషియో చైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తారు. ఈయనకు నిర్ణాయక ఓటు ఉంటుంది.
- రాజ్యసభ సభ్యులు తమలో నుంచి ఒకరిని డిప్యూటీ చైర్మన్‌గా ఎన్నుకుంటారు.
- మొదటి రాజ్యసభ చైర్మన్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.
- మొదటి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ – ఎస్.వి. కృష్ణమూర్తి రావు.
- రాజ్యసభ సమావేశానికి కావాల్సిన కనిష్ట సభ్యుల సంఖ్యను 'కోరమ్' అంటారు. మొత్తం సభ్యుల్లో పదో వంతును కోరమ్‌గా పరిగణిస్తున్నారు.

రాజ్యసభ ప్రత్యేక అధికారాలు:

1. 67వ అధికరణం ప్రకారం ఉప రాష్ట్రపతిని తొలగించే తీర్మానాన్ని ముందుగా రాజ్యసభలోనే ప్రవేశపెట్టాలి.
2. అధికరణ 249 ప్రకారం రాష్ట్ర జాబితాలోని ఏదైనా అంశానికి జాతీయ ప్రాముఖ్యం ఉందని భావించి రాజ్యసభ $^2/_3$వ వంతు మెజార్టీతో తీర్మానాన్ని ఆమోదిస్తే ఏడాది కాలానికి చెల్లుబాటయ్యే విధంగా శాసనం చేయవచ్చు.
3. అధికరణ–312 ప్రకారం నూతన అఖిల భారత సర్వీసులను ఏర్పాటు చేయడానికి సంబంధించిన బిల్లు ముందుగా రాజ్యసభ ఆమోదం పొందాలి.

- రాజ్యసభలో ప్రాతినిధ్యం ఉన్న కేంద్రపాలిత ప్రాంతాలు – ఢిల్లీ, పుదుచ్చేరి.
- జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ ఒక నెల లోపు ఆమోదించాలి.
- రాష్ట్రపతి పాలనకు సంబంధించిన తీర్మానాన్ని రాజ్యసభ రెండు నెలల్లోపు ఆమోదించాలి.
- లోక్‌సభ ఆమోదించిన ఆర్థిక బిల్లులను రాజ్యసభ 14 రోజుల్లోపు ఆమోదించాలి.

రాజ్యసభలో అత్యధిక స్థానాలున్న రాష్ట్రాలు:

	రాష్ట్రం	సభ్యులు
1.	ఉత్తరప్రదేశ్	31
2.	మహారాష్ట్ర	19
3.	తమిళనాడు	18
4.	పశ్చిమ బెంగాల్	16
5.	బీహార్	16
6.	కర్ణాటక	12
7.	ఆంధ్రప్రదేశ్	11
8.	మధ్యప్రదేశ్	11
9.	గుజరాత్	11

- **రాజ్యసభలో ఒక సభ్యుడిని మాత్రమే కలిగి ఉన్న రాష్ట్రాలు:** అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, గోవా, మేఘాలయా, సిక్కిం, త్రిపుర.
- కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి నుంచి రాజ్యసభకు ఒక సభ్యుడు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- ఢిల్లీ (కేంద్రపాలిత ప్రాంతం) నుంచి రాజ్యసభకు ముగ్గురు సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- తెలంగాణ, అసోం, పంజాబ్ రాష్ట్రాల నుంచి ఏడుగురు సభ్యుల చొప్పున రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

రాజ్యసభ చైర్మన్: పార్లమెంట్‌లోని ఉభయసభలను నిర్వహించడానికి విడివిడిగా సభాధ్యక్షులు ఉంటారు. 89వ అధికరణం ప్రకారం భారత ఉప రాష్ట్రపతి రాజ్యసభకు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.

- ఏ కారణంగానైనా రాజ్యసభ చైర్మన్ అందుబాటులో లేనప్పుడు డిప్యూటీ చైర్మన్ సభను నిర్వహిస్తారు.
- రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ కూడా అందుబాటులో లేనప్పుడు సభా నియమావళి ప్రకారం ఎంపిక చేసిన ఒక సీనియర్ సభ్యుడు సమావేశాలను నిర్వహిస్తారు.
- రాజ్యాంగంలో 89 నుంచి 92 వరకు ఉన్న అధికరణలు రాజ్యసభ సభాధ్యక్షుల ఎన్నిక, రాజీనామా, సమావేశాలకు సంబంధించిన వివరాలను తెలుపుతున్నాయి.
- అధికరణ 97 ప్రకారం రాజ్యసభ చైర్మన్ హోదాలో ప్రస్తుతం ఉప రాష్ట్రపతి నెలకు రూ.1,25,000 వేతనం పొందుతున్నారు. ఇతర సౌకర్యాలు, పెన్షన్ మొదలైన సదుపాయాలు కూడా ఉంటాయి..

బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసేవి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

బయాలజీ

జీవులు - వర్గీకరణ

జీవులు సుమారు 3,500 బిలియన్ సంవత్సరాల క్రితం భూగోళంపైన ఏర్పడ్డాయి. వీటి గురించి వివరంగా తెలుసుకొనేందుకు వాటి వర్గీకరణ అవసరం. దీన్ని ఆధారంగా చేసుకొని అరిస్టాటిల్ మొదట శాస్త్రీయంగా వర్గీకరించే ప్రయత్నం చేశాడు. ఇతడు మొట్టమొదట మొక్కలను గుల్మాలు, పొదలు, వృక్షాలు అని, జంతువులను ఎరుపు రక్తం ఉన్నవి, ఎరుపు రక్తం లేనివి అని వర్గీకరించాడు.

తర్వాత లిన్నేయస్ రెండు రాజ్యాల వర్గీకరణను అభివృద్ధి చేశారు. వాటిలో

1) వృక్షరాజ్యం, 2) జంతురాజ్యం.

సూక్ష్మదర్శినిని కనుగొన్న తర్వాత కణ నిర్మాణం వరకు పరిశీలించి కణ కవచం ఉన్న వాటిని ఒక సమూహంగా, కణ కవచం లేని వాటిని వేరొక సమూహంగా వర్గీకరించారు. అలాగే విట్టేకర్ 1969లో కణ నిర్మాణాన్ని బట్టి జీవులను ఐదు రాజ్యాలుగా వర్గీకరించాడు.

1) మొనీరా
2) ప్రొటిస్టా
3) ఫంగీ
4) ప్లాంటేరియా
5) ఆనిమేలియా

1. **మొనీరా:** ఏకకణ నిర్మాణం కలిగిన జీవులను వీటిలో చేర్చారు. ఆర్కి బ్యాక్టీరియా, యూబ్యాక్టీరియం, మైకోప్లాస్మా, ఆక్టినోమైసిటిస్ మొదలైన కేంద్రక పూర్వజీవులు (ప్రొకేరియోట్స్) ఉన్నాయి. ఆర్కిబ్యాక్టీరియాలో కఠినమైన ఆవాసాలలో నివసించేవి ఉన్నాయి.
   1) హాలోఫిల్స్ – అత్యధిక లవణయుత ప్రాంతాలు
   2) థర్మోఅసిడోఫిల్స్ – వేడినీటి చలమలలో..
   3) మిథనోజెన్స్ – బురద ప్రదేశాల్లో

   ఇవి ఆవులు, గేదెలు వంటి వాటి జీర్ణాశయాలలో జీవిస్తూ వాటి విసర్జక పదార్థాల నుంచి మీథేన్ (బయోగ్యాస్) ఉత్పత్తికి దోహదపడుతాయి.

- యూబ్యాక్టీరియా అనేవి అత్యధికంగా ఉండే సూక్ష్మజీవులు. వీటిలో గోళాకార (కోకై), దండాకార (బాసిల్లై), కామా ఆకారం (విబ్రియో), సర్పిలాకార (స్పైరిల్లం) బ్యాక్టీరియాలు ఉంటాయి. వీటి కణ కవచం మ్యూరిన్‌తో నిర్మితమై ఉంటుంది. వీటిలో రైబోసోమ్‌లు తప్ప ఇతర కణాంగాలు ఉండవు.
- సయనో బ్యాక్టీరియాలు నత్రజని స్థాపనలో తోడ్పడతాయి. కొన్ని పరపోషిత బ్యాక్టీరియాలు పాలను పెరుగుగా మార్చటంలో, జీవనాశకాల ఉత్పత్తిలో, లెగ్యూమ్ మొక్కల వేరు బుడిపెల్లో ఉండి నత్రజని స్థాపనలో తోడ్పడతాయి. కొన్ని బ్యాక్టీరియాలు మొక్కలు, జంతువుల్లో వివిధ రకాల వ్యాధులను కలగజేస్తాయి. బ్యాక్టీరియాలను ఫ్రెండ్స్ అండ్ ఫోయిస్ అని, ప్రకృతి పారిశుధ్య కార్మికులు అని కూడా పిలుస్తారు. ట్రైఖోడెస్మియం ఎరిథ్రియం ఎర్ర సముద్రంలో ఉంటుంది.
- మైకోప్లాస్మా అనేది అతి చిన్న కణం. ఇది మొక్కల్లో మంత్రగత్తె చీపురుకట్ట, పశువుల్లో ప్లూరోనుమోనియా, మనుషుల్లో మైకోప్లాస్మల్ యురిథ్రైటిస్ వంటి వ్యాధులను కలగజేస్తుంది.
- ఆక్టినోమైసిటిస్‌కు చెందిన స్ట్రెప్టోమైసిస్ ప్రజాతులు యాంటిబయోటిక్‌ను ఉత్పత్తి చేయడానికి ఉపయోగపడతాయి.

2. **ప్రొటిస్టా:**
   ఏక కణ నిజ కేంద్రక జీవులు. వీటిలో మొక్కలు, జంతువుల లక్షణాలు ఉండటం వల్ల వీటిని నిర్దిష్టంగా నిర్వచించలేదు. ఉదా: యూగ్లినా, జిగురుబూజులు.

- డయాటాలు డయాటమేసియస్ మృత్తికలు ఏర్పరుస్తాయి, ఇవి సిలికాన్‌ను కలిగి ఉండటం వల్ల పాలిష్ చేయడానికి, నూనెలు, ద్రవాల వడబోతకు ఉపయోగపడతాయి. మధ్యధరా సముద్రంలో ఎరుపు అలలు కనిపించడానికి కారణం వాటిలో డైనోఫ్లాజెల్లేట్స్ ఉండటమే.

ఈ వర్గంలోని ప్రొటోజోవన్లు కణకవచం లేని జంతువుల ఆదిమమైన బిందువులుగా భావించే జీవులు ఉదా: అమీబా, ప్లాస్మోడియం, పారమీసియం.

3. **శిలీంధ్రాలు (ఫంగి):**
   ఇవి ఎక్కువగా పూతికాహారులు. కొన్ని పరాన్న జీవులు మరికొన్ని సహజీవులు. వీటిలో ఈస్ట్, రొట్టెల బూజులు, పుట్టగొడుగులు, టాడ్ స్టూల్స్ (విషపూరిత పుట్టగొడుగులు) మొదలైనవి ఉంటాయి. వీటి కణ కవచం ఖైటిన్‌తో నిర్మితమై ఉంటుంది. వీటిలో నిల్వ ఆహారం గ్లైకోజన్.

- కొన్ని శిలీంధ్రాలు కాటుక తెగులు (యుస్టిలాగో), కుంకుమ తెగులు (పక్సేనియా), ఎర్ర కుళ్లు (కొలిటోట్రైఖం), మాడు వ్యాధి (ఆల్టర్నేనియా) వంటి వాటిని కలిగిస్తాయి.
- ఈస్ట్ అనే శిలీంధ్రం కిణ్వణ ప్రక్రియలో తోడ్పడుతుంది.
- పెన్సీలియం నోటేటం అనే శిలీంధ్రం నుంచి 1928లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్ అనే యాంటిబయోటిక్ ఇంజక్షన్ ను తయారు చేశాడు.
- అగార్, అయోడిన్ లాంటివి ఎరుపురంగు శైవలాల నుంచి లభిస్తాయి.

4. **ప్లాంటె:**
   వీటిలో నిజ కేంద్రక, హరితయుత స్వయం పోషకాలు ఉన్నాయి. వీటిలో కొన్ని నత్రజని లోపించిన నేలల్లో పెరిగి కీటకాలను ఆహారంగా తీసుకొంటాయి. ఉదా: యూట్రిక్యులేరియా (బ్లాడర్‌వర్ట్), నెపెంథిస్ (పిచ్చర్‌ప్లాంట్) మొదలైనవి. కొన్ని పరాన్న జీవ మొక్కలుగా ఉదా: కస్కుట, మరికొన్ని వృక్షోప జీవులుగా ఉంటాయి. మొక్కలు ముఖ్యంగా శైవలాలు, బ్రయోఫైటా, టెరిడోఫైటా, జిమ్నోస్పెర్మ్స్, ఆంజియో స్పెర్మ్స్‌గా విభజించారు.

5. **ఆనిమేలియా:**
   కణ కవచం లేని పరపోషిత నిజ కేంద్రక జీవులు. వీటిలో అవయవ వ్యవస్థలు ఏర్పడ్డాయి. ఇవి ఆహారాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తీసుకొని జీర్ణక్రియను కలిగి శక్తిని పొందుతాయి. వీటిలో నిల్వ ఆహార పదార్థం కొవ్వు / గ్లైకోజన్ రూపంలో ఉంటుంది..

రాజ్యం	కణరకం	కేంద్రకం	కణ కవచం	శరీర సంవిధానం	పోషణ
మొనీరా	ప్రొకేరియోట్	ఉండదు	సెల్యులోస్ లేనిది	కణయుతం	స్వయం పోషణ, పరపోషణ
ప్రొటిస్టా	యూకేరియోట్	ఉంటుంది	కొన్నింటిలో ఉంటుంది	కణయుతం	స్వయం పోషకం
ఫంగీ	యూకేరియోట్	ఉంటుంది	ఉంటుంది (ఖైటిన్)	బహుకణయుతం	పూతికాహారులు / కొన్ని పరాన్న జీవులు
ప్లాంటె	యూకేరియోట్	ఉంటుంది	ఉంటుంది (సెల్యులోజ్)	కణజాలయుతం	స్వయం పోషకాలు
ఆనిమేలియా	యూకేరియోట్	ఉంటుంది	ఉండదు	కణజాలయుతం / అవయవ వ్యవస్థలు	పరపోషితాలు (జాంతవభక్షణ/ హాలోజోయిక్)

మాదిరి ప్రశ్నలు

1. బ్యాక్టీరియాను మొదట కనుగొన్నది?
   ఎ) రాబర్ట్‌హుక్
   బి) ఆంటోని వాన్‌లీవెన్ హుక్
   సి) రాబర్ట్‌బ్రౌన్ డి) ష్లీడెన్
2. వైరస్ అంటే?
   ఎ) తీపి పదార్థం బి) చేదు పదార్థం
   సి) విష పదార్థం డి) ద్రవ పదార్థం
3. లెగ్యూమ్ మొక్కల వేరు బుడిపెల్లో నత్రజని స్థాపన చేసేది?
   ఎ) వైరస్ బి) ప్రొటోజోవా
   సి) థాలస్ డి) బ్యాక్టీరియా
4. బయో పెస్టిసైడ్స్‌ను దేని నుంచి తయారు చేస్తారు?
   ఎ) ఇ–కొలీ బి) థయోబాసిల్లస్
   సి) బాసిల్లస్ థురెంజియన్సిస్
   డి) పైవన్నీ
5. రెండు రాజ్యాల వర్గీకరణలో ఏ అంశాలు పరిగణనలోకి తీసుకున్నారు ?
   ఎ) బాహ్య స్వరూప లక్షణాలు
   బి) కణజాల లక్షణాలు
   సి) ప్రత్యుత్పత్తి అంశాలు డి) ఎ, సి
6. పూతికాహారులు అంటే?
   ఎ) అతిథేయి నుంచి ఆహారాన్ని సేకరించేవి
   బి) నిర్జీవ పదార్థాల నుంచి ఆహార సేకరించేవి
   సి) ఇతర జీవుల నుంచి ఆహారాన్ని పొందుతూ దానికి లాభాన్ని చేకూర్చేవి
   డి) స్వయంగా ఆహారాన్ని తయారు చేసుకొనేవి
7. బ్యాక్టీరియాలో ఉండి శిలీంధ్రాల్లో ఉండనిది?
   ఎ) గ్లైకోజన్ బి) కణకవచం
   సి) మీసోసోమ్ డి) రైబోసోమ్
8. ప్రొటోజోవా ఏ రాజ్యానికి చెందుతుంది?
   ఎ) ప్రొటిస్టా బి) ఫంగై
   సి) మొనీరా డి) ప్లాంటె
9. కాంతిని శోషించి పదార్థాలను తయారు చేసుకునే సముదాయం?
   ఎ) మొనీరా బి) ఫంగై
   సి) ఆనిమేలియా డి) ప్లాంటె
10. డయాటాలు ఏ కోవకు చెందుతాయి?
    ఎ) ఫంగై బి) మొనీరా
    సి) ప్లాంటె డి) ప్రొటిస్టా
11. వైరాయిడ్‌లో కేవలం...
    ఎ) ప్రోటీన్స్ ఉంటాయి
    బి) కాప్సిడ్ ఉంటాయి
    సి) ఆర్ఎన్ఏ ఉంటుంది డి) ఏదీకాదు
12. మనిషిలో యురైథ్రైటిస్ వ్యాధిని కలిగించేది?
    ఎ) మైకోప్లాస్మా బి) వైరాయిడ్
    సి) ప్రయాన్ డి) ప్లాస్మోడియం
13. టాడ్‌స్టూల్స్ అంటే?
    ఎ) తినదగిన పుట్టగొడుగులు
    బి) విషపూరిత పుట్టగొడుగులు
    సి) సాగు చేసే పుట్టగొడుగులు
    డి) పుట్టగొడుగుల విత్తనాలు
14. ఎర్ర సముద్రంలో ఉండే శైవలం?
    ఎ) ట్రైకోడెస్మియం ఎరిథ్రకం
    బి) నాస్టాక్ సి) అనబినా
    డి) రైజోబియం
15. కణ కవచం లేని నిజ కేంద్రక కణాలు?
    ఎ) బ్యాక్టీరియా బి) శిలీంధ్రాలు
    సి) ప్రొటోజోవా డి) ఏదీకాదు
16. చెరకు ఎర్రకుళ్లు తెగులును కలిగించేది?
    ఎ) పక్సీనియం బి) కొలిటోట్రైఖం
    సి) పెన్సీలియం డి) యస్టిలాగో
17. పొటాటో స్పిండిల్ ట్యూబర్ వ్యాధి దేనివల్ల వస్తుంది ?
    ఎ) ప్రియాన్ బి) టీఎంవీ
    సి) వైరాయిడ్ డి) పైవన్నీ
18. బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేసేవి?
    ఎ) ఆర్కి బ్యాక్టీరియా
    బి) యూ బ్యాక్టీరియా
    సి) ఫంగీ డి) లైకెన్స్
19. మధ్యధరా సముద్రంలో అలలు ఎరుపు రంగులో కనిపించడానికి కారణం?
    ఎ) వాల్‌వాక్స్ బి) గోనియోలాక్స్
    సి) డయాటమ్స్ డి) క్లోరెల్లా

సమాధానాలు

1) బి; 2) సి; 3) డి; 4) సి; 5) డి; 6) బి; 7) సి; 8) ఎ; 9) డి; 10) డి; 11) సి; 12) ఎ; 13) బి; 14) ఎ; 15) సి; 16) బి; 17) సి; 18) ఎ; 19) బి.

రాష్ట్రంలో దక్షిణ కాశీగా పేరొందిన దేవాలయం?

తెలంగాణ ప్రాంతం ఒకప్పుడు ఎత్తైన కొండలు, గుట్టలతో; ఎగుడు, దిగుడులతో శిలాప్రాంతంగా ఉండేది. కొన్ని మిలియన్ ఏళ్ల కాలంలో క్రమక్షయానికి గురై వికోషీకరణ చెంది అవశిష్ట పీఠభూమి గా ఏర్పడింది. నదుల కోతల వల్ల అక్కడక్కడా సమతల ప్రదేశాలతో పెనిప్లేన్లు ఏర్పడ్డాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ భూగోళ శాస్త్రం

తెలంగాణ నైసర్గిక స్వరూపం

తెలంగాణ రాష్ట్రం పురాతన గోండ్వానా ప్రాంతం నుంచి విడిపోయిన ద్వీపకల్ప భారతదేశంలో భాగం. ఇది దక్కన్ పీఠభూమి ప్రాంతానికి చెందింది. సముద్రమట్టానికి 150-600 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పీఠభూమి:

- దక్కన్ పీఠభూమి మీసోజోయిక్ కాలానికి చెందింది. ఈ పీఠభూమిలో అగ్నిమయ ఉదర విచ్ఛేదనం వల్ల లావా పెల్లుబుకి, ఘనీభవించడం ద్వారా బసాల్ట్ శిలలు ఏర్పడ్డాయి.
- తెలంగాణ పీఠభూమిలో హైదరాబాద్.. సముద్ర మట్టానికి 600 మీటర్ల ఎత్తులో ఉంది. ఇది రాష్ట్ర రాజధాని.
- పడమటి పీఠభూమి ఆర్కియన్ శిలలతో ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి 450 నుంచి 600 మీటర్ల వరకు ఎత్తు ఉంది.
- తెలంగాణ పీఠభూమి ఉత్తరాన ఆదిలాబాద్‌లోని నిర్మల్ గుట్టల నుంచి దక్షిణాన మహబూబ్‌నగర్‌లోని అమ్రాబాద్ గుట్టల వరకు వ్యాపించి ఉంది.
- ఉత్తర భాగంలో గోదావరి నదీలోయలో గోండ్వానా శిలలు ఉన్నాయి.
- గోండ్వానా శిలల్లో ప్రధాన ఖనిజం-బొగ్గు.

తెలంగాణ పీఠభూమిలో 2 రకాల శిలలు ఉన్నాయి. అవి.

1. గోండ్వానా శిలలు
2. దక్కన్ శిలలు

గోండ్వానా శిలలు: పురాతన యుగం తర్వాత ప్రకృతి ఉత్పాతాల వల్ల ఏర్పడిన వృక్ష సంబంధిత అవక్షేప శిలలను 'గోండ్వానా శిలలు' అంటారు. ఈ శిలల్లో అత్యధికంగా దొరికే ఖనిజం – బొగ్గు.

దక్కన్ శిలలు: అగ్ని పర్వత ఉద్భేదనం వల్ల ఇవి ఏర్పడ్డాయి. ఇవి తెలంగాణలోని గోదావరి నది పరిసర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి.

- ఉత్తర తెలంగాణ (ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం)లో గోండ్వానా శిలలతో బొగ్గు నిక్షేపాలు ఏర్పడ్డాయి. ఇవి గోదావరి నది వెంబడి ఉన్నాయి.
- హైదరాబాద్‌లో దక్కన్ పీఠభూమి సముద్రమట్టానికి 600 మీటర్ల ఎత్తులో, కృష్ణా-తుంగభద్ర నదీ లోయల మధ్య 350-450 మీటర్ల ఎత్తులో, భీమా-గోదావరి నదుల మధ్య 730 మీటర్ల ఎత్తులో ఉంది.
- మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య ఈ పీఠభూమి 600-900 మీటర్ల ఎత్తులో విస్తరించి ఉంది.

పర్వతాలు (కొండలు, గుట్టలు):

తెలంగాణ ప్రాంతంలో అనేక రకాల కొండలు, గుట్టలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని పర్వత శ్రేణులకు సంబంధించిన ముఖ్యాంశాలు..

- పడమటి కనుమలు లేదా సహ్యాద్రి పర్వతాలు అజంతా శ్రేణి నుంచి విడిపోయి ఆగ్నేయ దిశగా తెలంగాణ ప్రాంతంలోకి ఆదిలాబాద్ జిల్లాలో ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఈ పర్వతాలు కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల వరకు విస్తరించాయి.

ఈ పర్వతాలను కింద చూపిన విధంగా వివిధ జిల్లాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు.

జిల్లా పేరు	పర్వతాల స్థానిక పేరు
ఆదిలాబాద్	నిర్మల్ గుట్టలు
కరీంనగర్	రాఖీ గుట్టలు
వరంగల్	కందికల్ గుట్టలు
ఖమ్మం	పాపి కొండలు

తెలంగాణ పీఠభూమిలో తూర్పు కనుమలు మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రవేశించి, రంగారెడ్డి, నల్గొండ వరకు విస్తరించాయి. వీటిని కూడా వివిధ జిల్లాల్లో వేర్వేరు పేర్లతో పిలుస్తున్నారు.

జిల్లా	పర్వతాలు
మహబూబ్‌నగర్	నల్లమల కొండలు, అమ్రాబాద్ కొండలు
రంగారెడ్డి	అనంతగిరి గుట్టలు, రాచకొండ గుట్టలు
నల్గొండ	నంది కొండలు, యాదగిరి గుట్ట.

- తెలంగాణ పీఠభూమి సముద్రమట్టానికి 531 మీ. ఎత్తులో లేదా 1741 అడుగుల ఎత్తులో విస్తరించి ఉంది.
- హైదరాబాద్ – సికింద్రాబాద్ జంట నగరాలను హుస్సేన్‌సాగర్ వేరు చేస్తోంది. దీన్ని మూసీ ఉపనది అయిన కల్వలేరు నదికి అడ్డుకట్ట వేసి నిర్మించారు. హిమాయత్‌సాగర్ లేదా ఉస్మాన్‌సాగర్‌ను మూసీ ఉపనది అయిన ఈసా వాగుపై నిర్మించారు. ఇది హైదరాబాద్ నగరానికి పశ్చిమాన 25 కి.మీ. దూరంలో ఉంది.
- పోచారం సరస్సును మంజీరా ఉపనది అయిన ఆలేరు పాయపై నిర్మించారు. ఇది నిజామాబాద్ జిల్లాలో ఉంది.
- ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ హస్తకళలకు, పెయింటింగ్స్‌కు ప్రఖ్యాతి చెందింది. అదే జిల్లాలోని కడెం నదిపై 45 మీటర్ల ఎత్తులో కుంతాల జలపాతం ఉంది. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే ఎత్తైన జలపాతం.
- మల్లూరు ఉగ్రనరసింహస్వామి దేవాలయం వరంగల్ జిల్లాలోని మంగపేటలో ఉంది.
- కంచర్ల గోపన్న నిర్మించిన భద్రాచలం దేవాలయం ఖమ్మం జిల్లాలో గోదావరి నది ఒడ్డున ఉంది.
- 1980లో మద్రాస్ నుంచి హైదరాబాద్‌కు మారిన తెలుగు ఫిలిం కల్చర్ (టాలీవుడ్ ఇండస్ట్రీ) దేశంలోనే రెండో అతిపెద్ద సినీ పరిశ్రమ.

తెలంగాణ రాష్ట్రంలోని ముఖ్యమైన ప్రదేశాలు

- **ఓరుగల్లు:** నాటి కాకతీయ రాజధాని. నేడు ఖిలా వరంగల్‌గా పేర్కొంటున్నారు. 12వ శతాబ్దంలో మట్టికోట, రాతి కోటలను నిర్మించారు. వీటి మధ్యలో కాకతీయుల చిహ్నంగా నిలిచిన కీర్తి తోరణాలు, ఖుష్‌మహల్‌లు ఉన్నాయి.
  - ఇక్కడ భద్రకాళీ దేవాలయం, రుద్రేశ్వర ఆలయం (వెయ్యి స్తంభాల గుడి) వంటి చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి.
  - దీనికి సమీపంలో రామప్ప ఆలయం అద్భుత శిల్పకళా సౌందర్యానికి ప్రతీక.
- **పిల్లల మర్రి:** మహబూబ్‌నగర్‌లో సుమారు మూడు ఎకరాలకు పైగా విస్తరించి ఉన్న మహావృక్షం. దీని మొదలు, కొమ్మక్కెడో గుర్తించడానికి వీలు లేకుండా పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోంది. ఇది పట్టణ కేంద్రానికి సుమారు 4 కి.మీ.ల దూరంలో ఉంది.
- **మెదక్ చర్చి:** ఆసియాలోనే అతి పెద్దదైన మెదక్ డయాసిస్‌లో ఈ చర్చిని గోథిక్ నిర్మాణ శైలిని అనుసరిస్తూ 1914లో నిర్మించారు. ఈ చర్చి టవర్ ఎత్తు దాదాపు 173 అడుగులు. ఇక్కడ ఒకేసారి 5000 మంది ప్రార్థన చేసుకోవచ్చు.
- **వేములవాడ:** కరీంనగర్ జిల్లాలో ఉన్న ఈ ప్రాంతం.. రాజరాజేశ్వర దేవాలయానికి ప్రసిద్ధి. ఈ ఆలయాన్ని దక్షిణ కాశీ అంటారు. ఇది తెలంగాణలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే, అత్యధిక భక్తులు దర్శించే ఆలయాల్లో ఒకటి.
- **కొలనుపాక జైన మందిరం:** ఇది హైదరాబాద్-వరంగల్ రోడ్డుపై ఆలేరు దగ్గరలోని కొలనుపాకలో ఈ దేవాలయం ఉంది. ఇది తెలంగాణలోని అత్యంత ప్రాశస్త్యి కలిగిన జైన మందిరం.
- **జ్ఞాన సరస్వతీ దేవాలయం:** ఇది ఆదిలాబాద్‌లోని బాసరలో ఉంది. దేశంలో ఉన్న రెండు సరస్వతీ దేవాలయాల్లో ఇది ఒకటి. ఆదిలాబాద్ నుంచి సుమారు 157.6 కి.మీ. దూరంలో ఉంది.
- **శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం:** ఇది నల్గొండ జిల్లాలోని యాదగిరిగుట్టలో ఉంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఈ దేవాలయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. .

మాదిరి ప్రశ్నలు

1. రాఖీ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా?
   1) ఆదిలాబాద్ 2) కరీంనగర్
   3) వరంగల్ 4) ఖమ్మం
2. కుంతాల జలపాతం ఏ జిల్లాలో ఉంది?
   1) వరంగల్ 2) కరీంనగర్
   3) ఆదిలాబాద్ 4) ఖమ్మం
3. తెలంగాణలో 'దక్షిణ కాశీ'గా పేరొందిన దేవాలయం?
   1) వేములవాడ రాజరాజేశ్వరాలయం
   2) బాసర సరస్వతీ ఆలయం
   3) యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి
   4) ఆలంపూర్ నవబ్రహ్మ ఆలయం
4. పిల్లలమర్రి ఏ జిల్లాలో ఉంది?
   1) హైదరాబాద్ 2) రంగారెడ్డి
   3) నల్గొండ 4) మహబూబ్‌నగర్
5. హైదరాబాద్ సముద్ర మట్టానికి సుమారుగా ఎన్ని మీటర్ల ఎత్తులో ఉంది?
   1) 200 మీ. 2) 450 మీ.
   3) 600 మీ. 4) 1000 మీ.
6. పశ్చిమ కనుమలు తెలంగాణ రాష్ట్రంలోకి ఏ జిల్లాలో మొదట ప్రవేశిస్తాయి?
   1) నిజామాబాద్ 2) రంగారెడ్డి
   3) మహబూబ్‌నగర్ 4) ఆదిలాబాద్
7. ఆదిలాబాద్ జిల్లాలో పశ్చిమ కనుమలను ఏ పేరుతో పిలుస్తారు?
   1) కందికల్ గుట్టలు 2) నిర్మల్ గుట్టలు
   3) రాచ కొండలు 4) పాపి కొండలు
8. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల మధ్య దక్కన్ పీఠభూమి ఎంత ఎత్తులో విస్తరించి ఉంది?
   1) 600-900 మీటర్లు
   2) 350-450 మీటర్లు
   3) 700-850 మీటర్లు
   4) 200-375 మీటర్లు
9. అనంతగిరి పర్వత శ్రేణులు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
   1) నల్గొండ 2) మెదక్
   3) రంగారెడ్డి 4) కరీంనగర్
10. అమ్రాబాద్ గుట్టలు విస్తరించి ఉన్న జిల్లా ఏది?
    1) రంగారెడ్డి 2) మహబూబ్‌నగర్
    3) నల్గొండ 4) ఆదిలాబాద్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 1; 4) 4; 5) 3; 6) 4; 7) 2; 8) 1; 9) 3; 10) 2.

Learn to live and live to learn

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No.1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. She didn't (1)/ even take the trouble (2)/ to find out how to (3)/ spelling my name. (4)/ No error (5)
2. The escaped prisoners (1)/ were eventually trapped (2)/ in an underground garage (3)/ as recaptured. (4)/ No error (5)
3. He was (1)/ weakly, (2)/ cowardly and (3)/ treacherous. (4)/ No error (5)
4. The director transposes (1)/ Shakespeare's play (2)/ to 16th century Venice (3)/ to present day England. (4)/ No error (5)
5. We need to (1)/ ensure a smooth transition (2)/ between the old system (3)/ and new. (4)/ No error (5)
6. I think you'll have to (1)/ tweak these figures (2)/ a little before you shown (3)/ them to the boss. (4)/ No error (5)
7. These days it seemed (1)/ we must all submit (2)/ to the tyranny (3)/ of the motor car. (4)/ No error (5)
8. The political situation remains (1)/ highly unstable in many remote areas (2)/ even though the curfew (3)/ is lifted. (4)/ No error (5)
9. If society (1)/ is to exist as a unity, (2)/ its members may have (3)/ shared values. (4)/ No error (5)
10. The universal geriatric problems (1)/ projected in the movie (2)/ catched the attention of (3)/ the people across the world. (4)/ No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The ceremony was transmitted ____ by satellite to ____ 50 countries.
    1) open; above
    2) online; around
    3) streaming; almost
    4) live; over
    5) latest; approximately
12. The police reforms will ensure greater ____ and ____.
    1) law; care 2) security; safe
    3) transparency; accountability
    4) trepidation; tumult
    5) flexibility; reach
13. She had set a ____ for him and he had walked straight into it.
    1) goal 2) objective
    3) vision 4) mission
    5) trap
14. A restaurant has to ____ the tricky path between maintaining ____ and keeping prices down.
    1) treat; quantity
    2) meet; demand
    3) tread; quality
    4) expect; stock
    5) maintain; inventory
15. The aircraft is designed to ____ turbulent conditions.
    1) withstand 2) resist
    3) change 4) modify
    5) oversea

Directions (Q. No. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? Mark (5) as your answer, if there is no error.

16. The city's crime rate is a serious turn down to potential investors.
    1) Turn on 2) turn in
    3) turn off 4) turn up
    5) no correction required
17. The rise in violent crime will may go unchecked.
    1) must go 2) would go
    3) must not go 4) shall go
    5) No correction required
18. Planes passed overhead with unceasing regularity.
    1) over sky 2) over and above
    3) outcast 4) over flown
    5) No correction required
19. My son's 13 but he's younger for his age.
    1) youngest 2) youth
    3) older 4) young
    5) No correction required
20. When the needle enters the red zone the engine is indicator hot.
    1) too 2) much
    3) becomes 4) left
    5) No correction required

Directions (Q. No. 21-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

For decades, Chinese economic policymakers have drawn praise for keeping their economy growing strongly through **turbulence**, such as the Asian financial crisis of 1997-1998 and the worldwide financial tumult of 2008. But investors have begun to lose faith in Beijing's economic management. As China's economy slowed, the government decided to **deploy** the stock market to ease the pain. State-run media talked up stocks, and individual investors responded by buying shares and igniting a 150 per cent run-up in the Shanghai Composite stock index in the year through June. The hope was that Chinese companies could issue shares into a rising market and use the proceeds to **shrink** debts. But the stock bubble burst June 12. Shanghai stocks plummeted 37 per cent. The government sought futilely to intervene, suspending trading in hundreds of companies and banning big investors from selling stakes for six months. The intervention undermined Beijing's pledge to give market forces a bigger say in the economy and left policymakers looking clumsy and ineffectual.

On August 12, China surprised investors by marking down the value of its currency, the yuan. The government said it was responding to market forces: Investors had signaled that the yuan was overvalued. But skeptics worried that the devaluation was a desperate move to jolt the economy - a sign that the economy was weaker than thought. The move followed a report that exports had plunged in July. A cheaper yuan gives Chinese companies a price advantage in foreign markets. Since the devaluation, China has intervened to keep the yuan from falling too fast, confusing markets and renewing doubts about Beijing's commitment to market forces.

Chinese economic statistics have long been viewed as **dubious**. Premier Li Keqiang once acknowledged that the statistics on economic output were "man-made" and worthless. China watchers tended to shrug off the uncertainty as long as it was clear that the economy was **booming**. But now there's concern about what's really happening. Economists are looking at alternative measures of economic performance, such as electricity consumption. The London firm Consensus Economics asked several economists for forecasts based on the unconventional measures. These forecasters saw the Chinese economy growing just 5.3 per cent in the year up to the fourth quarter of 2015. Conventional forecasts have the economy growing closer to 7 per cent.

21. The Chinese economic policy makers have drawn praise during
    1) The government's intervention which suspended trading
    2) Selling of stock prices and upkeeping the market value
    3) Undermining the value of the stock and trading stopped by the government
    4) Tough times like Asian financial crisis and the worldwide financial tumult
    5) individual investors responded by buying shares and igniting a 150 per cent run-up
22. What led the investors to lose faith in the Beijing's economy?
    1) Praise for keeping their economy growing strongly through turbulence
    2) State-run media boosted the sales by investing in more stocks
    3) The government suspending trading in hundreds of companies and banned big investors from selling stakes for six months
    4) Chinese companies issued shares into a rising market
    5) individual investors bought shares and reinvested
23. The effect of government's intervention
    1) Damaged the promise to give the market forces a bigger say in the economy
    2) policy makers looked cooperative and favourable
    3) effective measures to curb the slowdown boosted confidence
    4) stock brokers had visualized a steady decline
    5) there is an uprise in the sale of stocks
24. Devaluation of the currency
    1) Was to respond to the stock and inventory
    2) was in response to market forces
    3) was a desperate move to jolt the economy
    4) Was to respond positively to international market
    5) To bring back the faith in the international trade
25. The result of devaluation of Yuan as stated in the passage is
    1) exports had plunged after the move of devaluation
    2) in confusing markets and renewing doubts about Beijing's commitment
    3) to surprise investors by marking down the value of its currency
    4) to go for alternative measures of economic performance
    5) to burst the bubble of uncertainity prevalent in the minds of the investors

Directions (Q. No. 26-28): Choose the word which is MOST SIMILAR in meaning to the word given from the five options.

26. **Turbulence**
    1) Turmoil 2) Stability
    3) Confident 4) Organize
    5) Segregate
27. **Deploy**
    1) Cluster 2) Entangle
    3) Install 4) Huddle
    5) Disperse
28. **Booming**
    1) Thriving 2) Striving
    3) Demotivated 4) Annoyed
    5) Provoked

Directions (Q. No. 29-30): Choose the word which is MOST OPPOSITE in meaning to the word given from the five options.

29. **Shrink**
    1) Shrivel 2) Contract
    3) Microscope 4) Minimize
    5) Nurture
30. **Dubious**
    1) Hesitant 2) Whisper
    3) Summarize 4) Certain
    5) Unsure

Directions (Q. No. 31-33): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Both humans and animals learn to live and live to learn.
B. According to scientific research animals not only learn from their own mistakes, but they can learn by observing their peers messing up.
C. Making mistakes is a fundamental part of every cognitive process, whether solving a math problem, making important decisions, or trying to convey meaning in a foreign language.
D. In the animal world, avoiding blunders may dramatically improve one's chances of survival.
E. Human beings, however have a unique skill: the ability to process and mistakes.
F. Making mistakes and learning from them is not simply a human skill.

31. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
33. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) E 5) F

Answers

1) 4	2) 4	3) 2	4) 3	5) 4
6) 3	7) 1	8)5	9) 3	10) 3
11) 4	12) 3	13) 5	14) 3	15) 1
16) 3	17) 3	18) 5	19) 4	20) 1
21) 4	22) 3	23) 1	24) 2	25) 1
26) 1	27) 3	28) 1	29) 5	30) 4
31) 1	32) 2	33) 4..		